సంస్థాపకులు
కీ॥శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి
రాఘవయ్య

అక్టోబరు 1978

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 16 సంచిక 9

విషయసూచిక

ముఖచిత్రం: 'సాహసవంతుడు' లో ఎన్. టి. రామారావు

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P. B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో రు. 42/-)

తొలిమాట

వచ్చేసంచికనుంచీ జ్యోతిలో విశేషాకర్షణగా ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనరాణి సీరియల్ ప్రేమసింహాసనం ప్రారంభమౌతోంది. సరళమైన శైలీ, అద్భుతమైన కథనం, పాఠకులను ఆకట్టుకొనే 'కథ' గ్యారంటీగా లభిస్తాయి సులోచనరాణి సీరియల్‌లో '78 లో ప్రారంభమవుతున్న ఈ ఆకర్షణ తర్వాత సంవత్సరమంతా పాఠకులనలరిస్తూనే వుంటుంది.

* *

కొత్త సీరియల్ ఆకర్షణతో నవంబర్ సంచిక పాఠకులు అందుకొన్న పది రోజుల్లోనే జ్యోతి తన పాఠకులకు దీపావళి కానుక నందజేస్తున్నది. మంచి కథలకు పేరెన్నికగన్న జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో ఈసారి ఒక నవలికకూడా ప్రచురిస్తున్నాము. ప్రముఖ రచయిత్రి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచన అది. బాపు రంగుల ముఖచిత్రంతోపాటు లోపల రంగుల్లో ఆర్ట్ పేపర్‌పై ముద్రించబడ్డ రెండురంగుల చిత్రాలు (చిత్రకారుడు : చంద్ర) ఈ సంచికకు ఆకర్షణలు. అక్టోబర్ 20 తేదీకి మీముందు కొస్తుంది దీపావళి ప్రత్యేక సంచిక.

* * *

నీతి, అవినీతి పదాల నిర్వచనం ఎంతకష్టం! ఆ రెండింటి మధ్య తేడా ఎంత స్వల్పం! ఎంత సున్నితం! ఒకమనిషి అవినీతి పనిచేశాడని వ్యాఖ్యానించే ముందూ, విమర్శించేముందూ—ఆ మనిషి ఆ పనిని ఏ పరిస్థితుల్లో, ఏ ఉద్దేశ్యంతో చేశాడన్నదీ ఆలోచించాలి. ఒక పనిని కొంతమంది అవినీతి పరంగానూ, మరి కొంతమంది అలా కాకుండానూ చూడటం జరుగుతూనే వుంటుంది. ఈ సంచికలోని కొన్ని కథలు చదివాక పాఠకులలోనూ ఈ రెండు రకాల భావాలు కలుగుతాయని మేం భావిస్తున్నాము. పాఠకుల వ్యాఖ్యానాలూ ఆశిస్తున్నాము.

ఉత్తరాలు

సెప్టెంబరు జ్యోతిలో "మయసభ"లో శ్రీ ఎ. రామసంజీవి వ్రాసినట్లు ఒక్క అయిదేళ్ళ పాటు ముఖ్యంగా సినిమాలను, కొన్ని పత్రికలను "నిషేధించిన" దేశానికి భాషకు, చాలా న్యాయం చేకూరుతుంది. యువతరం బాగు పడుతుంది అనుటలో సందేహంలేదు. సినిమాల విషయంలో అందరకు తెలిసిందే. అందునా శ్రీ యస్వీ. నారాయణ (పి. 123)లో సినిమా కబుర్లలో వ్రాసినట్లుగా మంచి చిత్రాలు కావాలంటే (రావాలంటే) నిర్మాత, దర్శక, నటీనటులు, సాంకేతిక నిపుణులు పూనుకొని చేయవలసిన విషయం. యీ మధ్య మేము ఒక తెలుగు సినిమా చూచాం. అందులో ఒక డాన్సరును, కెమెరా మాకు ఆమె తొడలు, పిరుదులు, బ్రెస్టును, క్లోజప్ షాట్స్‌లో చూపించి వారానందపడి (అఫ్‌కోర్స్) మమ్మకూడ ఆనంద పెట్టారనుకోండి. యీ నెల జ్యోతి కథలు ముఖ్యంగా "వారం....వారం" ఆడవారిలోనున్న వీక్‌నెస్‌ను కళ్ళకు కట్టినట్లుగా రచయిత్రిగారు వ్రాసారు. "లేటెంటు హీటు"ను డిఫైన్‌చేస్తూ చక్కటి ఉదాహరణ యిచ్చారు. చాలా బాగున్నది. యిహపోతే "సీతాలు గుడిసె మారింది"లో "సజీవాంధ్రభాష" అని వ్రాసారు. దానిని మా (పాఠకలోకం) నెత్తిన రుద్దుతున్నది ఎవరు? రచయితలే కదూ!

—తంగిరాల జగన్మోహనరావు,
రూర్కెలా.

జూలై సంచికలోని ఆరుద్రగారి వుత్తరం సెప్టెంబరు సంచికలోని శ్రీశ్రీగారి వుత్తరం చదివాక ఈ వుత్తరం వ్రాస్తున్నాను. 'మే' పద బంధ ప్రహేళికలో 'లాత్వం' అనే ఆధారం నిరాధారమని ఆరుద్రగారు విశదీకరించారు. అది అక్షరాలా నిజం. ఎందుకంటే 'అ' కారప్పొల్లును 'అ' పొల్లు అనే పేర్కొనాలిగాని 'త్వం' చేర్చటం సమర్థనీయంగాదు. దానిపై శ్రీశ్రీ 'నా పాఠకలోకం నన్ను సమర్థిస్తున్నద'నే ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించారు. కాని దీనిని ఏ పాఠకుడూ సమర్థించడు, శ్రీశ్రీ మహాకవి, ఒప్పుకుంటాను. కాని జరిగిన పొరపాటును గ్రహించక సమర్థించటం, ఆరుద్ర గారిమీద విరుచుకపడటం ఏ మాత్రం సమంజసం కాదు.

—జి. రామానాయక్, కారేపల్లి.

పోయిన్నెల జ్యోతిలో మద్రాసునుంచి శ్రీమూర్తిగారు శ్రీశ్రీగారిని సమర్థించినప్పుడే వ్రాద్దామనుకున్న ఈ వుత్తరం కారణాంతరాల వల్ల జాప్యం కల్గి ఇప్పుడు రాయడమవుతున్నది. "వ్యాకరణం తెలీని వాళ్ళుకూడా ప్రహేళికలో పాల్గొంటారని శ్రీశ్రీకి తెల్సు కాబట్టి, పాండిత్యాన్నే కాకుండా బుద్ధికి పని కలిగించేలా "లాత్వం" ఆధారం ఇచ్చార"న్నారు. శ్రీశ్రీగారు పజిల్స్ వ్యవహారంలో ఆపాటి జాలి పాఠకవర్గంమీద చూపించిన దాఖలాలు ఇప్పటివరకూలేవు. అదే నిజమయితే అంతకు ముందు వారు "ఇలాగా అల్లడం జడ" "పాండుష్మ పాలుడు"లాంటి, పూర్తిగాపాండిత్యానికి సంబంధించిన ఆధారాలు ఇవ్వకపోయేవారని నా విశ్వాసం. పజిల్సు ఎంత క్లిష్టంగా ఇచ్చినా శ్రీశ్రీగారు ప్రదర్శిస్తున్న యాక్యురసీ యిన్ క్లూస్ చాలా అభినందనీయం.

ఈనెల (సెప్టెంబర్) సంచికలో ,ఆరుద్ర గారిమీద శ్రీశ్రీగారు వ్రాసిన వ్యాఖ్యలాంటి లేఖ శ్రీశ్రీగారంటే పడిచచ్చే నాకే చాలా దిగ్భ్రమ కలిగించింది. ఒక పాఠకుడు తెలిస్తో

యద్దనపూడి సులోచనారాణి

సీరియల్

ప్రేమ సింహాసనం

వచ్చే సంచికనుంచే
ప్రారంభం

తెలియకో తెలుగులో మొట్టమొదటి గళ్ళ నుడి కట్టు పేనింది ఆరుద్రగారని వ్రాస్తే వెంటనే శ్రీ అరుద్ర ఆపని తనకంటే ముందు శ్రీశ్రీ గారే చేశారని వ్రాస్తే ఆయనలోని అడాసిటీకి ఫెయిర్నెస్‌కీ ముగ్ధుడ్నయ్యాను. ఆరుద్రలోని ఆ మంచితనాన్ని పక్కకునెట్టి శ్రీశ్రీగారు ఆయనకు "పజిల్సులోనూ కవిత్వంలోనూ దొరికి పోకుండా దొంగిలించే గుణం" అంట కట్టడం చాలా బాధాకరం. ఆరుద్ర కాపీ చేశారని శ్రీశ్రీ వుదహరించిన క్లూ కేవలం ఆక్సిడెంటల్ కావచ్చు కదా. ఇద్దరి మేధావుల ఆలోచనా సరళి ఒకే రకంగా ఒక్కోసారి వుండ వచ్చు కదా. ఒక ప్రముఖ తెలుగుకవి ఓసారి మావూరు వచ్చాడు. మేం మిత్రులం కొంత మంది ఆయనతో ఇష్టాగోష్టి జరుపుతున్నప్పుడు నేను శ్రీశ్రీగారి అనువాద సరళిని మెచ్చుకుంటూ చాలా మాట్లాడాను. అప్పుడాయన "శ్రీశ్రీ కూడా కాపీ చేస్తాడు. స్కైయీస్ యువర్ లిమిట్‌లాగా ఏదో ఇంగ్లీషు పోయమ్‌లో ఒక సెంటెన్సు వుంది; దాన్నే శ్రీశ్రీ 'నింగి నీకు హద్దురా' అని వ్రాశా" డన్నాడు. దానిమీద నేను అతనితో చాలా ఘర్షణ పడ్డాను. శ్రీశ్రీకి ఆ గుణం ఎప్పుడూ లేదు. కావాలంటే ఆయన సర్రియలిస్టుగా వున్నప్పుడు వ్రాసిన "26" గేయం కింద 'అలాంటి గేయాలకు ఆద్యుడు ట్రిస్టన్ జారా' అని తెలుపక పోయేవారు అని వాదించాను. ఏదో ఒక చిన్న వాక్యం ఆంగ్లంనుంచి ఉదహరించి శ్రీశ్రీని అనుమానించటం ఏం బాగుంటుంది? శ్రీశ్రీ మహాకవి. నిర్వివాదాంశం. ఆరుద్రా నారాయణబాబులు శ్రీశ్రీ గారింట్లో భోజనం చేయటం కూడా మా అందరికీ తెలియజేయాల్సినంత గొప్ప విషయమా?


—సదా శ్రీశ్రీ అభిమాని
(కేవలం కవిత్వంవరకే)
—ఎన్. కె. రామారావు, నల్లగొండ.

జ్యోతి సెప్టెంబరు '78 సంచికలో శ్రీశ్రీ గారి ఉత్తరం చదివాను. అది శ్రీశ్రీవంటి మహాకవి వ్రాయవలసిన ఉత్తరం కాదు. చాలా బాధపడ్డాను. ఆరుద్ర కవిగా ఎప్పుడో రాణించారు. ఇంకా రాణిస్తూ ఉన్నారు. పండితుడుగా భాసించాలనే తాపత్రయం ఉండటంలో తప్పు లేదు. "ళ్" అనే అక్షరాన్ని లకారపొల్లు అంటారు కాని ళాత్వం అనరు అని చెప్పడానికి చిన్నయసూరి మీద భరోసా పెట్టుకోవలసిన అవసరంలేదు. ఒకటవ తరగతి విద్యార్థిని అడిగినా లకారపొల్లు అనే చెబుతాడు తప్ప ళాత్వం అని చెప్పడు.

ఇకపోతే తనుచేసిన వ్యాకరణ దోషాన్ని నిరూపించినందుకు ఆరుద్రమీద వ్యక్తిగత దూషణానికి శ్రీశ్రీ పూనుకోవడం చాల గర్హనీయం. ఎప్పుడో చచ్చిపోయిన నారాయణబాబు ప్రసక్తి తీసుకొని రావడం శోచనీయం. శ్రీశ్రీ, చక్రపాణిగారి మాసపత్రికలో రూ॥ 40-లు సంపాదించుకొంటూ, నారాయణబాబుకి ఆరుద్రకి ఇన్ని మెతుకులుపెట్టేను అని చెప్పుకోవడం అసహ్యకరం. ఆ రోజుల్లో ఆరుద్ర శ్రీ రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీలో తంటాలు పడుతూ చాకిరీ చేస్తూంటే ఆయనకి రావలసిన పైకం శ్రీశ్రీ వసూలు పరచుకొనిపోతూ ఉండేవారని ఎంతమందికి తెలుసు?

ఒక పజిల్‌లో శ్రీశ్రీ "డు డు" అని అర్థం లేని మాటకు "ఒకడు, ఇంకొకడు", అని "క్లూ" యిచ్చేననిన్నీ, దరిమిలాను దీనిని "ఒకరు. ఇంకొకరు" అని ఆరుద్ర సొంతం చేసుకొన్నారనిన్నీ, కవిత్వంలోను, పజిల్సులోను దొరికి పోకుండా దొంగిలించే గొప్ప గుణం ఆరుద్ర దగ్గర ఉన్నదన్నీ శ్రీశ్రీ వ్రాశారు. 1-7-59 ఆంధ్ర వార పత్రిక నుడికట్టు-7 లో ఆరుద్ర "(శ్రీశ్రీ చెప్పినట్లు) ఒకరు, ఇంకొకరు" అని "క్లూ" యిచ్చేరు. (శ్రీశ్రీ చెప్పినట్లు) అని ఆరుద్ర యిచ్చినప్పుడు అది దొంగతనం ఎట్లా అవుతుంది? ఇకనైనా శ్రీశ్రీ వంటి ప్రజాకవి, మహాకవి ఇటువంటి రాతలు రాయడం మానేస్తారని ఆశిద్దాం.

—డి. సూర్యప్రకాశరావ్, మద్రాసు-17.



మయసభ

ప్రతి ఇంట్లోనూ గిన్నెలుంటాయి.

ప్రతి నోట్లోనూ మాటలుంటాయి.

ఇంట్లోని గిన్నెల్లో కొన్నిటిని ఎక్కువగా వాడుతుంటాం.-అవి అరిగిపోతాయి; చిల్లి పడతాయి; అందులో ఏమీ నిలవదు.

అలాగే మాటల్లోనూ కొన్నింటిని అతిగా వాడడంవల్ల అవి అరిగిపోతాయి; ఆ మాటలకూ చిల్లులు పడతాయి; వాటిల్లో అర్థం నిలవదు.

అలాగ అరిగిపోయిన పదాలు చాలానే వున్నాయి. "ప్రేమ", "సమసమాజం", "హృదయం", "విప్లవం" "కొత్తతరహా మాసపత్రిక", "మహాత్మాగాంధి"—లాటి శబ్దాలు జవసత్వాలు కోల్పోయి ఉత్త చప్పుళ్ళ గానే మిగిలాయి.

ఇలాటి శబ్దాలను వింటే మనసుకు ఏమీ అన్పించదు; అథవా అన్పించినా వేరే అర్థం స్ఫురిస్తుంది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను శారదా"— అన్నది వినగానే తెలుగు సినిమాలో ఇంటర్వెల్ ముందు డైలాగు అన్పిస్తుందే తప్ప ఇంకేమీ అన్పించదు.

"సమసమాజం" గురించి మాట్లాడేవాడు తప్పకుండా మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన వాడయి వుంటాడు. "హృదయం" కూడా సినీ రచయితల పోపుల పెట్టెల్లోనిదే. "విప్లవం" అంటే తాను ఏ మాత్రం మారకుండా సంఘాన్ని మాత్రం ఆదర్శవంతంగా తీర్చి దిద్దాలనే తాపత్రయానికి గుర్తుగా మిగిలింది; ఎగసం తోసిన వాళ్ళంతా ఏర్ కండిషనర్ల గదుల్లో కూర్చొని వుండగా ఆ మాటలు విని బందూకు పట్టిన యువకుల స్మృతికి చేతకాని మాటల రాయుళ్ళు వెలిగిస్తున్న అగరొత్తి "విప్లవం".

'కొత్త తరహా మాసపత్రిక'—అంటే కొత్త కోకలో మీరెరిగిన పాత శరీరం అన్న మాట....పాకింగ్ హడావిడే తప్ప పదార్థం అదే పదే!

'గాంధీ మహాత్ముడు'—అంటే ఓట్లు దండడానికి కూడా పనికిరాని ఒక ఓట్లుమాన్.

ఈ విధంగా లా ఆఫ్ డిమినిషింగ్ రిటన్స్ (వాడుతున్న కొలదీ విలువ తరుగును) అన్న ఆర్థిక సూత్రం మేరకు, పడిపోతున్న అమెరికన్ డాలర్‌వంటి శబ్దాలు ఎన్నో వున్నాయి. ఒక్కొక్క దానిమీద ఒక్కొక్క 'థైస్యం' (థీసిస్‌కో మిత్రుడు పెట్టిన తెలుగు పేరు) విరచించవచ్చును.

అందులో "అంకితం"అన్న దానికో ప్రత్యేకతవుంది. అరిగిన శబ్దాలు ఒక్కొక్కటి, సాధారణంగా ఒక రంగానికే పరిమితం అయి వుంటాయి. కాని 'అంకితం' మాత్రం రంగాతీతమయినట్టిది.

వి. రామసంజీవి

ప్రేమికులు, కళాకారులు, రాజకీయ వాదులు—వాళ్ళందరి పూపిరి 'అంకితం'; ప్రేమ, కళ, రాజకీయాలు వంటి విభిన్న రంగాలకు సేతువు 'అంకితం'

ప్రేమలోనో, కళలోనో, రాజకీయాల్లోనో అడుగు పెట్టని మానవ మాత్రుడు ఎవడూ వుండడు. మూడింట్లోనూ అడుగిడి త్రిగుణాత్మకమైన సచ్చిదానందావస్థ రుచి ఎరిగిన పూర్ణ పురుషులు మాత్రం బహుకొద్దిమందే వుంటారు. (పూర్ణ స్త్రీలుకూడా వుందురు—అని మనవి.)

పదేళ్ళదాక అమ్మనాన్న, ఏ పదహారేళ్ళ దాకానో బళ్లోనేస్తాలు— వాళ్ళతో మనసు నిండిపోయి వుంటుంది. అక్కడినుంచి ఇక సుధప్రద గురించో, ఆవశ్రీ గురించో, నాయక రావు గురించో కలలు కంటారు. ఆ దశలో హృదయం అంతా ఆ మూర్తికే అంకితం అయి వుంటుంది, ఆ తర్వాత, పాతికేళ్ళయే సరికి, బుద్ధిమంతుల్లా ప్రేమకు 'టాటా' చెప్పేసి అమ్మా నాన్న చెప్పిన 'సంబంధాన్నే' (కట్నంతో సహా) చేసుకుని ఆ వధువుకో వరుడికో అంకితం అయిపోతారు, అలాటి మాటలనే సంస్కృతంలో అగ్నిసాక్షిగా అనేసి దాంపత్య జీవితంలోకి వెళ్ళిపోతారు.

సరే, "పతియే ప్రత్యక్ష దైవము" అనేటువంటి శబ్దాలంకార సమేతమైన ప్రాచీన సూక్తులనుంచీ, "ఆడది జీవితంలో కోరే వరాలు రెండూ"—అని శాసించే సినీ కవి సుభాషితందాక బ్రెయిన్ వాషింగయిపోయిన ఆదర్శ భారతసతి భర్తకు ఆజన్మాంతం అంకితం అయిపోవడం గురించి చెప్పడం వుందే—అది శత్రువులు ఎంతమంది దాడి చేసినా తెలుగు సినిమా హీరోయే చివరకు గెలుస్తాడని చెప్పడం లాంటిది. ఇహ భర్తలంటారా ఇష్టంవున్నా లేకపోయినా భార్యలకు అంకితం అయిపోనూ, బండి లాక్కొస్తుంటారు.

నిజంగా ప్రేమకు అంకితం అయిన లైలా మజ్నూలు పారూ దేవదాసులంటారా జీవితంలో ఆట్టే కనపడరు కనుకనే సాహిత్యంలో సినిమాల్లో, కావ్యాల్లో కన్పిస్తుంటారు.

ఈ విధంగా ప్రేమలో అంకితులుండగా కళారంగంలోనూ ఈ గోత్రం వారు మనకు ఇతోధికంగానే కనపడుతుంటారు.

అంకితం అయిపోవడం అనేది గనుక ఒక వెర్రితనం అయితే కళాకారులకన్న వెర్రి వాళ్లెవరుంటారు!

"నిజమయిన కళాకారుడు—తన పెళ్ళాం పిల్లలు ఆకలితో మాడినా, తన ముసలి తల్లి తిండికోసం స్వయంగా పనిచేస్తున్నా పట్టించుకోకుండా—తన కళలోనే మునిగి తేలేవాడే నిజమైన కళాకారుడు—" అని బెర్నార్డ్ షా నిర్వచన మయితే చెప్పాడు కాని అది ఆ కాలం; అందులోనూ ఇంగ్లండాయెను. మన దేశానికి, 1978 లో ఈ నిర్వచనం యధాతథంగా వర్తిస్తుందా అంటే '-చదు' అనే చెప్పాల్సి వస్తుంది.

నాటకాలకే అంకితమయిపోయిన బళ్ళారి రాఘవ, మంచి సినిమాలకే అంకితమయిపోయిన చిత్తూరు వి. నాగయ్య, బి. ఎన్. రెడ్డి-లాటి వెర్రి బాగుల వాళ్ళెవరన్నా వుంటారటండీ ఈ రోజుల్లో? అనర్గళంగా కావ్యాలు చెప్పగలిగి నప్పటికీ "ఇదంతా మా గురువుగారి చలవ"—అని చెప్పగలిగే అజ్ఞానులు ఆధునిక భారతదేశంలో వుండరనే నా నమ్మకం. అలాగ కళకు, విద్యకు, వినయానికి అంకితమయిపోగా చేతికి చిప్పవచ్చిన చరిత్ర హీనులెందరో వుంటారు,

కాని కళా రంగంలో ధృవతారలుగా చలామణీ అయే పెట్రోమాక్స్ దీపాలూ, హరికేన్ లాంతర్లూ బొంబాయిలో, అమీర్‌పేటలో, టి. నగర్‌లో వందల కొలదీ వున్నాయి.

"నా బట్టతలకు విగ్ పెట్టుకుంటున్నానంటే అదంతా కళకోసం అంకిత మయినందువల్లనే! ఈకట్టుడు పళ్ళ నవ్వు, డూప్‌యుద్ధాలు, బూతు పాటలు, పిచ్చి గెంతుళ్ళు ఇదంతా కళకు అంకితమయిన వాడిగా నేను మీకు సమర్పిస్తున్నాను—" అంటూ నరుడిని వానరుడిగా మార్చి, మానవ పరిణామాన్ని వెనక్కు-నడిపించే కళా కారులకు కొదవేలేదు.

ఇంక సాహిత్య కారులున్నారు; వార పత్రి



జ్యోతి నవలల పోటీ

ప్రథమ బహుమతి: రు 2000/-
ద్వితీయ బహుమతి: రు 1000/-
తృతీయ బహుమతి: రు 750/-

పోటీలో పాల్గొను రచయితలు పాటించవలసిన నిబంధనలు :

1. నవలలు 'జ్యోతి నవలానుబంధం' సైజులో 128 పేజీలకు మించకుండా 96 పేజీలకు తగ్గకుండా (ముద్రణలో) ఉండాలి.
2. స్వీయరచనలే పంపాలి. అనువాదాలు, అనుకరణలూ అంగీకరింపబడవు. రచన స్వీయమేననీ, అనువాదంగానీ,అనుసరణగానీకాదని హామీపత్రం జతపరచాలి.
3. కాగితానికి ఒకేవైపు రాయాలి.
4. రచనలు తిప్పిపంపగోరువారు తగినన్ని పోస్టల్ స్టాంపులు అతికించిన స్వంత చిరునామా గల కవరు జతపరచాలి.
5. **నవలలు మాకు చేరవలసిన ఆఖరుతేది 20, సెప్టెంబర్, 1978**
6. కలం పేర్లతో రచనలు పంపినా రచయితలు తమ పేర్లను విధిగా తెలియ జేయాలి.
7. రచనలు పంపే కవర్లపై 'నవలల పోటీకి' అని తప్పక రాయాలి.

గమనించండి!

* బహుమతులు పొందని నవలలలో ప్రచురణార్హమైన వాటిని జ్యోతిలో సాధారణ ప్రచురణకు ఎన్నుకొనే హక్కు మాకుంటుంది.
* ఎన్నుకోబడిన నవలలు 'జ్యోతి నవలానుబంధం'లో ప్రచురింపబడుతాయి.
* ప్రచురణ సౌలభ్యం కోసం అవసరమైన మేరకు నవలను సంక్షిప్తీకరించే హక్కు మాకుంటుంది.
* పోటీకి సంబంధించి 'జ్యోతి' సంపాదకులదే తుది నిర్ణయంగా ఉంటుంది.

ఈ పోటీలో రచయితలు వైవిధ్యమున్న రచనలతో పాల్గొని సహకరిస్తారని ఆశిస్తున్నాము

—ఎడిటర్

కల కంకితమైన వాళ్ళనుండి, సినీ వారకాంతా ధాసులదాక రకరకాల వాళ్లున్నారు. వాళ్ళల్లో 'కీర్తి కాంత' అనే మానసికమైన 'తామర'కు అంకితమయిన వాళ్లుంటారు. వారు తమ రచనలను "మనుజాధములకు" అంకితం ఇచ్చి "అప్పడుపు కూడు" కతకడానికి సిద్ధంగా వుంటారు.

జాగ్రత్తగా ఏ మంత్రిగారికి అంకితం ఇస్తే, ఏ పని సాధించవచ్చునో అని ఆలోచించేటటువంటి దీర్ఘదర్శులనుండి, "ఎందుకయినా మంచిది అధ్యక్షుల వారికిది అంకితం ఇద్దాం; వచ్చే ఏడాది గ్రాంట్లలో ఒక వెయ్యి ఇటుపడేయకపోతారా—" అని ఆ చేతి ఎంగిలి మెతుకులకు తోకాడించే రచనా సింహాలవరకు కొదవ లేదు—పోతన పుట్టిన ఈ గడ్డలో.

అస్సలు 'అంకితం' అన్న నిరాకార శబ్దం మనుష్య రూపం దాల్చితే ఎలా వుంటుందో నన్న సంశయం కలిగితే "నాయకుడు" అని పిలువబడే ఆ రెండు కాళ్ళ శాల్తీకేసిచూడండి! పద్దెన్మిదో ఏట మీరూ నేనూ బాలామణినో నీలవేణినో ఎన్నుకుని అంకితమయిపోతే, ఈ రాజకీయ నాయకుడు, ఆ నూత్న యవ్వనంలోనే దేశసేవకు "అంకితం" అయిపోతాడు. అంకితం అంటే అట్లాంటిట్లాంటి అంకితం కాదు; ఇటీవలి తెలుగు సినిమాల్లో ముసలి హీరో పడుచు హీరోయిన్లు 'హత్తుకు' పోతున్నారే, అంతటి ఘాటయిన అంకితం అన్న మాట.

పేట సంఘం కార్యదర్శితో ఆరంభమవుతుంది ఈ అంకితం సీరియల్. వార్డు కౌన్సిలర్ లేక పంచాయతీ అధ్యక్షుడు అన్నది తర్వాతి అధ్యాయం. ఎం. ఎల్. ఏ, రాష్ట్రమంత్రి పదవి, ఎం. పి., కేంద్రమంత్రి అనేవి అంకితం నిచ్చెన మెట్లు; ఇక్కడయితే ముఖ్య

మంత్రి పదవి, అక్కడకుపోతే ప్రధాన మంత్రి పదవి—ఈ రకం అంకితాలకు మోక్షద్వారాలు.

ఈ "అంకితం జ్యోతి"వారి "హృదయా"లలో ఎంత గాఢంగా వెలుగుతుంటుంది అంటే వారు ఆరిపోయినా అది మాత్రం ఆరదు. ఖర్మకాలి వారు అంకితమయిన పార్టీకి మొన్న మార్చి 77' లో జరిగినట్లు శృంగభంగం అవుతుందనుకోండి—వాళ్ళ మనస్సుల్లో ఆ దేశ సేవ పట్లవున్న అంకితంజ్యోతి వుందే అది ఆ చీకటి సమయంలో వారికి దారిచూపుతుంది.

"చూడు రామదాసూ! 'రెండాకులు' వదిలేయి; 'సైకిలు చక్రం' మెజారిటీలో వుంది." అంటూ వెలుగు ప్రసాదిస్తుంది. ఆ ఫళంగా మనందరం ఏమీ అనుకోకుండా "ఆ పార్టీలో ప్రజాస్వామ్య శక్తులకు ఇంకచోటు లేదని తెలిసింది—నా శాయశక్తులా దరిద్రనారాయణులకు సేవచేయడానికని, నే నివ్వాళనుండి సైకిలు చక్రాలకి తోడునయిపోతున్నాను" అని ఒక ప్రకటన ఇచ్చేసి ఆయన మామూలుగా 'అంకితం' అయిపోతాడు ...! "అహో! ఏమా ఉజ్జ్వల ఉత్కృష్ట, ఉత్తమ దేశభక్తి!" అని మనం అనుకోవాలన్నమాట.

వాళ్ళ జీవితాలకు "అంకిత" మే ప్రాణం. అంకితమే మమభూషణం, మమ జీవనం, మమ సర్వస్వం" అని గీతికలు పాడవచ్చు వాళ్ళు.వాళ్ళను నిద్దర్లోలేపి మాట్లాడమనండి—"మీరంతా దేశాభ్యుదయానికి హరిజనోద్ధరణకు అంకితం కావాలి" అనక తప్పదు.

ఏ స్వాతంత్ర్యదినం నాడో పిలవండి—"మనమంతా ఈనాడు, గాంధీజీ ఆనాడు కలలు కన్న రామ రాజ్యానికి పునరంకితం కావాలి." అని మనల్ని హెచ్చరిస్తారు.

అంతం లేకుండా
కిమ్మనకుండా, అధికారానికి
తందాన తాన పాడే
ఈ పాచి పళ్ళ దాసరుల పాటల్లో
కొత్తదనం ఏముంటుంది?
గుడ్లగూబలు మేలుకొన్నచోట
తెల్లవారడం ఎలా వీలవుతుంది?
సత్యం, ధర్మం ఇంకిపోయే ఎడారులలో
జాతి జీవనం పచ్చగా ఏనాడవుతుంది? □

సీ రి య ల్

ప్రేమ-మాధుర్య



ఐ.వి.యస్. అచ్యుతవల్లి

సావిత్రికి పెద్ద ప్రాణగండం ఏమీ లేదని స్టేషన్‌కి వచ్చిన రాజేష్ చెప్పాడు. 'అమ్మయ్య' అని తేలిగ్గా నిట్టూర్చారు అక్క-చెల్లెళ్ళిద్దరూ.

సావిత్రి అత్తగారు, మామగారు, ఆడబిడ్డ కూతురు మధుర వున్నారు యింట్లో. సుమనను

వినతనూ చూసి అబ్బురపడింది సావిత్రి అత్త గారు. "చిన్న పిల్లలని మిమ్మల్ని పంపిందా మీ అమ్మ! కూతురుకు ప్రాణం మీదకువచ్చినా మీ అమ్మకు గర్వం వదల్లేదన్న మాట" అంది. శాంతమ్మ సావిత్రి పెళ్ళికి చాలా దర్జాగా నీటుగా వుండేది. అది గుర్తు ఆమెకి.

"మా అమ్మ పరాయి వూళ్ళల్లో తేలిగ్గా మసలలేదండి. అంచేత సాయితాగా వుంటా మని మమ్మల్ని పంపింది" అంది సుమన.

"బాగానే వుంది" అంది ఆవిడ.

హాస్పిటల్లో జాయినయ్యింది సావిత్రి. మామూలుగానే మాట్లాడుతోంది. సుమన, వినత కాఫీ పళ్ళూ పట్టుకు వెళ్ళారు. రాజేష్ వాళ్ళని హాస్పిటల్ వార్డుకి తీసుకు వెళ్ళి తను ఆఫీసుకి వెళ్ళిపోయేడు.

"మీరు వచ్చేరా! అమ్మ బయలుదేరలేదా?" అంది.

"లేదు. నిన్ను ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారు?" అంది సుమన.

"ఒక వారం రోజుల్లో ఇంటికి వెళ్ళ వచ్చును. అవునూ, అప్పుడు నేను చెప్పిన విషయం ఏమి చేసావు? ఆలోచించావా?" అంది సావిత్రి. ఆపరేషన్ మూలంగా సావిత్రి చాలా బలహీనంగా వుంది. మరి కళ్ళల్లో వున్నాయి ప్రాణాలు. అక్కని చూస్తే జాలి వేసింది సుమనకు.

"నా మనస్సు ఒప్పుకోదు అక్కా!" అంది దీనంగా.

సుమన వెంపు చూసింది సావిత్రి. సుమన మునుపట్లా లేదు. ఏదో అంతరంగ మథనంతో బాధపడుతోంది అనుకుంది సావిత్రి.

"ఏమిటక్కా?" అంది వినత. నీకెందుకు అన్నట్లు చూసింది సుమన వినత వెంపు. వినతకు కోపం వచ్చింది.

"ఏమిటక్కా! నీవేమి చెప్పావు? నాతో చెప్పకూడదా! మీరంతా ఒక్కటిగా వుంటారు ఎప్పుడూ. నాతో ఏమీ చెప్పరు. మీ అంత తెలివితేటలు లేకపోయినా ఇంటెడు పనీ ఒక్కదానిని చేస్తున్నాను, తెలుసా! ఈవిడగారు పెద్ద..బి. ఎ. ప్యాసయినాదని గొప్ప. చీర వుతుక్కోవటం రాదు. నేనే వుతికి పెట్టాలి. అబద్దాల వ్రాతలూ, లెక్కలూ వ్రాయటం వచ్చు కదా అని నళినమ్మ నాలుగొందలు జీతం ఇస్తోంది. ఆ గుమస్తా వుద్యోగం చూసుకుని తగని గర్వం! నేనెందుకూ పనికిరానిదాన్నని అందరికీ అనుమానం" అంది వినత కోపంగా.

సావిత్రికి వినతంటే జాలి వేసింది. వినత చిన్నప్పట్నించీ పెంకితనం ఎరగదు. తమకి పొట్టి అయిన పట్టు లంగాలు, జాకెట్లు దానికి ఇచ్చేవారు. మరీ పండగా పబ్బమూ వస్తే తప్ప దానికి వేరేగా బట్టలు కుట్టించేవారుకాదు. ఎదిగిన వాళ్ళకి ఎల్లానూ కాస్ట్లీ బట్టలే కొనే వారు. అవి ఎన్నేళ్ళయినా నలిగేవి కావు. అంచేత అవి ముగ్గురూ కట్టినా వినతదాకా వచ్చేవి.

"ఎందుకే అంత కోపం విన్నీ!" అంది సావిత్రి ప్రేమగా.

"అది-కాదక్కా! అన్నీ నా వద్ద దాపరికం ఎందుకు? నేను మటుకు మీలానే పుట్టానా లేదా! వినోద పాటి చేయలేదా? దానితో వున్న చనువూ, సఖ్యం నాతో ఎందుకు లేకపోవాలి!" అంది వినత.

వినత చదువుకోకపోయినా ఎప్పుడూ పని చేయవలసి రావటంవల్ల నీటుగా కనిపించక పోయినా, ఆలోచనావిధానం ఒకటి తనదిగా చేసుకుంది అనుకుంది సావిత్రి.

"నువ్వు మా అందరికంటె చిన్నదానివి. అన్ని బాదరబందీల గొడవలు నీకెందుకు చెప్పు? నీ మనస్సుని బాధించాలి. వుండగలిగి నన్నాళ్ళు నువ్వయినా స్వచ్ఛంగా విరిసిన పూవులా వుండాలని నా తాపత్రయం. నీవేమో ఇన్ఫీరియర్‌గా ఫీలవుతున్నావు" అంది సుమన.

"చిన్నదాన్ని అని అంత ప్రేమలు ఒలికి పోతే అందరికంటె నన్నేం ఘనంగా చూస్తు న్నారు? మీరందరు కట్టి విడిచిన బట్టలతోనే కదా నన్ను పెంచారు! కుడిచే వాళ్ళకు కుడి భాగ్యం! అన్నట్లుగానే వుంది, మీ కష్టాలూ సుఖాలూ నేను వినకూడదా?" అంది వినత.

జరిగిన కథ :

రామనాథం కూతురు సుమన ఆ వూళ్ళోని మరో రైతు జగన్నాధరావు వైపు ఆకర్షితురాలయింది. జగన్నాధరావు భార్య నళినికీ సుమనకూ స్నేహం కలిగింది. పరస్పరం ఆకర్షింపబడ్డ జగన్నాధరావు, సుమన లభించిన అనుకూల పరిస్థితులలో శారీరకంగాకూడా దగ్గరయ్యారు. సుమన అక్క సావిత్రికి కులాసాగా లేదని చూసేందుకు సుమన, సుమన చెల్లెలు వినత బయల్దేరారు. సుమనకు రహస్యంగా డబ్బు ఇవ్వడం చూపిన నళినికీ, వినతకూ అనుమానం కలిగింది. ★

"విన్నీ. ఇలా వచ్చి కూర్చో!" అంది సావిత్రి. ఎదురుగ్గా స్టూల్ మీద కూర్చున్న వినత లేచి అక్కగారి ప్రక్కలో కూర్చుంది.

"నాకు రాధ పెళ్ళి ముందు నించీ అనుమానంగా వుంది. కడుపులో ఏదో బాధ. క్రమ క్రమంగా అది భరించరానిదయింది. పరీక్ష చేయించుకుంటే కడుపులో ఏదో కంతి పెరుగుతుందన్నారు. ఆపరేషన్ అంటే భయం, ఏమయిపోతానో ఏమిటో అని. చివరికి తప్ప లేదు. మధురని చూసేరుకదా! మా మూడో ఆడపడుచు కూతురు. నిండా పదహారేళ్ళులేవు. ఆ పిల్లని మీ బావకి కట్టపెటాలని మా ఆడబిడ్డ తాపత్రయం. మా అత్తగారూ మామగారూ కూడా దానికి ఇష్టపడ్డారు. మీ బావేమో మరీ చిన్నపిల్ల కదా అని భయపడుతున్నారు. సుమనను చేసుకోవే అంటే చేసుకోను అంటోంవి. ఇదీ విషయం" అంది సావిత్రి.

"ఎందుకు చేసుకోవే! నీకు బావగారికన్నా పెద్ద వుద్యోగస్థుడు వస్తాడా?" అంది వినత.

"నా కిష్టం లేదు. అక్క భర్తతో కాపురం ఎల్లా చేస్తాను?" అంది సుమన బాధగా.

"అక్క భర్త కాకపోతే మరొకరిభర్తతో కాపురం చేయవచ్చా?"

"విన్నీ!" అంది కోపంగా సుమన.

"ఎందుకే ఆ గాంర్దింపు! మన అక్క మనల్ని వీధిలోపెట్టి ఝాడించదు. ఇప్పుడున్న పరిస్థితులలో నాన్న నీకు మొదటి పెళ్ళి, పెళ్ళి కొడుకునూ, స్టేటస్ అయినవాడ్ని తేగలరను కుంటున్నావా? అక్క దురదృష్టంవల్ల అనారోగ్యంపాలు అయింది. లేకపోతే అది ఈ పాటికి నలుగురు పిల్లలతో కలకల్లాడుతూ పెద్ద సంసారం ఈదుతూ వుండును. మన అక్క అయితే మనకీ ఆధరువుగా వుంటుంది. బావగారూ మంచివాడు. తెలియని స్నేహితులు కన్న తెలుసున్న రాక్షసులు నయం. ఒప్పుకోకపోవటానికి ఏముంది ఇందులో!" అంది వినత.

"ఏమో! నేను నా మనస్సుకు నచ్చచెప్పలేకుండా వున్నాను" అంది సుమన.

"పోనీ నేను చేసుకుంటాను అక్కా-బావగార్ని అడిగి చూడు. నాన్న దీనికి సంబంధాలు వెతికి వెతికి చేసేసరి కిముప్ఫయ్యేళ్ళు వస్తాయి ఇంక అప్పుడు నా సంగతి చూడాలి. ఎందుకు ఈ అవస్థ! నీ దగ్గరే పడివుంటాను. మధుర కన్నా పెద్దదాన్ని కదా." అంది వినత.

"నిజంగానా విన్నీ!" అంది సావిత్రి.

"నిజంగానే అక్కా! బావగార్ని ఒప్పించు. చదువుకోలేదనీ, శుభ్రంగా వుండదనీ అనుకుంటారు అంతా. ఇల్లంత పనీ అందరికీ అన్నీ అందించుతూ వుండాల్సినదానిని. అలంకరించుకుందుకు నాకు టయిమెక్కడుంటుంది! నువ్వే చెప్పు. నాన్నగారి వ్యవసాయం పెట్టుబడి ఎక్కువ, ఖర్చులెక్కువ. నాణ్యమైన గుడ్డలు కొనుక్కుందామంటే డబ్బు ఎక్కడ్నించి వస్తుంది? నీవు ఎల్లాగయినా బావతో చెప్పి ఒప్పించు. నీసేవ చేసుకుంటూ వుండిపోతాను"

అంది వినత.

తను చిన్నప్పుడు ఎత్తుకు మోసిన పిల్ల అది. ఎన్ని మాటలు నేర్చిందిః మగ పిల్లల కన్న ఆడపిల్లలకు లోక జ్ఞానం చప్పున వస్తుంది కాబోలు అనుకుంది సావిత్రి.

విన్నిని దగ్గరకు తీసుకుని "నీకున్న జ్ఞానం పెద్దదయినా దానికి లేదు చూడు'' అంది. వినత మాట్లాడలేదు. అక్క గుండెల మీద తల వాల్చి కళ్లు మూసుకుంది.

రాజేష్ సావిత్రి చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయేడు. అతనికి మామగారి పరిస్థితి అంతా తెలుసును. అయినా ఇంతలా దిగజారి పోతారని అనుకోలేదు. సుమనని అడగమన్నాడు తాను. వినత ఒప్పుకోవటం ఏమిటి? ఇది ఎవరి ప్రపోజల్? బహుశా మామగారే చెప్పి పంపివుంటారు. సుమనని కనుక్కోవాలి ఈ మిస్టరీ ఏమిటో! ఇంటికి ఆలోచనతోనే వచ్చేడు. సావిత్రి హాస్పిటల్లో వున్నన్నిరోజులు సావిత్రికి కావల్సినవన్ని సుమన, వినత పట్టుకు వెళ్తూవుండేవారు. మధుర వాళ్ళ నాన్న గారు కూడా ఉత్తరాది వూళ్ళల్లోనే వుండటం చేత మధురకు హిందూస్థానీ బాగా మాట్లాడటం వచ్చును.

ఒకరోజు వినత అంది. "మధురా కొంచెం తోడురా! నువ్వు వస్తేతప్ప నేను ఈవూళ్లో అంగుళం కదలలేను."

"అదెందుకులేమ్మా పానకంలో పుడకలా. మీ అక్కచెల్లెళ్ళిద్దరూ వెళ్ళిరండి! అంత దూరంనించి ఇంతదూరం వొచ్చేరు. ఈ వూళ్లో ఆమాత్రం తిరగలేరా! చోద్యం కాక పోతే!" అని సాగదీసింది అత్తగారు.


"లేదు. తను ఒక్కత్తీ ఎందుకు ఇంట్లో. మేమంతా సరదాగా వెళ్ళవచ్చునని పిలిచింది వినత. అయినా మేము హాస్పిటల్‌నించి బజారుకు వెళ్ళదామనుకుంటున్నాము. మాకు హిందీలో బేరసారాలు చేయటం రాదు. తను వస్తే హిందీలో బాగా మాట్లాడుతుంది" అంది సుమన.

వినత అక్కగారికి భోజనం స్టీలుకారియర్లో సర్దింది. వాళ్ళు వచ్చినది మొదలు, సావిత్రికి ఏంకావాలన్నా వాళ్ళే అమరుస్తున్నారు. వినత వచ్చినరోజు కొంచెం కొత్తగా కూర్చుంది. వాళ్ళుండేది కంపెనీ క్వార్టర్స్. ముందు వెనకా పెద్ద ఖాళీస్థలం, చుట్టూ బార్బ్‌డ్ వైర్‌తో ఫెన్సింగ్ దానిని గాఢంగా ఒత్తుగా అల్లుకున్న బతాణి పూలతీగ. పెరట్లోబోరింగ్ పంపు. కిచెన్, డైనింగ్‌హాలు, రెండు బెడ్ రూంలు, ఒకహాలు, ఒక స్టోర్‌రూంవున్నాయి. ఒక బెడ్‌రూంలో సావిత్రి అత్తగారూ మామ గారూ పడుకొంటారు. అందులో ఒకపెద్ద అలమార వుంది. దానిలో వాళ్ళ సామాన్లు అన్నీ పెట్టుకుంటారు. దానికి తాళం వేసు కుంటారు. ఒక బెడ్‌రూంలో రాజేష్ పడు కుంటాడు. హాలులో ఆడపిల్లలు ముగ్గురూ పడుకుంటున్నారు. క్వార్టర్స్ మూలంగా ఒక ఇంటికీ ఒక ఇంటికీ మధ్య ప్రహరీగోడలేదు. ఫెన్సింగ్‌మీంచి ఒక ఇంటిలోని వాళ్ళు ఒక ఇంటిలోని వాళ్ళకి కన్పిస్తూవుంటారు.

వినత అక్కతో తన అభిప్రాయం చెప్పిన మర్నాటినుంచీ ఇంటిపనులలో ఇంకా యెక్కువగా కలుగచేసుకోవటం మొదలు పెట్టింది. సావిత్రి అత్తగారికి మడి, పూజా అన్నీ వున్నాయి. మామగారుకూడా భగవద్గీత చదువుతూ వుంటారు. వినత తెల్లవారుఝామునే లేచి పూజగదిలో అత్తగారికి దేముడివద్ద వూదొత్తులు, కర్పూరం, పాలు, పంచదార దీపారాధనచేసే సిమ్మాలు అన్నిరెడీగా పెట్టేది. రాజేష్ లేచేసరికి బాత్‌రూంలో వేణ్ణీళ్ళు, పేస్టూ, బ్రషూ అన్నీ రెడీచేసేది. సుమన మధుర కలసి వంటపని చూస్తోంటే వాళ్ళకు అన్నీ అందించేది. అందరి స్నానాలూ ఐనాక అందరి బట్టలూ శుభ్రంగా ఉతికి ఆరవేసేది.

"వసే! వినత మంచి చురుకయిన పిల్ల. శాంతమ్మ అభిజాత్య మేమీలేదు. ఎంతపని చేస్తూందో చూడు," అన్నాడు ఒకరోజు సావిత్రి మామగారు అత్తగారితో.

"నిజమే! వినయ విధేయతలున్నాయి. చదువూ చక్కదనం లేకపోయినా అణకువ



అయిన పిల్ల" అంది అత్తగారు.

ఆవిడ ఎన్ని సూటిపోటీ మాటలు మాట్లాడినా వినత బదులు చెప్పేదికాదు. సుమన జవాబులు చెప్పేది. మధురకూడా వినత అంటేనే ఎక్కువ స్నేహం కనబరచేది. అందరికీ లోకువగా కనబడటమే దానికి కారణం కావచ్చును. సావిత్రి ఇంటికి వచ్చినరోజు గుమ్మానికి పసుపు కుంకుమ పెట్టి వాకిలికి మామిడీ ఆకుల తోరణం కట్టింది వినత.

"దేనికి అట్లా చేస్తున్నారు?" అని అడిగింది, పక్క క్వార్టర్లోవున్న జగ్‌జీత్ కౌర్.

"మా అక్కని ఇవ్వాళ హాస్పిటల్‌నుంచి ఇంటికి తీసుకువస్తున్నాము. అంచేత గుమ్మానికి తోరణం కట్టాము. పసుపు కుంకుమలు పెట్టాము. శుభానికి సూచన ఇట్లాచేయడం!" అని సుమన ఆమెకు ఇంగ్లీష్‌లో విడమర్చి చెప్పింది.

సావిత్రిని టాక్సీలో ఇంటికి తీసుకుని వచ్చేరు. ఆమెని రాజేష్ చేయిపుచ్చుకుని తన గదిలోనికి తీసుకుని వెళ్లేడు. వెనకాతల సుమన, మధుర వెళ్ళారు. కాస్సేపు అలసట తీరేదాకా దిండ్లు ఎత్తుపెట్టి కూర్చుంది. సుమన మధుర ఎదురుగా చిన్న మంచం వాల్చుకుని కూర్చున్నారు. వినత పండ్లరసంతీసి గ్లాసులో పోసి తెచ్చింది. సావిత్రి రసంత్రాగి గ్లాసు ప్రక్కన పెట్టింది. గ్లాసు తీసుకుని మధుర బయటకు వెళ్ళింది. రాజేష్ పేపరుచూస్తూ ఈజీఛేర్‌లో కూర్చున్నాడు.

"అక్కని తీసుకువెళ్ళి రెండుమూడునెల లుంచుకుందామనుకుంటున్నాం బావగారూ" అంది సుమన. తండ్రికూడా రాజేష్‌పేర అంతకుమునుపే జాబు వ్రాసివున్నాడు. వినత కూడా వంటింటికేసి వెళ్లింది. హాలులో ముసలాయన గీతాపారాయణలో మునిగివున్నాడు. అత్తగారు వినతకు మధురకు ఏవో పనులు పురమాయిస్తోంది. బయట వానవచ్చే సూచనగా మబ్బు పట్టివుంది.

"సుమనా! మీ నాన్నగారు నాకూ వ్రాసేరు. సావిత్రిని నీతో పంపమని. మొన్ననే ఆపరేషన్ అయింది. ఇంత దీర్ఘప్రయాణం అప్పుడే చేయలేదేమో అని నాకు భయంగా వుంది. కొన్నిరోజులు మీరేవుంటే బాగుంటుంది అని నా అభిప్రాయం" అన్నాడు రాజేష్.

ఆ వారం, ఈ వారం అనుకుంటూ సావిత్రి నెలా పదిరోజులుండాల్సి వచ్చింది హాస్పిటల్లో.

తండ్రి ఇచ్చిన డబ్బుకాక, జగన్నాధం ఇచ్చిన డబ్బుకూడా అప్పుడప్పుడు ఆటోలకీ, మందులకీ పళ్ళకీ ఖర్చుపెట్టూ వచ్చేది సుమన. రాజేష్ చాలా తెలివయినవాడు. లోతు ఆలోచన కల మనిషి! తనవద్ద డబ్బువున్నప్పుడు భార్యకి కావాల్సిన మందులు తనే కొనేవాడు. డబ్బు తక్కువగా వున్నప్పుడు. "సుమనా! మీరు హాస్పిటల్‌కు వెళ్ళేటప్పుడు ఈ మెడిసిన్స్ కొని పట్టుకువెళ్ళు. నేను నిన్న తేవటం మర్చిపోయేను" అంటూ ప్రిస్క్రిప్షన్ చీటీ ఇచ్చేవాడు. ఇంచుమించు వీళ్ళువచ్చి నెలాపది హేను-రోజులు అవుతోంది. మరీ అక్క ఇంటికిరాగానే వెళ్ళిపోతే బాగుండదు. తీసుకు వెళుదామంటే సావిత్రి నిజంగానే బలహీనంగా వుంది. సుమన ఆలోచించటం చూసేడు రాజేష్.

"సుమనా! ఎందుకంత ఆలోచన! మీ అక్క ఇల్లు మీయిల్లు కాదా పరాయిచోటు అన్నట్లు బాధపడతావేమిటి?" అన్నాడు అభిమానంగా రాజేష్.

రాజేష్ తల్లిలా కఠినుడుకాడు. తండ్రిలా సౌమ్యుడు. రాజేష్ తల్లికి సావిత్రిమీద కొంచెం కార్పణ్యంగానే వుండేది. సావిత్రి తల్లితండ్రికి తొలిసంతానం. అంచేత సావిత్రికి అన్ని ముచ్చటలూ చాలా భారీయెత్తున జరిగాయి. రాజేష్ తల్లికి సావిత్రితల్లి శాంతమ్మ అంటే సదభిప్రాయంలేదు. ఆమెకు ధనగర్వం ఎక్కువని రాజేష్‌తల్లి అభిప్రాయం. శాంతమ్మ స్వభావముకూడా కొరకొరలాడే స్వభావమే. అందుకనే రాజేష్ తల్లి సావిత్రిని ఆ వంక ఈ వంకపెట్టి దెప్పుతూవుంటుంది. కొత్తలో సావిత్రి అందమువల్ల అయితేనేం, లేక కొత్త భార్యమీది మోజువల్ల అయితేనేం తల్లినే విసుక్కునేవాడు రాజేష్. కాని ఈ మధ్యనే కొంచెం భార్య అంటే విసుగు ఎక్కువయింది. మళ్ళీ ఈమధ్య సావిత్రి మంచం ఎక్కటంతో సావిత్రి అంటే జాలివేయ సాగింది.

సావిత్రి ఆపరేషన్ థియేటర్‌లోనికి వెళ్ళబోతూ భర్తని దగ్గరగా పిలిచింది. "ఏమండీ, మళ్ళీ మాటాడే అవకాశం భగవంతుడు ఇస్తాడో ఇవ్వడో నన్ను మర్చిపోకండి" అంది.

రాజేష్‌కి కళ్ళమ్మట నీళ్ళూరాయి. ఎంతయినా పదేళ్ళ అనుబంధం. తను కసుక్కున్నా విసుక్కున్నా ఇంటిని అంటిపెట్టుకుని వుండి తనకేం కావాలో అమర్చిపెట్టేది. ఒకదశ దాటాక మగవాడికి భార్యచేసే సేవ తల్లికూడా చేయలేదు. తనకంటూ ఏమీ దాచుకోకుండా, శరీరంలోని అణువణువుతో భర్తలో ఐక్యమయిపోతుంది స్త్రీ. రోజుకో కొత్త అనుభూతి కోసరం వెంపరలాడుతాడు పురుషుడు. ఈ పదేళ్ళకాలంలో సావిత్రి తనుపొందిన దానికంటె రెట్టింపు పోగొట్టుకుంది. జీవితకాలం మోహనగీతి పాడాల్సిన తరుణంలో ఆమె జీవితం అస్తవ్యస్తమయి అగాధాల పాలు కావల్సివస్తోంది. అయినింట పుట్టిన స్త్రీ తన బాధను పెదవి దాటనియ్యదు. మంచి అయినా చెడు అయినా మగవాళ్ళు ప్రచారం చేసినట్లు ఆడవాళ్ళు ప్రచారం చేయలేరు.

రాజేష్ భార్యనోదారుస్తూ "పిచ్చిదానా!" అన్నాడు.

భగవంతుని దయవల్ల సావిత్రి కోలుకుంది. ఇంక ఆమె జీవితానికి డోకాలేదు. బ్రతికి వున్నన్నిరోజులు అనారోగ్యం లేకుండా వుంటుంది. సుమన బావగారి కంఠంలోని అభిమానం గుర్తించింది.

"పరాయిచోటు కాదు బావగారూ, నేను ఉద్యోగం చేస్తున్నాను. ఒకనెల సెలవు పెట్టేను. నెలాపదిరోజూ లయిపోయింది. వెళ్ళకపోతే బాగుండదు. వినతను అట్టే పెడతాను. ఒకనెల రోజులుపోయేక మీరు వచ్చి యిద్దరినీ దిగబెట్టండి. వేసంకాలం అమ్మదగ్గర వుంటుంది అక్క" అంది సుమన.

"ఉద్యోగమా! ఎక్కడా! ఎప్పుడూ చెప్పేవు కాదేం!" అన్నాడు రాజేష్.

"మావూళ్ళో. జగన్నాధంగారని పెద్ద ధనవంతుడున్నాడు. ఆయనకి పిల్లాజెల్లా లేరు. ఆయనభార్య ఒక స్కూల్ తెరిచింది. దానికి కరస్పాండెంట్‌గా వర్క్ చేస్తున్నాను...."

అంది సుమన.

"ఓః అతనిభార్య సోమనాథం గారమ్మాయి కదూ!"

"అవును. మీకు తెలుసా."

"మా అన్నయ్య క్లాసుమేట్. చాలా క్లవర్‌గా వుండేదిట. క్లాసులో అన్నీ ఫస్టు మార్కులే వచ్చేవిట. మా అన్నయ్యకు ఆమె అంటే చాలా అభిమానం వుండేది. కాని వాళ్ళకీ మాకూ చాలాదూరంవుంది. అంచేత.."

"అంచేత... ?"

"మావదిన కాలేకపోయింది."

"మీ అన్నగారు ఆమెను ప్రేమించారా?" అంది సుమన.

"ప్రేమంటే మాటలప్రేమకాదు. ఆరాధన. డివోషన్. ప్రేమను ఆరాధనక్రింద మార్చుకో గలిగితే వ్యక్తులు ఈర్ష్యా జ్వాలలపరిధి దాటి పోతారు. ఒక విధమైన మృదుభావనవస్తుంది. మనుష్యులకు ఎదుటి మనిషి సుఖాన్ని ఆశించే మనిషి దైవసముడు నా దృష్టిలో! మా అన్న అలాంటివాడు."

"ఎంచేత దూరమయ్యేరు! ఆయన తన ప్రేమను ఆమెకు తెలియచేయలేదా?" అంది సావిత్రి.

"ఎందుకు చేయలేదు. మా అన్న నల్లగా వుంటాడు. మాది పెద్దసంసారం. ఆయన ఎంత చదువుకున్నా వెయ్యిరూపాయల జీతం కన్నా ఎక్కువరాదు. నళిని నెలకు రెండు మూడువేలు దానధర్మాలు చేసేది. వాళ్ళింట్లో ఆమె ఎంతచెప్పితే అంత. ఇంటిల్లిపాదీ నళినిని ప్రత్యేక దృష్టితో చూసేవారు. ఆ అమ్మాయిని పెద్ద జమీందార్ల ఇంటిలో ఇవ్వాలనివాళ్ళ వాళ్ళు అనుకునేవారు."

"అనుకున్నట్లుగానే చేశారుకదా! జగన్నాధం గారిది పదితరాలు కూర్చుని ఖర్చుచేసినా తరగని సంపద" అంది సావిత్రి.

"చాలా తెలివయినవాడుకూడా. ఇంకా భూపరిమితి చట్టం రాకుండానే తనకు ఎక్కువ అవుతుందని తోచిన పొలాలన్నీ వూరిలోని బీదాబిక్కీ అందరికీ దున్నుకోండిరా అని దాన పట్టా వ్రాసి ఇచ్చేడు. స్కూలు పెట్టేరు. స్కూలు నిర్వహణకు కొంత ఆదాయము వచ్చేట్లు చూసేరు. అంతా ఆయన్ని తల్చుకుని మహరాజు అని కోటిదండాలు పెట్టేవారే! ఎలాగూ గవర్నమెంటు తనకి ఉండనియ్యదు. తన చేతులతో తమని కనిపెట్టుకుని వున్న వాళ్ళకి ఇస్తే వాళ్ళు సంతోషిస్తారు. తమని ఇంకా అభిమానిస్తారు. ఎదుటి వాళ్ళనించి అభిమానం రాబట్టుకోవటం ఒక కళకదా!" అంది సుమన.

"నాన్నగారు అత్తలు చెప్పినట్లు మన కుటుంబం ఆడపిల్లలపేర పసుపు కుంకుమ క్రింద వ్రాసినా మనపొలం నిలబడును, కొంత కాకపోతే కొంతయినా" అంది సావిత్రి.

"పొలం అమ్మేసి పట్నంలో మేడకొన మన్నాడు మామయ్య విన్నారు కాదు. కొంత పొలం అమ్మేసి ఆడపిల్లల పెళ్ళిళ్ళకేనా డబ్బు బాంకిలో వేసేరు కాదు. ఎవరన్నా మంచి సూత్రం చెబితే నాకు తెలియదా అన్న అహం భావంతో ఆచరించటానికి ఒప్పుకోరు" అంది సుమన.

రాజేష్ అన్నీ మౌనంగా విన్నాడు. సావిత్రి సుమన వాళ్ళ కుటుంబ విషయాలు మాట్లాడు కుంటున్నారు.

"సుమనా! నీవు చదువుకున్నదానివి. మీ కుటుంబ పరిస్థితి చక్కదిద్దాలని ఉద్యోగం కూడా చేస్తున్నావు. మీ అక్క చెప్పిన సంగతి కెందుకు విముఖంగా వున్నావు?" అన్నాడు రాజేష్ హఠాత్తుగా.

ఈ సంగతి రాజేష్ తను వెళ్ళేలోగా ఎప్పుడో అప్పుడు అడుగుతాడనీ దానికి తాను జవాబు సిద్ధంగా వుంచుకోవాలనీ అనుకుంటూనే వుంది సుమన.

"పెద్ద కారణం అంటే ఇదీ అని నేను చెప్పలేను."

"అంటే మీ అక్కకేదో అన్యాయమని బాధపడుతున్నావా?"

"అదీ కాదు. అక్కే ఒప్పుకుని సమర్ధి స్తుంది కదా!"

"మరయితే దేనికి? రెండో పెళ్ళి అనా? లేక నీకు కూడా రాధలా ఆర్భాటంగా పెద్ద హెచ్చరికగా సంబంధం చూసి చెయ్యాలనా?''

"అదీ కాదు. నాకు వివాహం అంటే ఇల్లా చేసుకోవాలి అని కానీ, నాక్కాబోయే భర్త ఇల్లా వుండాలి అని కానీ నిర్దుష్టమైన అభిప్రాయాలు లేవు.''

"అయితే నన్ను ఎందుకు అంగీకరించ లేవు?''

"నా చిన్నప్పట్నుంచీ మిమ్మల్ని అక్క భర్తగానే గౌరవిస్తూ వచ్చేను. ఇప్పుడు మిమ్మల్ని మరోవిధంగా భావించలేకపోతున్నాను. క్షమించాలి. అక్క అనారోగ్యంతో మీరు రెండు సంవత్సరాలనించీ కొన్ని సుఖాలకు దూరం అయి వుంటారు. నాలాంటిదాన్ని చేసుకుని నా నిరాసక్తతతో మళ్ళీ మీరు బాధ పడాల్సి రావటం నాకు ఇష్టం లేదు. ఒకవిధమయిన అభిమానంతోనే నేను మిమ్మల్ని అంగీకరించలేకపోతున్నాను.''

రాజేష్ గాఢంగా నిట్టూర్చాడు. ఒక్కొక్కళ్ళ జీవితాలే అంత. ఆశించినది దొరకదు. దొరికిన దానితో తృప్తి వుండదు. జీవితం అంతా అందని మమకారానికి అర్రులు చాస్తూ ఆరాటపడాలని భగవంతుని శాసనం అయి వుంటుంది. రామనాథంగారి ఆడపిల్లలందరిలోకీ సావిత్రే చాలా అందమయినది. రాధ అందంగానే వుంటుంది కాని విపరీతమయిన అలంకరణలతో చూసేవాళ్ళకి గౌరవభావం కలిగించేలా వుండదు. సావిత్రిది నిసర్గ సౌందర్యం. అయితేనేం, శాపగ్రస్థురాలు. వడ్డించిన విస్తరి లాంటి జీవితం ఇచ్చి భగవంతుడు తినబోయే సరికి భోజనం జల్లేసాడు పెంటకుప్పలో.

* * *

వినత బయట ఖాళీస్థలంలో ఏవో పూల మొక్కలు పాతుతోంది. సుమన వినతను అట్టేపెట్టి తను రెండు రోజులనాడు వెళ్ళిపోయింది. ఒక నెల రోజులు అయినాక తను ఇద్దరినీ తీసుకు వచ్చి దింపుతానన్నాడు రాజేష్ ఈలోగా ఇక్కడ విషయాలేవీ తల్లిదండ్రులతో చెప్పవద్దన్నది. సావిత్రి వినత మధురల్లో ఎవరు అతనికి నచ్చితే వాళ్ళనే ఎంచుకుంటాడు. ఈలోగా ఈ సంగతులన్నీ తల్లిదండ్రులకు చెప్పి మనస్సులు పాడుచేయటం ఎందుకు?'' అంది సావిత్రి. వినత ఇంట్లో వంటపని అక్కకు ఏం కావాలో చూసుకోవటం, అటు అత్తగారికీ మామగారికీ ఏం కావాలో చూసుకోవటం, ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ అల్లా ఏవో పనులు చేస్తూనే వుంటోంది.

"మామయ్యకి ఏం కావాల్సినా వినతే అందిస్తోంది. ఇంక నన్నెందుకు ఇక్కడ వుండమని చంపుతావు?'' అంది అమ్మమ్మతో మధుర.

"అదేమిటే? వినత అందిస్తే మటుకు నువ్వు ఉండకూడదా? అది పనిమంతురాలు. అంచేత మామయ్య దేనికయినా పిలిస్తే వెంటనే అందిస్తుంది. ఏదో అత్త లేచి తిరగ కూడదు కనుక ఆ పిల్ల అటూ ఇటూ తిరిగి నాలుగు పనులూ చక్కబెట్టుకుంటోంది. నువ్వు వెళ్ళిపోవటం ఎందుకు?'' అంది రాజేష్ తల్లి.

"అదికాదమమ్మమ్మా! ఇంట్లో సాయం కావాలనికదా నన్ను పిలిపించావు? సాయం ఆవిడ వుండనే వుందయ్యే! ఇంకా నేను కూడా ఎందుకు? నేను మావూరు పోతాను. నాకిక్కడ తోచటం లేదు కూడా.''

"బలేదానివే! ఎందుకు తోచదు? అస్సలు నీకు ఒక్కచోట కాలు నిలవదు.'' అంది ఆవిడ.

మధురకూ గారం ఎక్కువే! అటు వాళ్ళ నాయనమ్మ ఇంటికి ఇటు అమ్మమ్మ ఇంటికీ మేనత్తల ఇంటికీ తిరుగుతూ వుంటుంది. వాళ్ళ వూళ్ళన్ని బొంబాయి చుట్టుపక్కల వున్నచిన్న చిన్న పట్నాలు కావటంతో మధుర ఆ వూళ్ళన్ని తేలిగ్గా తిరుగుతూ వుంటుంది. హైస్కూల్ చదువు పూర్తి చేయలేదు. ఆ పిల్లకు చదువుకోవటం ఉద్యోగాలు చేయటం అంటే చిరాకు. ఇంట్లో పని అన్నా చిరాకే. రోజుకో రకం బట్టలు వేసుకొని సినిమాలకు,

పార్టీలకు హాజరవమంటే మటుకు రెడీ అవుతుంది. చాలామంది తెలుగువాళ్లు వుత్తరాది రాష్ట్రాలలో రైల్వే వుద్యోగాలవల్ల కానీ ఫ్యాక్టరీ వుద్యోగాలవల్ల కాని వుంటున్నారు. వుద్యోగస్థులు చాలామటుకు భార్యలు-కూడా చదువుకుని వీలయితే చిన్న వుద్యోగం చేసుకుందుకు వీలుగా వుండాలని కోరుకుంటారు. మధురను చూస్తే పదహారేళ్ళ పిల్లలాగుండదు. కాలు పొడుగు. చామన ఛాయ అయినా కను ముక్కు తీరు బాగా వుంటుంది. పొడుగాటి జడ. సాధారణంగా రెండు జడలువేసి చివర అటువెంపు అమ్మే ఊలుబంతులు పెట్టుంది. సాల్వార్ కమీజ్ కానీ, గాగరాకుర్తా కాని, లేక ఆరు గజాల చీరలు కానీ కట్టుంది. తనకి ఎక్కువ ఉత్తరాది స్టయిల్ బట్టలే వున్నాయి. లేకపోతే నాలుగయిదు-పల్చని జార్జెట్ చీరలున్నాయి. ఇంటి పనుల్లో వినతవాళ్లు లేనప్పుడు అమ్మమ్మకు సాయం చేసేది. వినత, సుమన వచ్చేక పని చేయటం మానేసింది.

మధుర లేచేసరికే వినత స్నానం చేయటం కాఫీ ఫలహారాలు తయారు చేయటం అయ్యేది. మధుర దంతధావనం ముగించేసరికి రాజేష్, వాళ్ళ నాన్నగారితోపాటు మధురకి కూడా కాఫీ ఫలహారాలు అందించేది వినత. కొత్తలో మనుమరాలి వర్జాకు మురిసిపోయినా, రాను రానూ మధుర పోకడలంటే విసుగు కలిగింది పురుషోత్తమరావుకు. ఎంతకూ షోకులు చేసుకోవటం ఇరుగింట పొరుగింట దూరి వాళ్ళతో బాతాఖానీ వేసుకు కూర్చోవటం శకుంతలమ్మకూ కష్టంగానే వుంది. మధురని చేసుకోవల్సిందని మూడో అక్క జాబు వ్రాసినా మధురని భార్యగా చేసుకోవాలనే దృష్టితో చూడటం లేదు రాజేష్. అభిమానంతో చిన్న పిల్ల కదా అనే ప్రేమతో ఏది కావాలంటే అది కొనితెచ్చి పెట్టితే అది అంతా మామయ్యకు తన మీద వున్న ప్రేమ అనుకొని మురిసిపోతూ వుంటుంది మధుర. అంచేతే మధుర స్వేచ్ఛాప్రవర్తన అతని మనస్సుకి కష్టంగా లేదు.

వినత ఇంటెడు పనీ ఒక్క చేతిమీద చేస్తోంది. అటు సావిత్రికి ఏమి కావాలో చూస్తోంది. ఆడదాని కింతకంటే ఏం కావాలి! రాజేష్‌కి మధుర అంటే కోపం కూడా వస్తుంది'' అంది శకుంతలమ్మ భర్తతో.

"దీనికంతా మగరాయుడితనం వచ్చింది. బి. ఏ. చదివి ఉద్యోగం చేస్తున్న సుమన మటుకు ఎంత సాయం చేసేది? అటు బజారు పని ఇటు ఇంటి పనీ. అటు మళ్ళీ హాస్పిటల్‌కి వెళ్ళి అక్కను చూసుకోవటం అన్నీ చేసేది. ఒకళ్ళ కిద్దరు సాయం వున్నారు కనుకనే సావిత్రి అన్ని రోజులు హాస్పిటల్‌కి వెళ్ళినా మనకి కొంచెమయినా ఇన్‌కన్వీనియన్స్ లేకుండా జరిగింది. మధురని నమ్ముకొని వాళ్ళకు జాబు వ్రాయకుండా వుంటే నీవీ చాకిరీ అంతా చేసేసరికి మంచమెక్కి వుందువు" అన్నారు ముసలాయన అభిమానంగా.

ఎందుకో అటువెంపు వచ్చిన రాజేష్ ఆ మాటలు విన్నాడు. గాఢంగా నిశ్వసించేడు. సావిత్రి ఎల్లాగయినా సుమనని ఒప్పించవచ్చునని ఇన్నిరోజులూ ఆశించేడు. సుమన ఖచ్చితంగా చెప్పేసింది చేసుకోలేనని. వినత తన చుట్టూ తిరుగుతోంది. వినతకు చదువు, సంధ్యా లేదు సుమనలా. తాకినంతనే మైమరపింపచేసే సొగసు లేదు కాని నిండయిన మనిషి. ఆదర్శ గృహిణి కుండవలసిన లక్షణాలున్నాయి. ఒక రకమయిన చేష్టలుంటాయి. చాలా ఆకర్షణీయంగా వుంటాయి. ముట్టుకుంటే చేయి చురుక్కుమంటుంది. అలాంటిదిసుమన. నువ్వు ప్రేమించిన వాళ్ళని ఒదులుకున్నా, నిన్ను ప్రేమించిన వాళ్ళని ఒదులుకుంటే ఎక్కువ నష్టపోతావు' అన్నారు ఎవరో. అలాగ కోరివచ్చిన వినతని కాదనటానికి తగిన కారణంలేదు, సావిత్రికీ ఆసరాగా వుంటుంది. తనకా మరీ చిన్నపిల్ల కాకుండా వుంటుంది అనుకున్నాడు రాజేష్. ఇప్పుడు తలితండ్రులు కూడా వినత సత్ప్రవర్తనకి ఎక్కువ వోట్లు వేయటంతో అత్తవారిల్లు వదలలేకపోయేడు అనే చెడ్డపేరునించి తప్పించుకోగలిగాడు.

సాయంకాలం రాజేష్ సావిత్రితో అన్నాడు "సావీ! మీ నాన్నకు జాబు వ్రాయకూడదూ!" అని.

"ఏమని?"

"ఈ నెలలో మంచి ముహూర్తాలు వున్నాయిట. మీ అమ్మగారినీ, నాన్నగారినీ రమ్మని వ్రాయి. ఇక్కడే ఏదో లాంఛనంగా పెళ్ళి జరిపేసుకుందాము."

రాజేష్ మనస్సు బాధగా వుంది. భార్య బ్రతికి వుండగానే భార్య సమక్షంలోనే భార్య సలహా సంప్రతింపులతోనే మళ్ళీ పెళ్ళికి పూనుకోవటం చాలా ఆక్వర్డ్‌గా వుంది. చాలామంది పురుషులు భార్య అందగత్తె అయినా ఇంటి నిండా గంపెడుమంది పిల్లాజల్లా వున్నా, సొగసుని చూస్తే పగలుపోతారు. రాజేష్‌కి అటువంటి చాపల్యం లేదు. సావిత్రిని చూసి మనస్ఫూర్తిగానే అంగీకరించాడు. సావిత్రి రోగిష్టి అయ్యేదాకా ఏ విషయంలోనూ ఆమె మాట కాదనలేదు. సావిత్రికి రోగం ముదురుతున్నకొద్దీ సుమన మీద అభిమానం పెంచుకున్నాడు. ఈ వస్తువునాది ఎక్కడకు పోతుంది అన్న జాగ్రత్తలోనే నాది అనే అభిమానంలో నిర్లిప్తతకు చోటు ఇచ్చాడు.

"బాగా ఆలోచించేరా! తీరా మావాళ్ళకి వ్రాసినాక మాటతిరిగితే వినత జీవితం దుర్భరం అవుతుంది" అంది. చారెడు కళ్ళూ తడి అయ్యేయి.

"ఇంక ఆలోచించవలసినదేముంది సావీ! సుమన పెద్దది. ఒప్పుకొంటుందేమో అనుకొన్నాను. తనకిష్టం లేదు అంది. వినత ఒప్పుకుంది అన్నావుగా నువ్వే!"


"అవును. దానంతటదే ఒప్పుకొంది. మధుర విషయం ఏమాలోచించారు! మీ అక్కయ్యకు కోపం రాదుకదా!"

"మావాళ్ళ కక్కూర్తి కానీ మధురకూ నాకూ పెళ్ళేమిటి? అదృష్టం లేకకానీ లేకుంటే మధుర ఈడు అమ్మాయిలు మనకుండేవాళ్లు. మావాళ్ళ విషయం నేను చూసుకుంటాను. మీవాళ్ళకి నచ్చచెప్పే పూచీ నీది. ఇంక అక్కడయితే మనం అంతా వెళ్ళటం పెళ్ళి పేరంటం అంటూ ఆర్భాటం నాకు నచ్చదు. పైగా సుమనకి కాకుండా చేయటం వాళ్ళకీ బాగుండదు. సుమనకి అయ్యేదాకా వేచి వుందామంటే సుమనకి ఏమీ సంబంధాలు చూస్తున్నట్టు లేదు. అందునా సుమన వుద్యోగస్థురాలు అయింది. ఆమె ఏమాశిస్తున్నదో ఏమిటో! అంచేత మన గొడవ మనం చూసుకుందాము. మీ వాళ్ళకి అన్ని విషయాలూ దాపరికం లేకుండా వ్రాయి. వీలుంటే మనం సుమనని అడిగిన సంగతి కూడా వ్రాయి" అన్నాడు రాజేష్.

అక్కగారికి హార్లిక్స్ కలిపి తీసుకు వచ్చిన వినత రాజేష్ మాటలు విన్నది. "హుం! సుమన" అనుకుంది. సుమన! సుమన! అందరికీ సుమనే కావాలి! తను ఇంత రెక్కలు ముక్కలు చేసుకొంటూన్నా సుమనే గుర్తువస్తుంది తప్ప తను గుర్తు రాదు. అందని ద్రాక్ష! దూరపు కొండ—నూరికే అన్నారా! ఏమైనా రాజేష్ తనని పెళ్ళి చేసుకోక తప్పదు. సుమన కన్నా రాధకన్నా అప్పుడు తనే గొప్పది అవుతుంది. తను అక్కను ఎంత జాగ్రత్తగా చూసుకుంటే బావ మనస్సు తనపట్ల అంత ప్రేమగా మారుతుంది. అత్తగారికీ, మామగారికీ ఎంత జాగ్రత్తగా పనులు చేస్తే అంత మంచిగా చెప్పుకుంటారు. ఈ ఇల్లు తనది! ఈ మనుష్యుల్ని తను ప్రేమించాలి. గౌరవించాలి. అప్పుడు తన స్థానం చెక్కు చెదరదు. గుండెని ధైర్యంతో నింపుకోవాలి. భార్యగా సావిత్రి అక్కకొక స్థానం, ప్రేయసిగాసుమనకొక స్థానం వుంది రాజేష్ హృదయంలో. వాట్లమధ్యగా తను చోటు చేసుకోవాలి అనుకొంది వినత. వెనుకకు మరలి వంటింటికి వెళ్ళిపోయింది.

భోజనాల వేళ...."మామయ్యా! పిక్చర్‌కి తీసుకువెళ్ళు" అంటూ మొదలు పెట్టింది మధుర.

"నువ్వు చూడనివేమి వున్నాయి? అన్నీ చూసేసావు" అన్నాడు రాజేష్!



వినత సావిత్రి ఇంటికి వచ్చినాక వూరంతా మధుర సాయంతో చూసింది. చాలామటుకు మరాఠీ భాషలో వచ్చిన సినిమాలే అక్కడ ఎక్కువ వస్తాయి! అన్నీ చూసింది మధుర సాయంతో. ఇప్పుడిప్పుడు మధురతో తిరగటం నించి కూరలవాళ్ళతో, షాపులవాళ్ళతో కొద్ది కొద్దిగా హిందీ మాట్లాడటం కూడా వచ్చింది. అయినా స్వంతంగా సుమన వూరు వెళ్ళినాక బజారుకు పోలేదు!

"చూస్తే మటుకు మళ్ళీ చూడాలని వుంది" అంది మధుర.

"నీకు అరికాలిలో ఆనికాయలున్నాయల్లే వుంది. ఒక్క నిమిషం కాలు నిలవదు" అన్నాడు రాజేష్.

"వంటలక్కలా వంటిల్లు పట్టుకు కూర్చోవటం నాచాత కాదు" అంది మధుర.

"వంట చేసేవాళ్ళంతా వంటలక్కలా! అయితే మీ అమ్మ కూటా వంటలక్కేనా?" అన్నాడు కవ్వింపుగా.

"పూర్వం అంతా ఆడపిల్లలని అలాగే తయారు చేసేవారు! ఏడెనిమిదేళ్ళ పిల్లలప్పట్నించీ కంచాలూ, ఎంగిళ్ళు తీయటం, కాఫీ గ్లాసులు అందించటం, వెనకాతల పుట్టిన తమ్ముళ్ళను చెల్లెళ్ళనూ ఎత్తుకొని తిప్పటం. ఇదే జీవితం అనుకొంటూ ఆడపిల్లలు పెరిగేవారు." పెద్ద ఆరిందాలా అంది మధుర.

"పూర్వం నయమే అయితే! కనీసం వంటన్నా చాతనయి వుండేది ప్రతి ఆడపిల్లకీ. ఇప్పుడు ఆడపిల్లలకి బట్టలు కూడా కట్టుకోవడం చాతకావటం లేదు. అందుకే ఎన్నేసి ఏళ్ళు నెత్తికి వచ్చినా లుంగీలు, లాగులూ కట్టుకుంటున్నారు" అన్నాడు రాజేష్.

"నువ్వేమీ ఎక్కిరించక్కర్లేదు. నా కా డ్రస్సులంటే ఇష్టం" అంది.

"నేనేమీ ఎక్కిరించటం లేదు."

"ఇంతకీ సినిమాకి వస్తావా రావా?"

"నువ్వూ వినతా వెళ్ళండి" అన్నాడు. విసుగ్గా.

"రోజూ ఆవిడతో వెళ్తానే వున్నాకదా!"

"ఇంకేం మరీ?"

"నీతో వెళ్దామని సర్దాగా" అంది. మధుర ముఖంలోకి చూసాడు రాజేష్! ఆ పిల్లకు తన కోరికలు, తన సర్దాలు తీరాలి. ఎదుటివాళ్ళ మంచిచెడ్డలు ఆ పిల్లకు అక్కర్లేదు. జబ్బుపడి లేచిన భార్య వుంది! అమ్మమ్మ తాత వున్నారు. మరదలు వుంది. కాని ఆ పిల్లకి తన

సరదా వెల్లడించటానికి ఎటువంటి సంకోచమూ కలగలేదు. ఇల్లాంటి పిల్ల తనకి భార్య అయి, తన రోగిష్టి భార్యకు సోదరియై, తన తల్లి దండ్రులకి కోడలు అయి సేవలు చేస్తుందా! అనుకున్నాడు రాజేష్.

"మనిద్దరం స్కూటర్ మీద వెళ్దామా!" అన్నాడు.

మధురకు ఏనుగెక్కినట్లయింది. "ఓ! దాని కనేగా నిన్ను రమ్మంటున్నదీ!" అంది. మధురని తయారవమన్నాడు. గబగబా రెండు ముద్దల్లో భోజనం కానిచ్చేసింది. తెల్లని జార్జెట్ మీద నీలం చుక్కలున్న చీర, లేత నీలం జార్జెట్ స్లీవ్‌లెస్ చోళీ వేసుకొంది. జుత్తంతా బ్రష్ చేసి సగానికి పైగా నీలం రిబ్బన్ కట్టి ముడి వేసింది. చెవుల వెనకగా మజుమ్‌తా పూసుకుంది."ఇన్ని తీరువలు విలాసాలు ఎవరు నేర్పారు?" అనుకున్నాడు రాజేష్.

శకుంతలమ్మ భర్తతో అంది "మనవాడికి మధురంటేనే ఎక్కువ ఇష్టం."

"పిచ్చిదానివి నువ్వు" నవ్వాడాయన. దొంగను దొంగే పట్టాలన్న సామెత వుంది. మగవాడి వూహలు ఏ తీరున వుంటాయో ఆడ వాళ్ళకేం తెలుసును? పురుషోత్తమరావుగారికి కొడుకు మనసు అర్థం అయింది. కష్టమో నష్టమో సావిత్రి కుటుంబంలోని పిల్లనే చేసుకో వాలని అనుకుంటున్నాడని ఆయన పసికట్టాడు. కాలంలో వున్నప్పుడయితే కొడుకులకీ, కూతు ళ్ళకీ ఆయనే మంచి సంబంధాలు ఎంచి పెళ్ళిళ్ళు చేసాడు. ఒక్క రాజేష్ తప్ప అంతా సుఖంగా ఎవరి సంసారాలు వాళ్ళు చేసుకుంటు న్నారు! ఇంక విశ్రాంతి తీసుకోవల్సిన వయ స్సులో రాజేష్ సమస్యను తన నెత్తికి రుద్దుకో దల్చుకోలేదు. కాస్తో కూస్తో వెనకాతల తనకు ఆస్తిమీద డబ్బు వస్తుంది. బాదరబందీలు ఆట్టే లేవు. పైగా ఆఖరువాడు. అందుకని రాజేష్ వద్దకు చేరారు. తన సౌఖ్యం తనే చూసుకుంటాడు! తనెందుకు అతని జీవితం లోని లోటుపాట్లు ఎంచి పెట్టడం? అని పురు షోత్తమరావుగారి అభిప్రాయం. వినత నడ వడిక ఆయనకు నచ్చింది కూడాను! అందు కనే శకుంతలమ్మ చేసిన వ్యాఖ్యానానికి నవ్వేసి వూరుకున్నాడు.

* * *

స్కూటర్ మీద మధురని ఎక్కించుకుని సినిమాకు కాకుండా వూరికి చాలాదూరం తీసుకు వెళ్ళాడు. ఆ వూరికి చివర ఒక నది ప్రవ హిస్తోంది. పెద్ద పెద్ద బండరాళ్ళు మధ్యన చిన్న చిన్న గులకరాళ్ళు గుండ్ర ఇసుక కదు లుతూ సన్నని మృదు సవ్వడితో వుంటుంది ఆ ప్రవాహం. అక్కడక్కడా పెద్ద పెద్ద గంగరావి చెట్లున్నాయి.

"ఇక్కడికి తీసుకువచ్చా వేమిటి!" సంశ యంగా అడిగింది మధుర.

దశమి వెన్నెల చాలా అందంగా పల్చగా పరుచుకొంది. నిశ్శబ్దతరంగాల చిరుసవ్వడిని సన్నని చలిగాలి విన్పిస్తోంది. చుట్టూ చాలా ఆహ్లాదకరమయిన వాతావరణం. దూరంగా ఏదో దేవాలయం గాలిగోపురం అస్పష్టంగా కన్పిస్తోంది. చెప్పులు విప్పి నీటిలో కాళ్ళు తడుపుకుంటూ కొంచెం దూరం వెళ్ళి విశా లంగా వున్న బండరాయి మీద కూర్చున్నాడు రాజేష్.

"సినిమా అంటే ఇక్కడికి తీసుకువచ్చా వేమిటి మామయ్యా!" అంది ఇంకా సందే హంగా మధుర.

"ఇల్లా వచ్చి కూర్చో!" అన్నాడు రాజేష్. మధుర భయంగానే వచ్చి కొంచెం దూరంగా వున్న యింకో బండరాయిమీద కూర్చుంది.

"మధూ! నీకు సినిమా ముఖ్యమా? నాతో షికారు ముఖ్యమా? ఏది బాగ వుంటుంది?"

"నాకు నీతో సినిమా ముఖ్యం" ఠక్కున జవాబిచ్చింది.

"అవునూ. నన్ను పెళ్ళి చేసుకోవాలని నీ కెందుకు అన్పించింది?"

"నాకు అన్పించలేదు, అమ్మ అంది."

"ఏమని?"

"అత్తకి జబ్బుగా వుంది. నువ్వు వెళ్ళి అమ్మమ్మకి మామయ్యకు సాయం చేయాలి"

తల వంచుకొంది మధుర.

"తర్వాత?"

"మామయ్యకు పెద్ద వుద్యోగం అవుతుంది. అప్పుడు రెండు వేల రూపాయలు జీతం నెలకు వస్తుంది. కారు కొంటాడు. పెద్ద బిల్డింగ్‌లోకి మారిపోతాడు. అందుకని...."

"అందుకని?"

"మామయ్యని పెళ్లి చేసుకొంటే నీకు పెద్ద హోదాగల భర్త వచ్చినట్లు అవుతుంది అంది. నిజంకాదా మరి!"

"మరి నీకు సందేహం రాలేదా?"

"ఎందుకు?"

"అత్త బ్రతికి వుంది. అమ్మమ్మ తాతయ్య మనవాళ్ళయినా మామయ్యని పెళ్లి చేసుకోవాలంటే అత్త మనసు కష్టపెట్టుకోదా అని!" మధుర తటాలున రాజేష్ ముఖంలోకి చూసి తల వంచుకొంది మళ్ళీ.

"చెప్పవేం?"

"నేను కాకపోయినా ఎవరో ఒకరిని నువ్వు పెళ్లి చేసుకొంటావు కదా! ఆ ఎవరో ఒకరు నేనెందుకు కాకూడదు! పెద్ద పెద్ద కట్నాలిచ్చినా మంచి వుద్యోగస్థులు నాకు రారు. అందరూ గ్రాడ్యుయేట్స్ కావాలంటున్నారు. నాకు చదువుకోవాలని లేదు" అంది.

"చదువుకోవాలని లేకపోతే పెళ్లి చేసుకోవచ్చును. అది ఎవరూ కాదనరు. కాని రెండో పెళ్లివాడిని భార్య బ్రతికి వుండగా చేసుకోవటం నీకు సిగ్గుగా వుండదా? రోజూ దాని క్రింద పని అదీ చేయాల్సి రావటం కష్టంగా వుండదా?"

"ఆవిడకి నేనెందుకు పని చేయాలి? నౌకర్ని పెడదాము. నలుగురిలో ఆవిడతో కూడా కూడా నేను తిరుగుతానా? ఏదో గుప్పెడు అన్నం తిని ఆవిడ గదిలో ఆవిడ పడి వుంటుంది. లేకపోతే నెలకి ఇంత అని ఒక నిర్ణయం చేసుకొని ఆమెనుపుట్టింటికి పంపేస్తే సరిపోతుంది."

"మీ అమ్మకు వంట్లో ఏదో తీరని అనారోగ్యం వచ్చిందనుకో. మీ అమ్మను పుట్టింటికి పంపేసి మళ్ళీ పెళ్లి చేసుకోమని మీ నాన్నకి సలహా ఇవ్వగలవా?"

"మరి మేమేమవ్వాలి?" ఎదురు ప్రశ్న వేసింది మధుర.

"ఎవరూ లేనంతమాత్రాన రోగిష్టిదని వదిలేయటమేనా! ఒకవేళ నాకేదయినా జబ్బు చేస్తే నువ్వు నన్ను నా ఖర్మానికి నౌకర్లకు అప్పచెప్పేస్తావా?" అన్నాడు రాజేష్.

"నిన్ను అలా ఎందుకు చేస్తాను!" అంది మధుర.

"మధూ! వివాహాలు ఎందుకు చేస్తారో తెలుసా పెద్దవాళ్ళు! ఒకరి కొకరు జీవితాంతం కష్ట సుఖాల్లో తోడునీడగా వుండాలని చేస్తారు. తలచెడిన ఆడది, నీడలేని ఆడది, గూడులేని ఆడది, తోడులేని ఆడది—అని వంటరి ఆడదాన్ని అంటారు. భర్త బ్రతికివుండగా పట్టెడు అన్నానికి, వంటికి కప్పుకుందుకు గుడ్డకీ, పుట్టింటికి చేరవలసి రావటం—ఆడదానికంటే ఆడదాన్ని కట్టుకొని కడగళ్ళపాలు చేసిన మగవాడికే సిగ్గుచేటు! నన్ను చేసుకోవాలంటే నాకు రాబోయే రెండువేల రూపాయల జీతం పై ఆడవాళ్లు తింటారేమో అనే దుగ్గకంటె విధి మోసగించిన ఒక సాటి ఆడదాన్ని ప్రేమగా గౌరవంగా ఆదరించగల మనసు కలిగి వుండాలి."

మధుర వెర్రెత్తినదానిలా రాజేష్ ముఖంలోకి చూస్తూ వుండిపోయింది చాలా సేపు. రాజేష్‌లో సావిత్రిపట్ల నిజంగా ఇంత అభిమానం వుందా! వుంటే వుండవచ్చును. ఆశ్చర్యం ఏముంది? పదేళ్ళ క్రిందట నవ వధువుగా ఎన్నో కోరికలతో కాంక్షలతో అతని ఇంటికి వచ్చింది. అగ్ని సాక్షిగా తాళికట్టిన భార్య! పదిహేను వేల రూపాయల కట్నం! పాతిక వేల రూపాయల జవాహరీ, సారె సామాను. ఇంటికి దీపం ఇల్లాలు అంటూ సినిమావాళ్ళు పాటలు పాడుతారు. ఎంతమంది మగవాళ్లు తమ ఇల్లాళ్ళని సమంగా ఇంటికి దీపంలా చూస్తున్నారు! సావిత్రికి మటుకు తను బ్రతికినన్ని రోజులూ తన భర్త తనతోటే కష్టమో సుఖమో పంచుకోవాలని అనిపించదా! అని

షించుతుంది. కాని పైకి శాసించలేదు. నేను చస్తేకాని మీరు మరో దారి త్రొక్కవద్దు అని భర్తని శాసించలేదు. ఆడదాని శాసనం మగవాళ్ళకి చెల్లదు. పిల్లలు లేకపోతేనేం! భర్తకు హఠాత్తుగా ఏ జబ్బోచేస్తే, 'భార్య నాకు పిల్లలు కావాలి. సంసార సౌఖ్యం కావాలి' అంటూ 'కావల్సివస్తే మీకూ సేవలు చేస్తాను' అని మరోక కుర్రవాడ్ని కట్టుకుని కాపరంచేస్తూ పిల్లల్ని కంటూ రోగిష్టి భర్తను ఒక మంచంమీద పడేసి "నాభర్తమీద నాకు చాలా ప్రేమ. ఆయన అనుమతి మీదనే నేను మళ్లీ పెళ్లి చేసుకున్నాను." అంటే ఈలోకం హర్షిస్తుందా? హర్షించదు. ధైర్యంగా యే ఆడదన్నా అలా చేసినా భర్తని ఒకచవట వాజమ్మక్రింద జమ కడతారు. మగవాడు భార్యని వదిలేసినా, చంపినా, రోగిష్టినిచేసినా ఏంచేసినా—భార్యని ఏంచేసినా సరే సర్వ హక్కులూ వున్నాయి. దానం చేయబడ్డ వస్తువుకదా మరి! దాన విక్రయ సర్వాధికారా లతో కన్యాదానం అన్నారు. కన్యనే దానం చేయాలి, కాళ్లు కడిగి! వరుని కన్యకు ఎందుకు దానం చేయకూడదూ! అది మన స్మృతు లలో లేదుకదా? భూదానం, గోదానం, కన్యా దానం, స్వర్ణదానం. చైతన్యం లేని వాటితో జమ ఆడపిల్లకూడా!

"ఏమిటి అలా చూస్తున్నావ్," అన్నాడు రాజేష్.

"క్షమించు మామయ్యా! అమ్మ చెప్పింది కదా అని ఒప్పుకున్నాను. కాని నిన్ను నేను పెళ్ళిచేసుకోలేను," అంది మధుర, ఆలోచన లోనుంచి తేరుకుంటూ.

"బెంగవద్దు మధూ! నీకు మంచిసంబంధం కుదిర్చి ఎంత కట్నమయినా యిచ్చి పెళ్ళి చేస్తాను!" అన్నాడు రాజేష్.

మధుర తేలిగ్గా నవ్వేసింది.

శ్రావణమాసం వచ్చింది. ఒక చేమబ్బులూ ముసురూ. ఒక్కరోజూ ఫెళ్ళుమని యెండ కాయటంలేదు. చుట్టుపక్కల పొలాలుండటం నించి ఊడ్పులకూలీలు అటూయిటూ తిరగ టంతో వూరంతా బురద బురదగా వుంటోంది. ప్రతి లోగిలిముందూ, సిమెంటు గోలాలతో నీళ్లుంచుతారు. ఇంటికి వచ్చేవాళ్ళూ కాళ్లు కడుగుకుని మరీ లోనికి రావాలి. అందుకనే ఏమో ఇప్పటికీ పల్లెలకు వెళితే కాళ్ళుకడుగు కుందుకు నీళ్ళ చెంబుతో ఎదురు వస్తారు. ముందు కాళ్ళు కడుగుకుందుకు నీళ్ళివ్వటము తర్వాత దాహానికి చిక్కటి మజ్జిగ ఇవ్వటం పల్లెటూర్లో సాంప్రదాయకంగా వస్తూంది.

నళిని ఏదో కొనాల్సివచ్చి పట్నానికి వెళ్ళింది. వెళ్ళేటప్పుడు అంత తుంపరలేదు. సన్నసన్నగా రొజ్జగాలి వీస్తూంది. వచ్చేసరికి ఈదురుగాలితో వానజల్లుకూడా పెద్దదయింది. రేగడి నేలకనుక బండ్లగాడిపడి రోడ్డంతా బంద బందగావుంది. కారు వూరి మొగదలకు వచ్చే సరికి బందలో దిగబడిపోయింది, అప్పారావు అన్నాడు. "ఇంక ఈబండి కదలండి" అని.

"అయితే ఏం చేద్దాం!" అంది నళినివిసుగ్గా.


"మీరు నడిచి వెళ్ళండి. నేను మనుషుల్ని కూడేసి కారు పైకి లాగిస్తాను." చెప్పులుతీసి కారులో పడేసి బందలో మడమలవరకూ కూరుకుపోతూంటే ఎట్లాగో ఇల్లు చేరుకుంది. జగన్నాధరావు ఎదురువచ్చారు.

"అప్పుడే వచ్చావేం! ఈపూటకి వుండి పోతావనుకున్నాను" అన్నాడు.

"వుండ బుద్ధికాలేదు. అయినా మనవూరి రోడ్లేమిటి మరీ అంత ఛండాలంగావున్నాయి ఈవూళ్ళో నివసిస్తున్నది మనుష్యులేనా!" అంది అసహనంగా.

"ఇప్పుడా సందేహం యెందుకొచ్చింది? ఇన్నాళ్ళూ సంసారం చేస్తున్నది ఈవూరు మనిషితోనే."

"నేను ఇన్నాళ్ళు అంత పట్టించుకోలేదు. ఎప్పుడూకోటలావున్న మన ఇల్లుదాటి బయటకు వెళ్లన దాన్నికాను. ఈరోజు చూసేను.అబ్బబ్బ! రొచ్చుకంపు! మురికి అంతా నాలుగురోడ్లు మధ్యవుంది. వీధి శుభ్రంగా ఉంచాలని యే ఒక్కరికీ తెలియటంలేదు. ఈ నిలవ వర్షం వల్ల ఇళ్ళలోవాళ్ళు పారవేసిన చెత్తాచెదార



మంతా నాని కుళ్లి కంపుకొడుతోంది. ఎలా బ్రతుకుతున్నారు వీళ్ళు!"

"కొన్ని ఏళ్ళబట్టీ బ్రతుకుతున్నారు. రోడ్డు అంటే ఏమిటి అని నీ వుద్దేశ్యం!"

"నలుగురూ నడిచే రహదారి అని."

"అదేంకాదు. మన ఇంట్లో మనకు పనికి రాని చెత్తంతా పారవేయటానికి పనికివచ్చే స్థలం. ఏదన్నా పనికిరాని వస్తువుగా తయారయితే ఇది యింక దేనికీ పనికిరాదు. రోడ్డు మీద పారెయ్యండి అని ఎంతో తేలిగ్గా సలహా లిస్తూ వుంటాం మరి!"

"నిజమే అనాలోచితంగా అంటాం. అయినా వీధులు ఇంత మురికిగా కుళ్ళుకంపు కొడుతూ వుంటే పంచాయితీ వాళ్ళు ఏంచేస్తున్నారు!"

"వాళ్ళు ఈ వూరికి సేవ చేయటానికి పంచాయితీ మెంబర్లు ప్రెసిడెంట్ అయినారు అంటావా! ఈ చిన్నమెట్టు ఎక్కితే పెద్ద మెట్టుకి దోవ దొరుకుతుంది. నలుగురు మనుష్యులూ తెలుస్తారు, రాజకీయ భరతనాట్య ప్రదర్శనలో అరంగేట్రం ఇయ్యటం లాంటిది. పంచాయితీ ప్రెసిడెంట్ అవటం. ఉండ్రాళ్ళ మీద భక్తేకాని వినాయకుడి మీద భక్తికాదు."

"మరి ఇంతలేసి మొఖాసాదార్లున్నారు. వాళ్ళకీ అక్కర్లేదా వూరి రహదారి బాగోగులు"

"సంఘ సేవ చేయదల్చుకుంటే మొఖాసాదారుల మోసాలు ఈపాటికే తుడిచిపెట్టుకు పోయేవి."

"బాగానే వుంది. నేనిన్ని రోజులూ వర్షాకాలం ఇల్లు కదలలేదు కనుక వూరు ఎల్లా వుందో చూడలేదు. ఒక్కరోజు వూరి మొగదల నించి మనింటికి వచ్చేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. నిత్యం అనేక పనులమీద తిరుగుతోంటారు సామాన్య జనం. వాళ్ళు ఎంత కష్టపడుతున్నారో!" అంది నళిని.

"ఎవరూ ఇంత బాధ అనుకొని వుండరు" అన్నాడు.

నాలుగు రోజులు గడిచాయి. మహిళా మండలివాళ్ళు సమావేశమయ్యారు. ఆగస్టు పదిహేను వస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం జరపాలనుకొన్నారు. ప్రతి సంవత్సరమూ ఎలిమెంటరీ స్కూల్ పిల్లలచేత ఊరేగింపు జరిపించి చాక్లెట్లు పంచి పెట్టించేవారు. సాయంకాలం మీటింగ్ పెట్టి, పిల్లలచేత డ్రామాలు, పాటలు పాడించేవాళ్లు. వాళ్ళల్లో బాగా పాడిన పిల్లలకి, బాగా నటించినవాళ్ళకి ప్రయిజులిచ్చేవాళ్ళు. క్రితం సంవత్సరం నళిని స్నేహితురాలు లీలామహంతిచేత వీణ కచ్చేరీ చేయించారు. ఈ సంవత్సరం ఏం చేద్దామా అని నళినిని

సలహా అడిగేరు.

"మీరంతా ఇక్కడికి ఎలా వచ్చేరు?"అంది నళిని.

"నడిచే" అన్నారు.

"రోడ్డు మీదేనా?"

"బాగుంది. రోడ్డు మీద కాక ఆకాశం మీంచి నడచి వొచ్చేమా!" అంది ఒకావిడ.

"అది కాదు. రోడ్డంతా బురద బురదగా లేదూ?"

"వర్షాకాలం అలాగే వుంటుంది."

"జ్వరం అలాగే వుంటుంది. అంటూ మందు వేసుకోకుండా వుంటే జ్వరం తగ్గుతుందా?"

"ఎలా తగ్గుతుంది?"

"అలాగే, జ్వరం వచ్చినా, తలనొప్పి వచ్చినా వెంటనే మందు వేసుకొంటాం. తగ్గించుకొందుకు శాయశక్తులా ప్రయత్నాలు చేస్తాం కదా! రోడ్డు బురద బురదగా వుంటే ఎవరికి వారే పట్టించుకోకుండా నడిచి వస్తారు. కాని ఈ రోడ్డు శుభ్రంగా గోతులు బెడ్డలు లేకుండా చేయాలని ఆలోచించలేరు."

"ఒక్కళ్ళవల్ల ఏమి అవుతుంది?"

"అవదు. ఒక్కళ్ళవల్ల ఏ పనీ అవదు. నలుగురూ కలిస్తేనే ఏపనయినా అయ్యేది. సంఘబలం ఏవిధమయిన పనయినా చేయించగలదు. అందుకనే నేను వకటి ఆలోచించాను. ఈ సంవత్సరం స్వాతంత్ర దినోత్సవం వేడుకలు శ్రమదానంతో ప్రారంభిద్దాము. ముందు మన వీధులు శుభ్రంగా వుంచుకోవాలి. రోడ్డు చివరగా అటూ ఇటూ సిమెంటు గోలేలు వుంచాలి. ఇళ్ళల్లోవాళ్లు ఏమన్నా పనికిరాని వస్తువులు చెత్తా చెదారం వుంటే ఆ సిమెంటు గోలేల్లో పారెయ్యాలి. రోజూ ఒకసారి రోడ్డు వూడిచేట్లు రెల్లివాళ్ళను నియమించాలి. రోడ్డుకి అటూ ఇటూ చిట్టికేసరి చెట్లని నాటించాలి. అప్పుడు వూరు చూట్టానికి పరిశుభ్రంగా వుంటుంది."

"అవి అన్ని పంచాయితీ వాళ్ళు చేయాల్సిన పనులు. ఆడవాళ్ళం మనం చెప్తే ఎవరు వింటారు?"

"మనం చెప్తే వినరు! చేస్తే వూరుకోరు నిజమే! అందుకు మనమేం చేయాలి! పంచాయితీకి మనంచెప్తే వినేవాళ్ళని ఎన్నుకోవాలి,"

"నిజమే;" అన్నారు వాళ్ళు.

ఆడవాళ్ళందరిని సమావేశపరిచారు. మనం రోజూ ఫర్లాంగు దూరంవున్న చెరువులోంచి నీళ్ళు ఇళ్ళకు జేరబోసుకోవాలి. వానా కాలం తెచ్చుకున్న నీళ్ళు సగం మళ్ళీ కాళ్లు కడుగుకొందుకే అయిపోతాయి. అంచేత రోడ్లు చిక్కగా దిట్టంగా కంకర వేయించాలి. మీ మగవాళ్ళని వారానికి ఒకరోజు రోడ్డు తవ్వేపనికి రమ్మనమనండి. మీరు కూడా వాళ్ళతో పనికి రండి. అందరం కలిసి రోడ్డు మరామత్తులు చేసుకుందాం." నచ్చచెప్పింది నళిని.

నళిని రోడ్డు మరామత్తు పనుల్లో నిమగ్నమయింది. పెద్దింటి కోడలు. జమీందారీ ఛాయాలోని మనిషి, నళిని ఇవతలికి వచ్చి నాలుగు పనులూ చేస్తోంటే వూరిలో చాలామంది తీరికవుండి వేరే వ్యావృత్తిలేని యువకులు కూడా ముందుకు వచ్చేరు. చేయదల్చుకుంటే ఎన్ని పనులయినా వుంటాయి. నళినికి కాలం క్షణం విరామం లేకుండా గడుస్తోంది. సుమనకు టీచరు పనిచేయ బుద్ధవటంలేదు. నళినితో సోషల్‌వర్క్ చేయ బుద్ధవటంలేదు.

మాటిమాటికి తనేదో తప్పుదోవలో నడుస్తున్నట్లు అన్పించుతుంది. తన గమ్యం ఇది కాదు. వచ్చివచ్చి ముళ్ళ డొంకలో చిక్కుకుపోయింది, ఎల్లా తప్పించుకోవాలో అర్థం కావటంలేదు. నళినికి ఇప్పుడు వూళ్ళోవాళ్ళు చాలామంది పరిచయస్థులయినారు, అంచేత ఏపనైన సుమన చేయూత అక్కర్లేకుండానే చేసుకుపోతోంది. నళిని ఆ రోజు భోజనానికి చాలా ఆలస్యంగా వచ్చింది. జగన్నాధరావు ఏదో పనివున్నదని పట్నం వెళ్ళాడు. భోజనం వడ్డిస్తూ అంది రాజమ్మ.

"సుమన చెల్లాయికి పెళ్లిట అమ్మా."

(ఇంకా వుంది)

ప్రతిబింబం

యర్రంశెట్టి శాయి

నరసింహం ఆఫీసు ముందు జీపు దిగాడు.

ప్యూన్ శ్రీరంగ పరుగుతో అతని కెదు రొచ్చి, చేతిలోని లెదర్ బాగ్‌ని అందుకొని వెనకే నమ్రతగా నడవసాగాడు. తన ఆఫీస్ రూమ్ దగ్గరకొచ్చేసరికి అప్పటికే ఆఫీస్‌లోని మిగతా వారంతా ఎవరి సీట్లలో వారు కూర్చొనుండటం కనిపించింది. గర్వంగా నవ్వుకొని తన సీట్లో కూర్చున్నాడతను. తనొచ్చాకే ఈ ఆఫీసులో డిసిప్లిన్ మొదలయింది. అంతకు ముందు ఆ ఆఫీసెలా వుండేదో కొంతమంది తనకి చెప్పారు. పదింటికి ఆఫీసయితే అందరూ పదిన్నరకొస్తారట. వచ్చి కబుర్లు చెప్పుకొని, కాంటీన్‌లో ఓసారి 'టీ' తాగి వచ్చేసరికి పదకొండున్నర. ఓ పావుగంట ఫైల్స్ సర్ది లంచ్ కెళ్లిపోతారు. ఆ తరువాత రెండింటికి ఆఫీసులో అడుగు పెట్టి ఒకటో అరో ఫైలు చూసి నాలుగున్నరనుంచే ఇంటికి జారుకోవడం మొదలు పెడతారుట! తను ట్రాన్స్‌ఫర్‌లో వచ్చి జాయినయిన మొదటి రోజే పది గంటలకల్లా ఆఫీసులో అడుగు పెట్టి ఆ సమయానికి సీట్లోకి రానివాళ్ళందరికీ స్వయంగా తనే ఆబ్సెంట్ మార్క్ వేశాడు. అంతే! అందరూ కాజువల్ లీవ్ అప్లయ్ చేయాల్సి వచ్చిందా రోజు. మర్నాటి నుంచీ తొమ్మిదీ ముప్పావుకే కలకలలాడిపోతోంది ఆఫీసు. మరో రోజు సరిగ్గా ఐదు గంటలకు రెండు నిమిషాలుందనగా సెక్షన్‌లోకి నడిచి ఖాళీగా వున్న సీట్ల తాలూకు వాళ్ళందరికీ ఆబ్సెంట్ వేశాడు. అక్కడితో అందరూ దారికొచ్చేశారు. ఆ తరువాత 'డయిరీ' పద్ధతి ప్రవేశపెట్టాడు. ఏరోజు ఎవరెంత పని చేసిందీ, ఎన్ని ఫైల్స్ డీల్ చేసిందీ వ్రాయాలందులో.

ఆ పద్ధతి మంచి ఫలితాలనే ఇచ్చింది.

అయినాకాని వాళ్ళను కనిపెట్టే వుండాలి. తను అశ్రద్ధ చేశాడా వాళ్ళు తోక జాడించేస్తారు.

రమణారావ్ ఏదో ఫైలు తీసుకొని ఆ గదిలో కొచ్చాడు. ఫైలు నరసింహం ముందు వుంచాడు సంతకం కోసం.

నరసింహం ఫైలంతా తిరగేసి చూడ సాగాడు. తను చూడకుండా ఎప్పటికీ సంతకం పెట్టడు. అన్నీ తెలుసుకోందే సంతకం పెట్టెయ్యటం తన కిష్టం లేదు. గుడ్డెద్దు చేలో పడ్డట్లు గుమాస్తాలు తయారుచేసిన నోట్ లన్నిటికీ సంతకాలు పెట్టేస్తే జరిగేదేమిటో తనకు తెలుసు. వాళ్లు కంట్రాక్టర్ల దగ్గరా, వర్తకుల దగ్గరా లంచాలు తినేసి వాళ్ళకు చేయకూడని సహాయాలు చేస్తారు. అక్కడే తనకు ఏవగింపు కలిగేది.

హఠాత్తుగా ఓ ఆలోచన తట్టిందతనికి. ఇప్పుడీ రమణారావ్ కూడా లంచం తినే వుంటాడా? ఫైలంతా చూడటం ముగించేసరికి అతని అనుమానం మరింత బలపడింది. రమణారావ్‌ని మళ్ళీ పిలిపించాడతను.

"ఈ కాంట్రాక్టర్‌కి అనుకూలంగా నోట్ రాశావెందుకు?" అడిగాడతన్ని.

రమణారావ్ తొణక్కుండా జవాబిచ్చాడు "రూల్స్‌ప్రకారమే చేశానండీ."

★ పాఠాలు పాఠశాలలతో అంతం కావు. నేర్చుకొనే అవసరం ఉన్నప్పుడు ప్రకృతిలో ప్రతి వస్తువు ఏదో రకంగా మనకు పాఠం చెప్పగలుగుతుంది. జీవిత కాలమంతా విద్యార్థులమే మనం! ★

"ఓహో—అంతకంటే ఇంకేమీ కారణం లేదంటావ్?''

రమణారావ్ కతని మాటల్లోని వ్యంగ్యం అర్థమయింది. కోపం వచ్చిందిగానీ అణచేసు కొన్నాడు.

"ఇంకేముంటుందండీ?" ఎదురు ప్రశ్న వేశాడు.

"రమణారావ్! నా ప్రశ్నకు సమాధానం మరో ప్రశ్న కాదు. నువ్వు ఈ కంట్రాక్టర్ దగ్గర లంచం తినలేదని ఏమిటి గారంటీ?"

రమణారావ్‌కి ఉద్రేకం పొంగుకొచ్చింది.

"ఇందులో గారంటీలేముంటాయండీ? ఒకరి నొకరు నమ్మాల్సిందే. నమ్మకం లేకపోతే వాళ్ళ ఖర్మ! అంతే"

"ఓహో! అలాగా! సరే! నేనిప్పుడు ఈ ఫైలుమీద సంతకం పెట్టను. అన్ని సంగతులూ వాటంతటవే ఎలా బయటకు రావో నేనూ చూస్తాను. .." కోపంగా అన్నాడు నరసింహం.

"సంతకం పెట్టకపోతే నాకొచ్చే నష్టం ఏమీ లేదు సార్! ఇది నా ఇంటిపని కాదు" విసురుగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు రమణారావ్!

బెల్ నొక్కాడు నరసింహం.

ప్యూన్ పరుగుతో వచ్చాడు.

"హెడ్ క్లర్క్‌ని పిలు...."

"అలాగే సార్...."

మరుక్షణంలో హెడ్‌క్లర్క్ సీతారామయ్య హడావుడిగా వచ్చాడు.

"చూడు సీతారామయ్యా! రమణారావ్ డీల్ చేసిన ఈ కేసు విషయంలో నాకు అనుమానంగా వుంది. నీ అభిప్రాయం ఏమిటి?" ఫైల్ అతని ముందుకు తోస్తూ అన్నాడు నరసింహం.

ఫైల్ చూసి వెంటనే గుర్తించాడు సీతారామయ్య.

"ఊహూ! రమణారావ్ అలాంటివాడు కాదండీ! మీరనుమానపడనవసరం లేదు... "

"ఓహో...." తల పంకించాడు నరసింహం అతనికి కొత్త అనుమానం మొదలయింది. అంటే సీతారామయ్యకి కూడా లంచం ముట్టిందన్నమాట!

"మీకెంత ముట్టిందందులో?" అడిగాడు నరసింహం!

సీతారామయ్య అసహనంగా చూశాడు.

"మీరెంతనుకొంటే అంత!" అన్నాడు కోపంగా.

"సరే—మిమ్మల్నందర్నీ ఎలా దారికి తేవాలో నాకు తెలుసు" దహించుకుపోతూ అన్నాడు నరసింహం.

"నరసింహంగారూ! గుమాస్తా అయినంత మాత్రాన కక్కుర్తిపడాలనీ, నీతి నియమాలు అమ్ముకోవాలనీ ఎక్కడా లేదు. అలాగే ఆఫీసర్లయి నంతమాత్రాన అందరూ ఆదర్శ వంతులూ నీతిమంతులూ అవరు" అనేసి బయటకు నడిచాడతను.

సాయింత్రంవరకూ మరో రెండు మూడు ఫైల్స్ విషయంలో కూడా మరో నలుగురి మీద అనుమానం కలిగిందతనికి.

ఆ రోజు ఏ పనీ పూర్తికాలేదు. ఆఫీసంతా ఒకటయినట్లు అనిపించింది. అరింటికి ఆఫీస్‌లో నుంచి బయల్దేరబోయేముందు ప్యూన్ కొన్ని సర్టిఫికెట్లు, ట్రూ కాపీలు తీసుకొచ్చి ముందు వుంచేడు.

"మీ సంతకం కావాల్సార్... " అన్నాడు వినయంగా.

వాటిని చూడగానే రక్కున గుర్తుకొచ్చింది నరసింహానికి! ఈ ప్యూన్‌లకి ఇదో ఆదాయం. ఇలా ట్రూ కాపీస్ కావాల్సిన వాళ్ళందరి దగ్గరా ఒకటో రెండో తీసుకొని తమతో సంతకాలు చేయిస్తారు. సర్టిఫికెట్లిప్పిస్తారు. కేవలం వీటి వల్లే బోలెడు డబ్బు సంపాదించి బిల్డింగులు కట్టించిన ప్యూన్ ఒకడు తనకు తెలుసు!

"వాళ్ళ దగ్గర ఎంత తీసుకొన్నావ్?" అడిగాడు నరసింహం.

"ఇతను మా అన్నయ్య కొడుకే సార్!"

"ఇది మరో అబద్ధం! గెటవుట్! నేను చేయను...." విసిరేస్తూ అన్నాడు నరసింహం.

అతను ఆ కాగితాలన్నీ ఏరుకొని బయటకు వెళ్ళిపోయాడు.

జీప్‌లో ఇంటికి బయల్దేరాడతను.

"పెట్రోలు కొట్టించాలి సార్."

"నిన్నేగా కొట్టించిందీ?" ఆశ్చర్యంగా అడిగాడు నరసింహం.

"మరి రాత్రి మైలవరం వెళ్ళి రమ్మన్నారు కదండీ-అరవై కిలోమీటర్లది...."

"అంతేనా? లేక ఆయిల్ మళ్ళీ బంక్ వాళ్ళకు అమ్ముతున్నావా?" అడిగాడు నరసింహం.

"అవన్నీ అడగొద్దు సార్; జీప్ ఎంత దూరం తిరిగిందీ, ఎంత ఆయిల్ కాలిందీ చూసుకోండి. మీకే తెలుస్తుంది ..." కోపంగా అన్నాడు డ్రైవర్.

నరసింహం ఏమీ మాట్లాడలేదు. నమ్మకంగా బంక్ వాడి ద్వారానే వీడి రహస్యం లాగాలి అనుకొన్నాడు.

ఇంటికి చేరుకొనేసరికి ఎవరో ఓ యువకుడితో ఉత్సాహంగా మాట్లాడుతోంది అరుణ.



నరసింహం లోపలకురాగానే "నమస్కారమండీ!" అంటూ వినయపూర్వకంగా పలుకరించాడా యువకుడు. అతనిని అంతకు ముందెక్కడా చూసిన గుర్తు లేదు నరసింహానికి. 'నమస్తే' అని పొడిగా అనేసి లోపలకు నడిచాడు. అరుణ చాలా సేపు ఆ యువకుడితోనే కబుర్లు చెబుతూ కూర్చుంది! నరసింహానికి అశాంతిగా వుంది. ఆ యువకుడెవరు? అరుణకు అతనితో అంతటి పరిచయం, చనువు ఎలా ఏర్పడినయ్? ఇంతకాలం తను చూడని ఉత్సాహం ఇప్పుడామెలో అకస్మాత్తుగా ఎందుకు ప్రవేశించింది?

అరుణ గదిలోకొచ్చింది.

"అతను మా క్లాస్‌మేట్ శాంత తమ్ముడండీ! మేము బి. ఏ.లో వుండగా అతను యస్సెల్సీలో వుండేవాడు. మన ఎదురింట్లోనే అద్దెకు దిగాడు. నన్ను చూసి గుర్తుపట్టి వచ్చి మాట్లాడుతూ కూర్చున్నాడు. రేపో మాపో అతని భార్యను కూడా తీసుకొస్తాడట ఆ ఇంట్లోకి."

నరసింహానికి మరింత అశాంతి కలుగచేసినయ్ ఆమె మాటలు.

"నువ్వంటే అంత ప్రేమ కాబోలతనికి!" వికటంగా అన్నాడు.

అరుణ చురుగ్గా చూసిందతని వైపు.

అతని మాటలోని అంతరార్థం లీలగా కనిపించిందామెకి. ఇది మొదటిసారి కాదు! అతనికి అనుమానం జబ్బు ఉందన్న విషయం తను కాపరాని కొచ్చిన పదేళ్ళల్లోనూ చాలా సార్లు గమనించింది.

అనేక సందర్భాలలో అనేక రకాలుగా బయటపడిందది.

"ప్రేమేముంది? అక్కయ్యా స్నేహితురాలంటే ఆ మాత్రం గౌరవం, అభిమానం వుండవా?"

"అవన్నీ పైన పదాలు. వాటన్నిటికీ అంత

రార్థం ఒకటే—నువ్వంటే అతనికి ఇష్టం. మరి నీ ప్రోత్సాహం లేకుండా అతని కలాంటి అభిప్రాయం ఏర్పడిందంటే నేను నమ్మలేను."

అరుణ చివాలున లేచి నుంచుంది. ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"ఇద్దరు పిల్లల తల్లినయిన నన్ను ఇంకా అనుమానిస్తున్నారంటే మిమ్మల్నేమనాలో అర్థం కావడం లేదు...." అనేసి అక్కడినుంచి వేగంగా వెళ్ళిపోయింది.

ఆ రోజునుంచీ ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. రెండ్రోజుల తర్వాత మళ్ళీ శాంత తమ్ముడొచ్చాడు! "దయచేసి మా యింటికి రాకండి" అని చెప్పేసి లోపలకువెళ్ళి కన్నీరు పెట్టుకొంది. తను నరసింహంతో మాట్లాడడం తగ్గించివేసింది.

మొదట్లో ఆమె ప్రవర్తన ఫరవాలేదనిపించినా, రాత్రాను ఆమెతో సాన్నిహిత్యం లోపించడంవల్ల ఏదో వెలితిగా కనిపించసాగిందతనికి. అయినాగాని తప్పలేదు. ఏలాగోలా ఈ వెలితి భరించడమే మంచిదనిపించింది.

ఓరోజు తన కొడుకు రవి స్కూలునుంచి ఇంటికొచ్చేప్పుడు ఐస్‌క్రీమ్ తింటూ తనకంట పడ్డాడు. ఇంటి దగ్గర వేచివుండి వాడురాగానే చావబాదేడు నరసింహం.

"నిజం చెప్పు ఐస్‌క్రీమ్ ఎక్కడిది నీకు?"

"మా ఫ్రెండ్ కొనిచ్చాడు."

"అబద్ధం! నువ్వు నా జేబులోనుంచి డబ్బు దొంగిలించావు కదూ?"

"ఊహు! లేదు నాన్నా! మా ఫ్రెండ్...."

నరసింహం అతని మాటలు వినిపించుకోలేదు. చావబాదేడు. ఆ రోజునుంచీ వాడికి తండ్రంటే ఏహ్యాభావం కలిగింది. అదివరలా అతని దగ్గరకు రావడం, మాట్లాడడం మానివేశాడు. ఓరోజు నరసింహం స్నేహితుడు విశ్వనాథం వచ్చాడు.

"నాకో సహాయం చేయాల్రా!" దీనంగా అడిగాడు విశ్వనాథం.

"ఏమిటది?" అడిగాడు నరసింహం.

"మా సిస్టర్ మారేజ్ చేస్తున్నాను. నా దగ్గరున్న డబ్బు చాలేట్లు లేదు. ఓ పదివేల రూపాయల సర్దావంటే వచ్చే నెలలో లోన్ తీసుకొని నీ బాకీ తీర్చేస్తాను."

"డబ్బా!" తేలిగ్గా మాట్లాడాడు నరసింహం.

"అవున్రా! మనవాళ్ళందరూ గడ్డు పరిస్థితుల్లోనే వున్నారు. అందరూ నీదగ్గర కెళ్ళమనే సలహా యిచ్చారు."

నరసింహం ఆలోచనలోపడ్డాడు. తన దగ్గర డబ్బుంది. అతని క్కావలసిన పదివేలూ తేలిగ్గానే ఇవ్వవచ్చు. కాని ఇస్తే ఆ డబ్బు తిరిగి వస్తుందా? ఒకవేళ వాడు తిరిగి ఇవ్వకపోతే తనేం చేయగలడు? అసలు తనిచ్చినట్లు ఋజువులేముంటాయ్? అంతలోనే విశ్వనాథంతో ఎంతో కాలం నుంచీ తనకున్న స్నేహం గుర్తుకొచ్చింది. నిజమే! తనకి వాడు ప్రాణ స్నేహితుడే! ఎన్నోసార్లు వాడిమూలాన తను ఎన్నో సహాయాలు పొందాడు! తను అడిగినప్పుడల్లా డబ్బు కూడా అవసరాలకి సర్దాడు. ఒకవిధంగా చెప్పుకోవాలంటే వాడు ధన సహాయం చెయడంవల్లే తనీ ఉన్నత పదవి సంపాదించుకోగలిగాడు. ఈరోజు వాడి పరిస్థితి కొంచెం దెబ్బ తినడంవల్ల తన దగ్గరకొచ్చాడు. నరసింహం ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు.

"ఏమిట్రా—ఆలోచనలో పడ్డావ్! డబ్బు లేదా? లేకపోతే పోనీలే! మరోచోట ప్రయత్నిస్తాను."

నరసింహం ఎటూ చెప్పలేక చిన్నగా నవ్వాడు.

అతను లేచి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోతూంటే నరసింహం బాధపడ్డాడు. తను తప్పు చేస్తున్నాడు. తనకు తెలుసు. తన ప్రాణస్నేహితుడిని మోసం చేశాడు. కానీ....తీరా తను సహాయం చేశాక అతగాడు అది మర్చిపోతే? అప్పుడు విచారించడంకన్న ఈ బాధే మంచిదేమో!

వారం రోజుల తర్వాత విశ్వనాథం చెల్లెలి పెళ్లి చాలా వైభవంగా జరిగింది. పెళ్ళికి తనూ వెళ్ళక తప్పలేదు నరసింహానికి. కానీ అక్కడ స్నేహితులందరితోనూ అదివరలా చనువుగా

(వి) చిత్ర విజ్ఞానం



సిగరెట్ పొగలో రెండు వాయువులున్నాయి. అవి నైట్రజన్ డై ఆక్సైడ్, హైడ్రజన్ సయనైడు! ఈ రెండూ ఊపిరితిత్తులకు తీవ్రమైన హానిని కలిగించి "ఎంఫైసిమా" అనబడే వ్యాధికి దారితీస్తాయి. అమెరికాలోని "ఓష్నర్ క్లినిక్" లో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులమీద పరిశోధనలు జరుపుతున్న డా॥ హర్స్ట్ హోచ్ రోజూ రెండు పాకెట్లకు మించి సిగరెట్లు తాగే వారికి యీ వ్యాధి సంభవించే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. నైట్రజన్ డై ఆక్సైడ్, హైడ్రజన్ సయనైడులను మొదటి ప్రపంచ యుద్ధంలో విష వాయువులుగా ఉపయోగించారు!!

మసలలేకపోయాడు. అదీగాక రాఘవగాడు అననే అనేశాడు కూడా "కొంతమంది చాలా తెలివిగలవాళ్ళయిపోయార్రా యీమధ్య! డబ్బు వుంచుకుని లేదు బొమ్మనేస్తున్నారు. వాళ్ళ బాంక్ బాలెన్స్ సంగతి మనకు తెలీదనుకొంటున్నారు కాబోలు—అయినా నాకు తెలీకడుగుతాను, ఇలా పోగుజేసి, చేసి చివరకు ఏం సాధిద్దామని?''

ఆ మాటతో తనకు తల కొట్టేసినట్టయింది. విశ్వనాథాన్ని పిలచి క్షమించమని అడగాలనుకొన్నాడు. కానీ ఏదో తెలీని బలహీనత అతనిని అలా చేయనీకుండా అడ్డుపడింది. ఆ తరువాత అతను కనిపించినా చూడనట్లు తప్పించుకుపోసాగారందరూ.

రాన్రాను నరసింహానికి జీవితం అసంతృప్తిని కలిగించసాగింది.

తన భార్య తనతో మనసు విప్పి మాట్లాడదు.

తన కొడుకు అసలు తనతో మాటాడడానికే ఇష్టపడడు.

తన కూతురుకి తనని చూస్తేనే భయం!

తన జీప్ డ్రైవర్‌కి తనంటే నిర్లక్ష్యం.

ప్యూన్‌కి అసహ్యం!

ఆఫీసు స్టాఫందరికీ తనంటే ద్వేషం.

స్నేహితులకి అయిష్టం—

ఏమిటీ దారుణం?

తను అందరిలాంటివాడు కాదూ? తనలో మానవత్వం లేదూ?

తన కుటుంబమంటే తనకి ప్రేమ లేదూ?

తన స్నేహితులను తను ప్రేమించడం లేదూ?

అయినా అందరూ తనమీద ఎందుకిలా కత్తి కట్టారు? ఈ ఆలోచనలు ఎక్కువవుతున్న కొద్దీ అశాంతి పేరుకుపోసాగిందతన్లో. ఆఫీసులో ఒక్క కాగితం కూడా కదలడం లేదు. అసలు ఆఫీసు కెళ్ళడానికూడా మనస్కరించడం లేదతనికి.

రెండు నెలలు సెలవు తీసుకొని ఇంట్లో కూర్చున్నాడు నరసింహం. తను మరో రెండేళ్ళలో రిటయిరవుతున్నాడు. ఆ తరువాత తన

బ్రతుకేమిటి? ఆఫీసువాళ్ళెవరయినా రోడ్డుమీద కనబడితే ఉమ్మి వేయరూ? మంచాన్న బడితే భార్యా పిల్లలు విసుక్కోరూ? ఛీదరించుకోరూ? స్నేహితులు వేళాకోళం చేయరూ?

నరసింహం ఆలోచనల్లో కృంగిపోసాగాడు. తన గదిలో కిటికీ దగ్గర కూర్చుని ఇరవై నాలుగ్గంటలూ ఎడతెరిపి లేకుండా ఆలోచించడమే అతని దినచర్య.

నెల రోజులు గడిచిపోయినయ్.

ఆ రోజు అతని గదిలోని అద్దం దగ్గరకు ఓ పిచ్చుక వచ్చి అరుస్తూ అద్దంలోని తన ప్రతిబింబాన్ని పొడవటం కనిపించిందతనికి.

అతనికి ఆశ్చర్యం వేసింది.

అది తన ప్రతిబింబమేనని దానికి తెలీదూ? మరెందుకలా శత్రువులా పొడుస్తుంది? నిజానికి అక్కడ మరో పిచ్చుక లేదనీ అదంతా తన భ్రమ అనీ దానికి ఎందుకు అర్థం కావటం లేదూ?

లేచి ఆ పిచ్చుకని బయటకు తరిమేశాడు నరసింహం. అయిదు నిముషాలన్నా అవక ముందే మళ్ళీ అద్దం ముందు చేరిందది.

మరేమీ చేయలేక దానివంకే చూస్తూండి పోయాడతను.

చీకటి పడిపోతోంది.

పిచ్చుక పూర్తిగా అలసిపోయి ఒగరుస్తూ నిలబడింది.

హఠాత్తుగా నరసింహం మస్తిష్కంలో మెరుపు మెరిసినట్లయింది. అవును! తనూ, ఆ పిచ్చుకా ఒక్కటే!

అది తనప్రతిబింబాన్నే పొడుచుకుంటోంది.

తనూతన ప్రతిబింబాన్నే పొడుచుకొన్నాడు.

తను తన భార్యను నమ్మలేదు. తన పిల్లలను నమ్మలేదు. తన స్నేహితులనూ, తన కొలీగ్స్‌నీ, తనక్రింద పనిచేసేవారినీ ఎవ్వరినీ నమ్మలేక పోయాడు. అందుక్కారణం అసలు తనమీద తనకి నమ్మకం లేకపోవడమే. అదే తన ప్రతిబింబం! దాన్ని పొడిచే అందరికీ దూరమయి ఒంటరిగా ఒగరుస్తూ నిలబడ్డాడిప్పుడు. నరసింహం లేచి పిచ్చుకను తరిమి అద్దం మీద పెద్ద గుడ్డపరచేశాడు. □

బహుమతి

'రజని'

పచ్చని మామిడి తోరణాలతో తీర్చిదిద్దిన రంగవల్లులతో కళకళలాడుతోంది పెళ్ళి పందిరి. ఏవో ఊపిరి సలపనన్ని బాధ్యతలు నెత్తిన వేసుకున్నట్టు ఎవరికి వారే హడావిడిగా తిరుగుతున్నారు.

నలుగురు తల నెరిసిన పెద్దలు కుర్చీలు వేసుకుని వక్కపొడి నములుతూ హాయిగా కబుర్లాడుకుంటున్నారు.

గరగరలాడుతున్న పట్టు చీరలు, రెపరెపలాడే సిల్కు లాల్చీలు కేరింతలు కొడుతూ ఎగిరే కుర్రకారు.

అలా కొద్ది క్షణాలు తను వచ్చినట్టు ఎవరికి చెప్పాలో అర్థం కానట్టు నిలబడిపోయాడు శంకరం. ఆ వాతావరణం ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంటే జేబురుమాలుతో ఒకసారి ముఖం తుడుచుకున్నాడు.

ఎటునుండో వడగళ్ళలా మాటలు వినవచ్చేయి. "నయం. నీలాంటి వాళ్ళందర్నీ నమ్ముకున్నాను కాను, నిలువునా గంగలో ముంచేవాడివి. ఎంత పెద్ద మనిషివి! ఏదో సామెత చెప్పినట్టు పదహారు రోజుల పండుగ అయ్యాకా వచ్చేవు కాదులే."

బాబాయి మాటల ధోరణి అలవాటే కనక నవ్వుకున్నాడు శంకరం.

"ఏమైనా ఇంకా ముహూర్తం టైము దాటిపోలేదుగా బాబాయ్! నువ్వు కోప్పడతావనే మా మేనేజరు శలవు ఇవ్వనంటే ఉద్యోగమున్నా మళ్ళీ దొరుకుతుంది కానీ మా లలిత పెళ్ళి మళ్ళా నా కోసం చెయ్యరు స్వామీ అని చెప్పి వస్తే" అన్నాడు గడుసుగా తప్పించుకుని.

ఓసారి నివ్వెరపోయి చూసి బాబాయి మనసు నిండా నవ్వాడు ఆనందంగా.

"ఒరేయ్! నువ్వు రాకుండా అదసలు పెళ్ళి పీటలమీదికి అడుగు పెడుతుందా! నాల్రోజులు ముందుగా వచ్చి పెళ్ళి పనులన్నీ చక్కదిద్దుతావని ఆశపడ్డాను. పోనీలే."

శంకరం పిన్ని వచ్చింది.

"ఏం నాయనా! ఆలస్యంగా అయితేనేం ముత్తానికి రాగలిగేవు. కానీ అమ్మాయేది. ఇలాంటి ముచ్చట్లకి ఆడవాళ్ళే ఎక్కువ సరదా పడతారని తెలియదా." అని ఆవిడ సన్నగా చీవాట్లు పెడుతోంటే.

"ఏం చెప్పేది పిన్నీ మీ అమ్మాయికి లేస్తే చెయ్యి నొప్పి, కూర్చుంటే కాళ్ళు లాగడమాయె. ఇక్కడికి రావాలంటే కనీసం వంద మైళ్ళు ప్రయాణం చెయ్యాలా! ఎక్కడ పడక వేస్తుందోనని తీసుకురాలేదు" అంటూ సంజాయిషీ చెప్పుకున్నాడు.

"ఇంతకీ పెళ్ళి కూతురెక్కడ. సిగ్గుల గదిలో కూర్చుందా! లేక ఓరచూపులు ప్రాక్టీస్ చేస్తోందా, బావగారిమీద వలలు విసరడానికి."

కొంటెగా లలిత ఉన్న గదిలోకి అడుగు పెట్టబోతూ విద్యుద్ఘాతం తగిలినట్టు ఆగిపోయాడు.

★ 'అమ్మా' అన్న పిలుపు అద్భుతానందాన్నిస్తుంది ఆడదానికి. ఆ పిలుపుకోసం, ఆ పిలుపులోని మాధుర్యంకోసం, బిడ్డల కోసం తపించిపోతుంది స్త్రీ. సంతానాన్ని మించిన బహుమతి లేదు మహిళకి! ★

కొంతసేపటివరకూ ఈ లోకంలోకి రావడానికి అతని మనసు నిరాకరించింది. తెలివి వచ్చాకా తన గుండెలు దడదడ కొట్టుకుంటున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

తన కళ్ళు చూస్తున్నది నిజమైన మనిషినా కలలోని రూపాన్నా. ఇవి ఇంత స్పష్టంగా స్వచ్ఛంగా చూడడం ఎప్పుడు నేర్చుకున్నాయి.

అతనికి మతిబోయింది.

మొగలిపూల జడ వేయించుకుంటున్న లలిత అడుగుతున్నవేమీ అతనికి వినిపించడం లేదు.

అతని దృష్టి మొగలిపూల జడమీద లేదు. అన్ని అలంకారాలతో మెరుపు తీవెలా శోభ లీనుతున్న లలితమీద లేదు. పెళ్ళి కూతురికి హారతులు పడుతూన్న అమ్మలక్కల మీద లేదు. వాళ్ళు ఆడుతూన్న ఛలోక్తులమీదలేదు.

అద్భుతంగా మొగలి రేకులతో తయారైన పువ్వుల్ని జడలో చక్కగా నేర్పరితనంతో అమర్చే తెల్లని సొగసైన ఆ చేతులవైపు.

చిన్నగా శబ్దం చేస్తున్న బంగారు గాజులతో చకచకా కదులుతున్న ఆ అందమైన చేతుల్ని

ఇంకొంచెం ధైర్యంచేసి

ఎర్రని పట్టు చీరకి మరింత అందాన్నిస్తున్న సృజనాత్మక సౌందర్యాన్ని ఆ మనోహర రూపాన్ని తదేకంగా చూశాడు.

ఆమె... మీనాక్షి. సందేహంలేదు. ఏవేవో ఆలోచనలతో క్షణక్షణం గుండె బరువుగా మారుతోంటే అతి బరువుగా నిట్టూర్పు విడిచాడు.

"ఎవరో గుర్తొచ్చిందా అన్నయ్యా! అప్పుడు శేషగిరి మావయ్య కూతుర్ని నీ కిద్దామనున్నారే ఆవిడే ఈ మీనాక్షి వదిన. ఏమైనా బొంబాయిలో సెటిలయ్యాకా అందర్నీ మర్చిపోయావు. లేకపోతే వదిన్ని తీసుకురాకపోదువా! మీనాక్షి కూడా వాళ్ళాయన్ని దాచుకు వచ్చిందిలే ఎక్కడ మన మందరం పట్టి పీడిస్తామేమోనని."

లలిత ఆరిందాలా చెబుతోంది. అవును మరి పల్లెటూళ్లో పెరుగుతూన్న పిల్లాయె. అతిసహజంగా అన్ని తెలివి తేటలు అబ్బుతాయి.

"కాస్త మొహమెత్తి మా అన్నయ్యాని చూడనీయమ్మా! ఇంతలో అరిగిపోవులే. పెళ్ళి కూతుర్ని సిగ్గు నా వంతుగాని" వెనక్కి తిరిగి మీనాక్షి బుగ్గని మెల్లగా పొడిచింది.

లలిత మాటలకి కాబోలు మీనాక్షి కొద్దిగా కదిలి రెపరెపలాడే కళ్ళతో శంకరం వైపు ఒకసారి చూసి మళ్ళీ తలదించుకుని తనపనిలో లీనమై పోయింది.

చక్రాల్లాంటి కళ్ళు. మీనాక్షికి ఆ పేరు పెట్టిన వాళ్ళ మేధాసంపత్తిని తప్పక అభినందించాల్సిందే. విధి ఇంకోలా వక్రించక పోతే ఆ చక్కని కళ్ళు పసిమిఛాయలో మెరుస్తున్న ఈ బంగారమంతా తన స్వంతమై ఉండేది. అన్ని అధికారాలు తనవే అయ్యేవి. ఇప్పుడు దీనికి హక్కుదారు వేరొకరు. కనీసం తలచడానికన్నా తనకు అర్హతలేదు.

మీనాక్షి వంటి రంగుతో పోటీపడలేక మెడలో సుతారంగా ఊగుతోన్న పచ్చని మాంగల్యం చూడరానిచోట చూస్తున్నావని హెచ్చరించడంతోచటుక్కున దృష్టిమరల్చాడు.

"ఇంకా జ్ఞాపకం రావడంలేదా మీనాక్షి వదిన. అయితే మతిమరుపు వచ్చేసింది నీకు" లలిత నవ్వింది.

అసలు మీనాక్షిని ఎప్పుడన్నా మర్చిపోతే కదా గుర్తు తెచ్చుకోడానికి.

శంకరానికి ఆమెతో ఎన్నెన్నో మాట్లాడాలని ఉంది. పలకరించితే పెదవి విప్పుతుందో లేదో.

"బాగున్నావా మీ నా క్షి" అన్నాడు అప్రయత్నంగా.

మీనాక్షి ముఖం దించుకునే తల ఊపింది. కానీ ఆమె చూపులు నేలవాలుగా తన పాదాలను తాకుతున్నట్టు గమనించిన శంకరం మనసు తెలియకుండానే స్పందించింది.

ఆ ముభావం ఆమె బిడియపడడం లేదనీ ఆమె హృదయం మెలి తిప్పిన బాధకి గురౌతోందనీ తెలియ చెబుతోంది.

గతమంతా కళ్ళముందు కదలాడుతోంటే చెమర్చిన కళ్ళను ఎవరూ చూడకుండా ఇవతలి



కొచ్చాడు.

మావయ్య హఠాత్తుగా పోవడంతో మీనాక్షి తల్లి కూతురి పెళ్ళికి తొందర పడి పోయింది. చిన్నప్పట్నుంచీ అనుకుంటున్న సంబంధం కనక శంకరం తండ్రికి కబురు చేసింది.

"వాడి చదువు పూర్తి అయ్యాకా చేస్తే బాగుంటుందేమో. ఇప్పుడు పెళ్ళికేం తొందర" అన్నాడు ఆయన. అప్పటికి శంకరం ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరంలోకి వచ్చాడు. ఈలోగా మీనాక్షికి వేరే సంబంధాలు చూస్తున్నట్టు వార్త అందింది. పెళ్ళి చదువుకి ఎక్కడ ఆటంకమవుతుందో నన్న తండ్రి భయానికి అతడు లోలోపలే చిరాకుపడ్డాడు. శేషగిరి మావయ్య ఇంటికి వెళ్ళినప్పుడు తనని చాటుగా చూసి పారిపోయే మీనాక్షి తలపుల్లో హత్తుకుపోయింది.

ఈ పెద్దవాళ్ళు ఒక్కొక్కసారి అసందర్భంగా ఆలోచిస్తారు. పెళ్ళికి చదువుకి సంబంధం ఏముంది నామొహం. మీనాక్షికి వేరే సంబంధం కుదిరిపోతే ఆ అందమంతా ఎవరి సొత్తో అయిపోదూ! తను ఆమెని ప్రేమించానని చెప్పుకోడానికి మొహమాటం అడ్డొచ్చింది. అందుకే మీనాక్షికి వేరే సంబంధం కుదిరిందని తండ్రి చెబుతోంటే మనసు విప్పలేని అసమర్థతకు తన్ను తాను తిట్టుకున్నాడు.

"ఆడపిల్ల గలవాళ్ళు కొంచెం అణకువగా వ్యవహరించవద్దూ నేనైనా కొన్నాళ్ళు ఆగమన్నాను కాని మీ పిల్లని చేసుకునేది లేదని ఏమీ చెప్పలేదే. ఆవిడ అంత పట్టుదలగా కూతురికి సంబంధం నిర్ణయిస్తే మనమెందుకు అడ్డుపెట్టాలి." మీనాక్షి తల్లిపై కోపంతో తండ్రి ఏవేవో అంటుంటే మౌనంగా విన్నాడు. ఆమె పెళ్ళికి తమ ఇంటినుంచి ఎవరూపోలేదు.

మీనాక్షికి తన ప్రేమ గుర్తుగా ఏదైనా బహుమతి పంపుదామనుకున్నాడు. దానికి కూడా ధైర్యం చాలింది కాదు. చదువు పూర్తయి బొంబాయిలో ఉద్యోగం వచ్చాకా ఇందిర మెడలో తాళి కట్టడం ఇద్దరు బిడ్డల తండ్రి కావడం ఇవన్నీ నిన్నమొన్న జరిగి నట్టుంది. అన్నట్టు మీనాక్షికి ఎందరు పిల్లలో.

ఆ పగలంతా ఆమె తనను తప్పించుకునే తిరగడంతో అతని మనసు చిన్నబోయింది.

సాయంత్రం చేలగట్ల వేపు వెళ్ళివచ్చాడు. పట్టణాలలో ఆ రణగొణ ధ్వనుల మధ్య విసుగ్గా కాలం గడిపే వారికి పక్షుల కిలకిలా రావాలు చెవినపడుతోంటే ప్రాణానికి ఎంత హాయిగా ఉంటుంది!

ప్రశాంతంగా ఉన్న ఆ వాతావరణంలో పూల సువాసనలను మోసుకొస్తూ తెరలు తెరలుగా వీస్తున్న గాలి మీనాక్షి తలపులతో రగులుతున్న అతని మదిని కొంచెం చల్లార్చింది.

రాత్రి పదిగంటలు దాటాకా ముహూర్త కాలం దగ్గరపడడంతో సందడి ఎక్కువైంది. బాబాయి వెనకే తిరుగుతూ శంకరం ఆయనకి అన్ని పనుల్లో సహాయపడ్డాడు. భోజనాల వద్దన దగ్గర్నుంచి మగపెళ్ళి వారికి మర్యాదలు చేయడం వరకు అన్నిచోట్ల తనే అయి కనిపించాడు.

అంత అల్లరిపిల్ల లలిత పెళ్లి పందిట్లో బుద్ధిగా మొగుడిపక్కన కూర్చుని పురోహితుడు చెప్పిన ప్రకారం చేస్తోంది.

మంగళ సూత్రధారణ సమయంలో తెల్లని జరీ చీర తలనిండా మల్లెలతో లలిత పక్కన వంగుని మీనాక్షి ఆమె చెవిలో ఏదో చెబుతూ ముసిముసిగా నవ్వుతోంటే "పో! వదినా" లలిత సిగ్గు నభినయిస్తోంది.

పందిరి గుంజ నానుకుని నిలబడిన శంకరం మనసులో ఆ దృశ్యం ముద్రపడిపోయింది.

క్రితం రాత్రంతా నిద్రలేమి, ప్రయాణ బడలిక ఉదయం నుంచీ నెత్తిన వేసుకున్న పెళ్ళి పనులు అలసటతో కళ్ళుమూతలు పడుతున్నా బలవంతాన నిద్ర ఆపుకుంటూ పెళ్ళి తంతు తిలకిస్తున్నాడు.

"ఏరా! శంకరం నిలబడే నిద్రపోతున్నావు. నిన్నరాత్రి కూడా ప్రయాణంలో నిద్రలేదాయె ఎలాగా మాంగల్యధారణ అయిపోయింది. కనక కాస్సేపు నడుం వాల్చు. విడిదిల్లు ఖాళీగానే ఉంది"బాబాయి హెచ్చరికతో కొంచెం సేపు నిద్రతీస్తేనేగాని లాభం లేదనుకుని విడిదింటి వైపువచ్చాడు.

నిద్రపోతున్న ఒకరిద్దరు పిల్లలు తప్ప అందరూ పెళ్ళి పందిట్లోనే ఉన్నట్టున్నారు. చిందర వందరగా పడేసిన సామానుతో నిండి పోయిన గదులన్నీ దాటుకుంటూ పెరటివైపు వసారాలో మడత మంచం కనిపిస్తే దానిపై మేను వాల్చాడు.

పక్కనే వున్న పూలపందిరినుండి వస్తున్న విరజాజి పరిమళం మత్తులో ముంచెత్తుతోంది. సన్నగా వినిపిస్తూన్న మంగళవాయిద్యాల మధ్య చెట్టు కొమ్మలు చేసే సవ్వడికూడా కలుస్తోంది. అలసిపోయిన శరీరాన్ని వెంటనే నిద్రాదేవత రెండు చేతులూ చాపి తన కౌగిలిలోకి లాక్కుంది.


తనమీదికి ఒరిగిపోతోన్న ఓ పాలరాతి శిల్పం విశాలమైన కళ్ళు నున్నటి చెంపలు అదిరే ఎర్రని తమలపాకుల్లాంటి పెదవులు.

ఆత్రంగా తను ఆ పెదవుల్ని పదేపదే ముద్దు పెట్టుకుంటూ మెత్తగా తాకుతున్న ఆ శిరోజాలను సవరిస్తున్నాడు.

ఆ పాలరాతి సౌందర్యం ఎవరు! ఇంకెవరు తను కోరుకున్న మీనాక్షి. లన స్వంతమైన మధుర క్షణాలు. జీవితంలో తిరిగిరాని అమృత ఘడియలు.

గుండె వేగంగా స్పందిస్తూంటే తన చేతుల్ని ఆమె నడుంచుట్టూ పెనవేసి దగ్గరగా....

ఎవరో తట్టి లేపినట్టు హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. తను ఎక్కడున్నాడు. మీనాక్షితో తను స్వప్న.... కాదు స్వర్గలోకాలలో విహరించేడు. కలే అయినా ఎంత బాగుంది! శాశ్వతంగా అలాగే నిద్రపోగలిగితే ఇంకేం కోరుకుంటాడు తాను.



ఇది కలకాదు నిజమే. తనని తాకుతోన్న మెత్తని స్పర్శ అతనికి అనుభవంలోకి వచ్చింది. శంకరం చటుక్కున లేచి కూర్చున్నాడు.

"నేనే బావా! బీరువా తాళాలు ఎక్కడ పెట్టావో అత్తయ్య వెతుక్కుంటోంది." అంది. ఆమె గొంతు సన్నగా స్వచ్ఛంగా వుంది.

"తాళాలకేం బాబాయి దగ్గిరే వున్నాయికానీ మీనాక్షీ" శంకరం కంఠంలో ఆవేదన ధ్వనించింది.

"నేనంటే నీకు అసహ్యం కదూ! అందుకనే నన్ను తప్పించుకు తిరుగుతున్నావు. అవునా!"

మీనాక్షి గలగలా నవ్వింది.

"భలేవాడివే. నలుగురిలో నీతో మాట్లాడితే ఏం బాగుంటుంది. చూసేవాళ్ళు వేరే విధాన అనుకోరా!"

శంకరం సర్దుకున్నాడు.

"అలాగా! ఇలా ఏకాంతంగా పలకరిస్తే తప్పులేదన్నమాట'' అతని మాటల్లో కొంటెదనానికి మీనాక్షి ముఖం ఎర్రబడింది.

"అలా అని ఎవరన్నారు" అంది మరింత రెచ్చగొడుతూ. వెచ్చగా సెగలు రేపుతున్న వెన్నెల, మల్లెల వాసన ఆమె సౌందర్యం అతనికి పరవశం కలిగిస్తోంది. రెచ్చగొట్టే ఆమె మాటల ధోరణి పిచ్చివాడిని చేస్తోంది.

"నువ్వు....నువ్వు ఎందుకింత బాగుంటావు" అన్నాడు అర్ధరహితంగా-మళ్ళీ

"నేను చాలా దురదృష్టవంతుణ్ణి మీనాక్షి. నాన్నని ఎదిరించి ధైర్యంగా నిన్ను చేసుకోలేకపోయాను. కానీ ఇప్పటికీ నువ్వు నా ప్రేమ దేవతవే" అన్నాడు శంకరం ఆవేశంగా.

మీనాక్షి ఇంకొంచెం నవ్వింది.

"అవన్నీ ఇప్పుడెందుకు."

"నిజమే. నువ్వు ఇంకొకరి భార్యవి అయిపోయావు గనక నేనిలా మాట్లాడకూడదు. క్షమించు మీనాక్షి."

"పిచ్చివాడివి" ప్రేమగా అతని జుట్టు సవరించింది. "నే నెప్పటికీ నీదానినికాదా బావా.''

"నిజంగానా! ఇందాకటి కలలో మీనాక్షి ఎంతో మంచిదనుకున్నాను. అసలు మీనాక్షి ఇంకా ఇంకా మంచిది" అతని మనసు క్షణ క్షణానికీ అదుపు తప్పుతోంది.

తనని చుట్టుకున్న అతని చేతుల్ని ఆమె వారించలేదు. అతన్ని గాఢంగా హత్తుకుపోతూ చెవిలో మెల్లగా గొణిగింది.

"మనం ఇలాగే వుండిపోకూడదూ."

* * *

తెల్లవారాకా శంకరం ఎవరి ముఖం సరిగా చూడలేక పోయాడు. ఆ క్షణంలో ఎందుకంత అవివేకం తనని ఆవహించింది. మీనాక్షి ఏమను కుంటుంది. ఆమె ఊహల్లో తను ఎంత నీచుడుగా చిత్రించబడతాడు. వివాహిత అయిన స్త్రీని ఛ—

తిరిగి దిద్దుకోలేని పొరపాటుజరిగిపోయింది. ఆమె తొందరపడితే మాత్రం తన బుద్ధి ఏమయ్యింది.

వెంటనే ప్రయాణమయ్యాడు.కానీ శంకరం బాబాయి వెళ్ళనివ్వలేదు.

"ఇంకా రెండ్రోజులు సెలవుందిగా! వెడుదువుగానిలే. అవతల మీనాక్షి ప్రయాణం కట్టింది. స్టేషన్ వరకూ నేను సాయం వెళ్ళొస్తాననుకో...."

ఉలికిపాటును బయటపడనివ్వలేదు.

"మీనాక్షి వెళిపోతోందా." అని మాత్రం అన్నాడు.

కొత్తచీర కట్టుకుని కాళ్ళకి పసుపు పూసుకుని అందరికీ చెప్పి శంకరం దగ్గరికి వచ్చి ఆగింది మీనాక్షి.

"వస్తాను బావా" ఇదివరకులా ఆ కళ్ళలోకి సూటిగా చూడలేక అపరాధిలా తలదించుకున్నాడు.

"మంచిది మీనాక్షీ."

"నాగపూర్ వచ్చినప్పుడు మా ఇంటికి రా బావా! వస్తావుకదూ" మీనాక్షి కంఠంలో అభ్యర్థన, కాదు ఆజ్ఞ మిళితమైంది.

శంకరాన్ని ఒప్పించిగానీ బండెక్కలేదు మీనాక్షి. ఎడ్ల మువ్వల చప్పుడుతో బండి పరుగులు తీసింది.

నాగపూర్ ఆఫీసు పనిమీద వచ్చినప్పుడు గుర్తుంది శంకరానికి మీనాక్షి వాళ్ళు అక్కడే వుంటున్న సంగతి. మీనాక్షి భర్త ఎలా వుంటాడో! ఏదో అతీతశక్తి ఆమె ఇంటికి బయలుదేరదీసింది. బజారులో నడుస్తుంటే గుర్తొచ్చింది, తన ప్రేమ గుర్తుగా మీనాక్షికి ఏమైనా ఇవ్వాలనుకున్నట్టు.

వెంటనే ఆగి కనిపించిన షాపులో దంతంతో చేసిన రాధాకృష్ణుల విగ్రహం తీసుకున్నాడు. వారిలానే తమ మధ్యగల అనుబంధంకూడా గొప్పదనిపించింది.

ఇల్లు తొందరగానే దొరకడంతో తేలిగ్గా ఊపిరి పీల్చాడు. తననిచూసి ఏమంటుందో మీనాక్షి.

హాలులో తెల్లని సూటు ఒత్తైన గిరజాల జుట్టుతో హుందాగా కూర్చుని వున్న వ్యక్తిని చూసి

"మీనాక్షి భర్త అందమైనవాడే" శంకరం లోలోపల అసూయ పడకుండా వుండలేక పోయాడు.

సోఫా పక్కన మూడేళ్ళ పిల్లవాడు బొమ్మలతో ఆడుకుంటున్నాడు. కర్టెను తొలగించుకు కాఫీ తీసుకువస్తున్న మీనాక్షి ముఖం శంకరాన్ని చూస్తూనే వికసించింది.

"రా. బావా! అక్కడే ఆగిపోయావేం. నువ్వెప్పుడూ ఈయన్ని చూడలేదు కదూ!.... మావారే" అంటూ పరిచయం చేసింది.

"నా పేరు చంద్రశేఖరం. అయితే మా మీనాక్షికి బావగారన్న మాట. ఆవిడ ఇంతగా ఆహ్వానిస్తున్నదంటే మీరు చాలా ఆత్మీయులుగానే లెక్క."

అతడు మామూలుగానే మాటలాడుతున్నా శంకరానికి వేరే అర్థం ధ్వనిస్తోంది.

"ఇంకా ఒక్కడేనా. అదృష్టవంతులు" అన్నాడు పసివాణ్ణి ఎత్తుకుంటూ.

చంద్రశేఖరం అదేదో హాస్యంగా జమకట్టి నవ్వాడు. "మీ మరదలు ఒప్పుకోదండీ. ఎక్కువ పిల్లలు పుడితే తన ఆరోగ్యం పాడైపోతుందిట. అలా అనే తల్లుల్ని మీరెంతమందిని చూశారు చెప్పండి. మా అమ్మకి మేం పదిమంది సంతానమైనా ఎంత ఓపిగ్గా పెంచింది. ఇప్పటికాలం ఆడవాళ్ళ తీరే వేరు. ఏమంటారు."

శంకరం నవ్వి ఊరుకున్నాడు ముగ్గురు పుట్టినా ఆపరేషన్‌కి ఒప్పుకోని భార్యను తలచుకుని.

మీనాక్షి వంటింట్లో పని ముగించుకుని

(వి) చిత్ర విజ్ఞానం

గోల్ఫ్ బంతి రహస్యం



గోల్ఫ్ బంతి ఒకవిధమైన దళసరి ప్లాస్టిక్ పొరతో కప్పబడి వుంటుంది. ఈ పొరకింద కొన్ని కిలోమీటర్ల నిడివిగల దారంతో చుట్టబడిన వుండ వుంటుంది. ఈ వుండ లోపల గుండ్రటి రబ్బరు బంతి వుంటుంది. ఈ రబ్బరు బంతి లోపల ఉండే దేవిటో తెలుసా? ఆముదం!!

వాళ్ళ ఎదురుగా కూర్చుంది.

"నామీద ఏం నేరాలు చెప్పుకుంటున్నారు."

"ఈవిడకి మొండితనం ఎక్కువ శంకరం గారూ. తనకి ఎంత తోస్తే అంతే. మరొక ఆడ పిల్ల వుంటే ఇల్లు కళకళ లాడదూ."

అవని మాటల్ని మీనాక్షి తేలిగ్గా కొట్టి పారేసింది. "ఇంటిని పీకి పందిరి వేయడానికి ఒక్కదాన్ని చాలుసెండి. అంతా కులాసానా బావా. మీ ఆవిడ ఆరోగ్యం ఎలా వుంది. లలిత పెళ్ళికి చూడ్డమే నిన్ను. అప్పుడే నాలుగేళ్ళ య్యింది" నిట్టూర్చింది.

మీనాక్షి మరీ బలవంతం చేయడంతో ఆ రోజుకి ఆగిపోక తప్పలేదు శంకరానికి. వచ్చే టప్పుడు

"మీ పెళ్ళికి రాలేకపోయాను మీనాక్షి. ఎప్పటినుంచో నీకిది ఇవ్వాలని నా కోరిక ఆల స్యంగా బహూకరిస్తున్నాను." రాధాకృష్ణుల విగ్రహం టేబిల్ మీద పెట్టాడు.

ఒకసారి ఆ బొమ్మవైపు చూసిన మీనాక్షి కళ్ళలో ఏవో నీలినీడలు కదలాడాయి. మరు క్షణం అవి ఎప్పటి కాంతిని నింపుకున్నాయి.

"పోనీ ఇప్పుడు మాత్రమేం. మా అబ్బాయి ఆడకుందుకు ఉపయోగపడదా" ఆమె వారి స్తున్నా వినకుండా ఓ పచ్చ కాగితం పిల్లవాడి చేతిలోపెట్టి బయలుదేరాడు. చంద్రశేఖరం గేటువరకూ వచ్చి సాగనంపాడు.

అడుగు ముందుకు వెయ్యబోతోంటే.

"కర్చీఫ్. మర్చిపోయావు బావా" అంటూ వచ్చింది మీనాక్షి.

"నాది కాదే" అనబోయి ఆగిపోయాడు శంకరం. ఆమె చూపులలోనే సౌంజ్ఞచేస్తోంటే నీలిరంగు రుమాలుని భద్రంగా జేబులో పెట్టు కున్నాడు.

"ఈ ఊరు వచ్చినప్పుడు మమ్మల్ని మరచి పోకండి" అన్నాడు చంద్రశేఖరం.

"మరచిపోను" అన్నాడు చిరునవ్వుతో. చంద్రశేఖరం మంచి సంస్కారవంతుడు. అత నితో వైవాహిక జీవితం మీనాక్షిని పూలతేరుపై నడిపిస్తుందనటంలో సందేహంలేదు.

కానీ మీనాక్షి తనతో చెప్పదలచుకున్నదేదో వున్నట్టుంది. ఆ కళ్ళల్లో మూగవేదన ఎందుకు ప్రతిఫలిస్తోంది.

హఠాత్తుగా నీలిరంగు జేబురుమాలు గుర్తు కొచ్చి తీసిచూశాడు. అతనూహించినట్టే అందు లోంచి ఓ కవరు క్రిందపడింది.

ఆత్రుతగా తీసి చదివాడు.

బావా!

నీతో చాలా చెప్పాలని వుంది. కానీ ఉత్తరం ద్వారా తప్ప అది సాధ్యంకాదని తెలుసు. అందుకే ఇది వ్రాస్తున్నాను. లలిత పెళ్ళిలో ఆ నాటి నా ప్రవర్తనకి నువ్వు ఎన్ని అర్థాలు చెప్పుకున్నావో మీనాక్షిని ఎంత హీనంగా చిత్రించుకున్నావో నా అంతరాత్మ క్షోభించని క్షణంలేదు.

నీ భార్యను కావలసినదాన్ని విధివ్రాతవల్ల తప్పిపోయింది. కానీ నామీద అభిమానం నీలో చెక్కుచెదరకుండా వుందని గ్రహించేను. అందుకే... అందుకే ఆరాత్రి సాహసించేను. ఏ ఆడదీ చేయకూడని పాపం చేశాను. ఏ భార్యా తలపెట్టని ద్రోహంతో నేను నా భర్తని వంచించేను.

ఎందుకు తెలుసా. నాలుగేళ్ళ క్రితం లలిత పెళ్ళి ఇంకా అవలేదు అప్పటికి. మావారికి స్కూటర్ మీద వస్తుంటే యాక్సిడెంట్ అయింది. ఆ ఆక్సిడెంట్‌లో మావారు పోగొట్టుకున్నదేమిటో డాక్టరు చెప్పాకా నాకు పిచ్చెత్తినట్టే అయింది. అంటే ఈ జన్మలో నేను సంతానవతిని కాలేనన్నమాట. అక్కడికి హాలాహలం లాంటి ఆ నిజాన్ని భరించడానికి సిద్ధపడ్డాను. అయినా దేవుడు ఇంకా పరీక్షలకు గురిచేశాడు.

"ఈ సంగతి ఆయనకి తెలియడానికి వీల్లేదు. హార్టు ఫెయిలయ్యే ప్రమాదం వుంది. ఏమంటే కొద్దిగా షాక్ ఇచ్చే వార్తలు విన్నాకూడా ఆయన గుండె తట్టుకోలేకపోవచ్చు" అని చెప్పాడు డాక్టరు.

ఏం చేయాలి. హృదయంలో అగ్ని ప్రజ్వరిల్లుతున్నా పైకి చిరునవ్వు నటించేదెట్లా! మొండిదాన్ని కనక అలవాటు పడిపోయాను అనుకో. కానీ ఆయన మనసులో దినదిన ప్రవర్థమానమయే అనుమానం ఎలా తీర్చడం "పిల్లలు కావాలనుకోవా మీనాక్షీ. ఏందుకైనా మంచిది డాక్టర్‌ని కన్సల్టు చేస్తాను." అన్నప్పుడు నిలువునా కృంగిపోయాను.

"ఇప్పుడేమంత అవసరం వచ్చిందండీ. పిల్లలు లేకపోతే పోయె. ఒకవేళ నాలోనే ఏదైనా లోపం వుందేమో." ఎంత ప్రయత్నించినా ఆయన్ని ఒప్పించలేకపోయాను. అదే సమయంలో లలిత పెళ్ళికి రావడం తటస్థించింది. ఆ తర్వాత నా ప్రవర్తనకు ఈ కథ అన్వయించుకోగలవు కదూ.

నన్ను ఎలాగూ అసహ్యించుకుంటావు. నాకు తెలుసుగానీ నేనేం చేసినా మాతృత్వం కోసం కాదు. నా భర్త ప్రాణాలు నిలబెట్టుకోడానికే చేసేనని నమ్ముతావా బావా.

నువ్వు నాకిచ్చిన బహుమతి రాధాకృష్ణుల విగ్రహం కాదు. అంతకంటే విలువైన నా ముద్దుల సతీష్‌ని. మా ఇంట్లో నవ్వుల పంటలు వెదజల్లే బంగారు కొండని.

మరి నీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోనూ

—నీ మీనాక్షి! □

మన మధ్య దూరం వుంది!

శ్రీసుభా

రంగనాయకులుగారు కూతురు ప్రమీల తన మాటను అంతచేటు ఖాతరు చేయకుండా మొహం మీదే తిరస్కరిస్తుందనుకోలేదు. తన పెంపకంలో, ఫకస్తు తన ఆధ్వర్యంలో పెరిగిన కూతురు తనకే ఎదురు తిరగడం ఆయనకు వెన్నుమీద చరిచినట్టయ్యింది.

ప్రమీల తను తెచ్చిన సంబంధం కాదన దనుకున్నాడు ఆయన. ఆ భరోసాతోనే పెళ్ళి వారితో కొంచెం చొరవగా మాట్లాడాడు. ప్రమీల తన అభిమానం మీద దెబ్బకొట్టలేదు. తనని అవమానం చేసింది. అదీకాదు-యిరవై ఏళ్ళు ఎదిగి చదువుకొని కన్న తండ్రిని సవాల్ కూడా చేసింది.

"నా అభిప్రాయం ముందుగా అడిగి వుండ వల్సింది."

"నువ్వు ఇంతచేటు స్వాతంత్ర్యం ప్రకటి స్తావని నాకు తెలియలేదు మరి" కోపంగా అన్నాడు ఆయన.

"మీరింత తొందరపాటుతో మాటిస్తారని నేను వూహించలేదు. పెళ్ళి కొడుకుని చూసి అతని మొహం మీదే "నువ్వు నాకు నచ్చ లేదు" అని తేల్చిపారేయడం సంస్కారం అవుతుందని నేను అనుకోలా."

"ఇంతకీ నువ్వు అనేదేమిటీ?" చిరాగ్గా అడిగాడు.

"నాన్నగారూ, మీరు ఏమీ అనుకోవద్దు. ఇక్కడ మీ గౌరవం దెబ్బ తింటుందని ఆలో చిస్తే నేను మీకు నేరస్తురాలిగా, మీ మాట విననిదానిగా కన్పిస్తాను, నాకు నచ్చని సంబం ధముచేసి మీరు సంతృప్తిపడతానంటే అందు కోసం నేను తలూపితే అప్పుడు నేను యాభై ఏళ్ళ క్రితం జనాభాకి వారసురాలినవుతాను. నాకు నేను కోరిన స్వేచ్ఛ, ధైర్యం ఇచ్చిన మిమ్మల్ని ఇంతకాలం తర్వాత మరోరకంగా వూహించుకోమనకండి! పెళ్ళి అయి అత్త వారింటికి వెళ్లి నేను బ్రతికి వున్నంతకాలం మిమ్మల్ని ఆడిపోసుకొనే శిక్ష నాకు మీరు వెయ్యద్దు...."

"ఎక్కడికి వెడుతున్నావ్?"

"ఈ విషయం అమ్మతో కూడా చెప్పాలి నాన్నా! తండ్రిని ఎదిరించినందుకు నన్ను తిట్ట డానికీ ఆపైన కన్నీరు నింపుకోవడానికీ అమ్మ తయారుగా వుండి వుంటుంది."

"మధ్యలో దాని ప్రసక్తి ఎందుకు!" రంగ నాయకులు చిరాగ్గా అరిచాడు.

ప్రమీల కోపంతో చూస్తున్న తండ్రినిచూసి తలొంచుకొని నవ్వుకొని—

"మీరు అన్నం తిని అరగంట అయ్యింది. న్యాయంగా అయితే తాంబూలం వేసుకొని చుట్ట కాల్చుకుందుకు అగ్గిపెట్టె తేనందుకు నా మతిమరుపు మీద పెద్ద లెక్చర్ యిచ్చేవారు. మీకు అగ్గిపెట్టె తెస్తాను" ప్రమీల లోనికి వెళ్ళింది.

"ఇది దీనికి పుట్టిన బుద్ధికాదు, దీనిబుర్రలో చెదపురుగులు దొలవడానికి కారణం అది, అదే... " అనుకొన్నాడు రంగనాయకులుగారు.

★ 'నేడు' నిన్నకు 'రేపు' అయినా, రేపటికి మాత్రం 'నిన్న' అయికూర్చుంటుంది. ఒకతరం చెయ్యలేని సాహసం మరో తరం అతి సాధారణమైన కార్యంగా చేయగలగడంలో చిత్ర మేముంది? ★

దాంతో రంగనాయకులుగారికి కోపం రెట్టింపు అయ్యింది. రెండేళ్ళనాడు తన మాట ఖాతరు చెయ్యకుండా కాలేజీలో తనతోపాటు ఉద్యోగం చేస్తూన్న పిల్లని ప్రేమించి ఆ అమ్మాయి కోసం ఇంట్లోంచి వెళ్ళిపోయిన కొడుకు రంగనాథ్ గుర్తొచ్చాడు. వాడూ ఇంతే! పాతి కేళ్ళు పెంచి చదువు చెప్పించి ఉద్యోగం వేయిస్తే జీవితంలో అన్నీ అమరిన తర్వాత రెక్కలు విప్పుకొని ఎగిరిపోయాడు. వెళ్ళే ముందు గర్వంగా ధీమాగా తనని ఎదిరించి తనకి నీతులు చెప్పి వాకిలి దాటాడు. ఆవేళ గుండెల్లో రగిలిన మంట, శరీరంలో రక్తం వేసిన పొంగు తనింకా మర్చిపోలేదు.

"మగపిల్లలకి విశ్వాసం వుండదు. నీకన్నా అది నయంరా. ఇంతవరకూ నే గీచిన గీటు దాటలేదు."

"మన పిల్లలు మనకి భయపడేటట్టు వుండాలని కోరుకోవడం అన్యాయం."

"ఎదిరించాలి, రొమ్ము మీద తన్నాలి. అది గొప్ప అంటావు. అవునా?"

"అది కాదు....నా వుద్దేశం."

"మీరంతా స్వార్థపరులురా."

రంగనాథం వెళ్ళిపోయాడు.

రెండేళ్ళకి మళ్ళీ మరో సమస్య. కలలో కూడా వూహించలేదు, మరో దెబ్బ తగులుతుందని. ప్రమీల కూడా అన్నగారి బాటలో ప్రయాణం చెయ్యడానికి వుబలాటపడుతుందని తలపనయినాలేదు. తను ఏనాడూ తన తండ్రిని ఎదిరించలేదు. తల్లి మాట కాదనలేదు.

రంగనాయకులుగారి మనస్సు కలుక్కుమంది. నిజమే! తల్లి దండ్రులు గీచిన గీటు దాటని అపర శ్రీరామచంద్రమూర్తి తను. తనని చుట్టాల్లో అందరూ పొగిడేవారు. నిజంగా తను తల్లిదండ్రుల్ని ఎదిరించలేదా? లేదు... లేదు....ఎదిరించాలనుకొన్నాడు. పోట్లాడాలనుకొన్నాడు, ఆరోజు. పంతంపట్టి ఇంట్లోంచి చెప్పి పెట్టకుండా పరారీ అవ్వాలనీ అనుకొన్నాడు. అనుకొన్నది అనుకొన్నట్టు జరిగితే అందరికీ అందలమే అందుబాటయితే అందం వుండదేమో! పైచదువు కోసం, హోదా కోసం తను తాపత్రయపడలేదు. కానీ ఎదురింటి జానకి కోసం కలలు కన్నాడు. జానకి కోసం జీవితాన్ని ఎన్నో మలుపులు, అవి ఎంతటి ఇబ్బందితో కూడుకున్నవయినా తీసుకోవాలనుకొన్నాడు. కానీ....ప్రేమించుకొన్న వాళ్ళందరూ పెళ్ళి చేసుకొంటే మనుషుల్లో భగ్న ప్రేమికులు మిగలరేమో! చిన్నకారణాలు భూతద్దంలో పెరిగి పెద్దవయి మనుష్యుల్ని మెలితిప్పి మెడలు వంచి జీవితం నుంచి దూరం చేయడం సహజం!

ఇంట్లో ఒక్క వ్యక్తి, సంఘంలో ఓ బలమైన అగ్రస్య శక్తి, లేక రక్తసంబంధం, అదీగాకపోతే కన్నీళ్ళు, ఏవో ఒకటి జీవితానికి అడ్డుగోడలవడం జరుగుతుంది.


రంగనాయకులు లోకంలో చాలా మందిలా మనసు రాయి చేసుకొని మామూలు మనిషి అయ్యాడు. కానీ మనసు రాయి అవడం ఎక్కడా జరగదు. అది తాత్కాలికంగా గడ్డ కడుతుంది. అందుకే ఎప్పుడో ఒకప్పుడు అది జ్ఞాపకాలతో ద్రవిస్తుంది. వ్యక్తుల చేష్టలతో వికావికలమవుతుంది. తను చెయ్యని పని తను సాధించలేని పని ఒకనాడు కొడుకు, ఈరోజు కూతురు తనతో ఘర్షణపడి భేటీ వేసుకొని విజయం సాధించబోతూంటే రంగనాయకులుగారిలో సంఘర్షణ పుట్టింది.

తన వారసులకి ముందుదారి సుగమం చేసి తను ఆదర్శంగా నిలబడాలో-తనలాగే తన పిల్లలు కూడా తండ్రి మాట జవదాటకుండా జాగ్రత్తపడాలో తేల్చుకోలేకపోతున్నాడు.

అహంకారం, ఆప్యాయత, ఆవేశం త్రిభుజాలై విడిపడుతున్నాయిగాని త్రిభుజంగా ఇమడలేకపోతున్నాయి ఆయనలో. అటుగా వచ్చిన భార్య కామేశ్వరిని చూస్తే ఆయనకు కోపం ఆగింది కాదు.

* * *

తల్లి అంత సూటిగా ప్రశ్నించేసరికి ప్రమీల మొదట తల వంచుకొంది....ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.



"నాన్నతో పోట్లాడాను....కానీ నిజం చెప్ప లేకపోయాను. ఎలా చెప్పమంటావమ్మా.... ఆయన నన్ను మాట్లాడనివ్వడంలేదసలు."

"పోనీ నేను చెప్తాను సరేనా?"

"వద్దమ్మా...." కంగారుగా అంది ప్రమీల.

"ఏం?"

"నాన్న కోపంలో వున్నాడు. నన్ను ఏమీ అనకపోవచ్చు. కానీ వాళ్ళింటికి వెళ్ళి గొడవ చేస్తే!"

"అయితే ఏం చెయ్యమంటావ్?"

"నువ్వే చెప్పమ్మా!"

"నేనా...."

"అవునమ్మా! నువ్విప్పుడు కలగజేసుకోక పోతే నా బ్రతుకు నాశనం అవుతుంది. నా మాట వినమ్మా...." ప్రమీల గారంగా అంది.

"సరే నువ్వు పోయి పడుకో... ఆ ఇదే

పురపాలక సంఘాలు, పంచాయతీ సంస్థలు

మీ నగరాన్ని, పట్టణాన్ని, గ్రామాన్ని అందంగా, ఆహ్లాదకరంగా, చల్లని ప్రదేశాలుగా తీర్చిదిద్దుకోండి.

రహదారులకు యిరుప్రక్కల, కార్యాలయాలలో, పాఠశాలల్లో, ఉద్యానవనాలలో, ఖాళీప్రదేశాలలో మొక్కలు నాటే యీ తరుణంలో (జూలై—ఆగష్టు) చెట్లను నాటండి.

మొక్కలు సలహాలు ఉచితం

సంప్రదించండి.

జంటనగరాల్లో :


డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్,
విస్తరణ విభాగం,
హైదరాబాదు-500 004.
ఫోన్ నెం: 30631 (ఎక్స్-45)

జిల్లాల్లో :

డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్,
జిల్లా కేంద్ర స్థానాలు.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

14/78-79



చెప్పడం మళ్ళీ నాకు తెలియకుండా అతగాణ్ణి నువ్వు కల్సుకోకూడదు.... సరేనా?''

"అలానే...." తల్లి చేతిలో చెయ్యివేసి ప్రమీల తన గదిలోకి వెళ్ళిపోయింది.

కామేశ్వరమ్మగారుమంచంమీద కూర్చుంది. తర్వాత చుట్టిన పక్కమీద వత్తిగిలి పడుకొంది. నిజమే-కూతురికి తను నిజం చెప్పలేదు. భర్త తనని ఎలా వేధించిందీ ఎలా ఆజ్ఞలు పెట్టిందీనూ: తను చూచాయగా చెప్పింది కూడా.

"అంటే ఎద్దునడిగి గంత కట్టాలంటావా?"

"ఈ రోజుల్లో అదే మంచిపని. మనుషులు కాబట్టి మనం మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి."

"నీ సలహా నా కనవసరం."

"అది కాదు నా మాట వినండి. అది ఒక వేళ ఎవర్నయినా ప్రేమించిందేమో: నన్ను కనుక్కోమంటారా?"

"అంటే...."

"మనం తెచ్చిన సంబంధం ఒట్టినే అది ఎందుకు కాదంటుంది?"

"నాకదంతా అనవసరం....నా మాట అది విని తీరాల్సిందే. అది వినేటట్టు నువ్వు చెయ్యవల్సిందే."

"బావుంది మధ్య నాదేముంది?"

"నీ కూతురేగా అది....సర్ది చెప్పు."

"నా మాట వినండి....వాడిలా యిది కూడా....కాదు అలా జరగదనుకోండి. మనం వాళ్ళ ముద్దు చెల్లించలేదని వాళ్ళెందుకు మనసు విరుచుకుని బాధ పడాలి? వాళ్ళు బాధపడ్డం మనకి మాత్రం సంతోషమా....మనంతట మనం కలతల్ని కోరి ఆహ్వానించద్దండీ."

రంగనాయకులుగారు వినలేదు.

భర్తతో మాట్లాడిన మాటలన్ని తూచా తప్పకుండా తిరిగి గుర్తుచేసుకొంది కామేశ్వరమ్మగారు. భర్త తన దారికి వస్తాడనీ ఇద్దరూ కలిసి కూతురు సుఖం కోసం కొత్తదారి వేయగలరనే నమ్మకం ఆవిడలో సన్నగిల్లడం మొదలయ్యింది. తలక్రింద పెట్టుకొన్న చేతిమీదకి కన్నీరు పడుతోంది. చెయ్యి తీసుకుని పమిట కొంగుతో కళ్ళు వత్తుకొంది.

చిన్నప్పటి నుంచి కారుతూనే వున్నా ఈ

నేటియువకులకు మేటి పిలుపు

పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సన్నద్ధంకండి

మీ విద్యాసంస్థను పచ్చని వృక్షాలతో కళకళలాడించడానికి పైసాకూడా ఖర్చుకాదు. చెట్లవల్ల నీడ లభించడమేగాక పరిసరాలు ఆకర్షణీయమవుతాయి.

మొక్కలు నాటే తరుణం ఆసన్నమైంది.

అన్నిరకాల మొక్కలు, సలహాలు ఉచితం

సంప్రదించండి

జంటనగరాలలో :

డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్,
విస్తరణ విభాగం,
హైదరాబాదు-500 004.
ఫోన్ నెం; 30531 (ఎక్స్-45)


జిల్లాల్లో :

డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్,
జిల్లా కేంద్ర స్థానాలు.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

15/78-79.

(వి) చిత్ర విజ్ఞానం



1974లో పోర్చుగల్ "కాలరా" వాత బడింది. వందలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. బెర్లిన్‌లోని రాబర్ట్‌కోష్ ఇన్‌స్టిట్యూటు పరిశోధకులు యీ "కాలరా"కు మూలకారణమైన క్రిమి "అంగోలా" జాతికి చెందినదని తేల్చారు. జెనీవాలోని "వరల్డ్ హెల్త్ ఆర్గనై-జేషన్" (WHO) సాయంతో, వెంటనే సరైన విరుగుడు మందును తయారుచేసి పంపి పోర్చుగల్‌లో కాలరాను అదుపులోకి తెచ్చారు. కాలరా క్రిమిని 1883లో రాబర్ట్‌కోష్ కనిపెట్టాడు. ఈయన పరిశోధనలు క్షయ, గాయాలనుండి ఏర్పడే పుండ్లూ మొదలగు వ్యాధులను అరికట్టడానికి కూడా ఎంతగానో తోడ్పడ్డాయి. 1905లో ఈయనకి నోబెల్ బహుమతి లభించింది. బెర్లిన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఈయన పేర స్థాపించబడినదే!

కన్నీటికి అడ్డులేదు. ఆ కన్నీటికి ఆశ్రయమిచ్చే కళ్ళకి విసుగులేదు. మనిషి జవసత్వాలు ఇబ్బందులూ ఏవీ పట్టించుకోకుండా నిత్య నూతనంగా కన్నీటిని జారవిడుస్తూనే వుంటాయి అవకాశం చూసుకొని.

తనెన్నిసార్లు ఇలా ఏడ్చిందని! ఆడది ఏడ్చి సాధిస్తుందంటారు. ఒట్టిమాట. తన కన్నీటికి విలువ లేదు! అర్థం లేదు. అవి మనసును తడిపి మనిషిని కుదిపి సత్తువ లేకుండా చేశాయి. కొడుకు ఇంట్లోంచి వెళ్లినందుకు రెండేళ్ళనాడు కన్నీటి బొట్లు రాలాయి కానీ కొడుకును తిరిగి చూడలేకపోయింది. మళ్ళీ, కూతురు వెళ్ళబోతోంది. కాదు ఓడిపోయి తల వంచి, అయిష్టంగా వెడుతుంది. అప్పుడు తిరిగి తను ఏడుస్తుంది. తన జీవితపరమావధి ఏడుపేనా?

కామేశ్వరి తిరిగి వత్తిగిలి పడుకొంది. చీకటి వెక్కిరిస్తూ కనబడుతోంది-కిటికీలోంచి.

* * *

"అమ్మా నాకు భయంగా వుందే" అంది ప్రమీల. ప్రమీల గంటనుంచి బొమ్మైన తల్లిని చూస్తూ వుంది. తన కన్నతల్లి తనకి ఆప్తురాలిగా స్నేహితురాలిగా మారుతుందని ప్రమీల ఊహించలేదు. భర్తచాటు ఆడది, యాభై ఏళ్ళ వయసుది కూతురు జీవితం కోసం, కూతురు సుఖం కోసం కన్న ప్రేమను పక్కకి నెట్టి నెచ్చెలిగా మారి సలహా యివ్వడం.... అదీ మామూలు సలహా కాదు.

"వెళ్ళు....నీ ఇష్టం. అతను నువ్వూ ఏ వూరు పోయినా సరే....కానీ సుఖపడంటి చాలు. నిన్ను బాధపెట్టడం ఇష్టం లేక నీ సంతోషానికి అడ్డురావటం ఎలాగో చేతకాక నీకీ సలహా యిస్తున్నాను. పెళ్ళి చేసుకొని ఓ యింటిదానివికా. పిల్లల్ని కని తల్లివికా...."

"అమ్మా...." అంది ప్రమీల తల వంచుకొని,

"అవునే....చిన్నప్పుడు నా పక్కలో పడుకొని పూలగుత్తిలాంటి కాళ్ళతో నా కడుపులో

తన్నేదానివి. అది సహజం.... అంతేగానీ అందుకు నాకు కోపం రాదు....నీకు ఇష్టమైనవి అమర్చడం తల్లిగా నా విధి."

"అమ్మా....నాన్న రేపు అడిగితే ఏం చెప్తావ్?"

"నాకున్నది ఒకటే ఆయుధం. అది కన్నీరు" కామేశ్వరి నవ్వేసింది.

"నా మీద కోపం లేదా?"

"లేదు....ఒట్టు."

"అమ్మా....నేనూ రాజారావూ ఈ రాత్రికే బొంబాయి వెడతాం. నాన్నగారు మరీ గొడవ చేస్తే ఉత్తరం వ్రాయి....నేను వచ్చి ఆయన్ను బ్రతిమాల్తాను సరేనా...." ప్రమీల దొడ్డి గుమ్మందాటి చీకటిలో కలిసిపోయింది.

కామేశ్వరి కళ్ళు వత్తుకొని తలుపు వేయ డానికి వెనక్కి తిరిగింది. ఎదురుగా భర్త!

"అంటే....అంటే...."

కామేశ్వరి మాట్లాడలేదు.

"నువ్వే దాన్ని ఇంట్లోంచి సాగనంపావన్న మాట."

కామేశ్వరి జవాబు చెప్పలేదు.

రంగనాయకులు అంతకు మించి కామే శ్వరిని నిలదీయలేకపోయాడు. వెళ్లి పట్టె మంచం మీద తలక్రింద చేతులు పెట్టుకొని పడుకొని చూస్తూ వుండిపోయాడు.

"క్షమించండి."

రంగనాయకులు మాట్లాడలేదు.

"మిమ్మల్నే....మీ మనసుకు గాయం చేసాను తప్పు నాదే!"

"తప్పు నీది కాదు....నాది. నువ్వూ నాలాగే ఊహిస్తావనీ ప్రవర్తిస్తావనీ అనుకొన్నాను."

"ఏం చెయ్యమంటారు?" ఏడుస్తూ వుండి పోయింది కామేశ్వరి.

"మంచిదేలే....మనలాగే వాళ్ళ జీవితాలు ఎందుకు వెళ్ళాలి? వాళ్ళు సుఖపడేతరం మనుషులు. నీలా నాలా పెద్దవాళ్ళ మాటకోసం పెళ్ళిళ్ళు చేసుకొని...."

"నా వుద్దేశం అది కాదు...." నెమ్మదిగా అంది కామేశ్వరి.

"అవును....నన్ను నా జీవితం, నిన్ను నీ జీవితం శపించాయి. అయిష్టంగా ఒకళ్ళ కొకళ్ళం ముడిపడ్డాం. మనలాగే వాళ్ళూ ఎందుకు బ్రతకాలి? వాళ్ళు అదృష్టవంతులు" రంగనాయకులు నవ్వేశాడు బిగ్గరగా. కామేశ్వరి భర్త వైపు చూసింది.

"ఆరోజు మీ అమ్మగారు గానీ, నాన్నగారు గానీ నీలా ప్రవర్తించి వుంటే నువ్వు ఎక్కడ వుండేదానివి? కామేశ్వరీ-జీవితం ఎంత విచిత్ర మైంది? మీ అమ్మగారు నీకు యివ్వలేని స్వేచ్ఛ, నువ్వు అమ్మవై కూతురికి యిచ్చావు. కానీ నేను చూడు, నాకు మావాళ్ళు వేసిన శిక్ష నేనుతిరిగి నా పిల్లలకి వెయ్యాలనుకొన్నాను. ఏం మనిషిని నేను....?"

కామేశ్వరి భర్తకి నచ్చజెబుతూనే వుంది చాలా సేపటివరకూ. ఓదారుస్తూనే వుంది మాటలతో....

చీకటిపోయి వెలుతురు వచ్చేవరకూ వాళ్ళి ద్దరూ జీవిత పర్యావలోకన చేసుకుంటూనే వున్నారు అలా. □

---

* అది చెయ్యకుండా మనం మరణించినా పరవాలేదన్న పనిని మాత్రమే రేపటికి వాయిదా వెయ్యి. —పికాసో.

* విశ్రాంతి తీసుకొనేందుకు కూడా సమయం దొరకనంత పనిలో మునిగి నప్పుడే కొంచెం విశ్రాంతి తీసుకో. —ఎస్. జె. హెచ్.

* పువ్వులకు సూర్యరశ్మి, మానవ జాతికి చిరునవ్వులూ అత్యవసరం. —జోసెఫ్ అడిసన్.

తొలిరేఖ

కె. సురేష్ కుమార్

ప్రశాంతంగా వున్నగదిలో అశాంతి నిండిన హృదయంతో వున్నాడు శ్రీనివాస్. అతని అశాంతికి అసలు కారణం మరొకటయినా అతను డాక్టర్ కావటంకూడా ఆ క్షణంలో ఓ కారణమే- అలాగని అతనికి ఆ వృత్తిమీద ఇష్టంలేదని కాదు. అందుకు వేరే కారణం వుంది. కారణాల తోరణాలకన్నా ముఖ్యమైంది సత్యం. నిద్రలోవచ్చే కలల్లాకాక మనసు కనే కలలు సాధారణంగా మధురంగా ఉంటాయి. అందుకే స్వప్నం తలకిందులయిందనే సత్యం చేదుగా, బాధగా వుంటుంది. మానసిక పరిపూర్ణత సాధించుకోని ప్రతిమనిషి అనుభవించేదీ అదే.

శ్రీనివాస్ హృదయంలో అతని భార్యకాక అరుణ కదులుతూంది. అరుణ అతని యౌవనంలోని తొలిచెలి. అతని యెడద జాబిలి. అతను మతిమాలి వలచిన కోమలి. ఎం.బి.లో చేరిన మొదటి సంవత్సరంలో అతనికి అరుణతో పరిచయం కలిగింది. అతని బ్రతుకులో వలపుల అరుణోదయమైంది. కాని ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలుసుకునేలోగానే తొలిసంధ్య అనుకొన్నది మలిసంధ్యలాగా మారి కాస్సేపటికి లో చీకటి మిగిల్చింది.ఫస్టియర్ చివరలో అనుకోకుండా తనతండ్రి టెలిగ్రాం చూసుకొని ఇంటికి వెళ్ళిన శ్రీనివాస్, వెకేషన్స్ అయిపోయి మళ్ళీ వచ్చేసరికి, యేం జరిగిందో, యెలా జరిగిందో అరుణజాడ తెలియరాలేదు. ఆ తరువాత చాలాకాలం పిచ్చివాడుగా తిరిగాడు. కాలం గారడిలో విధి ఆరడిని మరచిపోగలిగాడు.

ఎం. బీ. పూర్తయింది. డాక్టరుగా ప్రయివేట్ ప్రాక్టీసు పెట్టుకున్నాడు. ఏడాది తిరిగేలోగానే మంచి సంబంధం వచ్చింది. పెళ్ళి అనేది తప్పదుగనుక తప్పించుకోలేకపోయాడు.

పెళ్ళితంతు మొదలయిన క్షణంనుండీ అతనికి నీలిమ స్పర్శలో ఒకవింత గోచరిస్తూనే వుంది. ఐతే చేయిచేయి పట్టుకుని జీవితపథంలో జంటగాసాగే నవదంపతుల తొలిసోపానం—సాప్తపది వేళలో మాత్రం నీలిమస్పర్శలో తోచిన వింతను, హృదయ స్పందనకు లయబద్ధమయిన నాడిచప్పుళ్ళే విస్పష్టం చేశాయి. నీలిమ గర్భవతి. అది తెలిసీ, నిర్ధారించుకోలేదు కనుకా, సంస్కారం అడ్డువచ్చి ఏమీ చేయకూడదని ఊరుకున్నాడు. కానీ ఆ శోభనపురాత్రి అతని హృదయంలో వైముఖ్యాన్ని రేకెత్తిస్తూంది. సిగరెట్ పీలుస్తూ అలాగే ఆలోచిస్తూన్న శ్రీనివాస్, తలుపు చప్పుడు కావటంతో తలెత్తిచూశాడు.

ముత్తయిదువలు ముద్దుగా నీలిమను గదిలోకి పంపి తలుపుమూశారు. అక్కడే ఆగిపోయింది నీలిమ.

ఒకసారి పరీక్షగా ఆ అలంకరణంతా కాదని ఆమె నిలుచున్న తీరును, హృదయ ప్రతిబింబాలుచూపే కళ్ళు, ముగ్ధత్వం నిండిన

★ ఒక్కొక్కసారి నిజం నిప్పులా మారుతుంది. వివేకంగలవాళ్ళ ఆలోచనలను దహించి అయోమయంలోకి తోసేసి కలత పెడుతుంది. ఆవేశపెడుతుంది. ఆవేశం మనిషి వివేకాన్నే దెబ్బతీస్తుంది మరి! ★

ముఖాన్ని చూశాడు. సిగ్గుకంటే సంకోచమే కనిపిస్తూందతనికి. బిడియంకంటే భయమే గోచరిస్తుందా కళ్ళలో. ఆమెచేసింది పొరపా టన్న ఆలోచన తొలగిపోకున్నా, కనీసం నటించలేని ఆ హృదయనైర్మల్యం అతన్ని ఒక్కక్షణం కదిలించింది.

"రా నీలిమా" అన్నాడు మృదువుగా.

సిగ్గుపడుతూనే అతని ఎదుటి కొచ్చింది నీలిమ. శ్రీనివాస్ కూచోమన్న మీదట అతని కాస్త ఎడంగా కూచుంది.

కాస్సేపు మౌనం రాజ్యమేలింది. అంత సేపూ ఆలోచిస్తున్న శ్రీనివాస్ చటుక్కున అన్నాడు—

"చూడు నీలిమా. ఇది తొలిరేయి, అంటే యింతదాకా కొత్తవాళ్ళమయిన మనం ఇకపైన జీవితాంతం పంచుకునే అనుభవాలకు తొలిసో పానం యీ రోజన్నమాట" ఆగి నీలిమ వైపు చూశాడు.

ప్రశాంతంగా, శ్రద్ధగా వింటూంది. మళ్ళీ అన్నాడు శ్రీనివాస్—

"గతం భవిష్యత్తుకు పునాది అన్నారు. కనక మన జీవనగతాలు మనం వాటికి విలువనిచ్చినా యీయకపోయినా తెలియ చెప్పుకోవటం మంచిదని నా అభిప్రాయం."

"అవును" అంది నీలిమ వినిపించీ విని పించనంత మెల్లగా.

ఆమె అలా మాటాడటం కాస్త ఆశ్చర్యం వేసింది.

ఐతే, ఎలాగోలా ఆ విషయం శ్రీనివాస్‌కు చెప్పేయాలనే నిశ్చయించుకున్న నీలిమకు ఎందుకోసం అతనామాటలన్నాడో తెలియక పోయినా, అతని సంభాషణ ప్రోత్సాహాన్ని కలిగించింది.

"కానీ, నిజం నిదానంగా అర్థం చేసుకో గలిగితే నేను అదృష్టవంతురాలినవుతాను."

ఆ మాటకు మరింత ఆశ్చర్యపోయాడు శ్రీనివాస్. ఐతే తాను గర్భవతిననే విషయం నీలిమ చెప్పేస్తుందా? అతను వేగంగా ఆలో చిస్తున్నాడు. తనుచేసిన పొరపాటు భర్తముందు దాచి అతన్ని నటనతో మోసం చేయడంకంటె నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే నీలిమను తను ఆదరించగలడా? ఆలోచిస్తూనే,

"చెప్పు వింటాను" అన్నాడు.

నీలిమ చెప్పటం ఆరంభించింది.

"టు ఎర్ యీజ్ హ్యూమన్ అని మీకు తెలుసనుకుంటాను, నేనూ అందరిలాంటి ఒక మామూలు మనిషిని. మా కాలేజీ మేట్‌ను పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. అతన్ని విశ్వసిం చాను. తేనె తీసుకొని తేటి ఎగిరిపోయాక పువ్వు చేయగలిగిందేమీ వుండదు. నా జీవి తమూ అలాగే అయింది. అమ్మానాన్నా గొడవచేశారు. ఈపెళ్ళి నిశ్చయంచేశారు. నేను నిజం చెప్పమని ఎంత ఒత్తిడి చేసినా వినలేదు. నా యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా పెళ్ళి జరిగిపోయింది."

అంతసూటిగా చెబుతున్న నీలిమ నిర్భయ త్వాన్ని అభినందించకుండా వుండలేకపోయింది శ్రీనివాస్ హృదయం.

"కానీ పొరపాటును ధైర్యంగా ఒప్పు కోవటం, శిక్షను నిర్భయంగా భరించటం నా అభిమతం. నేను మాత్రం ఇది దాచి మిమ్మల్ని మోసం చేయలేను. నిజం మీకు చెప్పాను. నా హృదయం నిర్మలమైంది. అది ఇకపైన కేవలం మీది. ఇక ఏం చేయాలని మీరు నిర్ణ యించినా నేను ఎదురుచెప్పను." చీరకొంగు చివర వేళ్ళకొసలతో మెలివేస్తూ తలదించు కొని కూర్చుంది నీలిమ.

శ్రీనివాస్ ఏమీ మాటాడలేదు. అంతదాకా వూరికే కాలుతూన్న సిగరెట్ పడేసి మరోటి వెలిగించుకున్నాడు.

జరిగిన పొరపాటులో నీలిమ పొరపాటు ఎంతవరకున్నదనేది తాను నిర్ణయించలేడు. ఐతే అతని ఆలోచనలు మరోవిధంగా వున్నాయి.

తనూ నీలిమలాగే మరొకరిని ప్రేమిం చాడు. పెళ్ళిచేసుకోలేక పోయాడు. ఐనా, నీలిమలాగా సంఘం హర్షించలేని పొరపాటు తను చేయలేదు. ప్రేమ అన్నది ఎంత ఆకర్ష

ణీయమయినదయినా శారీరక వాంఛలకు తన మనస్సును లొంగనీయలేదు.

భార్యా భర్తలనే బంధంలో తన దృష్టిలో వాళ్ళను కలుపగలిగిన తీయని అనుభవాలలో తొలిరేయికూడా ఒకటి. అది ఇద్దరికీ నవ్యాను భవమైతేనే అవ్యాజానుబంధం యేర్పడుతుం దేమో. ఐతే తన విషయంలో వేరుగా జరి గింది, ఇది తనకు మాత్రమే తొలిరేయి. తన జీవిత భాగస్వామికి, తను పెళ్ళాడి అర్ధాంగి అనుకున్న వ్యక్తికి మాత్రంకాదు.

అది. సహజంగానే అందులోని పూర్తి ఆనం దాన్ని అనుభవించాలని శ్రీనివాస్ అను కున్నాడు. అలాటి అవకాశం లేదని తెలిసి, మనసును సమాధాన పరచుకోవటం సామాన్య మైన విషయమేమీ కాదు.

అలాగని నీలిమను తిరస్కరించచటానికి శ్రీనివాస్ మనసు ఒప్పుకోవటంలేదు. అమా యకంగా ఒక మగవాణ్ని నమ్మటమే నీలిమ చేసిన పొరపాటయితే, దాన్ని క్షమించి ఆద రించగల మరొకమగవాడి సంకుచితత్వము



కన్నెపిల్లలోని ఆ తొలిసిగ్గు, తొలి సారిగా రుచిచూచే ఆ అనుభవాలలోని వింతయిన మత్తు అవన్నీ చవిచూసే అదృష్టంనీలిమనుండి తనకు కలుగదు. అలాంటి ఆలోచన రాగానే శ్రీనివాస్ మనసంతా కల్లోల భరితమయింది.

శృంగారం అనేది ప్రకృతిలోని అద్భుత మయిన అనుభవం. తనను తాను వ్యాప్తి చేసు కొని, సదా నిలచిపోవటానికి యీ ప్రకృతి పతి ప్రాణిలోనూ ఏర్పరచే అద్వితీయానుభూతి

కారణంగా ఆమె జీవితం బలికావట మనేంతటి ఘోరశిక్ష అనుభవిం చాలా? అలా కాకుండా చేయగల అవకాశం తనకుంది. కానీ మన స్ఫూర్తిగానే చేయలేకపోతున్నాడు.

అలా చాలాసేపు ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా అన్నాడు—

"నీలిమా, నిజానికి నేను విలువ నిస్తాను. ఐనా కొన్ని నిజాలు భరించటం కష్టం. తప్ప కుండా ఈ నిజం భరించగలిగే మంచితనం

విద్యుత్ విప్లవం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో పరవళ్ళు తొక్కుతూ ముందుకు సాగుతున్నది. ఈ పరిశ్రమలకు ప్రధానకారణం మనరాష్ట్రంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి గణనీయంగా పెరగడమే. విద్యుత్ ఉత్పాదన పెరుగుదల ఫలితంగా నేడు మన రాష్ట్రంలో అధునాతన ప్రగతిశీల ఆర్థిక సామాజిక వ్యవస్థ చక్కని రూపురేఖలు దిద్దుకొంటున్నది.

1978-79 వార్షిక ప్రణాళికలో విద్యుచ్ఛక్తి రంగానికి 180 కోట్ల రూపాయలు కేటాయించారు. దిగువసీలేరు మూడవ యూనిట్ 1977 నవంబరులో ఉత్పత్తి ప్రారంభించింది. కొత్తగూడెం నాలుగవ దశక్రింద 110 మెగావాట్ల శక్తిగల మొదటియూనిట్ 1977 మార్చిలోనూ, రెండవ యూనిట్ 1978 జనవరిలోనూ పనిచేయడం మొదలు పెడతాయి. 1978-79 సంవత్సరంలో విజయవాడ థర్మల్ స్టేషన్ మొదటి యూనిట్ పని ఆరంభం అవుతుందని ఆశిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తిలో నూతన శిఖరాలను చేరుకొంటున్నది.

డైరెక్టరు, సమాచార పౌరసంబంధ శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

5/78-79

పొందగలను. కానీ అందాకా దయచేసి నన్ను క్షమించి దాంతోపాటు. ఈ నిజం కూడా మన మధ్యనే వుండనీయి" అనేసి లేచివెళ్ళిపోయాడు.

* * *

చాలాసేపు ఒంటరిగా కూర్చుని, ఈ ఆలోచనలతో పిచ్చెక్కిపోయింది శ్రీనివాస్‌కు. బట్టలు మార్చుకుని- పర్స్ జేబులో పెట్టుకుని బయటకు నడిచాడు. నీలిమ అతన్ని వారించ లేదు. ఆ రోజంతా హడావిడి మూలంగా అంతా అలసిపోయి నిద్రలో వున్నారు. శ్రీనివాస్ వెళ్ళటం ఎవరూ గమనించలేదు.

అణచుకోలేని మనసును మరచిపోటానికే ప్రయత్నిస్తాడు, నిబ్బరంలేని ప్రతి మనిషీ. బలహీన మనస్కులందరూ అందుకు ఎన్నుకొనేది మత్తు ఒక్కటే. శ్రీనివాస్ కాళ్ళు బార్ వైపే దారితీశాయి.

అరుణ తనను అర్థం చేసుకోలేదు. అవాంఛితంగా జరిగిన పొరపాటు అనూహ్యమైన బలికోరింది. ప్రతివాడూ తన జీవిత భాగస్వామి పవిత్రంగా వుండాలనే కోరుకుంటాడు. కానీ ఆ పవిత్రతగానీ, శీలంగానీ మనసుకు సంబంధించినదనీ, శారీరకమైనది ఎంతమాత్రమూ కాదనీ చాలామంది గ్రహించలేరు. నేనూ అలాంటి వాణ్నే అనుకొని అరుణ ఆత్మహత్య చేసుకుంది. చివరి చూపులకు కూడా నోచుకోలేని అభాగ్యుడై పోయాడు తను. అరుణ శవంకూడా దొరకలేదు. మెరుపులా మెరిసి తనపై పిడుగు వేసింది అరుణ. అరుణ అలా చేయకపోతే తను యిప్పుడు నీలిమను గురించిలా ఎంత మాత్రమూ ఆలోచించేవాడు కాదు.

అలా ఆలోచిస్తూనే బార్‌దాకా వెళ్ళాడు.

అలవాటు లేనివాడు కనుక కొద్దిగా తాగే సరికే నిషా ఎక్కింది. బాటిల్ పూర్తిచేసి బిల్లు జేబులోంచి తీసిపడేశాడు; బిల్లు ఎంత యిందో తను ఎంత యిచ్చాడో తెలుసుకొనే స్థితిలో లేడు, మెల్లగా కాళ్ళు బైటికి దారి తీశాయి. ఇద్దరు ముగ్గురు రిక్షావాళ్లు ఎక్కడికో తీసుకెళ్తామన్నారు. రిక్షా ఎక్కి కూర్చున్నాడు. దిగినాక ఓ యింట్లోకి తీసుకెళ్ళి ఏదో చెప్పాడు రిక్షావాడు. శ్రీనివాస్ రిక్షావాడికి డబ్బులు కూడా యివ్వలేదు.

కళ్ళు విప్పుకుని చూశాడు. ఏవో కిలకిలలు కలకలం వినిపిస్తూందే తప్ప ఏదీ స్పష్టంగా కనిపించటంలేదు.

ఇంతలో ఓ అమ్మాయి వచ్చి శ్రీనివాస్ ముఖం రెండు చేతుల్లోకి తీసుకుని కళ్ళల్లో కళ్లుపెట్టి చూసింది.

"ఏయ్" అంటూ ఆమె చేతులు తోసేశాడు.

ఆ అమ్మాయి మరో ఆవిడతో మెల్లిగా ఏదో చెప్పి, అతన్ని నడిపించుకొని ఓ గది లోకి తీసుకెళ్లింది. శ్రీనివాస్‌ని మంచంమీద కూర్చోబెట్టింది, ఒక గ్లాసుడు చల్లటినీళ్ళు తాగించింది బలవంతంగా. శ్రీనివాస్‌కి కొంచెం నిషాదిగింది. కానీ ఒళ్ళు స్వాధీనంలోలేదు.

"ఏయ్, ఎవరునువ్వు?"

"ఈరోజుకయినా మీదాన్ని."

"అంటే నా భార్యవా?"

"ఈరోజుకు మాత్రం."

"మరి రేపు?"

"నిన్నటి దాకాలాగే రేపుకూడా మీరెక్కడో నే నెవ్వరో మీకు."

"అంటే?"

"అదిపోనీ, మీరెప్పుడయినా ఇంతక్రితం ఇలాంటి చోటుకి వచ్చారా?"

"ఇలాంటి అంటే ఎలాంటి చోటు?"

"ఒక రేయి సుఖంగా గడపగలిగిన చోటు."

"ఉహుఁ నాకు యివ్వాళే తొలిరేయి, ఇవ్వాళే మొదటిసారి."

ఆ చోట అలాంటి జంట అదొక్కటే నేమో, ఏదో పొందగల చోట, కనీసం అదేమిటో తెలుసుకోలేని స్థితిలో వున్న మగవాడు అది తెలిసీ స్వార్థంకొద్దీ కాక, ఏదో మంచి తనం కొద్దీ అతని మనసు లోతుల్లోకి చొచ్చుకొని పోతున్న ఆడది, బహుశా అలాంటి చోట వాళ్ళిద్దరేనేమో.

* * *

నిద్రనుండి లేచేసరికి పదిన్నరయింది. శ్రీనివాస్ పక్కనే కూచుని వుంది నీలిమ.

కంపెనీ వాటాల్లో మీరు
చిన్న పెట్టుబడి దారా?

అయితే పన్ను రాబట్టకనే మీకు లాభాంశ చెల్లిస్తారు.

మీరు కంపెనీ కాకపోయి, ఈ లాభాంశను కలుపుకుని మీ మొత్తం రాబడి ఆదాయం పన్ను మినహాయింపు పొందే కనీస మొత్తానికన్న (వ్యక్తులకు, హిందూ అవిభక్త కుటుంబాలకు, కంపెనీలు, వ్యక్తులు ఏర్పరచుకున్న సంఘాలు, వ్యక్తుల బృందాలు, ఆర్టిఫిషియల్ జూరిడికల్ వ్యక్తులకు రు. 10,000) తక్కువగా ఉన్నట్లయితే కంపెనీ ప్రకటించిన పూర్తి లాభాంశను మూలంలో పన్ను రాబట్టుకోవడమంటూ లేకుండా మీకు చెల్లిస్తారు.

అదెలాగ ?

పన్ను రాబట్టుకోకుండా అటువంటి లాభాంశను చెల్లించేట్టు మీ వాటాలుగల కంపెనీకి అధికారం ఇస్తూ సర్టిఫికెట్ జారీ చేయవలసిందిగా కోరుతూ ఫారం నం. 14 లో మీ ఐ. టి. ఓ.కు


లేదా

ఏ కంపెనీ నుండయినా మీకు రావలసిన లాభాంశ రు. 250కి తగ్గినట్లయితే నిర్ణీత ఫారం నం. 14 బి లో ఒక డిక్లరేషన్ (రెండు ప్రతులు) అటువంటి ప్రతి కంపెనీకి పంపండి.

అవకాశాన్ని ఉపయోగించుకోండి
ఆదాయం పన్ను కార్యాలయం నుండి
రిఫండ్ కోరే పని
పడకుండా చూడండి.

జారీ చేసినవారు :
డైరక్టర్ ఆఫ్ ఇన్స్పెక్షన్
(రిసర్చ్, స్టాటిస్టిక్స్ & పబ్లికేషన్)
ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్
న్యూ ఢిల్లి-110 001

78/158



రాత్రంతా ఏడ్చినట్టుగా ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి నీలిమ కళ్ళు. ఆ పెదాలమీద తెచ్చి పెట్టుకొన్న నవ్వు. అయినా ఆ ముఖంలో నిర్మలత్వం.

తాను రాత్రి మత్తులో ఏం చేసిందీ స్పష్టంగా గుర్తు లేకున్నా నీలిమను నొప్పించాడని గ్రహించాడు శ్రీనివాస్.

"నీలిమా, నేను దుర్మార్గుడ్ననుకొంటున్నావు కదూ?" నోటిదాకా వచ్చిన మాట అనటానికి ఏదో మొహమాటం అడ్డు వచ్చింది శ్రీనివాస్‌కి. లేచి తల వంచుకొని వెళ్ళిపోయాడు.

అది మరోలా భావించిన నీలిమ నిశ్శబ్దంగా నీళ్ళు దిగమింగుకుంది.

ఇంట్లో ఎవరికీ ఏమి అనుమానం రాకుండా రాత్రంతా మేలుకుని వున్న నీలిమ, తెల్లవారుతూండగా వచ్చిన శ్రీనివాస్‌ను, తీసుకెళ్ళి గదిలో పడుకోబెట్టింది.

స్నానాదులు కానిచ్చి టిఫిన్ పూర్తి చేసిన శ్రీనివాస్‌కు పోస్టులో వచ్చిన ఓ కవర్ తెచ్చి యిచ్చింది నీలిమ.

విప్పి తెరిచాడు.

"వాసూ" సంబోధన చూడగానే ఆశ్చర్యపోయాడు. హృదయ వీణలో ఏదో మూగపోయిన తీగను ఎవరో మీటినట్టు, ఎక్కడివో మాసిపోయిన తలపులు మెరిసినట్టు ఎక్కడివో గత జన్మలోని వాటిలాంటి జ్ఞాపకాలు స్మృతి పథంలో మెదిలాయి.

తనను అలా సంబోధించేది అరుణ ఒక్కతే.

చివరి పేజీ తీసి సంతకం చూశాడు. "అరుణ" అని చూడగానే గుండె వేగంగా కొట్టుకోసాగింది. గబగబా చదువసాగాడు.

"ఏ జన్మలో చేసిన పుణ్యమో, ఒక్కసారి మళ్ళీ నిన్ను చూడాలనుకున్న నా కోరిక తీరింది. అంతమాత్రాన నేను అదృష్టవంతురాలినని, నీదాన్ని కాకపోయిన తరువాత కూడా ఎలా అనుకోగలను?

ఎవడో నీచుడి కామానికి బలయిన నేను, అభిమానం చంపుకోలేక ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. కనీసం ఆ అవకాశం కూడా లేకుండా సిగ్గు, లజ్జలేని ఒళ్ళమ్ముకునే వాళ్ళలో కలిసిపోయాను. విధికి నామీద ఎందుకంత పగో ఏమని చెప్పను?

జీవచ్ఛవంలా బ్రతుకుతున్న నాలో నిన్న. ఆ వ్యభిచార కొం...
ఎలాం...

నా మూలంగా నువ్వు తాగుబోతువు, వ్యభిచారివీ ఐనావేమో ననుకున్నాను. కానీ కాదని తెలుసుకోగలిగాను.

వాసూ, ఒక ఆడదానికోసం నాశనం చేసుకోవలసినంత అల్పమైంది కాదు జీవితం. నువు డాక్టరువి. నీద్వారా సంఘానికి యెంతో కొంతమేలు జరుగుతున్నదంటే, దాన్నంతం చేసే హక్కు నీకులేదు.

నీ భార్యగురించి నువు చెప్పినది విన్నాక నీకు ఒక్కమాట చెప్పాలనిపించింది. అరుణ దురదృష్టవంతురాలయితే నీలిమ అమాయకురాలు. ఆమె తను చేసిన తప్పు తెలుసుకొని తానుగా ఒప్పుకొని, నిన్ను తన దేవుడిగా భావించనెంచింది. అలాంటి నిర్మల హృదయిని నీభార్యగా దొరికితే జరిగిన చిన్న పొరపాటుకు ఆమె జీవితం నాశనం చేయటం న్యాయంకాదు.

నేనే, ఆనాడు నీదగ్గిరకొచ్చివుంటే నువు ఇలాగే ప్రవర్తించేవాడివా? ఎంత మాత్రమూ కాదు. నాకా అదృష్టంలేదు. ఐనా కాకతాళీయంగా నిన్ననే నువు నాదగ్గరకి రావటము మంచిదే అయింది.

వాసూ, నీ తొలిరేయి అనుభవం నీభార్యతోనే పంచుకో. ఆమె పొరపాటు చేసింది. నేను నీచాతినీచమైన స్థానంలోవున్నాను. మనసును జోకొట్టి మత్తులోవున్న నీ ఆశలను నీదాన్ని కావాలనుకున్న నా ఆశకు బలిచేయదలచుకోలేదు. అందుకే నీకు నన్ను అర్పించుకోలేకపోయాను.

నాకోసం ఎంతమాత్రమూ ప్రయత్నించవద్దు. అరుణ చచ్చిపోయిందనుకో. నీలిమను ఆదరించు.

ఒకచిన్న కోరిక తీరలేనంత మాత్రాన, ఒక బ్రతుకు నాశనం చేయటం మంచిది కాదని మాత్రమే నేను చెప్పేది.

నామాట కాదనవనే ఆశతో,

—అరుణ."

ఉత్తరం పూర్తిచేసి, భారంగా కళ్ళు మూసుకున్న శ్రీనివాస్, "తలనొప్పిగావుందా" అన్న నీలిమ మాటకు, నుదిటిమీద ఆమె స్పర్శకు మెల్లిగా కళ్ళువిప్పాడు.

లేచి, నీలిమను గట్టిగా కౌగిలించుకున్నాడు, పసిపిల్లవాడిలా.

అతని కళ్ళలోనుండి కారుతున్న వెచ్చటి కన్నీళ్ళు భుజంమీద పడుతూండగా యేమీ అర్థంకాకపోయినా, తల్లి లాలించినట్టుగా అతని వీపుమీద చేయివేసి నిమురుతూ వుండిపోయింది నీలిమ. □

వేమకోటి సీతారామశాస్త్రి

తెర

సూర్యోదయమైంది. అందరిళ్ళలోకి వెలుగు వచ్చినా వెలుగురాని గూళ్ళమైన యిల్లది. మొదటి రెండు మిద్దె గదులు తర్వాత వంటిల్లు పెరట్లో నంద నుయ్యి యిక్ష్వాకులనాడు తయారు చేసిన కఱ్ఱ కిటికీలు చిన్నవి, చెదలు పడుతున్న గుమ్మాలు, నేడో రేపో—కూలి పోవడానికి సిద్ధంగా వున్నట్లుగా వుంటుందా యిల్లు.

ఆ యింటి యజమాని భార్య శాంతమ్మ గారు వంటింట్లో కూర్చుని కాఫీ కలుపుతోంది. యజమాని జగన్నాధం ముక్కు మూసుకుని దేవుడి దగ్గర జపం చేస్తున్నాడు. గాలి వెలుతురు లేని ఆ గదిలో చీకటి కోయలేని చిరు దీపం దేవుడు ముందు నీరసంగా వెలుగుతోంది.

శాంతమ్మగారి మనస్సు మనస్సులో లేదు. పెద్ద మనిషయినా వోణీ వేసుకోని రెండో పిల్ల దేవి, దాని తర్వాత వ్యక్తురాళ్ళు, కావడానికి సిద్ధంగావున్న మరో యిద్దరాడ పిల్లల్ని తదేకంగా చూస్తోంది. వాళ్ళు, సినిమాల గురించి వాళ్ళు కట్టుకున్న బట్టలు గురించి అలంకరణ గురించి చెప్పుకుంటున్నారు. చిరుగాలికి పెరట్లో ఉతికి జామచెట్టు కారేసిన దేవి పైట వోణీ రెపరెప లాడుతోంది. ఆ పెద్ద పిల్లతో కలుపుకొని ఆ వంటింట్లో మండుతున్న కుంపటితో కలుపుకుని ఆ దంపతుల గుండెల మీద ఐదు కుంపట్లు వున్నాయి.

యెక్కడి నుండో చిరుగాలి పొరపాటున వంటింట్లోకి జొరబడ్డది. జగన్నాధం నుదుటి మీద అనుభవాలు వేసిన ముడుతల మధ్య లాస్యం చేస్తున్న స్వేదబిందువుల్ని తాకింది. తర్పణంచేసి బాహ్యప్రపంచంలోకి వచ్చారు జగన్నాధం. పీట వేసుకుని కుంపటి దగ్గర కూర్చున్నారు.

"యింకా యెంతకాలమండీ........" కాఫీ యిస్తూ శాంతమ్మ అడిగింది బాధగా.

"నేనేం వూరికే కూర్చున్నానా...." ప్రతీ రోజూ యిచ్చే సమాధానమే.

"అదిగాదండీ అటు చూడండి. రాధ తర్వాత వాళ్ళ ముగ్గురూ తోటకూర కాడల్లాగ పెరిగిపోతున్నారు. కాలాన్ని మనం ఆపలేం కదామరి యేదో వొకటి చెయ్యాలండీ...." గాదదికంగా అంది శాంతమ్మ కన్నీటి తెర ఆమెలో వుండే ఆవేదనని కప్పేట్టేసింది.

"అలాగే శాంతా....ఈ సంవత్సరాంతం లోగా యెలాగైనా పెద్ద దానికి కానిచ్చేదాం." అన్నారు అరవై ఏళ్ల దగ్గర పడుతున్న ఆయన కంఠం కొంచెం వణికింది.

"పోనీ పెద్దవాడితో నయినా కొంచెం చెప్పండి. మీకు వీలులేకపోతే నేనయినా వాడింటికి వెళ్ళి చెబుతాను."

వేదాంతిలా నవ్వారు జగన్నాధంగారు.

"నీకింకా మమకారం పోలేదు శాంతా.

★ పరువు ప్రతిష్ఠలకోసం తెరల వెనుక జీవితం సాగించగలిగినా, ఆకలిని కప్పే తెర సంపాదించ డానికి జీర్ణించి ఉన్న తెరలను తొలగించక తప్పదు ఒక్కోసారి! ★

పురుట్లో తల్లి పోయినవాడికి తల్లిపై కంటి పాపలా పెంచావు. నీ పిల్లలకు వున్నా లేక పోయినా వాడికే అసౌకర్యం లేకుండా చేసావు. వాడేదో చదివి పెరిగి పెద్దవాడై మనల్నంతా వుద్ధరిస్తాడని రెక్కలు ముక్కలు చేసుకుని చదివించాను. మనకి వాడేం శిక్ష వేసాడో తెలుసా?" బాధగానే ప్రశ్నించారు.

ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో ఉద్యోగం యిప్పించి లక్షణంగా పెళ్లి చేస్తే పెళ్ళాం మాటలు విని వూళ్లోనే వేరే కాపురం పెట్టి, ఆ యింటి ఛాయలకే రావటం మానుకున్నాడు. మొదటి సంబంధం కొడుకు.

"పోన్లెండి. యిప్పుడవన్నీ యెందుకు గత జల సేతు బంధనం. అవసరం మనది........ "ఒసేవ్ పిల్లలు యింకా యేం చేస్తున్నారు. రండి కాఫీ త్రాగుదురుగాని తమ్ముడి నిద్ర లేపండ్రా...." వంటింటినుండే కేకవేసింది. కోడిపెట్ట మన స్తత్వం శాంతమ్మది, తన పిల్లలు యే గ్రద్దబారి పడకుండా తన కనుసన్నల్లోనే మెలగాలని ఆమె తపన.

"యీ పూటకు బియ్యం నిండుకున్నా యండి. నాలుగు రోజులుగా యిరుపొరుగుల్ని అడిగి తెచ్చాను. యింక యెవ్వరూ...." నిస్స హాయత ప్రతిధ్వనిస్తోంది.

"యీ వొక్క పూటకు యెలాగయినా తీసుకువస్తాను." మధ్య గదిలోకి వెళ్ళిపోయారు అంతకన్నా నిస్సహాయంగా కొన్ని క్షణాల తర్వాత.

"యీ చీకటి గూడా ఈ యింట్లో దరిద్రం లాగే తిష్టవేసుకుని కూర్చుంది." గొణు క్కుంటూ వెతుక్కుంటున్నారాయన ఆ ప్రక్క గదిలోకి వెళ్ళి. ఆ గదిలో రాట్నంమీద దారం టప్పుమని తెగిపోయింది. పెద్ద కూతురు రాధ యేకాగ్రతకు భంగమే కలిగింది.

"యేమిటి నాన్నగారు వెతుకుతున్నారు" రాట్నం ఆపి అడిగింది.

"యేం లేదమ్మా జోళ్ళు వెతుకుతున్నాను తల్లీ. కాళ్ళకు ఆనెలుంటే వీడు మనం లేక పోతే నడవలేదు కదా అని. అవి అప్పుడప్పుడు నాతో దొంగాటలాడుతూ వుంటాయి" అని తడుముకుంటున్నాడు.

రాధ వెలికి తీసిందా హవాయి చెప్పుల్ని.

"నాన్నగారూ పట్టీ తెగిపోయిందండీ...." అంది బాధగా రాధ.

"వాటికి గూడా తెలిసిపోయింది యింక నేను యెందుకూ పనికిరానని" కంఠంలో దుఃఖం జీర కదలాడుతోంది.

"అవేం మాటలు. దీన్ని నేను కుట్టేసి సరి చేస్తాను నాన్నగారూ." సూదీ దారం పట్టుకొని వీధి గదిలోకి వచ్చింది.

వీధి గదిలోనూ అంత వెలుగు లేదు. వీధి గుమ్మానికి తెర వేలాడుతోంది. చిరుగాలికి, అ స్తవ్య స్తంగా వూగుతూ. వాటి కొసలు అక్కడక్కడా పీచులు తెగిపోయి వున్నాయి. దాన్ని దూరం నుండి చూస్తే అవి చిరుగులకు వేసిన కుట్లో, క్రొత్తరకం యెంబ్రాయిడరీయో యెవ్వరూ పోల్చుకోలేదు.

"నాన్నగారూ ఈ నెల షాహుకారు జీతం యివ్వలేదా? తమ్ముడికి స్పెషల్ ఫీజులు యూనిఫారమ్ డ్రెస్ లేకపోతే స్కూలుకి రానివ్వనంటున్నారట. గోల పెడుతున్నాడు వాడు...." నెమ్మదిగా అడిగింది రాధ.

"ఈ నెలేకాదు. యింకే నెలా జీతం యివ్వ రమ్మా. వాడికీ మనకీ ఋణానుబంధం సరి. సరిగ్గా చూపానరన్న మిషతో తీసేసి ముందు వాడిన అడ్వాన్సులకు విగగొట్టుకున్నాడు. అప్పుడే వారం రోజులైంది." మరేం మాట్లాడ లేదు జగన్నాధంగారు.

"మరి...." రాధ కంఠంలో బెంగ తొంగి చూసింది.

"ఈ విషయం తెలిస్తే మీరంతా బెంగపడి పోతారని చెప్పలేదు. రోజూ రామమందిరం దగ్గర కూర్చుంటున్నాను. పురోహితులంతా అక్కడ చేరతారుకదా..యెవరయినా యేదయినా పని చెబితే చేయటం దానాలు పట్టటం...." మరి చెప్పలేకపోయారు. భయం తెర అతని మనస్సును కప్పేసింది.

రాధకు మరి నోట మాటరాలేదు.

"మాకోసం యెంత శ్రమపడుతున్నావు నాన్నా!...." మనస్సులోనే దుఃఖం దిగమింగుకుంది. కుడుతున్న హవాయి చెప్పువంక చూసింది. అవి బాగా అరిగిపోయి పల్చని అట్ట ముక్కల్లా వున్నాయి. వాటి మధ్యన కాలి ఆనెలు చేసిన బరువు ముద్రలు దీనంగా కన్పిస్తున్నాయి లాగుతున్న భారజీవితాన్ని ప్రతిబింబిస్తూ.

మరో క్షణంలో ఆ రెండు కాళ్ళు చెప్పుల్లోకి దూరాయి. గుమ్మం తెరవరకూ వచ్చి ఆగిపోయాయి.

"అమ్మా! రాధా! మళ్ళా ఈ తెర మధ్యగా నిలువుగా చిరుగు పడిపోయింది దీన్ని కుట్టమ్మా. లేకపోతే పెద్దది అయ్యేటట్లుగానే వుంది" అన్నారు బాధగా.

"అది బాగా చిరిగిపోయింది నాన్నగారూ!" అని అంటే యేం సమాధానం వస్తుందో రాధకు తెలుసు. ఒకనాటి సమాధానం ఆమెకు గుర్తుకు వచ్చింది.

"ఈ తెర గుడ్డకు పెద్ద చరిత్ర వుందమ్మా. నువ్వు మీ అమ్మ కడుపులో నున్నపుడు కొన్నానమ్మా. అప్పటిది చాలా గట్టిగా, మందంగా వుండేది. యిన్నేళ్ళు మన కుటుంబ చరిత్ర దీని వెనకాతలే వుంది. ఈ యింట్లోవాళ్ళకి కట్టుకుందికి వొకే బట్టతప్ప మరి లేదని, వొకపూటే అన్నం అవకాశం వుంటే తింటారని, ఈ యింట్లో మనుషులు వ్యక్తిత్వాలూ మమతల మధ్య దారిద్ర్యం వొక్కటే విలయతాండవం చేస్తుందన్న నగ్న సత్యాల్ని బయటి ప్రపంచానికి తెలియకుండా కాపాడుతోందమ్మా...." అనేవారు జగన్నాధంగారు ఆ తెరని మనసారా ఒకసారి తడిమి.

"అలాగే నాన్నగారూ...." అంటూ వర్తమానంలోకి వచ్చి సమాధానం యిచ్చింది సూదిలో మళ్ళా దారం యెక్కిస్తూ, తండ్రి గుమ్మందాటి బయటకు వెళ్ళడం చూస్తూ.

యింతలో రాధ ప్రయత్నాన్ని వంటింట్లో కేకలు అడ్డుకున్నాయి.

"ఈ యింట్లో యెప్పుడూ బెల్లం కాఫీయేనా!




యిది త్రాగలేక కడుపులో దేవేస్తోంది. దరిద్రం కొంప...." కాఫీ గ్లాసు దభేలున నేలమీదన యేత్తేశాడు భార్గవ. గచ్చులూడిన నేల పీల్చేసిందా కాస్త కాఫీని.

"యేమిటి భార్గవా ఈరోజూ ఈ అల్లరి. యింట్లో లేదని యేడవనా లేక నీ అల్లరికి యేడవనా. నాకు చావొచ్చింది కాదు'' తల్లి తల గుమ్మంకేసి కొట్టుకుంటోంది.

రాధ అకస్మాత్తుగా వచ్చి అడ్డుకుంది. కానీ అప్పటికే తల చిట్లి రక్తం కారుతోంది.

"యేమిటమ్మా నువ్వునూ....వాడి సంగతి తెలిసిగూడా...."

"వాడు నా కొడుకు కాడే. నా ప్రాణాలు తీసేస్తున్నాడే. యింట్లో దేనికని యేడవను. ఈ గుండెలమీద కుంపట్లు మంటలకే యేడవనా?



భగవంతుడు నాకు చావు తెప్పించేడు కాదే తల్లీ...." అంది రాధ వొడిలో తలపెట్టుకుని. పసిపిల్లలా యేడ్చేస్తోంది శాంతమ్మ. మిగిలిన ఆడపిల్లలు యేం తోచక చూస్తున్నారు.

"యింట్లో యేదుంటే అది త్రాగాలి. కానీ నీకోసం పంచదార యెక్కట్నించి తెస్తుందిరా." అడిగింది దేవి బాధగా.

"అనండే మీరూ అనండే. పెళ్ళి పేటా కాలూ లేక విర్రవీగిపోతున్నారు. మీవల్లనే నాకేం ముద్దు ముచ్చట జరగలేదు. మీరెవరైనా పోతేగాని ఈ యింటికి పట్టిన దరిద్రం వదల్దు'' గట్టిగా అరిచాడు.

"ఒరేయ్! అతిగా మాట్లాడకు. దవడ పళ్ళు రాలగొట్ట గలను." అంది దేవి. కోపంతో ఆమె బుగ్గలు యెరుపెక్కి పోయాయి.

"ఊరుకోవే దేవీ...." గద్దించింది రాధ.

"ఛీ....ఛీ....ఈ యింట్లో వుండి చదువుకోవడం కన్నా చదువు మానేసి యెక్కడయినా కప్పులు కడుక్కుంటూ బ్రతికితే బాగుంటుంది. అన్నయ్యగారింట్లో పిల్లలకి యెంచక్కా స్కూలు యూనిఫారమ్ అన్నీ వున్నాయి...." భార్గవ గొంతుకలో—దుఃఖం తెర రెపరెపలాడుతోంది.

"చూసావే.... చూసావే........వాడేమంటున్నాడో....పోరా .... పోతేపో — యెవడున్నాడ్డ రించాలివుండి."అని రెచ్చిపోయింది, శాంతమ్మ.

"వెళ్తానే ఆ రోజు దగ్గరలో వుంది...." ముక్కుపుటాలు యెగ చీల్చుకుంటూ, వెళ్ళిపోయాడు, పద్నాలుగేళ్ళ నిండీ నిండని భార్గవ పుస్తకాలు చేత్తో పట్టుకొని.

"వాడంటే పసివాడు, తెలిసీ తెలియని వయస్సు. నువ్వెందుకమ్మా అలా వాడితో పోట్లాడతావు" అంది రాధ అనునయంగా.

"పోట్లాట కాదే తల్లీ ప్రాణాలు తీసేస్తున్నాడు. రచ్చకెక్కిస్తున్నాడు ఒసేయ్ దేవీ, కమలా, విమలా యేం చేస్తున్నారర్రా కుండీలోకి నీళ్ళు తోడండి...." అంటూ నీరసంగానే లేచింది శాంతమ్మ.

నుదుటి గాయంలో రక్తం గడ్డ కట్టి పోయింది.

* * *

దేవి, కమలా వాళ్ళిద్దరూ వీధి గుమ్మం తెర దగ్గర వున్నారు. తెర చిరుగులో నుండి బయటి ప్రపంచాన్ని చూస్తున్నారు. మధ్యన రోడ్డు, రోడ్డు కవతల చక్కటి మేడ....మేడచుట్టూ చిన్న పిట్టగోడ. లోపల రకరకాల పూలచెట్లు. ఆ మేడ ఈమధ్య యెవరో కొనుక్కుని బాగు చేయించుకున్నారు. కుటుంబాన్ని యింకా తీసుకు

రాలేదు. ఒక నడివయస్సాయన కొంచెం కుంటుకుంటూ నడుస్తాడు ఆవరణలో. ఎప్పుడూ తెల్లని మల్లెపూవులాంటి బట్టలతో మేడమీద వరండాలో కూర్చుని సిగరెట్లు కాలుస్తుంటాడు. బంగారం ఫ్రేము కళ్ళజోడు తగిలించుకొని, స్టూలుమీద పుస్తకాలు వేసుకుని చదువుకుంటూ వుంటాడు....చిరుగులో నుండి వొక గాలి రివట రెండు రోజులనుండి తైల సంస్కారం లేని దేవి ముంగురులను రెపరెపలాడించింది ఆమె మనస్సులోని ఊహలతో బాటు.

"అలాంటి మేడ, సినిమాల్లో చూపించే సోఫాసెట్లు, నవలల్లో వర్ణింపబడే అందమైన ఆరడుగుల ఉంగరాలజుత్తు హీరో. అమెరికాలో చదివినవాడు—యింపాలా కారు, 'డార్లింగ్ నీకు డబ్బు లేకపోయినా సరే. మీ వూళ్ళోవున్న పదవ క్లాసువరకూ చదివినా సరే, నీవు నా పాలిట జయసుధవే. నిన్ను తప్ప మరొకర్ని చచ్చినా పెళ్ళాడను. నా ప్రేమను స్వీకరించు.' పువ్వుల మొక్కలమధ్య ఆ హీరో తన చేతిలో వొలు వేసున్నపుడు అందమైన యెర్రగులాబీ తన జడలో తురుముతున్నపుడు...." కలల్తో కళ్ళు మూసుకుంది దేవి.

"ఆ మేడింటి వాళ్ళకో తన ఈడు అబ్బాయుంటే, ఆ అబ్బాయి మెళ్ళో యెంచక్కా జమీందారిలాంటి పులిగోరు పతకం, నాలుగు వేళ్ళకు వుంగరాలు, అందమైన గుండ్రని ముఖంతో, కళ్ళకు చారడేసి కళ్ళతో తనతో తొమ్మిదవ క్లాసు చదువుతూ, ఆప్యాయంగా.... 'రా కమలా! నా రిక్షాలోనే రోజూ బడికిపోదాం.' అంటూ రిక్షాలో యెక్కించుకొని బడికి వెళుతూ వుంటే, పొరుగింటి స్వర్ణా, యిరుగింటి అమలా ఈర్ష్యతో వుడికిపోవాలి." అనుకుంటోంది కమల.

"యేం చేస్తున్నార్రా యిక్కడ మీ రిద్దరూ" అంది రాధ.

"ఏంలేదు. ఈ తెరగుడ్డని చూస్తున్నాను." అంది కమల తన కలలమీద, అబద్ధం తెరని కప్పేసి.

"తెర గుడ్డని చూసేదేమిటీ...." నవ్వింది రాధ.

"పగిలిపోయి, పిట్లిపోతున్న ఈ తెర మన గుమ్మాన్ని యింకా యెంతకాలం అంటిపెట్టుకొని వుంటుందో నని ఆలోచిస్తున్నాం" అంది దేవి.

"దానికీ మనకీ యెంతకాలం ఋణానుబంధం వుంటే అన్నాళ్ళు వుంటుంది. అమ్మ పిలుస్తోంది" అంది, రాధ సూదిలోకి దారం యెక్కిస్తూ.

అప్రయత్నంగానే మేడవేపు చూసింది రాధ. అతనువచ్చి అప్పుడే కుర్చీమీద కూర్చున్నాడు. అతను రోజూ పుస్తకాలు చదువుతాడో, రోడ్డు మీద వచ్చేపోయే జనాన్ని చూస్తాడో తెలియదు. తన వొకసారి బజార్లో వడికిన నూలు అమ్మి తూంటే పుస్తకాల షాపు దగ్గర నిలబడి పుస్తకాలు కొంటున్నాడు, కుష్టురోగమో యేమో పాపం చేతివేళ్ళుకూడా వంగివున్నాయి.

పాపం భార్య విడాకులు యిచ్చేసిందట రోగిష్టివాడని. యివన్నీ పనిమనిషి అమ్మతో చెబుతూంటే తను వింది.

రాధ ఆలోచనలు మాని చిరుగును కుట్టడం ప్రారంభించింది. గట్టిగా పట్టుకుంటే మరోచోట చిరిగిపోయే పరిస్థితి యేర్పడిందా తెరకు. అది కుడుతూండగానే మరొక చిరుగు.

"నిన్నింక యెంతోకాలం కుట్టుకుట్టి శ్రమ పెట్టను. మా పరువు మర్యాదల్ని యింతకాలం కాపాడావు. నీకింక విశ్రాంతి నిస్తాను." అంది కృతజ్ఞతాపూర్వకంగా. రాధ వడికిన నూలు అమ్మి యింటి ఖర్చులకు కొంత పోగా, తెర గుడ్డ కొనాలని కొంచెం కొంచెం దాచిన డబ్బు యెప్పటికప్పుడు యింటి ఖర్చులక్రిందే పడిపోతూ వుండేది. ఈసారిమాత్రం యెంతో శ్రమపడి, యెనిమిది రూపాయలు కూడబెట్టింది. ఇంకొంచం కాలం వోపిక పడితే పది రూపాయలకు వొక చవకరకం తెరగుడ్డ రాకపోదు.

రెండో చిరుగులో యెదురింటాయన తమ యింటి గుమ్మంవేపే చూస్తున్నాడు. రాధ మేడ వేపు చూస్తోంది.

"నా తమ్ముడ్ని కష్టపడి చదివించాలి. గొప్ప వాడ్ని చేయాలి, అలా యింటిని, ఆ మేడలాగ అందంగా కట్టించాలి. వాడు పెద్ద వుద్యోగం చేస్తూ తన తల్లినీ, తండ్రినీ సుఖపెట్టాలి' ఆ రోజు....ఆ రోజు....కోసం...." యిలా దృఢ మైన ఆలోచనలతోనే రెండో చిరుగు కుట్టడం పూర్తిచేసి స్నానానికి వెళ్ళడానికి వెనక్కి తిరిగింది.

"ఊఁ నెమ్మదిగా సాయం పెట్టండి...." అన్న మాటలు వినిపించి వెనక్కి తిరిగింది.

రిక్షావాడు, చిన్ననాటి నేస్తం, సీతారామయ్య గారూ తన తండ్రిని సాయం పట్టి లోపలకు తెస్తున్నారు.

"అమ్మాయ్ రాధా! ఇక్కడ మంచం వెయ్యమ్మా...."

జగన్నాధంగారి వొంటిమీద తెలివిలేదు. రాధకు గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. మంచం తెచ్చి దానిమీద చిరిగిన బొంత వొకటి వేసింది.

"యేం జరిగిందన్నయ్యగారూ!" ఆతృతగానే అడిగింది శాంతమ్మగారు రుద్ధమైన కంఠంతో.

"యేం లేదమ్మా! రామ మందిరం దగ్గర కొంచెం రక్తం కక్కుకుని స్పృహ తప్పిపడి పోతే....ఆహా మరే బెంగ పడకండి. యేదో కొంచెం వేడిచేసి వుంటుంది. తగ్గిపోతుంది. కొంచెం జ్వరంగూడా వచ్చినట్టుంది. పెద్దాడిని పంపిస్తాను. డాక్టర్ని తీసుకు వస్తాడు. నేను వూరికి వెళ్ళాలి" అంటూ వెళ్ళిపోయారాయన.

* * *

మధ్యాహ్నమయినా ఆ ఇంటికి పెద్దకొడుకు రాలేదు. జగన్నాధంగారు మూసిన కన్ను తెరవ లేదు. రాధే డాక్టరును తీసుకువచ్చింది. డాక్టరు పరీక్షచేసి యింజక్షనూ, వో పెద్ద మందుల లిష్టు రాసి వెళ్ళిపోయాడు.

గుమ్మంవరకూ వెళ్ళి తను కొత్త తెరగుడ్డ కొందామని వుంచిన డబ్బు, డాక్టరుకి ఫీజుకింద యిచ్చేసింది. ఆ యింట్లో సభ్యులకు ఆ పూట అన్నం తినలేదన్న సంగతిగూడా భయం తెర తెలియనివ్వలేకుండా చేసింది.

దీపాలు పెట్టే వేళ కళ్ళు తెరిచారాయన. కొంచెం జ్వరం తగ్గి చెమటపట్టింది. సీతా రామయ్యగారు వచ్చారు.

"పెద్దవాడితో చెప్పారా అన్నయ్యగారూ?" అడిగింది శాంతమ్మ.

"చెప్పానమ్మా....వాడిక్కడికి రాడమ్మా.... వాడోకబురు చెప్పాడమ్మా...." ఆగారు సీతా రామయ్యగారు.

అంత నీరసంలోనూ జగన్నాధంగారు, కళ్ళింతలు చేసుకొని వింటున్నారు.

"జన్మ నిచ్చిన తండ్రిని జాగ్రత్తగా చూసు కోవటం తన ధర్మమని అందుకని వీళ్ళందర్ని వదలి నీవు అక్కడికి వచ్చేస్తే నిన్ను పోషించ డానికీ, నీ బాగోగుల్ని చూసుకోవడానికి తనకేం అభ్యంతరం లేదని...." సగంలోనే ఆగి పోయాడు. జగన్నాధం కళ్ళనుండి విస్ఫు లింగాలు వర్షిస్తున్నాయి. తారాజువ్వలా లేచాడు.

"ఈ మాట చెప్పడానికి నీకెంత సిగ్గుతే

(వి)చిత్ర విజ్ఞానం



కేరళలో ఉప్పునీటి కాలువలు చాలా వున్నాయి. అక్కడ "కైనా కారి" అనే గ్రామంలో ప్రభుత్వం ఒక "పడవ పోస్టాఫీసు"ను స్థాపించింది. పోస్టు మాష్టరు యీ పడవ పోస్టాఫీసును గడవేసి నడుపుతూ కాలువల ఒడ్డున వున్న ఊళ్లకి వెళ్లి ఉత్తరాలు అందిస్తాడు!

దయ్యా!! ఆ బోడి పోషింపు యెవడికొ్కావాలయ్యా. నేను బ్రతికుండగానే నా పిల్లలు దిక్కులేని వాళ్ళయిపోవాలా. అలా జరగదయ్యా. నేను జన్మనిచ్చినా వాడికి పునర్జన్మ ప్రసాదించింది. నా శాంత....వాడికి చిన్నపుడు న్యుమోనియా వస్తే యింక మన పిల్లడు కాడని అరుగుమీద పడేస్తే రాత్రనక, పగలనక కళ్ళల్లో వత్తులు వెలిగించుకుని బ్రతికించుకుంధయ్యా యిదయ్యా! దానికి వాడిచ్చే ప్రతిఫలం. విశ్వాస ఘాతకుడు వాడు అనుభవిస్తాడయ్యా. ఇంతకింత....ఒరేయ్ పితృద్రోహి నువ్వు... నువ్వు...."మాటతడబడింది. కుప్పలా కూలిపోయాడు కుక్కి మంచంమీద.

డాక్టరిచ్చిన మాత్ర తండ్రిచేత మింగించింది రాధ.

రాత్రి జగన్నాధం గారికి తెలివి వచ్చినప్పుడల్లా కొడుకుని తిడుతూనే వున్నాడు....ఆ రాత్రల్లా రాధకు నిద్రలేదు.

* * *

సూర్యోదయమైంది. తొమ్మిది గంటల ప్రాంతంలో నిద్రలేచారు. కాఫీ త్రాగిన తరువాత కొంచెం తేలిగ్గా వున్నారు. గాలికి నీరసంగా కదులుతున్న తెర ఆయనకు సుప్రభాతం పలుకుతోంది. పిల్లల బ్రతుకులకో దారి చూపించాల్సిన బాధ్యతల తెరలా, దాని నీడ ఆయనమీద రెపరెప లాడుతోంది.

"యిది తెగితేనే కానీ నాకు విముక్తిలేదు. ముక్తిలేదు. యేం చేయలేకపోతున్నాను...." ఆయన కన్నీటి తెర కరిగిపోయింది. కొన్ని క్షణాల తర్వాత యింటి గుమ్మం ముందు రిక్షా ఆగినట్లుగా చిరిగిన తెరలో నుండి స్పష్టంగా జగన్నాధంగారికి కన్పించింది. అందులో నుండి రాధ పెద్ద అట్టపెట్టెలతో దిగి, రిక్షావాడిచేత లోపలికి పట్టించుకొని రావటం కన్పించింది. జగన్నాధంగారు ఆశ్చర్యపోయారు.

"యేమిటమ్మా యిది...."

"మందులూ, పళ్ళు నాన్నగారూ. డాక్టరుగారు మీకు కొన్ని నెలలపాటు విశ్రాంతికావాలన్నారు. అందుకని...." మరేం మాట్లాడలేక పోయింది.

"నా కెందుకమ్మా! ఇది మామూలు జ్వరమే కదా. రేపటికో యెల్లుండికో తగ్గదూ. ఏకాదశి నాడు సూరావధాన్లు, సత్యనారాయణ వ్రతం చేయించమన్నాడు." అన్నారు నీరసంగా, దగ్గర బల్లమీద మందులు సర్దుతూ.

"మీ నాన్నగారికి బ్లడ్ కాన్సర్.చాలా అశ్రద్ధ చేస్తారు. బహుశా యెంతోకాలం బ్రతకరు. అయినా ఉపశమనానికి మందులు వాడండి.... ఆయనసలే కదలగూడదు. చాలా జాగ్రత్త డాక్టరు చెప్పిన"—నగ్న సత్యాన్ని రాధలోని మమతల తెరలు చెప్పనివ్వకుండా కప్పేశాయి.

కూతురు చేస్తున్న పని వొక్కొక్కటే ఆయనా అప్పుడే కాఫీ తెచ్చిన తల్లీ చూస్తున్నారు.

గుమ్మానికి, కొన్ని సంవత్సరాలుగా అంటిపెట్టుకుని రక్షణ కల్పించి జీర్ణమైపోయిన తెర గుడ్డను తొలగించింది. లతల డిజైన్లతో అందమైన చక్కని తెర పాత దాని స్థానాన్ని అలంకరింపజేస్తూ, ప్రయత్నపూర్వకంగానే మేడవేపు చూసింది, రాధ.

"యింకా ఈయనగారు నిద్రనుండి లేవనట్లుగా వుంది" అని మనస్సులో వొక చిరునవ్వు తెరను దాచింది, అనుభవం నిజంమీద!

"యింత ఖరీదయిన మందులు,టానిక్కులు, యాపిల్సు, హార్లిక్సు, బోర్నవిటా యివన్నీ కొనడానికి నీకు డబ్బెక్కడిది?...." తెరలు తెరలుగా వస్తున్న జగన్నాధంగారి అనుమానాలూ...

"బియ్యం, పప్పులూ, నెయ్యి, తమ్ముడికి యూనిఫారం, చెల్లెళ్ళకు వోణీలు యివన్నీ కొనడానికి డబ్బెక్కడిదీ...." అని తల్లి గుండెల రగులుకొంటున్న అనుమానాలూ....

యివన్నీ ఆ దంపతుల పెదవుల్ని దాటలేదు. వాళ్ళ దరిద్రం మురికిపట్టిన పీలికలు కావడానికి సిద్ధంగా వున్న పాత తెర గుడ్డను రాధ పెరట్లోకి తీసుకు వెళ్ళిపోతున్న దృశ్యాన్ని మాత్రం చూసాడు నిస్సహాయంగా. □

విధివంచిత

రమాదేవి జాస్తి

తలుపుమీద 'దబదబ' బాదిన చప్పుడైంది.

తల దువ్వుకుంటున్న సంపూర్ణ చేతిలో దువ్వెనతో అలానేవచ్చి తలుపు తీసింది. ఒక్కసారి 'బ్రాందీ' వాసన గుప్పుమంది. వచ్చింది రాఘవకాదు. "ఎవరు కావాలి?" సంపూర్ణముందు వేసుకున్న జడ అల్లుకుంటూ అడిగింది. "ఈ ఇంట్లో ఓ అమ్మాయివుంది. ఆమెకావాలి" అతను బాగా త్రాగివున్నా సవ్యంగానే మాట్లాడుతున్నాడు.

"ఈ ఇంట్లోవుండే అమ్మాయిని నేనొక్కదాన్నే. మా వారు బజారు వెళ్ళారు" అతని వైపు ఆశ్చర్యంగా చూస్తూ జవాబిచ్చింది, సంపూర్ణ.

అతను మరో ఇంటికి వెళ్ళబోయి పొరపాటున ఇటు వచ్చేడేమో అనుకుంది.

"ఈ ఇంట్లో వుండేది "సంపూర్ణ" అని రాఘవ చెప్పేడు. రాఘవకి నేను డబ్బిచ్చేను సంపూర్ణ కోసం" అతను నిర్భయంగా చెప్తున్నాడు.

సంపూర్ణ అవాక్కయింది. ఏమిటితను మాట్లాడేది? అది నిజమా? నిజం కాకపోతే అంత ధైర్యంగా వచ్చి తలుపెందుకు కొడతాడు? చివరికి రాఘవ తననిలా....? ఆ పైన ఆలోచించలేక పోయింది సంపూర్ణ.

కొండ తిరిగి తలమీద పడుతున్నట్లు, రక్తం సలసలా మరిగి ఆవిరైపోతున్నట్లు, తలలోని నరాలన్నీ ఎవరో చేతుల్తో నొక్కేస్తున్నట్లు-ఏవిటి అయిపోతుంది సంపూర్ణకి.

"నేనే సంపూర్ణని. కాని నేనలాంటి దాన్ని కాదు" సంపూర్ణ గొంతు పెగుల్చుకుని హీన స్వరంతో అంది. మరు నిముషం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగేయి. దోసిట్లో ముఖం దాచుకుంది.

"మిమ్మల్ని బలవంతం చెయ్యాల్సిన అవసరం నాకు లేదు. రాఘవ మాటలు నమ్మి ముందుగా డబ్బిచ్చాను. చేతిలో డబ్బుండాలే కాని మీరు కాకపోతే ఇంకొకరు. మిమ్మల్ని బాధపెట్టి నట్లున్నాను సారీ" అతను గబగబ అడుగు లేసుకుంటూ వెళ్ళిపోయేడు.

సంపూర్ణ తలుపులు మూనేసి మంచం మీద వాలిపోయింది. అంతవరకూ బిగబట్టుకున్న దుఃఖం ఉప్పెనలా ముంచుకు వచ్చింది. పెద్ద గండం తప్పిపోయినట్లుంది. ఎక్కడ పుట్టింది తను? ఎలా పెరిగింది? చివరికిలా తన జీవితం చీకటి మెట్ల మీదుగా జారి ఏ అగాధంలోకి పడబోతోంది? భయంతో సంపూర్ణ గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయ్. నీళ్ళు నిండిన కళ్ళకు భవిష్యత్తు అంధకారంగా, అగమ్యగోచరంగా కన్పిస్తోంది.

సంపూర్ణ కళ్ళుమూసుకుంది. రాలిన ముత్యాల్లా టపటపమంటూ చేతిమీద పడినయ్ కన్నీళ్ళు. తన జీవితమిలా కావటానికి కారకులు ఎవరు? తనా? సుదర్శనమా? రాఘవా? లేక భగవంతుడా?

సంపూర్ణ ఆలోచిస్తోంది.

* * *

★ గదిలో పెట్టి తలుపులుమూసి కర్ర పట్టుకొని దండించబోతే పిల్లి అయినా పులిలా మీద బడుతుందంటారు. మరి మనుషులు మాత్రం ఎందు కూరుకొంటారు. కడుపు మండినప్పుడు ఎవరైనా అంతే! ఎక్కడలేని బలం వచ్చేస్తుంది వారికి! ★

ఎస్. ఎస్. సి పాసైన సంపూర్ణని కాలేజీలో చేర్పించటానికి తండ్రి రామ్మూర్తి చాలా ఆలోచించేడు, ఇంకా చదివిస్తే ఇంకా ఎక్కువ చదివిన వాడిని తేవల్సి వస్తుంది, తన శక్తికి మించిన పని అవుతుందేమో నని. కాని సంపూర్ణ వినలేదు. పట్టుపట్టి ఇంటర్‌లో చేరింది. రామ్మూర్తిది మధ్య తరగతి సంసారం. సంపూర్ణ తర్వాత మరో ఆడపిల్ల, మగపిల్లవాడూ వున్నారు.

సంపూర్ణ ఇంటర్ సెకండియర్‌లోకి ప్రవేశించాక పెళ్ళి సంబంధం వచ్చింది. పనిమీద ఆ వూరు వచ్చిన సుదర్శనం కాలేజీనుండి వెళ్తున్న సంపూర్ణని చూసి ఆ తర్వాత వివరాలు తెల్సుకుని ఆ అమ్మాయిని తప్ప మరెవర్నీ చేసుకోనని మొండికెత్తేడు. దానితో సుదర్శనం తండ్రి స్వయంగా వచ్చి అడిగేడు రామ్మూర్తిని.

సుదర్శనం ఎమ్. టెక్ పాసై వెయ్యి రూపాయల జీతం సంపాదిస్తున్నాడు. తండ్రి కూడా పేరున్న కంపెనీలో జనరల్ మేనేజర్. బాగా కలిగిన కుటుంబం.

రామ్మూర్తికి, అతని భార్యకి కలయో? వైష్ణవమాయో? అన్పించింది. మామూలుగా నైతే యాభై వేలు పోసినా అంత గొప్ప సంబంధం సంపూర్ణకు తాము తీసుకు రాలేరు. అదృష్టం సంపూర్ణను వెతుక్కుంటూ వచ్చి తలుపు తడుతోంది, ఉబ్బి తబ్బిబ్బయిపోయేరు. సంపూర్ణ మొదట్లో 'పెళ్ళివద్దు. చదువు కుంటాను. అని మొరాయించినా సుదర్శనం ఫోటో చూసేక మళ్ళీ మాట్లాడలేదు. అందము ఐశ్వర్యం, చదువు అన్నీ వున్న సుదర్శనం తనని కోరి పెళ్ళాడటం సంపూర్ణకి వింతగాను, గర్వంగాను అన్పించింది.

శ్రావణ మాసంలో సంపూర్ణ పెళ్ళి జరిగిపోయింది. తననేమీ కట్నం అడగలేదని రామ్మూర్తి శక్తికి మించి ఖర్చుపెట్టి వైభవంగా వియ్యంకుడి తాహతుకి తగినట్లుగానే చేసేడు పెళ్ళి. అప్పు అయినా అతడికి బాధ న్పించలేదు. వచ్చిన వాళ్ళంతా చక్కని జోడీ, అని మెచ్చుకున్నారు. సాటి ఆడపిల్లలు సంపూర్ణ అదృష్టానికి ఈర్ష్యపడ్డారు.

సుదర్శనం పెళ్ళయిన వెంటనే సంపూర్ణని తీసుకెళ్ళి పోతాననలేదు. ఇంటర్ పూర్తి చేయించమన్నాడు. పరీక్షలయ్యే వరకూ 'శోభనం' వాయిదాపడింది అతని కోరికమీదే.


సంపూర్ణ మళ్ళీ కాలేజీకి వెళ్ళటం ప్రారంభించింది కాని మునుపటిలా దృష్టి చదువు మీదకు పోవటంలేదు. ఫ్రెండ్స్ వేసే చిలిపి ప్రశ్నలూ, చేసే వేళాకోళాలు సంపూర్ణకి సిగ్గు కలిగించేవి, ప్రేమఘట్టాలు పుస్తకాల్లో చదువుతున్నా, సినిమాల్లో చూస్తున్నా సంపూర్ణకి సుదర్శనమే గుర్తుకొచ్చేవాడు. తామిద్దర్నీ అలా వూహించుకుని కలల్లో తేలిపోయేది. ఇంకా చదివి తను ఉద్యోగాలు చెయ్యాలా? ఊళ్లు ఏలాలా? పుస్తకంలో భర్త ఫోటో పెట్టుకుని గంటలు తరబడీ చూస్తూ కూర్చునేది.

ఎలాగైతేనేం రోజులు సంవత్సరాల్లా గడిచి ఆ పరీక్షలు కాస్తా అయిపోయినయ్. సంపూర్ణ హాయిగా నిట్టూర్చింది. రామ్మూర్తి అల్లుడిని పంపమని వియ్యంకుడికి ఉత్తరం వ్రాసేడు. తిరుగు టపాలో సుదర్శమే వచ్చేడు.

సంపూర్ణ ఎదురు చూసిన ఘడియ రానే వచ్చింది. సుదర్శనం కోరికమీద చాలా సింపుల్‌గా జరిగేయి ఏర్పాట్లు.

తెల్లని జరీచీరతో, తలనిండా మల్లెపూలతో, చేతిలో పాల గ్లాసుతో, మోయలేని సిగ్గు బరువుతో సన్నజాజి మొగ్గలా గదిలోకి అడుగు పెట్టిన సంపూర్ణకి టేబులో దగ్గర దీక్షగా చదువుకుంటున్న సుదర్శనం కన్పించేడు. సైడ్ పోజ్‌లో అతని ముఖం చక్కగా తీర్చి దిద్దినట్లు కన్పిస్తోంది. సంపూర్ణ గదిలోకి వచ్చింది గమనించలేతను.

అయిదు నిముషాలు చూసి అతను తల త్రిప్పక పోవటంతో నెమ్మదిగా అతని ప్రక్కకు వెళ్ళి పాలగ్లాసు టేబుల్ మీదపెట్టింది. 'గుప్పు' మన్న మల్లెల వాసనకి సుదర్శనం తలెత్తేడు. తలొంచుకుని నిలబడివున్న సంపూర్ణ కన్పించింది. పాలగ్లాసు తీసుకుని ఖాళీచేసి టేబుల్



మీద పెట్టూ "నువ్వు వెళ్ళిపడుకో సంపూర్ణా. నేను కాస్సేపు చదువుకోవాలి" అన్నాడు సుదర్శనం.

ఎంతో కాలం నుండీ సంసారం చేస్తూన్న వాడిలా అన్న అతని మాటలు విని సంపూర్ణకి బిందెడు చన్నీళ్లు నెత్తిమీద దిమ్మరించినట్లు అన్పించింది. తనూహించుకున్న దానికీ వాస్తవానికీ పొత్తు కుదరక తీవ్రమైన ఆశాభంగం కలిగింది సంపూర్ణకి. మౌనంగా వెళ్లి మంచం మీద ఓ చివరగా గోడవైపు తిరిగి పడుకుంది. కళ్లు మూసుకున్నా చెవులు మాత్రం సుదర్శనం అడుగుల సవ్వడికోసం ఎదురు చూస్తున్నాయ్, ఆశగా.

సంపూర్ణ పన్నెండు గంటలవరకూ మెలకువగానేవుంది: సుదర్శనం గదిలో మరోప్రాణి లేనట్లు నిశ్చలంగా చదువుకుంటుంటే ఒళ్ళు మండిపోయింది సంపూర్ణకి. వెళ్లి చేతిలో పుస్తకం లాగేసి, లైటు తీసేద్దామా? అన్పించింది కాని క్రొత్తబిడియం ఆ కోరికకు కళ్లెం వేసేయి.

ఆలోచనలోనే సంపూర్ణ నిద్రలోకి జారిపోయింది. సుదర్శనం ఎప్పుడు వచ్చి పడుకుందీ తెలియదు. ప్రొద్దున్న నిద్రలేచేసరికి మంచానికి రెండో వైపున నిద్రపోతున్న సుదర్శనం కన్పించేడు. అందమైన అతని ముఖం చూస్తూ నిలబడి పోయింది సంపూర్ణ. మన

సంతా గర్వంతో నిండిపోయింది, "ఈ వ్యక్తి నా భర్త" అనుకుంటుంటే గబుక్కున వంగి అతని నుదుట సుతారంగా పెదవు లాన్చింది.

నలగని మల్లెలు నిరర్థకంగా వాడిపోయినయ్. నలగని సంపూర్ణ గదిలోకి ఎలా వచ్చిందో అలానే 'సన్నజాజి మొగ్గ' లాగానే వెళ్ళిపోయింది నిరుత్సాహంతో, గదిలో నుండి.

మర్నాడే సుదర్శనం సెలవు లేదని వెళ్ళిపోయేడు. ఆ తర్వాత మంచి రోజు చూసి రామ్మూర్తి కూతురికి సారెతో అత్తవారింటికి పంపేడు.

మొదటి ఆశాభంగాన్ని మనసులో నుండి చెరిపేసుకునికోటి ఆశల్తో; కోర్కెల్తో అత్తింట అడుగు పెట్టింది సంపూర్ణ.

* * *

లంకంత మేడలో ఎవరి రూమ్స్ వాళ్ళకే వున్నాయ్. సంపూర్ణ ఏ పనీ చెయ్యనవసరం లేదు. వంటకి ఒక మనిషి, బజారు పన్లకో నౌకరు, పాచి పన్లకో పనిమనిషీ వున్నారు. కాలు కదిపితే కందిపోతుందేమో నన్నంత అపురూపంగా చూసుకుంటున్నారు సంపూర్ణని, అత్త మామలు. సంపూర్ణ ఒక్కగానొక్క ఆడపడుచు శైలజ నాలుగేళ్ళ క్రితమే అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఒక్క మరిదీ గుల్బర్గాలో మెడిసిన్ చదువుతున్నాడు. ఏ ఆంక్షలూ లేవు. ఏ లోటూ లేదు సంపూర్ణకి. పగలంతా సంపూర్ణతో బాగానే వుంటాడు సుదర్శనం. సినిమాలకీ షికార్లకీ తీసుకెళ్తాడు. కంటికి నచ్చిన చీరల్లా కొనుక్కొస్తాడు. సుదర్శనం కంపెనీకి వెళ్ళిపోయినా బుక్స్‌తో బాగానే కాలక్షేపం అవుతుంది సంపూర్ణకి సుదర్శనానికి మంచి లైబ్రరీ వుంది. అన్నీవున్నా సంపూర్ణ మనసులో వెలితి వెలితిగానే వుండిపోయింది.

రాత్రిపూట సుదర్శనం చదువుకుంటూ కూర్చోవటం, సంపూర్ణ ఆలోచనల్లోనే నిద్రలోకి జారిపోవటం, ఏ అర్ధరాత్రికో సుదర్శనం మంచం రెండో చివర్నచేరి నిద్రపోవటం.... మార్పులేని కార్యక్రమంగా మారిపోయింది. అతను తనకెందుకని సన్నిహితంగా రాలేకపోతున్నాడో సంపూర్ణ కర్థం కావటం లేదు-పోనీ పెళ్లికి ముందే ఎవరికైనా మనసిచ్చాడా అంటే అతనే తనని కోరి పెళ్ళిచేసుకున్నాడు. ఇంక అనుమానించేందుకు ఆస్కారమేదీ?

సంపూర్ణకి చీకటి రాత్రులు వెన్నెల రాత్రులు అన్నీ ఒకే రకంగా గడిచిపోతున్నాయ్ చీకటిగా. ఎన్నాళ్ళిలా యాంత్రికంగా జీవితం గడపటం? పగలంతా సరదాగా వుండే సుదర్శనం రాత్రయ్యేసరికి ఎందుకంత ముభావంగా మారిపోతాడు? ఎవరితో చెప్పుకోవాలి తను? అసలేమని చెప్పాలి? తనలో తను సతమతమైపోసాగింది సంపూర్ణ.

పసిపాపల్ని చూస్తే సంపూర్ణకి తనకీ అలాంటి పాపాయి కావాలని మనసు కొట్టుకుపోయేది. కానీ అదీ జన్మలో సాధ్యం కాదేమో' అనుకునేది నీరసంగా. ఇంతవరకూ భర్త స్పర్శే ఎరుగని తను తల్లి కావాలంటే పురాణాల్లో మాదిరి ఏ మంత్రశక్తివల్లో సాధ్యం కావాలి. లేకుంటే ఏ దేవుడో ప్రత్యక్షమై భర్త మనసు మార్చేయాలి అనుకుని సంపూర్ణ నిట్టూర్చేది.

కాపురానికి వచ్చిన ఆర్నెల్ల తర్వాత సుదర్శనం వాళ్ళ కంపెనీ డైరెక్టర్‌గారి బర్త్‌డే పార్టీకి సంపూర్ణని వెంటపెట్టుకుని వెళ్ళేడు. కుంకుమపువ్వు రంగు పట్టుచీర; మాచింగ్ జాకెట్ వేసుకుంది సంపూర్ణ. రెండు వరసలున్న పొడవైన ముత్యాలదండ వేసుకుని, చెవులకి ముత్యాల జుంకీలు పెట్టుకుంది. పొడవైన జుట్టు వదులుగా అల్లుకుని సైడ్‌గా రెండు తెల్ల గులాబీలు పెట్టుకుంది. అప్పి సుదర్శనం పెలశనే.

పార్టీలో అందరి కళ్ళూ సంపూర్ణమీదే వుండటం గమనించి గర్వంగా నవ్వుకున్నాడు సుదర్శనం. సంపూర్ణకి మాత్రం ఇలాంటి పార్టీలు అలవాటు లేకపోవటంతో బిడియంగా తలొంచుకుని కూర్చుంది. ఎవరో పిలవటంతో సుదర్శనం మరోవైపు వెళ్ళేడు. సంపూర్ణ ఒక్కతే కూల్‌డ్రింక్ 'సిప్' చేస్తూ కూర్చుంది. కొంచెం వెనకగా తమ గురించి

(వి) చిత్ర విజ్ఞానం



ఐసాక్ అసిమోవ్ మహా రచయిత. ఇప్పుడాయన వయస్సు 52 సంవత్సరాలు. విజ్ఞాన గణితశాస్త్రాలకు సంబంధించిన విషయాలమీద 188 గ్రంథాలూ, వెయ్యికి పైచిలుకు వ్యాసాలూ రాశాడు. విజ్ఞాన రంగంలో పలువురు అడిగే ప్రతి సందేహానికి స్వయంగా సమాధానాలు రాసి పంపుతాడు. వారానికి 70 ఉత్తరాలకు పైబడిన వాటికి బదుళ్లు రాస్తాడు. అమెరికాలోకి ప్రముఖ ఖగోళ శాస్త్రజ్ఞుడు కారల్ సాగన్, "మన అఖండ విజ్ఞాన ప్రగతిని సామాన్య మానవుడికి అర్థమయ్యే తీరులో చెప్పే శక్తి ఒక్క అసిమోవ్‌కే వుంది" అని పేర్కొన్నాడు.

నెమ్మదిగా అనుకుంటున్న మాటలు సంపూర్ణ చెవులో పడి కుతూహలంగా వినసాగింది.

"సుదర్శనం భార్య బంగారు బొమ్మలా వుంది కదూ?"

ఒక కంఠం మెచ్చుకుంటోంది.

"ఎంత అందం వుండీ యేం ప్రయోజనం? అది అడవిన కాసిన వెన్నెల అయినపుడు" మరో గొంతు సానుభూతిగా అంది.

"అదేం?" మొదటిగొంతులో ఆశ్చర్యం.

"అంత అందమూ అనుభవించే సామర్థ్యం సుదర్శనానికి లేదు. పాపమతను దాంపత్య జీవితానికి అనర్హుడు. అందుకనే పేదింటి పిల్లను చేసుకున్నాడు కావాలని" రెండవ గొంతు చెప్తోంది.

"నీకెలా తెలుసు?" మొదటి వ్యక్తి ఆసక్తిగా అడుగుతున్నాడు.

"సుదర్శనం నా దగ్గరే ట్రీట్‌మెంట్ తీసుకునేది. మెడిసిన్స్ వాడితే ఉపయోగముంటుందేమోనని అతని ఆశ?"

సంపూర్ణకి తర్వాత మాటలు విన్పించలేదు. మెదడు మొద్దుబారిపోయింది. తల తిరుగుతున్నట్లు, ఆకాశం కూలి తన నెత్తిమీదే పడిపోతున్నట్లు అన్పించింది. ఎంత మోసం? ఎంత వంచన? స్వాధీనం తప్పిపోతున్న మనసుని బలవంతాన అదుపులోకి తెచ్చుకుని నెమ్మదిగా లేచి ఎవరితోనూ చెప్పకుండా రిక్షా మీద ఇంటికి వచ్చేసింది సంపూర్ణ. ఇంటికొచ్చాక మేడమీద గదిలోకెళ్ళి మంచంమీద వాలిపోయి అంతవరకూ అదిమిపట్టిన దుఃఖానికి ఒక్కసారిగా కళ్లెం వదిలేసింది సంపూర్ణ.

అరగంట తర్వాత క్రింద హాల్లో 'సంపూర్ణ వచ్చిందా?' అని అదుర్దాగా అడుగుతున్న సుదర్శనం గొంతు విని లేచి బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది సంపూర్ణ.

అయిదు నిముషాల తర్వాత పైకి వచ్చిన సుదర్శనానికి మామూలుగానే కన్పించింది సంపూర్ణ.

"చెప్పకుండా వచ్చేసావేం సంపూర్ణా?" సుదర్శనం ఆప్యాయంగా అడిగేడు.

"ఒంట్లో బాగోలేదు" ముభావంగా అనేసి మరోవైపు పడుకుంది సంపూర్ణ.

"పోనీలే. హాయిగా రెస్టు తీసుకో. చెప్ప

మినీ కథ

చల్తే-చల్తే

ఆనంద్‌భవన్‌లో కాఫీతాగి బయటకివచ్చాను.

"హలో సురేష్...."మారుతిరావు పిలుపుకు పక్కకిపోడి కొనుక్కొని, తింటూ, "ఈపాటికి విజయ వచ్చే వుంటుంది ఆఫీసునుండి" అని అనుకుంటూ కదలబోతున్న నేను ఆగిపోయాను.

"బొత్తిగా నల్లపూసవై పోయావ్...." అంటూ నవ్వి "మా చెల్లాయి కదలనీయదేమిట్రా?" అన్నాడు.

నేను చిన్నగా నవ్వాను. పెళ్ళయిన కొత్తలో ప్రతివాడు ఎదుటివాడి ఈ ప్రశ్నకు చిరునవ్వు సమాధానంగా చెబుతాడేమో! కారణం.... నిజంగా ఆ వచ్చిన కొత్తావిడ, ఇంట్లోంచి నిజంగా కదలనీయకకాదు. మగవాడు చేసే ప్రతీదానికి పరోక్షంగా బాధ్యత వహిస్తున్నందుకు సంతోషంగా, ఎదుటవాడు ఆ కారణం తప్ప మరోటి ఊహించలేని తత్వానికి, వాళ్ళ ఆలోచనా పరిధి అంతకుమించి లేనందుకు జాలిగా....

నా నవ్వు గురించి వాడు అడిగేలోగానే దూరంగా స్కూటర్ వెనుక కూర్చుని, వెడు

కుండా వచ్చేసరికి కాస్త ఆదుర్దాపడ్డాను." సుదర్శనం గదిలోనుండి వెళ్ళిపోయేడు.

ఎంత నటన? కసిగా పళ్ళ కొరుక్కుంది పూర్ణ. ఈ నిజం తనతో చెప్పేస్తే అతని సొమ్మేంపోయింది? ఈరోజు పార్టీకి వెళ్ళబట్టి అగ్నిజ్వాలలాంటి ఆ నిజం తెలిసి తనని నిలువునా దహించివేస్తోంది. ఇంక తనే పాపాయి కోసమూ కలలు కనక్కరలేదు. ఏ మధురమైన రాత్రులకోసమూ ఎదురుచూడనక్కర్లేదు. తనను వరించింది 'అదృష్టం' కాదు. అదృష్టపు మేలిముసుగుతో వచ్చిన దురదృష్ట దేవత. తను అమాయకంగా తలుపులు తెరిచి ఆమె నాహ్వానించింది. అంతా కలిపి పద్దెనిమిదేళ్ళ వయసు తనకి. ఎలా గడపటం మిగిలిన జీవితమంతా మోడులాగ? గడ్డిపువ్వు సైతం తుమ్మెద ప్రేమకు నోచుకుంటుందే? తన బ్రతుకు అంతకన్నా హీనమైపోయిందేం? తనకి, షోకేస్‌లోని బొమ్మకి తేడా ఏముంది?

రోజులు గడుస్తున్నకొద్దీ సంపూర్ణలో అన్నింటిమీదా ఆసక్తి చచ్చిపోతోంది. తల దువ్వుకోవాలన్పించదు. చీర మార్చుకోవాలన్పించదు. ఓ విధమైన నిర్లిప్తత. ఏ మార్పూ లేని జీవితంమీద నానాటికీ విసుగు పుడుతోంది. కనీస మానవుడికి వుండే ఎంతో మామూలు కష్టసుఖాలకుకూడ నోచుకోనిది తనదేం బ్రతుకు? వెన్నెల రాత్రులు, మల్లెల ఘుమఘుమలు, పురిటి నొప్పులు, పాపాయి బోసి నవ్వులు—ఇవన్నీ తన కందనంత ఎత్తులో వున్నయ్. మరబొమ్మలా మారిపోతోంది సంపూర్ణ.

సంపూర్ణలో మార్పు సుదర్శనానికి అర్థమౌతూనే వుంది. కాని తనేం చెయ్యగలడు? సంపూర్ణలోని స్తబ్దతకి కూడ కారణం తెలుస్తూనే వుంది. ఇంటర్ పాసైన సంపూర్ణని బి. ఏ. కి కట్టమని ప్రోత్సహించేడు. మళ్ళీ కాలేజీలో చేరేందుకు సంపూర్ణ ఇష్టపడలేదు. ఇంటి దగ్గరే ప్రైవేట్‌గా కట్టింది. సుదర్శనం ట్యూషన్ పెట్టించేడు.

బి.ఏ.పాసై నాలుగేళ్ళ నుండీ ఖాళీగా తిరుగుతున్న రాఘవ సంతోషంగా ఒప్పుకున్నాడు సంపూర్ణకి ట్యూషన్ చెప్పేందుకు. రాఘవ అన్నయ్య నరసింహం సుదర్శనం కంపెనీలోనే పనిచేస్తున్నాడు. అతని ద్వారానే తెలిసినది సుదర్శనానికి రాఘవ గురించి. వెంటనే సంపూర్ణకి ట్యూషన్ చెప్పేందుకు ఒప్పించేడు రాఘవని.

రోజూ ఇంటికి వచ్చి సంపూర్ణకి పాఠాలు చెప్పటం ప్రారంభించేడు రాఘవ.

* * *

రాఘవ నలుపైనా ఎత్తుగా, బలంగా ఆకర్ష

తున్న రమేష్ స్కూటర్‌ను ఆపించి, ఆ స్కూటర్‌వాలా కేదో చెప్పి మా వైపు రావడంతో, మా సంభాషణ మరో దారి పట్టింది.

సాహిత్యం అన్నా, సభలన్నా, చర్చలన్నా మాకు కాలం తెలీకుండా పరుగెత్తుతుంది. ఇప్పుడు అంతే అయింది.

దాదాపు ఆనంద్ భవన్‌నుండి స్టేషన్ చేరుకుని అలా ఎంతసేపు హస్కులో పడిపోయామో కాని, గడియారం ఏడుగంటలు చూపెట్టటంతో—

"నే వెళ్తారా....ఏడు దాటింది. మీ చెల్లాయి ఎదురుచూస్తుంటుంది" అన్నాను. విజయ పేరు వినగానే—

మారుతిరావు, కొరడా దెబ్బ తిన్నవాడిలా "అమ్మాయ్"అంటూ కొలికేక పెట్టి,"షాపింగ్ కని నేను మీ చెల్లాయి వచ్చాంరా! హోటల్‌లో టిఫెన్‌చేసి బిల్లు చెల్లించాలని నేను ముందుగా లేచాను. ఆమె చేతులు కడుక్కొని వెనకే వస్తుందని నిలబడ్డ నేను. నువ్వు కనిపించే సరికి.... అంతే.... మాటల్లో పడి....మీతో.... తను ఒక్కతి....బాప్‌రే...." అంటూ పదడుగులు పరుగులాంటి నడకతో వేసి, ఆటోను కేకేసాడు మారుతిరావు.

రచన:

దేవరకొండ (ఆలేటి) నాగమణి

ణీయంగానే వుంటాడు చూసేందుకు. బి. ఏ. మామూలుగా పాసయ్యేడు. అతనికి చదువులో కన్నా మిగిలిన విషయాల్లో ఆసక్తి, తెలివి తేటలూ ఎక్కువ. అందమూ; ఐశ్వర్యమూ, చక్కని భర్తనీ కలిగివున్న సంపూర్ణ ఎందుకంత ఉదాసీనంగా వుంటుందో రాఘవకి అర్థం కాలేదు. మొత్తానికి సంపూర్ణ సంసార జీవితంలో ఏదో 'మిస్టరీ' వుందని మాత్రం గ్రహించ గలిగేడు.

మొదట చదువుకన్నా సంపూర్ణలో చైతన్యం కలిగించటం ముఖ్యంగా కన్పించింది రాఘవకి. పాఠాలు పావు గంట, కబుర్లు గంటన్నర చెప్పటం ప్రారంభించేడు. రాఘవ జోక్స్‌కి నవ్వకుండా వుండటం సంపూర్ణకి సాధ్యమయ్యేది కాదు. పుస్తకాలందించే టప్పుడు యధాలాపంగా తగిలే రాఘవ చేతులు, టేబుల్ క్రిందగా పొరపాటున అన్నట్లు తాకే రాఘవ పాదాలు సంపూర్ణలో తెలియని వూహల్ని తట్టి లేపుతుండేవి. తనకి తెలియకుండానే రాఘవ పట్ల ఆకర్షింప బడసాగింది సంపూర్ణ మనసు.

రోజూ సాయంత్రం ట్యూషన్ టైమ్‌కి చక్కగా ముస్తాబై రాఘవ కోసం ఎదురు చూస్తుండేది సంపూర్ణ. ఆమెలో ఈ మార్పుని తేలిగ్గానే అర్థం చేసుకున్నాడు రాఘవ.

ఓ రోజు సాయంత్రం సుదర్శనం కంపెనీ పనిమీద ప్రక్కవూరు వెళ్లేడు. సంపూర్ణ అత్త మామలు ఎవరో స్వామివారి ఉపన్యాసాలు వినేందుకు వెళ్ళేరు. పనివాళ్ళెవరూ పిలవందే పైకిరారు. ఆ సమయాన్ని చక్కగా వినియోగించుకున్నాడు రాఘవ. ఎదురు తిరుగుతున్న సంపూర్ణ మనసుని నిద్రలేచిన వయసు జోకొట్టేసింది. ఎక్కువ ప్రతిఘటించకుండానే లొంగిపోయింది సంపూర్ణ.

రాఘవ వెళ్ళిపోయాక సంపూర్ణ చాలా బాధపడింది—తను చేసిన పనికి కాదు, తను ఇంతకాలం ఎంత అమూల్యమైన అనుభవాల్ని పోగొట్టుకుందో తల్చుకుని. సృష్టిలో ఇంత మాధుర్యాన్ని నింపికూడ తనకి అందనివ్వని భగవంతుడిని తిట్టుకుంది మొదటిసారిగా. తను చేసింది తప్పనిపించలేదు సంపూర్ణకి. సుదర్శనంనుండి తాను పొందలేనిదాన్ని రాఘవ నుండి పొందుతోంది. తప్పేముంది? అనుకుంది సంపూర్ణ.

ఆ తర్వాత తిరిగి రాఘవతో ఏకాంతం లభించలేదు సంపూర్ణకి. మళ్ళీ అనుభవం కోసం తహతహలాడ సాగింది ఆమె మనసు. మనిషి రక్తం రుచి మరిగిన పులిలా వుంది, సంపూర్ణ స్థితి. ఎంతెంత తపస్సులు చేసినా మహర్షులు సైతం ఆడది కనపడితే ఎందుకు లొంగిపోయేవారో ఇప్పుడర్థమౌతోంది సంపూ

ర్ణకి. అసలు రుచంటూ తెలీకపోతే ఏ బాధా వుండదు కాని ఒకసారి చవిచూసాక ఆ అనుభవాన్ని ఎలా మర్చిపోవటం? సంపూర్ణ సతమతమై పోసాగింది.

సంపూర్ణ తహతహ రాఘవ గమనిస్తూనే వున్నాడు. రోజూ ఏకాంతం దొరికేట్లయితే సంపూర్ణ తనకోసం ఇంతగా ఆరాటపడేది కాదు. వియోగం విరహాన్ని పెంచుతోంది. బంగారు పిచ్చుకలాంటి సంపూర్ణ తనకింత తేల్గ్గా దొరకటం రాఘవకి చాలా సంతోషం కలిగించింది. దాంపత్య జీవితంలో భర్తవల్ల సంపూర్ణ సంతృప్తి పొందలేక పోతోందనుకున్నాడు రాఘవ. కాని సంపూర్ణ అసలు అనాఘ్రాతపుష్ప మన్న విషయం వూహించలేకపోయేడతను.

సంపూర్ణ ఒంటిమీద బోలెడు నగలున్నాయ్. సంపూర్ణని తనతో తీసుకునిపోతే? ఆ నగలన్నీ కరిగేలోగా తనకి ఉద్యోగం రాకపోతుందా? తను రమ్మంటే సముద్రంలోకైనా కళ్లుమూసుకుని వచ్చేసేలావుంది సంపూర్ణ. రాఘవ బుర్ర చురుగ్గా పనిచెయ్య సాగింది.

రాఘవ నమ్మకం నిజమే అయింది. అడగ్గానే కళ్ళు మూసుకుని ఒప్పుకుంది సంపూర్ణ. సంపూర్ణకు క్షణంలో తల్లీ, తండ్రి, అత్త మామలు, సుదర్శనం—వారి ప్రేమ. తన అంతస్థు ఐశ్వర్యం — ఇవేమీ గుర్తుకు రాలేదు. ఒక్క రాఘవే కన్పించేడు లోకమంతా. అతనితో తను పంచుకోబోయే స్వర్గం లాంటి భవిషత్తుమీదే వుంది చూపంతా. అది ప్రేమా? ఏమో? సంపూర్ణకే తెలీదు.

అర్ధరాత్రివేళ సుదర్శనానికి మెలకువ రాకుండా నెమ్మదిగా లేచి సూట్‌కేస్ తెరచి తను సర్దినవన్నీ సరిగా వున్నయ్యో లేదో చూసుకుని తాళంవేసి ఇటు తిరిగిచూస్తూనే స్తంభించిపోయింది సంపూర్ణ. అడుగుపడలేదు.

సుదర్శనం కుర్చీలో కూర్చుని సిగరెట్ త్రాగుతున్నాడు.

"నీకు కావల్సినవి ఇంకేమైనా వుంటే తీసుకో సంపూర్ణా?" అతని మాటల్లో కోపం లేదు.

సంపూర్ణ పట్టుబడిన దొంగలా తలవంచుకుంది. సుదర్శనంలో ఆ ఒక్క లోపమూ తప్ప మరేమీ లేదు. కాని ఎన్ని వున్నా ఏం లాభం? అసలు స్త్రీ కోరుకునేది లేనపుడు? తనేమైనా యోగినా-కోరికల్ని చంపుకునేందుకు? రక్తమాంసాలున్న మనిషి. ఉప్పూ కారం తినే శరీరం. తనకేం ఖర్మ-జీవచ్ఛవంలా పడివుండటానికి? సంపూర్ణకి ధైర్యం వచ్చింది.


"నాకు తెలుసు సంపూర్ణా, ఇలాంటి రోజు ఒకటి వస్తుందని. కాని ఇంత త్వరగా వస్తుందనుకోలేదు, అంతే. నీ క్రొత్తజీవితం సుఖంగా సాగాలని కోరుకుంటున్నాను" సుదర్శనమే అన్నాడు. అతడి గొంతులో ఆవేదన తొంగి చూసింది.

సంపూర్ణ అలానే నిలబడింది బొమ్మలా.

"ఒక్కమాటిస్తున్నాను సంపూర్ణా. మరో స్త్రీకి నీలా వెళ్ళిపోయే పరిస్థితి రానివ్వను. నా జీవితంలో నువ్వే మొదటిదానివి, ఆఖరిదానివీ కూడ. పరువుకోసమని, నాకూ ఓ భార్య వుందని నలుగురిలో చెప్పుకోవటం కోసమని నీ మెడలో తాళికట్టేను. కాని తర్వాత తెలిసి వచ్చింది నాకు-నేను చేసిందెంత పొరపాటు పనో. హృదయముంటే నన్ను క్షమించు" సుదర్శనం పశ్చాత్తాపంతో అన్నాడు.

సంపూర్ణకి అదంతా మంచితనం అనిపించలేదు. చేతగానితనం క్రింద కనిపించింది. కొంచెం జాలి కలిగింది అతనిమీద. మరొకరైతే చేతిలో సూట్‌కేస్ లాక్కుని, ఆ చెంపా ఈ చెంపా వాయించి, కాళ్ళు చేతులు కట్టేసి ఓ మూల పారేసేవారు. ఏమో మరొకరైతే అసలిలా చెయ్యవలసిన అవసరమే వచ్చేదే కాదేమో? అయినా ఏ ధైర్యంతో సుదర్శనం తన నాపగలడు?తను ఎందుకని వెళ్లిపోతోందో అతడికి తెలియకపోతే గదా?

"మీ ఔదార్యానికి నా కృతజ్ఞతలు: దీనికి ప్రతిగా నేను మీకేం చెయ్యగలను? ఒక్క హామీ యివ్వగలను. ఎలాంటి పరిస్థితుల్లోను మీ రహస్యం నానుండిబయటకు పోనివ్వను. "ఏ పరువు కోసమని మీరీ పెళ్ళి చేసు



కున్నారో ఆ పరువుని నా వెంటపెట్టుకుని పోతున్నాను. క్షమించండి' తలొంచుకుని ఎలానో ఈ నాలుగు మాటలూ అనేసింది సంపూర్ణ.

"నీకు భవిష్యత్తులో నా వల్ల ఏ సహాయం అవసరమైనానిస్సంకోచంగా అడుగుసంపూర్ణా. నాకు చేతనైనంతవరకూ చేస్తాను" సుదర్శనం లేచి బీరువాలోనుండి డబ్బుతీసి సంపూర్ణ పర్స్‌లో వుంచేడు.

మరొక్క నిముషమాగితే ఆ మంచితనం ముందు తను లొంగిపోతానేమో నని భయం వేసింది సంపూర్ణకి. కృతజ్ఞతా పూర్వకంగా అతని వైపుచూసి బయటకు నడిచింది సంపూర్ణ.

సంపూర్ణ ఇల్లుదాటింది. సుదర్శనం జీవితం నుండి, ఆ ఇంటినుండి శాశ్వతంగా నిష్క్రమించింది. స్టేషన్‌లో రాఘవ తనకోసమే ఎదురుచూస్తుండటం కన్పించి పొంగిపోయింది. సంపూర్ణ కళ్ళలో కోటికాంతులు విరిసేయి. అతనితో తను కోరుకున్న క్రొత్త జీవితం కోసం, కొత్త మనసుతో, క్రొత్త కోర్కెల్తో నమ్మకంతో ధైర్యంతో రాఘవ చేయందుకుని రైలెక్కింది సంపూర్ణ.

* * *

రాఘవ, సంపూర్ణల జీవితం సాదాగా ప్రారంభమైంది. మామూలు జీవితం రాఘవకి అలవాటే. నిజం చెప్పాలంటే పూర్వం కన్నా అతనికి ఇప్పుడే బాగుంది. సంపూర్ణ తెచ్చిన డబ్బు చేతినిండావుంది. ఇంకా నగలున్నాయ్. సంపూర్ణకి కూడ ఈ జీవితం హాయిగానేవుంది. ఐశ్వర్యం లేకపోయినా పుట్టింట్లోను అదే మోస్తరు జీవితం గడిపింది తను. మధ్యలో వచ్చిన ఐశ్వర్యం కలలా కరిగిపోయింది. కాదు తను చెరిపేసుకుంది.

రెండు నెలలు సుఖంగా గడిచిపోయాయి. డబ్బు అయిపో వస్తున్నా నగలు ధైర్యాన్నిస్తున్నాయ్. రాఘవ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. కనీసం సెకండ్ క్లాస్ అయినా లేని బి. ఏ. డిగ్రీకి ఉద్యోగం ఎవరిస్తారు? ఆర్థిక సమస్యకన్నా ముందు సంపూర్ణకి మరొక క్రొత్త సమస్య వచ్చిపడింది.

రాఘవ ధోరణి వింతగా మారింది. పడక చేరిన సంపూర్ణని ప్రశ్నల్తో వేధించేవాడు, పడకమీద సుదర్శనం ఎలా ప్రవర్తించేవాడు? మొరటుగానా? లేక సున్నితంగానా? ఎక్కడెక్కడ ముట్టుకునేవాడు? ఎలా ముట్టుకునేవాడు? ఏం చేసేవాడు? సంపూర్ణ గుండెల

మీద చేతులువేసి నొక్కుతూ 'ఇక్కడ సుదర్శనం చేతులు వేస్తే నీకేమనిపించేది? ఇప్పుడే మన్నిస్తుంది' అని అడుగుతూ సమాధానం కోసం రాఘవ బలవంతం చేస్తుంటే సంపూర్ణకి ప్రాణం చచ్చిపోతున్నట్లు అన్పించేది.

అవన్నీ సుదర్శనం చేస్తే తనిలా రావల్సిన అవసరం ఏముంది? మగవాడన్న అర్హత తప్పితే రాఘవ ఎందులోనూ సుదర్శనంతో సరిపోడు. నక్కకి నాగలోకానికి వున్నంత తేడావుంది. నిజం చెప్పేద్దామంటే వచ్చేస్తూ తను సుదర్శనానికిచ్చిన మాట గుర్తుకొచ్చి మౌనం వహించేది సంపూర్ణ. అసలే అతడిని గురించి హేళనగా మాట్లాడే రాఘవ మరింత చులకనగా మాట్లాడటూ సుదర్శనం గురించి అసలు విషయం చెప్తే?

సంపూర్ణ మౌనం రాఘవకి కోపం తెప్పించేది. ఆ కోపాన్ని మరోరకంగా చూపించేవాడు. సంపూర్ణ బుగ్గలు రక్తం వచ్చేలా కొరికేవాడు. ఈ హింసాత్మకమైన శృంగారం భరించలేక సంపూర్ణ విలవిలలాడిపోయేది. చీకటి పడుతుందంటేనే సంపూర్ణకి గుండెలో రైళ్లు పరుగెత్తేవి.

కాలం గడిచి పోతూనేవుంది. రాఘవ ఉద్యోగాలకోసం తిరుగుతూనేవున్నాడు, నగలు ఒక్కటొకటే కరిగిపోతూనే వున్నాయ్. సంపూర్ణ రాఘవ పశుత్వాన్ని భరిస్తూనేవుంది. ఇప్పుడిప్పుడే సంపూర్ణకి సుదర్శనం, తల్లీ తండ్రీ, అత్తమామలు—అందరూ గుర్తుకొస్తున్నారు. తన సుఖంకోసం వారికిచేసిన ద్రోహం, శాశ్వతంగా ఆ కుటుంబాలుమీద పడిన 'మచ్చా' గుర్తుకొస్తున్నాయ్. మనసు మధనపడుతోంది.

రాఘవకి సంపూర్ణమీద మోజు తగ్గిపోతోంది. మనసు క్రొత్త రుచుల్ని వెతుకుతోంది. చేతిలో డబ్బుంది. ఫ్రెండ్స్ దొరికేరు. త్రాగటం, 'తిరగటం' అలవాటైంది. అతని బయటి తిరుగుళ్లు సంపూర్ణ ప్రాణానికి కాస్తంత తెరిపినిచ్చేయి. అప్పుడప్పుడూ త్రాగొచ్చి తన్నటం మొదలైంది.

మరో నాలుగు నెలలకి సంపూర్ణ మెడలో పసుపుతాడు మాత్రం మిగిలింది. చేతిలో డబ్బులేక రాఘవకి 'మందు' దొరకటంలేదు. పిచ్చెక్కినట్లు వూరంతా తిరుగుతున్నాడు. రాఘవ 'మందు' గురించి దిగులుపడుతుంటే, సంపూర్ణ భవిష్యత్తు గురించి దిగులు పడుతోంది.

సంపూర్ణ కిప్పుడు తరచు 'సుదర్శనం' గుర్తుకొస్తున్నాడు. పాపం నిజం తనతో చెప్పలేక తనలో తను అతనెంత బాధపడ్డాడో? అన్పిస్తుందిప్పుడు ఆలోచిస్తుంటే. అతను మాత్రం మనిషి కాడూ? అతనికి మాత్రం అందరిలా వుండాలని వుండదూ? కోరికల్ని తీర్చుకునే శక్తిలేక అతనెంత నలిగిపోయేవాడో? సానుభూతిగా అనుకుంటుంది సంపూర్ణ, అతని గురించి.

ఏది ఏమైనా సంవత్సరన్నర తర్వాత తను రాఘవతో రావటం గొర్రె కసాయివాడిని నమ్మటం వంటిదేనని అర్థమైంది సంపూర్ణకి. కాని అప్పటికే చాలాదూరం వచ్చేసింది తను. చావో బ్రతుకో ముందుకి వెళ్లి తేల్చుకోవాలి తప్ప తిరిగి వెనక్కి వెళ్లే అవకాశంలేదు.

ఇలాంటి పరిస్థితిలోనే రాఘవ పంపిన వ్యక్తి సంపూర్ణ కోసం వచ్చేడు.

* * *

తలుపుమీద 'ఫెడీ'ల్మని తన్నిన చప్పుడు విని సంపూర్ణ త్రుళ్లిపడింది. గతం చెదిరిపోయి వర్తమానం 'భూతం'లా కనపడింది కళ్ళ ముందు. రాఘవ వచ్చేసాడు. బాగా దోసులో వుండి వుంటాడు. సంపూర్ణ వణికిపోయింది. మరో తన్నుకి తలుపులు విరిగిపోయేట్లున్నయ్.

సంపూర్ణవెళ్లి తలుపు తీసింది. రాఘవ తూలుకుంటూ లోపలికి వచ్చేడు. తలుపులు గడియవేసేడు. కళ్ళు ఎర్రగా నిప్పుముద్దల్లా భయంకరంగా వున్నయ్. సింహానికి చిక్కిన లేడిలా గజగజలాడుతూ నిలబడిపోయింది సంపూర్ణ.

"ఏమే పెద్ద పతివ్రతలా కబుర్లు చెప్పావట?" రాఘవ గొంతు ఉరిమినట్లు విన్పించింది.

"పిల్లాడికి ఒంట్లో బాగోలేదని సీత ఉత్తరం రాసింది. చేతిలో డబ్బుల్లేక ఒక్క రాత్రికి

వందిస్తానన్నాడు కదాని నీ దగ్గరకు పంపితే ఇద్దరి దగ్గర పడుకున్న నీకు మూడోవాడి దగ్గర పడుకోవటం తప్పయిందా? కట్టుకున్న మొగుడ్ని వదిలేసొచ్చిన నువ్వు నీతికబుర్లు చెప్తావా?" రాఘవ వెటకారంగా అన్నాడు.

సంపూర్ణ తెల్లబోయి చూసింది. సీతెవరు? పిల్లాడేమిటి? రాఘవ ఏవి మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

"సీత ఎవరు?" గొంతు పెగల్చుకుని అడిగింది.

"సీత నీకు తెలీదు కదూ? నా భార్య. నా కొడుకు తల్లి" రాఘవ తాపీగా చెప్పేడు.

"మీకు పెళ్ళయిందా?" నిర్ఘాంతపోతూ అడిగింది సంపూర్ణ.

"ఆహా. అయికూడ అయిదేళ్ళయింది. తొలి చూపులోనే నిన్ను వలచాను. నువ్వే నా పెళ్ళానివనుకుంటున్నావా?" రాఘవ ఎగతాళిగా నవ్వేడు.

సంపూర్ణకి ఒళ్ళు మండిపోయింది, ఎంత మోసం? ఎంత దగా? మాటమాత్రం తనతో చెప్పలేదింతవరకూ. భార్యా, కొడుకు వుండగా తననిలా తీసుకురావటంలో అతని ఉద్దేశ్య మేమిటి? ఇంతకాలం భార్యా భర్తల మధ్యన ఉత్తరాలు నడుస్తూనే వున్నయ్యన్నమాట. సంవత్సరంన్నరకే రెండువేలు డబ్బూ, పది వేల రూపాయల బంగారమూ హరించుకు పోవటంలో గల అంతరార్థం ఇప్పుడర్థమౌ తోంది సంపూర్ణకి. సగం పైనే భార్యకి పంపించి వుంటాడు తేలిగ్గా. పైగా అతని కొడుకు వైద్యానికని తను ఒళ్ళమ్ముకోవాలా? ఎంత దారుణం? సంపూర్ణకి తననెవరో నిప్పుల్లో పెట్టి కాలుస్తున్నట్లు వుంది. అసహ్యంగా చూసింది రాఘవ వైపు.

రాఘవ అదేమీ గమనించటంలేదు. ఎంత పొగరు దీనికి ఏం చూసుకుని నీలుగుడు? మార్కెట్‌లో పెడితే తేలిగ్గా వేలకివేలు సంపాదిస్తుందనుకున్నాడు తను. మొదట్లోనే ఇదిలా మొండికెత్తితే ముందు ముందు తన

కలలు ఫలించేదెలా?

రాఘవ చేతిలో బెల్టు సంపూర్ణ శరీరం మీద ఛెళ్ళున మ్రోగింది. సంపూర్ణ కెవ్వు మంది. బాధతో ఉండ చుట్టుకు పోయింది. దెబ్బమీద దెబ్బ అలా పడుతూనే వుంది. తెల్లని శరీరంమీద ఎర్రని వాతలు తేలి రక్తం చిమ్ముతోంది అక్కడక్కడా. సంపూర్ణ తెలివి తప్పి పోయింది. రాఘవ బెల్టు అవతలికి విసిరి "దెబ్బతో లంజముండకి రోగం కుదరాలి" అను కున్నాడు నేలమీద చాప చుట్టలా పడివున్న సంపూర్ణ వైపు కోపంగా చూసి "ఇది వింటుందో? దీని బాబు వింటాడో? తేలాలి" అనుకుంటూ వెళ్లి మంచంమీదపడి హాయిగా నిద్రపోయేడు రాఘవ.

*   *   *

అర్ధరాత్రివేళ తెలివి వచ్చింది సంపూర్ణకి. మరలోపెట్టి త్రిప్పినట్లు ఒళ్ళంతా పచ్చిపుండులా వుంది. పుట్టి బుద్ధెరిగినాక ఇన్ని దెబ్బలు ఏనాడూ తిని వుండలేదు తను. అన్నిటికన్నా బాదగావుంది. సుందరమైన జీవన కలశం తన చెయ్యి జారి ముక్కచెక్కలైందన్న విషయం. అదే సంపూర్ణకి రెట్టింపు బాధని కలిగిస్తోంది. ఇంక తన పతనం ఎంతో దూరంలోలేదు.

మొదటి జారుడు మెట్టుమీద నిలబడివుంది తను. రాఘవ తనని చెయ్యిపట్టుకుని క్రిందికి లాగేస్తున్నాడు. అలా జారిజారి ఏ అగాథంలోనో పడిపోతుంది తను. కుక్కలు చింపిన విస్తరై పోతుంది బ్రతుకు. రాఘవకి తగిన బుద్ధిచెప్పాలి. కసితో, అసహ్యంతో, పగతో మండిపోతోంది సంపూర్ణ మనసు. ఎక్కడలేని తెగువా వచ్చే సింది. నెమ్మదిగా లేచి కూజాలో నీళ్ళు గ్లాసు లోకి వంపుకుని గటగటా త్రాగేసింది.

లైటు వెలుగుతూనేవుంది. రాఘవ మంచం మీదపడి దున్నపోతులా నిద్రపోతున్నాడు, గురకలు పెడుతూ. సంపూర్ణ ఓ నిముషం ఆలోచించి బట్టలారేసుకునే వైర్లు వూడదీసుకు వచ్చి రాఘవ కాళ్ళు, చేతులు మంచానికి బిగించి కట్టేసింది. మరోత్రాడు సంపాదించి పొట్టమీదనుండి లాగి మంచం అడుగున కట్టింది రాఘవ అటూ ఇటూ కదిలేందుకు వీల్లేకుండా. అంత చేస్తున్నా రాఘవ నిద్ర పోతూనే వున్నాడు మత్తుగా.

సంపూర్ణ ఓ మూలపడేసివున్న బెల్టు తీసు కుంది చేతిలోకి. కసికొద్దీ ఛెళ్ళున బాదింది రాఘవ కాళ్ళమీద. రాఘవ తటుక్కున కళ్లు తెరిచేడు. మొదట నిద్రమత్తులో అతడికేమీ అర్థం కాలేదు. కళ్ళు నులుముకోబోయేడు. చేతులు కదల్లేదు, మరోదెబ్బ తొడలమీద పడటంతో రాఘవమత్తు వదిలిపోయింది. జరుగు తున్నదేమిటో బుర్ర కెక్కసాగింది.

ఎదురుగా సంపూర్ణ రేగిన జుట్టుతో, కమిలి వాచిపోయిన ముఖంతో, మండుతున్న కళ్ళతో, ఆవేశంతో ఎగిరెగిరి పడుతున్న గుండెల్తో చేతిలో బెల్టుతో 'మహంకాళి'లా నిలబడివుంది.

రాఘవ కదలబోయేడు కాని కాళ్ళకి చేతు లకి వైర్లు ఒరుసుకుని మంటపుట్టేయి తప్ప ఫలితం కన్పించలేదు. అప్పటివరకూ మెల కువ రాని తన మొద్దు నిద్రని తిట్టుకున్నాడు మనసులోనే. ఆశ క్కుదైపోయేడు. అతడి గుండెలు భయంతో కొట్టుకున్నాయి, సంపూర్ణ వాలకం చూస్తే తన ప్రాణం తీసేలా వుంది. ఛఛ. ఎంత అవమానం ఆడదాని చేతిలో తన్నులు తినటం? దీనంగా, భయంగాచూసేడు సంపూర్ణవైపు. అరవటానికి అభిమానం అడ్డొస్తోంది.

సంపూర్ణ కరిగిపోలేదు. జాలి, దయ తుడిచిపెట్టుకుపోయినయ్ సంపూర్ణలో. పిల్లి నైనా గదిలోపెట్టికొడితే ఎదురు తిరిగి గోళ్ళతో రక్కేస్తుంది. అలానే వుంది సంపూర్ణ పరి స్థితి. దెబ్బతిన్న ఆడ పులిలా శివమెత్తి పోతోంది. నమ్మి సర్వమూ అర్పించినందుకు రాఘవ తనను తలపెట్టిన అన్యాయానికి సంపూ ర్ణకి పిచ్చెక్కి పోతోంది. కసికొద్దీ ఎడాపెడా బాదసాగింది బెల్టుతో. దెబ్బ ఎక్కడ పడు తోందీ చూడటంలేదు. 'కసి' ఒక్కటే సంపూ ర్ణలో వుంది. 'ప్రతీకార' మొక్కటే సంపూ ర్ణకు తెలుస్తోంది. రాఘవ తలపెట్టిన 'దారుణ'మే సంపూర్ణ మనసును కాస్తోంది. ప్రేమ, అభి

మానం ఇవేమీ గుర్తుకు రావటంలేదా క్షణంలో.

కొట్టి కొట్టి సంపూర్ణ చేతులు నొప్పి పుట్టేయి, తను తిన్న దెబ్బలకి రెట్టింపు వడ్డించేక గాని తృప్తికలగలేదు సంపూర్ణకి. బెల్టు దూరంగా విసిరేసింది రొప్పుతూ. మంచం మీద ఒళ్ళంతా వాతల్తో, చారలుకట్టిన రక్తంతో తెలివి లేకుండా పడివున్నాడు రాఘవ.

సంపూర్ణ గ్లాస్‌తో నీళ్లతెచ్చి అతడి ముఖాన చిలకరించింది. రాఘవ కళ్ళుతెరిచేడు. ఒళ్ళంతా మండిపోతోంది దెబ్బలకి. సంపూర్ణ కూడ అలాగే తను కొట్టిన దెబ్బలకి బాధపడివుంటుందన్న వూహరాలేదతడికి. ఒక్క ఉదుటున లేచి సంపూర్ణని గొంతు పిసికి చంపెయ్యాలన్నంత ఆవేశం వచ్చింది. కాని శరీరం అందుకు సహకరించలేదు. మరో పదిరోజుల వరకూ తానీ దెబ్బలనుండి కోలుకోలేనన్పించింది రాఘవకి. సంపూర్ణ కంత శక్తి ఎక్కడి నుండి వచ్చిందో అర్థం గాలేదు. "ఓపికరాగానే దీని రక్తం తాగాలి" కసిగా మనసులోనే పళ్ళు నూరుకున్నాడు రాఘవ.

అతని కళ్ళలోని కోపం బాధ! అసహాయత చూసి సంపూర్ణ నిరసనగా నవ్వింది. పెద్దగా నవ్వింది. తెరలు తెరలుగా నవ్వింది. పిచ్చి పట్టినట్లు కడుపు చేత్తో పట్టుకుని మరీ నవ్వింది. ఆ నవ్వులో కసివుంది. అసహ్యం వుంది. ద్వేషంవుంది. రాఘవ తెల్లబోయి చూసేడు ఆమె నవ్వుతుంటే. దీనికి పిచ్చి పట్టిందనుకున్నాడు కూడ భయంగా.

"ఆడది తల్చుకుంటే ఏదైనా చెయ్యగలదు. నీలాంటి పశువులకు ఎలాగైనా బుద్ధి చెప్పగలదు. నీ కొడుక్కి రోగంవస్తే నేను ఒళ్ళమ్ముకోవాలా? రాస్కెల్ నమ్మించి తీసుకొచ్చి అంగట్లోపెట్టి అమ్మాలని చూస్తావా? నీపెళ్ళాన్ని తీసుకొచ్చి అమ్ముకోలేకపోయావా? పరాయి ఆడదంటే అంత తేలికా నీకు?

ఆడదానిలో ఎంత మంచి వుంటుందో అంత చెడుకూడ వుంటుంది. ప్రాణాలు పొయ్యటమే కాదు అవసరమైతే ప్రాణాలు తియ్యగలదు కూడ. జీవితంలో మరెన్నడూ పరాయి ఆడదాని జోలికి పోకు. పోషించలేకపోతే నువ్వు నీ పెళ్ళాం బిడ్డలూ ఏ గంగలోనో దూకిచావండి అంతే కాని ఆడవాళ్ళతో ఆటలాడుకోకు."

సంపూర్ణ నిప్పులు కురిపించింది.

రాఘవ జవాబివ్వలేదు. మనసు అవమానంతో మండిపోతుంటే, శరీరం దెబ్బలకి మండిపోతోంది. కోరల్తీసిన పాములా వున్నాడతను. సంపూర్ణ తిట్టితిట్టి ఆవేశం పట్టలేక 'ధూ' అని వూసింది రాఘవ ముఖాన.

తర్వాత నాలుగు చీరలు చేతి సంచిలో కుక్కుకుని, ఇన్నాళ్లు రాఘవకి కనపడకుండా దాచిన ఉంగరం తీసుకుని, రాఘవకి చేతికట్లు మాత్రం వూడదీసి బయటికి నడిచింది సంపూర్ణ. రోడ్డున పడి నడవసాగింది. చల్లగాలి తగిలి గాయాలు బాధ పెడుతున్నా సంపూర్ణ కెంతో హాయిగా వుంది. మనసంతా ప్రశాంతంగావుంది.

అలా ఎంత దూరం నడవాలో, గమ్యం ఏమిటో సంపూర్ణకి తెలియదు. ఎప్పుడో, ఎక్కడో ఓసారిచూసిన 'అనాధస్త్రీల' సంక్షేమ సంఘం' అన్నబోర్డు ఒక్కటే గుర్తుకొస్తోంది సంపూర్ణకి. కడుపులో పెరగబోతున్న బిడ్డను తల్చుకుని ధైర్యంగా, నిబ్బరంగా ఆత్మవిశ్వాసంతో అడుగులేస్తోంది సంపూర్ణ. □

---

* క్షణం తీరిక దొరకని వారికి కూడా, తాము క్షణం తీరికలేని పనిలో వున్నామన్న విషయాన్ని వివరించేందుకు మాత్రం సమయం చిక్కుతుంది గమనించారా? —బి. టి.
* మనదగ్గర సలహా కొచ్చే వారందరూ బుద్ధిమంతులే నన్పిస్తుంది మనకు. —జాక్ హెర్బర్ట్.
* జీతాలిచ్చేది యజమానికాదు. యజమాని డబ్బు వ్యవహారాలు చూసే వ్యక్తి మాత్రమే. నిజానికి జీతాలిచ్చేది ఉత్పత్తి. —హెన్రీ ఫోర్డ్.
* సిగిరెట్లు కాల్చే అలవాటు మానుకోవడం రెండు అంచెలలో జరుగుతుంది. మొదట తన సిగరెట్లు కాల్చడం మానేస్తారు. తర్వాత ఇతరుల సిగరెట్లు కాల్చడం మానుకొంటారు. —మిక్కీ పోర్టర్.
* సాధించాలనుకొనే గొప్పకార్యాలకన్న,సాధించగలిగిన చిన్నపనులేమిన్న.—పీటర్ మారల్

సీరియల్

పడమటి సంధ్యారాగం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

జరిగిన కథ

ఎవరి మాటలు వినో తన భార్య ప్రియంవద శీలాన్ని శంకించి విపరీతమైన వేదనకు గురి అయాడు సత్యమూర్తి. ఆ ఆలోచనలలోనే తన మొదటి భార్య శ్రీవల్లి జ్ఞాపకాలతో సతమత మవుతున్నాడు. సత్యమూర్తీ, శ్రీవల్లీ రాజమండ్రి బయలుదేరారు. దారిలో సత్యమూర్తి పొరపాటున మరో బస్సు ఎక్కాడు. ఎంత వెదికినా శ్రీవల్లి కన్పించలేదు. సత్యమూర్తిని మాణిక్యశాస్త్రిగారి దగ్గరకు తీసుకెళ్ళాడు అతని బావ. 'ద్వితీయ కళత్రం ఉంది నీ జాతకంలో ఇక ఆ అమ్మాయిని గురించి మరచిపోవచ్చు' అని చెప్పాడాయన. మాణిక్యశాస్త్రిగారితో జరిపిన సుదీర్ఘ చర్చ, సత్యమూర్తిని 'డిటాచ్‌మెంట్' వైపు ఆకర్షింపజేస్తుంది. ఆ భావాలతో ఉండగానే అక్క చేసిన వత్తిడికి లొంగి రెండో పెళ్ళి ఒప్పుకుంటాడు. మొదట్లో నిర్లిప్తంగా ఉన్నా ప్రియంవదతో సంసార జీవితం సాఫీగా కొనసాగిస్తాడు సత్యమూర్తి. అయితే ఒక కొడుకు కలిగేసరికి మళ్ళా సత్యమూర్తిలో అలజడి ప్రారంభమవుతుంది. తనకంటే ఎక్కువ ప్రాధాన్యత తన కొడుకు పొందుతున్నాడు ప్రియంవదనుంచి అన్న ఆలోచన. ఇంతలో పిడుగులా శ్రేయోభిలాషి నంటూ పేరు తెలియని ఓ వ్యక్తి ప్రియంవద ఎవరితోనో తిరుగుతుందని చెప్పడంతో తల్లడిల్లిపోతాడు. మనశ్శాంతి లేక మాణిక్యశాస్త్రి దగ్గర కెళ్తాడు.

"ఆయన రాకుండానా?" సంశయించాడు.

"ఆయనవచ్చి వండుకుని తింటారు. ఆయనవంట వేరు. మనం ఆగక్కర లేదు."

"అదేం?"

"గురుపత్ని పరమపదించి వత్సరం అవుతుంది. ఆయన భార్య చేతివంట లేదా స్వహస్త పాకంతప్ప మరొకటి ముట్టరు వారి ఆచారం అది" చెప్పాడు ఓ శిష్యుడు.

సత్యమూర్తి భోజనం చేసేసాడు.

మాణిక్య శాస్త్రులు ఆరాత్రి వంట వండుకోలేదు. వంట్లో నలతగావుందని పచ్చి దోసకాయలు మాత్రం తిని పాలు తాగాడు.

"క్రిష్ణవడ్డుకి వెళదామా?" అడిగాడు ఆయన.

పౌర్ణమి కాబట్టి పిండారబోసినట్లుగా వుంది వెన్నెల. క్రిష్ణానదినిండా నీళ్ళున్నాయి. వెన్నెలకి మెరుస్తున్నాయి నీళ్ళు తళతళా. చల్లటి గాలి వీస్తోంది మందంగా....

ఇద్దరూ ఇసకలో కూర్చున్నారు నీళ్ళ దగ్గర.

మాణిక్యశాస్త్రులు క్రిష్ణానదికి నమస్కారంచేసి మనసులో సంస్కృతంలో ఏదో శ్లోకం చదువుకున్నాక అడిగాడు సత్యమూర్తిని.

"నీకు పిల్లవాడు పుట్టాడని చెప్పారు మీ బావగారు ఆ మధ్య."

"అవును."

"అమ్మాయి కులాసాగా వుందా?"

"ఉంది."

ఆయన మౌనంగా వుండిపోయారు.

"మీభార్య....చెప్పారు మీ శిష్యులు."

"కాలం తీరింది. వచ్చినచోటికి వెళ్ళిపోయింది."

దీర్ఘంగా నిట్టూర్చాడు మాణిక్య శాస్త్రులు. కొద్దిసేపాగి చెప్పాడు.

"నా రెండో అబ్బాయి లండన్‌లో వున్నాడు. అక్కడికి వచ్చి తన దగ్గరే వుండమని గొడవ. అది ప్రశస్తం కాదని నా వూహ. ఈ గడ్డ మీద పుట్టాను. ఇక్కడే కిష్టమ్మ తల్లి వడిలో అయిపోవాలి నా జీవితం. మరో జన్మనివ్వకుండా ఆ సర్వేశ్వరుడు ఈ జీవిని తనలో ఐక్యం చేసుకుంటే కృతార్థుడి నవుతాను....అన్నట్లు నీకు దేముడంటే విశ్వాసంలేదని చెప్పావుగా!"

చిన్నగా నవ్వాడు సత్యమూర్తి.

"ఏమిటి నీకొచ్చిన కష్టం? నీ మొదటి భార్య కానీ, కూతురు కానీ కనబడ్డారా?"

"వాళ్ల కనబడితే నాకు కష్టం ఎందుకవుతుంది? అదికాదు."

"మరి? కష్టసుఖాలు అనేక రూపాల్లో వచ్చి పీడిస్తాయి మనుష్యులని. అన్నిటిలోకి అతి నికృష్టమయినవి అనారోగ్యం, దరిద్రం. అష్టకష్టాల్లో ఈ రెండూ చేర్చబడ్డాయి. తర్వాత కాంతా కనకాలవల్ల వచ్చే మనోక్లేశం భరించలేనివి."

సత్యమూర్తి తల వంచుకుని చెప్పాడు.

"నా భార్య ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది."

"అంటే?"

సత్యమూర్తి తనకి తెలిసినదంతా

వివరంగా చెప్పాడు మాణిక్యశాస్త్రులుకి.

"ప్రియంవద ఇలా చేస్తుందనుకో లేదు. నన్ను నిజంగా ప్రేమిస్తోందను కున్నాను. రెండోసారి కూడా జీవితంలో ఘోరంగా మోసపోయాను. నా కసలు ఈ బ్రతుకంటేనే, ఆడవాళ్ళంటేనే,అసలీ లోకం అంటేనే విరక్తి పుడుతోంది."

మాణిక్యశాస్త్రులు మౌనంగా పారే కృష్ణానది నీళ్ళవంక చూస్తుండిపోయాడు కొద్దిసేపు.

"మీ రిదివరలో నాకు చేసిన హితోప దేశంవల్లనే ఈ మాత్రమయినా నిబ్బరంగా వుండగలుగుతున్నాను. శ్రీవల్లి ....అంటే నా మొదటిభార్యమీద నేను పెంచుకున్న మానసిక బంధం మళ్ళీ నా రెండోభార్యమీద కూడా పెరగకుండా జాగ్రత్తపడుతూ వస్తున్నాను. ఆమె వియోగం నాకు బాధాకరంకాదు అట్టే. భరించగలను అది. నా మనసు నా అదుపులో వుంది. కాని ప్రియంవద చేసిన ఈ పాడు పనివల్ల మనసంతా బాధగా వుంది."

"ప్రియంవద తప్పు చేసిందని ఎందు కనుకోవాలి?"

"అంటే? అది వప్పు అనా మీ వుద్దేశం?"

"తార్కికంగా చూస్తే అది వప్పే. కాని మన సమాజం, మన మతం మొదటినుంచీ, కొన్నివేల సంవత్సరాల నుంచీ పరపురుషుడితో శయనించడం దోషంగానూ, పాపంగానూ ప్రబోధిస్తు న్నారు. అది మన రక్తంలో జీర్ణించుకుని పోయి పెద్ద తప్పుగా పరిగణించబడు తోంది."

"అంటే మీకు పాతివ్రత్యం అన్నది ఒక మంచి గుణంగా అనిపించటం లేదా?...."

"తప్పకుండా అది మంచి గుణమే. కాని మనలో భర్తని వదలి ఇంకో పురుషుడితో తిరగడం పాపం అనే భావం పెంపొందించడంతో లోకంలో అనేకమంది ఈ విషయంలో బాధితులవు తున్నారు. కామం కూడా ఓ భౌతిక మయిన అవసరం. ఆకలివేస్తే భర్త సంపాదించిన భోజనమే తినాలి. పర పురుషుడు సంపాదించిన భోజనం చేస్తే పతివ్రత కాదు అనే భావంకూడా తర తరాలుగా మన సాంప్రదాయంలో వుండి వుంటే, ఇప్పుడు మరొకరి ఇంట్లో భార్య రహస్యంగా భోజనం చేస్తే ఇప్పుడు నువు అనుభవించే బాధే అనుభవించేవారు అంతా. అదే విధంగా, పరపురుషుడితో రతి జరపడం తప్పుకాదు అన్న సిద్ధాంతం అమలులో వుంటే యీ బాధ వుండేది కాదు."

"మీరే ఇలా చెప్తూంటే...."

గలగలా నవ్వాడు మాణిక్యశాస్త్రులు.


"నాలో చాలా కాలంగా ఏర్పడ్డ ఆలోచనలనినీకు వివరించానంతే. కాని నీభార్య స్వభావాన్ని బలపరచడం నా అభిమతం కాదు. నీ బాధని నేను అర్థం చేసుకో గలను."

కొద్దిసేపు ఆగి చెప్పాడు మాణిక్య శాస్త్రులు.

"ప్రేమంటే ఏమిటి?"

"నాకు తెలుసు కాని చెప్పలేను."

"శారీరక సంపర్కం ప్రేమలో ఓ భాగం అవునా? కాదా?"



"అవును."

"అయితే ప్రేమకీ, కామానికీ మధ్య వున్న అతి సన్నటి సరిహద్దు గురించి నీకు తెలియదు."

"ఒకటి లేనిదే యింకొకటి వుండదు."

"ఇదివరలో చెప్పాను. సృష్టిలో ప్రతీ స్త్రీ నిర్మాణం ఒక్కటే. పరిమాణాలే తేడా. ఏ స్త్రీతో రతి జరిపినా పొందే సంతృప్తి ఒకటే. ఒక స్త్రీమీద మనసు లగ్నం అయితే ఆమెవల్ల ఎక్కువ తృప్తి పొందుతున్నామనుకోవటం మనసులోని భ్రమ మాత్రమే.

కామం కూడా ఆకలిలా మనిషికుండే ప్రాథమికమయిన ఆకలి. దాహం. ఆ దాహం, ఆ ఆకలి లేకపోతే మానవజాతి అంతరిస్తుంది కాని కొత్త జీవులకి అంకురార్పణ జరగదు. సృష్టి కార్యంలో స్త్రీ పురుష లిరువురికీ అమితమయిన ఆనందం నిర్దేశించాడు పరాత్పరుడు. ఆ విధంగా ఆ కార్యంమీదకి వారిరువురి మనసులూ సదా లగ్నం అయేలా చేసి, మానవాళిని సమసిపోకుండా కాపాడుతున్నాడు. లేనిపక్షంలో ఆ కొద్ది నిముషాల తృప్తికోసం, అందుకు ఫలితంగా జనించే బిడ్డని, కొన్ని పదుల సంవత్సరాలు భరించే ఓపిక శక్తి మానవుడికి వుండదు. అందుకే జీవికి కామపరంగా ఆసక్తి సహజంగా వుండేలా దేముడు ఏర్పాటు చేసాడు.

ఈ కామం ప్రేమ కాదు. సాధారణంగా ప్రేమకీ, కామానికీ తేడా లేదనుకుంటారు. ఆ రెండూ రెండు ప్రత్యేక గుణాలు. అవి రెండూ కలిసివుంటాయి కాని అవి రెండూ ఒకటి కానేకావు. కామం పూర్తిగా భౌతికం. ప్రేమ ఒక మానసిక స్థితి.

కామం శరీరంలోని కొన్ని గ్రంధుల

వల్ల కలుగుతోంది. అలా కామ ప్రకోపం పొందిన వ్యక్తికి కేవలం తన కామ దాహం తీర్చుకొనేవరకే బాధ. ఆ తర్వాత తనకా తృప్తిని ఇచ్చిన వ్యక్తితో వుండ టానికి కూడా ఇష్టపడక పోవచ్చు. కన్నెత్తి తిరిగి చూడకుండా వెళ్ళి పోవచ్చు.

ప్రేమ అలా కాదు. ఎన్నిక ముఖ్యం ప్రేమకి. ఎంతమందితోనయినా కామ వాంఛని చల్లార్చుకోవచ్చు కాని ప్రేమ దాహం ఒక్కరివల్లే తీరుతుంది. కామం శారీరకం. ప్రేమ మానసికం. తనకి నచ్చిన గుణాలున్న వ్యక్తినే ప్రేమించ గలడు అందంగా లేకపోయినా. అందం చూసి ప్రేమిస్తున్నాననుకుంటే అది సాధా రణంగా కామం అయి తీరుతుంది.

ఇష్టంలేని ఇంకో వ్యక్తితో కామ వాంఛని బలవంతంగా తీర్చుకోగలవు నీ అవసరానికి. కాని నీ అవసరానికి ఆ విధంగా నీకు ఇష్టంలేనివ్యక్తిని ప్రేమించ లేవు.

ఈ రెండిటికీ వున్న అతి సన్నటి సరిహద్దు ఒకటే. ఒక వ్యక్తిమీద కామం కలిగివుంటే అది తెలుసుకోవచ్చు. ప్రేమ కలిగివుంటే అదీ తెలుసుకోవచ్చు. ఎలా?....

"క్రమం క్రమంగా శరీరంలో ప్రారంభం అయి ఒకానొక స్థితిలో అది చల్లారితే కాని ఉపశమనం కలుగదు. అప్పుడే నీకు ఆ స్త్రీ గుర్తుకు రావచ్చు విరహ బాధతో. ప్రేమ అలా కాదు. అది క్రమ క్రమంగా పెరిగి చల్లారదు. ఎప్పుడూ నీ మనసులో వుంటుంది. దానికి కాలంతో నిమిత్తంలేదు. చాలా లోతైన ఆ భావన ఆ వ్యక్తి ఎంతకాలం దూరంగా వున్నా నిలుస్తుంది మనసులో. ప్రేమ లోని ముఖ్య గుణం ప్రేమించబడే వ్యక్తి సుఖంగా, సంతోషంగా వుంటే నే ప్రేమించే వ్యక్తి మనసు హాయిగా వుంటుంది. ఆ సుఖం,సంతోషంతన వల్లే కలుగునక్కరలేదు.

కామం శారీరకమే అయినా ఏమాత్రం వుత్సాహం లేకుండా ఆ కార్యం నెర వేరిస్తే కలిగే తృప్తి వున్నా ప్రేమించే వ్యక్తితో సంభవిస్తే తృప్తి ఎక్కువగా వుంటుంది. కారణం మొదటి విష యంలో అది యాంత్రికం అవుతుంది. కామపరమయిన తృప్తికి మనసు ముఖ్యం. అందువల్లే ప్రేమించే వ్యక్తి వల్లే ఎక్కువ సుఖం లభిస్తుంది మానసి కంగా.

అందుకే ధనంతో పొందే వ్యభిచారిణి పొందుకన్నా, ప్రేమతో పొందే సతీమణి పొందు అద్భుతంగా వుంటుంది. దేముడు కావాలని ఈ గుణం ఏర్పాటుచేసాడు. అందువల్ల ఒక్కసారితోనే అధిక తృప్తి లభిస్తుంది."

"అంటే ప్రియంవదకి నా కన్నా సుగుణరావుదగ్గరే అధిక తృప్తి లభి స్తోందా?"

చాలాసేపు మౌనంగా వుండిపోయాడు మాణిక్యశాస్త్రులు. ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

"అంటే సుగుణరావుని ప్రేమిస్తోం దన్నమాట" సత్యమూర్తి తనలో తను గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు.

"రోజులు బోధించలేని విషయాలు సంవత్సరాలు చెప్పగలవు."

ఇద్దరు మౌనంగా వుండిపోయారు చాలాసేపు.

"నా మనసిప్పుడు నిర్మలంగా, నిశ్చలంగా వుంది" అన్నాడు సత్యమూర్తి హఠాత్తుగా.

"ఏం?"

"ఆశా నిరాశల మధ్య కొట్టుకుపోయాను. ఇప్పుడు ఆ రెండూ లేవు."

"మానసిక పరిపక్వత పొందిన వ్యక్తే నిజంగా సుఖపడేది. కాషాయబట్టలు కట్టుకొన్న వ్యక్తి కాదు సన్యాసి. మనసులో కోరికా, విచారం, మమకారం, ఆశ, నిరాశలు లేని వ్యక్తి వున్ని బట్టల్లోవున్నా నారబట్టల్లో వున్నా క్రిష్ణ వడ్డున ముక్కు మూసుకొని కూర్చున్నా, ఇంట్లో కాపరం చేస్తున్నా, అతనే నిజమయిన సన్యాసి అవుతాడు.

"మీరు ఇదివరలో నాకు మన మతం గురించి కొన్ని అంశాలు బోధించారు. వాటి సారాంశం ఒకటే నాకు గుర్తుంది. జీవితంలో ఎన్ని నిరాశలు, అసంతృప్తులు ఎదురయినా ఓడిపోయామనే భావనకి లోనుకాకుండా మంచి రోజుల కోసం ఆ భగవంతుడి మీద భారంవేసి, బాధని మరవడానికి ఆ కనపడని దేవుడిని నమ్ముకోవాలని. నేను అలాగే చేసాను. అయినా యిలా అయింది."

కొద్దిసేపు ఆగి మళ్ళీ చెప్పాడు.

"ఇంకోటి కూడా చెప్పారు. అసలు మన మతంలోనే నిరాశావాదం వుంది. అందులోనే ఆనందం వుంది. మనసుని భావరహితంగా వుంచుకుంటే మానసికా

నందం పొందచ్చని చెప్పారు. రాగ ద్వేషాలు మరిచి, ఏ సంఘటనకు మనసు స్పందించకుండా, ఎదని అలజడికి సంఘర్షణకి గురికానివ్వకుండా అదుపులో వుంచు కోగలగడంవల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. అందుకు చేయాల్సిన కృషి, కోరిక, మమకారాలనే రెక్కలని ఖండించుకోవని కూడా చెప్పారు."

"నీ భార్యమీద ప్రతీకారం చేసే వుద్దేశం పెట్టుకోకు. పగ, ద్వేషాలు అస లుండకూడని స్పందనలు. అవి నెమ్మదిగా రహస్యంగా ఆత్మహత్యకి లేదా హత్యకి వుపయోగపడే గుళికల్లాంటివి. నిన్ను పిచ్చివాడిని చేస్తుంది కసి. చివరికి నిన్నూ నీ చుట్టుప్రక్కల వాళ్ళనీ దహించి వేస్తుంది. నువ్వు ఆర్పలేని జ్వాలని నీవే రగిలించుకున్నట్లవుతుంది. మొక్కతో తుంచెయ్యకపోతే అది మానయి నిన్ను కృంగతీస్తుంది."

సత్యమూర్తి ఎంతో ప్రశాంతంగా నవ్వాడు.

"నాకు ప్రియంవద మీద ద్వేషం లేదు."

"కొద్దికాలం నువ్వు వివిధ ప్రదేశాలు సందర్శిస్తూ నీ భార్యకి దూరంగా వుంటే మనసుకు శాంతి లభిస్తుందేమో?"

"ఏ ప్రదేశాలు?"

"మన హిందువులు దర్శించదగ్గ అతి పావనమయిన ప్రదేశం ఆ గంగమ్మతల్లి సన్నిధిలోవున్న కాశీవిశ్వేశ్వరుడి గుడి. దారిలోనే త్రివేణి సంగమంలో స్నానం చేసి మనసుకంటిన మాలిన్యాలని కడిగి వేసుకోవచ్చు."

"అలా చేస్తాను."

చాలాసేపు మాణిక్యశాస్త్రులు హిందూ మతంలోని కొన్ని విషయాలని గురించి, జీవితం గురించి, జీవితాన్ని ఏ విధంగా స్వీకరించాలో మొదలయిన విషయాల మీద మాట్లాడాడు.

కొద్దిసేపాగి అడిగాడు సత్యమూర్తిని.

"శ్రీవల్లి ఇప్పుడు కనబడితే ఏం చేస్తావు?"

"ఏమో!"

జవాబు చెప్పాడు సత్యమూర్తి.

13

ఆ రాత్రి మాణిక్యశాస్త్రులు ఇంట్లో పడుకుని మర్నాడు వుదయం ఆయనతో పాటు కనకదుర్గ కొండమీదకి వెళ్ళాడు.

ఆ దేవికి దణ్ణం పెట్టుకుని చాలాసేపు మౌనంగా మంటపంలో కూర్చుండి పోయాడు.

తర్వాత లేచి నిలబడి కొండమీద నుంచి కనపడే విజయవాడ పట్టణాన్ని చూసాడు కొద్దిసేపు. కృష్ణాబేరేజ్, కృష్ణా నది, రెండు రైలుబ్రిడ్జీలు, ఒకదాని మీద వెళ్ళే రైలు, గాంధీకొండ, చుట్టు కనబడే ఎత్తయిన కొండలు, చల్లటిగాలి.

మాణిక్యశాస్త్రులుండే శివాలయంలోకి వెళ్ళి ఆయన దగ్గర తీర్థం, ప్రసాదం తీసుకొని, శెలవు తీసుకుని కిందకి దిగి వచ్చేశాడు.

"ప్రభూ! సత్యమూర్తికి జీవితంలో ఏది ఆచరణ యోగ్యమో ఆ మార్గం ప్రసాదించు."

మాణిక్యశాస్త్రులు మనసారా ఆ శివుడిని ప్రార్థించాడు ముకుళిత హస్తాలతో.

(వి) చిత్ర విజ్ఞానం



ఫ్రాన్సు దేశంలో ఫోను సౌకర్యాలు చెప్పనలవికానంత అధ్వాన్నంగా వుంటున్నాయి. ఒక ఇంజనీరు తనకి ఫోను కావాలని దరఖాస్తు పెడితే, 13 సంవత్సరాలనంతరం అతనికి ఫోనుసౌకర్యం కల్పించారు. పారిస్ నగరంలో, ఒక గొప్ప జోకుంది. అక్కడ సగం మంది ప్రజలు ఫోను సౌకర్యంకోసం వేచి వుండగా ఆ సౌకర్యం పొందిన మిగతా సగం మంది తమ ఫోన్ డయల్ టోన్ వినడానికి వేచివుండారట! అక్కడ ఫోన్‌లో ఒకళ్ళ మాటలు ఒకళ్ళకి వినిపించవట. వినిపించినా లైన్లు కట్ ఐపోతూ వుంటాయట!

మాణిక్యశాస్త్రులు ఇంట్లోని తన బ్రీఫ్ కేస్ తీసుకుని బస్‌స్టాండ్‌కి చేరుకున్నాడు. గుంటూరు వెళ్ళే బస్సు సిద్ధంగావుంది. దాంట్లో ఎక్కి మంగళగిరి దాకా తీసుకున్నాడు టిక్కెట్ పానకాలస్వామిని దర్శించాలన్న కోరిక అప్పటి కప్పుడు కలగగానే.

బస్సుదిగి కొండమీదకి నడిచివెళ్ళాడు. మళ్ళీ శ్రీవల్లి జ్ఞప్తికి వచ్చింది. చాలా సంవత్సరాల క్రితం శ్రీవల్లితో వచ్చాడు మంగళగిరి.

పానకాలస్వామి దర్శనం అయ్యాక ఒక్క క్షణం కూడా వుండకుండా దిగి వచ్చేసాడు కిందకి. మళ్ళీ బస్సెక్కి విజయవాడ చేరుకునేసరికి ఒకటిన్నరయింది.

రాజమండ్రీ వెళ్ళే బస్సు సిద్ధంగా వుంది ఒకటి. బస్సులో కూర్చున్నాక తన అక్కా బావలని మేనల్లుడిని, మేన కోడలుని చూడాలన్న కోరిక ఎక్కువయింది. చాలాకాలం అయింది వాళ్ళని చూసి.

కండక్టర్ బస్‌లోని ప్రయాణీకులకి టిక్కెట్లు ఇస్తున్నాడు.

క్షణకాలం సత్యమూర్తికి అనిపించింది.

తనకెందుకు వాళ్ళమీద యింత మమకారం?

కొద్ది నిముషాలు ఆలోచనలో కొట్టుకుపోయాడు. తను వెళ్ళి చూడలేనంత బలంగావుందా ఆ బంధం? కండక్టర్ వచ్చి ఎక్కడికని అడిగాక లేచి నిల్చుని చెప్పాడు.

"ఎక్కడికి లేదు."

గబగబా బస్సు దిగి ఎంక్వయిరీ ఆఫీస్ దగ్గరికి వెళ్ళి అడిగాడు. హైద్రాబాద్‌కి మూడున్నరదాకా లేదు బస్సు.

ఆ బస్సుకోసం వెయిట్ చేయసాగాడు పేపర్‌కొని చదువుతూ.

బస్‌లో రష్‌లేదు అట్టే.

ఓ ముసలాయన పధ్నాలుగేళ్ళ అమ్మాయిని ఎక్కించడానికి వచ్చాడు బస్సు.

సత్యమూర్తిని అడిగాడాయన.

"మీది హైద్రాబాదా?"

"అవును."

"నా మనమరాలు కూడా హైద్రాబాద్ వెళ్తుంది. ఒక్కతినే పంపిస్తున్నాను. బస్‌స్టాండ్ నుంచి ఇంటికి వెళ్ళగలదు. శెలవులకి వచ్చి వెళుతోంది. దయచేసి దారిలో ఏదయినా అవసరంవస్తే సహాయం చేయండి."

"అలాగే."

"థాంక్ యూ" అని ఆ అమ్మాయికి చెప్పాడు సత్యమూర్తిని దారిలో ఏమయినా కావాలంటే అడగమని.

"మీ పేరు?" అడిగాడు బస్సు కొదారలో ఆగినప్పుడు, బస్సు దిగుతూ.

"ప్రవీణ."

"ఏమయినా కావాలా?"

"టీ తాగుతాను."

గాజుగ్లాసులో టీ తెచ్చి యిచ్చాడు. తాగి థాంక్స్ చెప్పి చిల్లర యివ్వబోయింది. సత్యమూర్తి తీసుకోలేదు.

"ఫర్వాలేదు తీసుకోండి" అన్నది సిగ్గు పడుతూ.

"వద్దు."

బస్సు రాత్రి తొమ్మిదిన్నరకి చేరుకుంది హైద్రాబాద్. బస్సు దిగి అడిగాడు సత్యమూర్తి.

"మీ రొక్కరే వెళ్ళగలరా? తోడు రానా?"

"వెళ్ళగలను. మీరు టీ రెండుసార్లు తెచ్చారు కొదారలో, సూర్యాపేటలో. డబ్బు తీసుకోలేదు. నా దగ్గిర వుంది."

నవ్వాడు సత్యమూర్తి.

"నాకు చెల్లెళ్ళు లేరు ప్రవీణా. వద్దు ఫర్వాలేదు."

"నాకు అక్కయ్యలే తప్ప అన్నయ్యలు లేరు....మీరుండేది ఎక్కడ? ఏం చేస్తున్నారు?" చొరవగా అడిగింది ప్రవీణ.

చెప్పాడు తను పనిచేసే లైబ్రరీ ఎక్కడ వుందో. తన చేతిలోని ఇంగ్లీష్ నవల మీద వ్రాసుకుంది పేరూ, ఎడ్రస్.

సత్యమూర్తి బ్రీఫ్‌కేస్‌తో బయటికి నడిచాడు.

14

రాత్రి పదిన్నరకి చేరుకున్నాడు సత్యమూర్తి ఇంటికి బస్‌డిపో నుంచి. తలుపు తడితే ప్రియంవద తలుపు తెరిచింది. గుప్పున మల్లెపూల వాసన వేసింది సత్యమూర్తికి.

తలలో మల్లెపూల దండ.

పెదిమలు ఎర్రగా వాడిపోయివున్నాయి ఉదయం వేసుకున్న తమలపాకుల ఫలితంగా.

"వచ్చారా? రండి."

సత్యమూర్తి తల వంచుకుని లోపలకి వెళ్ళాడు.

"భోజనం వండనా?" అడిగింది.

"వద్దు" చెప్పాడు.

"అయితే బట్టలు మార్చుకోండి నిద్ర వస్తోంది."

"ఓపిక లేదు. ఇలాగే పడుకుంటాను"

"అదేం.... చెమట వాసన...."

"నన్ను విసిగించకు."

"నేను మార్చనా?...."

"దయచేసి నన్ను విసిగించకు."

సత్యమూర్తి పడుకోగానే పక్కనే పడుకొని చొక్కా బొత్తాములు విప్పి ఛాతీమీద కుడిచేత్తో రాస్తూ అన్నది ప్రియంవద.

"రాజూ ఎందుకు నా మీద అలిగి వెళ్ళావ్?"

సత్యమూర్తి మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని నిద్రపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు.

"రాజూ నన్ను వదిలి వెళ్ళి బ్రతకలేవు నువ్వు" ప్రియంవద సత్యమూర్తి ఛాతీని మృదువుగా చేత్తో రాస్తూ అన్నది.

సత్యమూర్తికి ప్రియంవద చర్యలలోని ఆప్యాయత తెలుస్తోంది.

"ఇటు తిరుగు."

ప్రియంవద వంటిమీది బట్టలు తీసేయడం గుర్తించాడు సత్యమూర్తి. వివస్త్ర అవుతోంది. అయినా అటు తిరగలేదు. కనీసం కళ్ళయినా తెరవలేదు. అలాగే పడుకున్నాడు.

"నిన్నే తిరుగు."

సత్యమూర్తిని బలవంతంగా తనవైపు తిప్పుకుంది.

సత్యమూర్తి కళ్ళు తెరిచాడు. చాలాసేపు ప్రియంవద కళ్ళలోకి చూస్తూండిపోయాడు. నల్లటి కనుగుడ్ల మీద ఎర్రటి బెడ్ లాంప్ పడి గుండుసూది తలలంత ఎర్రటి కాంతి మెరుస్తోంది వాటి మీద.

నిశ్చలంగా, నిర్వికారంగా వున్న సత్యమూర్తి మొహం చూస్తే ఏదోగా వుంది ప్రియంవదకి.

నెమ్మదిగా లేచాడు సత్యమూర్తి.

దూరంగా జరిగి మోకాళ్ళమీదకూర్చుని

ప్రియంవద నగ్నశరీరాన్ని నిశితంగా చూస్తూండిపోయాడు-రెప్ప వాల్చకుండా.

తెల్లటి శరీరం. నీడలు పడుతూ కని పించే వంటి వంపులు. మెడమీది ముడత లలో, వక్షోజాల క్రింద, వక్షోజాలమధ్య, నడుంకి రెండు ప్రక్కలా, ఇంకా కింద నల్లటి నీడలు కనిపించే వంపులు.

నగ్నశరీరం.

ఆ నగ్నశరీరం మీద చర్మం లేకపోతే ఎలా వుంటుంది?

ఎర్రటి రక్తనాళాలు, పచ్చిమాంసం, నరాలు. అవికూడా లేకపోతే?

ఎముకలు. ఎముకలగూడు ఆ శరీరం.

"ఏమిటి చూస్తున్నారు? రండి" పిలి చింది ప్రియంవద రెండుచేతులూ చాపుతూ సిగ్గుగా.

సత్యమూర్తి నెమ్మదిగా కదిలాడు. మోకాళ్ళమీద నుంచి లేచి నిలబడ్డాడు నెమ్మదిగా.

ఓసారి పక్కనే చిన్న మంచంమీద పడుకునున్న తన బాబువంక చూశాడు. నిద్రపోతున్నాడు.

తలుపు తెరుచుకుని బయటికి వచ్చాడు.

"ఎక్కడికి?"

ప్రియంవద పిలుపు వినిపించింది లోపలనుంచి.

వీధి గుమ్మం దగ్గరే నిలబడి నిర్మా నుష్యంగావున్న ఆ సందువంక చూసాడు. వీధిలో రెండువైపులా వెలుగుతున్న దీపాలు. ఓ మూల గోడకి తగిలించివున్న పోస్ట్‌బాక్స్. పక్కనే దుప్పటి పరుచుకుని పడుకునివున్న ఓ బిచ్చగాడు.

సత్యమూర్తి దూరంగా నడిచిపోవటం చూసింది, చీరమీద గబగబా వంటిమీద చుట్టబెట్టుకుని బయటకి వచ్చిన ప్రియంవద.

రెండుచేతులూ వెనక్కి పెట్టుకుని తల వంచుకుని నడుస్తున్నాడు సత్య మూర్తి. అతని నీడ అతనికి రెండింత లుగా వెనకాల పడుతోంది.

భర్త ప్రవర్తన విచిత్రంగా కన పడింది ప్రియంవదకి. ఎంతో కొత్తగా వుంది. మొదటిసారిగా సీరియస్‌గా ఆలో చించసాగింది భర్త గురించి.

సత్యమూర్తి నిర్మానుష్యంగా వున్న ఆ వీధుల్లో నడిచి మెయిన్ రోడ్‌మీదకి వచ్చాడు. చాలాసేపు అలా నడుస్తూండి పోయాడు.

రాత్రి పదకొండుంపావునుంచి తెల్ల వారుఝామున మూడున్నరదాకా, దాదాపు నాలుగున్నర గంటలసేపు నడుస్తూండి పోయాడు.

తర్వాత వచ్చి ఇంటితలుపు కొట్టాడు. ప్రియంవద త్వరగా తలుపు తీసింది. నిద్ర పోలేదు ప్రియంవద కూడా. ఎదురు చూస్తోంది.

"ఎక్కడికి వెళ్ళారు?" అడిగింది.

జవాబు చెప్పకుండా పరుపుని మంచం మీదనుంచి కిందకి లాగి శారీరకంగా, మానసికంగా పూర్తిగా అలసిపోయిన సత్యమూర్తి ఆ పరుపుమీదకి వాలి పోయాడు కాళ్ళు పీకుతూంటే.


"మిమ్మల్నే. ఎక్కడికి?"

సత్యమూర్తి జవాబు చెప్పలేదు.

"చెప్పులుకూడా తొడుక్కోకుండా ఎటెళ్ళారు?"

"..........."

"వినపడటంలేదా?"



"..........."

"మనిషినే అడిగేది."

"..........."

"ఎవరిదగ్గరకయినా వెళ్లొచ్చారా?"

"..........."

"ఎవరయినా అమ్మాయిదగ్గరకి వెళ్లొచ్చారా?"

"..........."

"డబ్బిచ్చి ఏ వేశ్యదగ్గరకయినా వెళ్లొచ్చారా? లేకపోతే ఇంతరాత్రి ఎపెుత్తారు మీరు?"

"..........."

"మాట్లాడరే?"

సత్యమూర్తి దగ్గిరకి విసవిసా వెళ్ళింది ప్రియంవద.

అలసిపోయిన సత్యమూర్తి అప్పటికే నిద్రలోకి జారిపోయాడు.

సత్యమూర్తి నుదుటిమీదపడ్డ జుట్టుని వెనక్కి త్రోసి మృదువుగా అక్కడ ముద్దు పెట్టుకుంది ప్రియంవద.

15

"సంగితేమిటో చెప్పండి."

మర్నాడు పుదయం సత్యమూర్తి పక్కన కూర్చుని అతని తలని వళ్ళో పెట్టుకుని లేపి అడిగింది ప్రియంవద.

సత్యమూర్తి మాట్లాడలేదు.

"చెప్పండి ప్లీజ్. నన్నిలా వేధించకండి."

"ఏం లేదు."

"మరెందుకిలా వున్నారు?"

"నాకే తెలియదు."

"లేచి స్నానం చేయండి. లైబ్రరీకి టైం అవుతోంది....పోనీ ఈపూట మానేస్తారా?"

"ఉహూ."

"మరయితే లెండి."

స్నానం అయాక అడిగింది ప్రియంవద.

"వడ్డించనా?"

"వద్దు"

"అదేం? ఆకలిలేదా?"

"ఉంది."

"మరి?"

"నీ చేతి వంట తినను."

ప్రియంవద గుండెలో గూడుకట్టుకుంటున్న భయం ఈసారి ప్రియంవద మొహంలో ప్రతిఫలించింది.

"ఎందుకో?"

"ఏమో?"

"ఏమిటీ మొండితనం? రండి తిందాం."

"వద్దు."

"నేను కలిపి నోట్లో పెడతాను."

సత్యమూర్తి లేచి స్నానం చేసి ప్రియంవద ఎంత అడుగుతున్నా వినకుండా లైబ్రరీకి వెళ్ళిపోయాడు.

"అలా వున్నారేం? ఒంట్లో బాగా లేదా?"

అరగంట తర్వాత అడిగాడు ఓ తోటి వుద్యోగి సత్యమూర్తిని చూసి.

సత్యమూర్తి జవాబు చెప్పలేదు. టెలిఫోన్‌దగ్గరకి వెళ్ళి, డైరెక్టరీ చూసి ఓ నంబర్ తిప్పాడు. అవతలివైపువారు పలకగానే "బి. హెచ్. ఇ. ఎల్?" అడిగాడు.

సమాధానం రాగానే, ఓ ఎక్స్‌టెన్షన్ నెంబర్ చెప్పి ఆగాడు.

మళ్ళా అవతలవైపునుంచి ఎవరో మాట్లాడగానే ఓ పేరు చెప్పి అతన్ని పిలవమని అడిగాడు.

కొన్ని నిముషాల తర్వాత మళ్ళీ ఓ కొత్త కంఠం వినవడింది.

"నేను సత్యమూర్తిని మాట్లాడుతున్నాను. ఆమధ్య ఓసారి మీరి కనపడి మీ ఫోన్ నంబర్ ఇచ్చారు. మనం రాజమండ్రిలో పి.యు.సి. దాకా కలసి చదువుకున్నాం. గుర్తు పట్టారా?" అడిగాడు.

"మీరు లైబ్రరీలో పనిచేసే సత్యమూర్తా? దానవాయిపేటలో గుడిదగ్గర కదా మీ ఇల్లు?"

"అవును."

"చెప్పరా సత్యం. కొత్తవాళ్ళలాగా మీరేమిటి? ఇప్పుడు ఆరోగ్యం యెలా వుంది?"

"బావుంది. చిన్న సహాయం చేయాలి."

"ఏమిటి?"

"మీ కంపెనీలో ఓ అతను పనిచేస్తున్నాడు. ఎలక్ట్రికల్ ఇంజనీర్. మారేడ్‌పల్లిలో వుంటాడు. అతని ఇంటి అడ్రస్ చెప్పాలి నాకు. ఎలాగయినా సరే కనుక్కోవాలి. చాలా ముఖ్యమయిన విషయం."

"పేరు?"

కొన్ని క్షణాలు ఆగి చెప్పాడు.

"సుగుణరావు."

"నీ ఫోన్ నెంబరెంత?"

చెప్పాడు.

"పే బిల్స్ సెక్షన్‌కి వెళ్ళి కనుక్కోవాలి. ఓ అరగంటలో ఫోన్ చేస్తాను మళ్ళా."

"థాంక్స్. మర్చిపోవద్దు."

ఫోన్ పెట్టేసాడు సత్యమూర్తి. ఓసారి దీర్ఘంగా నిట్టూర్చాడు.

పుస్తకాలుండే గదిలోకి వెళ్ళి, మత సంబంధమయిన పుస్తకాలుండే రేక్ లోంచి వేదాంతానికి సంబంధించిన ఓ గ్రంథం తీసుకుని వచ్చి తన సీట్‌లో

కూర్చున్నాడు. ఇదివరకు చదివిన పుస్తకమే అది. అందులో ఇదివరకే గుర్తు పెట్టిన ఓ అధ్యాయం తీసి దాన్ని చదవసాగాడు.

ఆ చాప్టర్‌లో మనిషి, ఆత్మ, మనుగడ, ఇహలోకంలో మానవుడిని కట్టివేసే వివిధ బంధాలు, మానవుడు వాటిని నిత్యంగా నమ్మి ఎలా బాధలకి గురవుతున్నాడు, వాటిమీద విరక్తి కలగకుండా మానవుడి ఆలోచనా సరళి ఎలా సాగుతోంది మొదలయిన అంశాలున్న ఆ అధ్యాయాన్ని చదువుతూండిపోయాడు దీక్షగా.

ఇరవై నిముషాల తర్వాత ప్యూన్ వచ్చి చెప్పాడు సత్యమూర్తికి.

"సార్, టెలిఫోన్."

సత్యమూర్తి ఇదివరలో తనకి వచ్చిన ఆ అజ్ఞాత వ్యక్తి వ్రాసిన వుత్తరం తాలూకు కవరుని గుర్తుగా పుస్తకంలో వుంచి, దాన్ని టేబిల్ మీద వుంచి లేచాడు.

"గడ్డం బాగా పెరిగిపోయింది సార్. ఒంట్లో బాగాలేదా?" అడిగాడు ప్యూన్.

సత్యమూర్తి టెలిఫోన్ దగ్గరకి వెళ్ళి రిసీవర్ అందుకుని "హలో!" అన్నాడు.

బి. హెచ్. ఇ. ఎల్. నుంచి కాదు ఆ ఫోన్.

"హలో! సత్యమూర్తేనా మాట్లాడేది?...." కరకుగా వినిపించిందో కంఠం.

"అవును."

"నేను సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని మాట్లాడుతున్నాను."

శ్రీవల్లి కనపడిందా?

"చెప్పండి" పొడిగా అన్నాడు.

"మీరు వెంటనే గాంధీ హాస్పిటల్‌కి రండి."

"ఎందుకు?"

"ఓ శవాన్ని ఐడెంటిఫై చేయడానికి."

"వస్తున్నాను."

"మార్చురీ రూమ్ దగ్గరకి రండి. అక్కడే వుంటాను నేను."

ఫోన్ పెట్టేసాడు సత్యమూర్తి.

ఆ శవం ఎవరిది? శ్రీవల్లిదా? సత్యవల్లిదా? ప్రియంవదదా? తనకి తెలిసిన ఇంకెవరిదన్నానా?

సత్యమూర్తికి అలాంటి ఆలోచనలేం కలగలేదు. లైబ్రేరియన్‌కి సంగతి పొడిగా చెప్పి మళ్ళీ తన టేబుల్ దగ్గరకి వెళ్ళాడు. చదువుతూ మధ్యలో వదిలిన ఆ పుస్తకం తీసుకుని బయటకి వచ్చాడు.

ఆటో ఎక్కి చెప్పాడు.

"గాంధీ హాస్పిటల్."

దారిలో ఆ పుస్తకం చదువుతూ, అందులో కొన్నివేల సంవత్సరాల నుంచి వస్తున్న అంతులేని విజ్ఞానాన్ని తన మనసులో, ఆలోచనలో, తన రక్తంలో, తన ఒంట్లోని అణువణువులో అర్థం చేసుకుని ఇంకించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆటోని ఆపి, ఆ పుస్తకంలో లీనమయిన సత్యమూర్తిని పిల్చాడు డ్రయివర్.

అయిదురూపాయల నోటుని అందించి లోపలికి నడిచాడు సత్యమూర్తి.

యూనిఫాంలో వున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని చూసి అతని దగ్గరకి నడి

చాడు. తనని పరిచయం చేసుకున్నాడు.

తర్వాత మౌనంగా అతని వెంట దారి తీసాడు శవాలు భద్రపరిచే గదికి. ఇన్ స్పెక్టర్ సౌజ్ఞని చూసి ఆ గదిలోని వ్యక్తి ఓ పెద్ద డ్రాయర్ని గోడలోంచి బయటకి లాగాడు.

"ఈ అమ్మాయి మీకు తెలుసా?"

సత్యమూర్తి ఆ చల్లటి పెద్దడ్రాయర్లో వున్న మృతదేహాన్ని చూసాడు.

వెంటనే ఒక్కడుగు వెనక్కి వేసాడు. తనని తను సంబాళించుకునే ప్రయత్నం చేయలేకపోయాడు.

"ఎవరీమె?" అడిగాడు ఇన్స్పెక్టర్. గొంతులో అధికారం, కరుకుదనం.

"ఎలా తెలుసు మీకు నా ఫోన్ నంబర్?"

"నిన్నరాత్రి ముషీరాబాద్ చౌరస్తా దగ్గర ఈమె ఎక్కి వెళుతున్న ఆటోని లారీ ఢీ కొట్టింది. డ్రయివర్, ఈమె మరణించారు అక్కడే. ఈమె చేతిలోవున్న పుస్తకంలో మీ పేరు, ఫోన్ నంబర్ వున్నాయి."

ఆ మంచుడ్రాయిర్లోని మృతదేహం వంక చూసాడు. తను క్రితంరాత్రి చూసిన ఆ మొహం గుర్తుకు వచ్చింది. ఎంతో అందంగా, అమాయకంగా, తియ్యగా, మధురంగా వుందా మొహం.

ఇప్పుడు?

గుర్తుపట్టడానికి వీలు లేనంతగా చితికి పోయి, మాంసం ముద్దలా....

"ప్రవీణ"

చెప్పాడు.

"మీకేమవుతుంది."

"ఎవరికెవరు ఏం అవుతారు? ఏం కారు."

"అంటే?"

"తోటి ప్రయాణీకులం మనం అందరం."

"వివరంగా చెప్పండి."

కరుకుతనం. కఠినత్వం. అసహనం.

"నిన్న విజయవాడ నుంచి హైద్రాబాద్కి మేం ఇద్దరం ఒకే బస్లో కలిసి వచ్చాం. దారిలో సహాయం చేసాను. పేరు, టెలిఫోన్ నంబర్ రాసుకుంది ఈ పుస్తకంలో."

"ఇల్లెక్కడో తెలుసా?"

"అడగలేదు. చెప్పలేదు."

"బయటకిరండి. సంతకాలుపెట్టాలి."

కొద్దినిముషాలు మాంసం ముద్దలా వున్న ప్రవీణశరీరం వంక చూచి బయటికి వచ్చాడు.

సంతకాలు పెట్టాక అడిగాడు.

"ఇప్పుడేం చేస్తారు?"

"అంటే?"

"ఆ దేహం."

"కార్పొరేషన్ వాళ్ళు చూసుకుంటారు."

"నా కిస్తారా?"

"దేనికి?"

"ఆ దహనం నా చేతులు మీదుగా చేస్తాను. నన్ను అన్నయ్యగా వరుస కలిపింది నిన్న."

"అలాగే."

"అయితే ఓ అరగంటలో డబ్బు తీసుకుని వస్తాను."

"ఈ లోపల నేను ఆస్పత్రి వాళ్ళకి చెప్తాను."

సత్యమూర్తి బయటకి వచ్చి దగ్గరే వున్న ఓ మార్వాడీ షాప్‌కి వెళ్ళి తన చేతి కుండే వుంగరం వాచీ తాకట్టు పెట్టి రెండువందల నలభై అయిదు రూపాయలు తీసుకున్నాడు.

ఆస్పత్రి గుమ్మం దగ్గరే అడిగాడో బండివాడు సత్యమూర్తిని.

"బండి కావాలా సార్?"

"ఎందుకు?"

"శవాన్ని తీసుకెళ్ళడానికి."

"కావాలి."

"ఎక్కడికి తీసుకువెళ్తారు?"

"నువ్వు చెప్పు"

"అంబర్ పేట్."

"నీ కెలా తెలుసు?"

"చాలా శవాలు తీసుకెళ్ళాను. అక్కడ స్మశానం వుంది."


"అదికాదు. నేను శవాన్ని తీసుకెళ్ళ దలిచానని."

నవ్వాడు.

"నా వృత్తే అది బాబూ. పదండి. చీకటి పడకుండా వెళ్ళొచ్చేద్దాం."

కొన్ని ఫారాలమీద సంతకాలు చేసి సత్యమూర్తి ప్రవీణ దేహాన్ని బండిలోకి చేర్చాడు. దాదాపు రెండు గంటల తర్వాత చేరుకుంది బండి అంబర్‌పేట్‌లోని స్మశానానికి.

బండివాడు దారిలో కట్టెలు, బ్రాహ్మ



లకి కావల్సిన దర్భలు తెల్లబట్టల్లాంటి సామాను కొనిపించాడు సత్యమూర్తిచేత.

స్మశానంవున్న సందు బాగా ఇరుకుగా వుంది. లోపలకి మెట్లు. నాలుగయిదు శవాలు కాలుతున్నాయి దూరంగా. గేటుకి కుడివైపు వుంది శ్మశానవాటిక తాలూకు ఆఫీస్. సత్యమూర్తి శవాన్ని కాల్చడానికి రుసుము చెల్లించాడు.

బ్రాహ్మణులు ఇద్దరు సత్యమూర్తి దగ్గరకి వచ్చారు.

అరగంటలో మంత్రాలు వల్లెవేశారు.

ప్రవీణ దేహాన్ని పేర్చిన చితిమీదకు చేర్చారు స్నానం చేయించి.

బ్రాహ్మలు మంత్రాలు చదువుతూంటే సత్యమూర్తి ఆ చితిచుట్టూ ప్రదక్షిణాలు చేసి తలదగ్గర కొరివిపెట్టాడు.

పదినిమషాలలో భగభగ మండిపో సాగింది చితి. మాంసం కాలుతున్న వాసన. నల్లటిపొగ. ఎర్రటి మంట. దూరంగా ఎత్తుపల్లాలు, రాళ్ళు. అక్కక్కడ ఆ ఎత్తుపల్లాలలో నిలిచిన నీళ్ళు. మరికాస్త దూరంలో బట్టలుతుకుతున్న చాకలివాళ్ళు. స్మశానంలో కట్టివున్న అమ్మవారి గుడి.

సత్యమూర్తి సాయంత్రం నాలుగు దాకా అక్కడే కూర్చున్నాడు తనతో తెచ్చుకున్న పుస్తకం చదువుతూ.

మధ్యమధ్యలో కాలుతున్న యితర శవాల తాలూకు బంధువుల ఏడుపులు వినబడుతున్నాయి. వాళ్లుపెట్టే పిండాల చుట్టూ చేరుకున్నాయి కావుకావుమనే కాకులు

మనుషులు చస్తేకాని వాటికి తిండి వుండదు యిక్కడ!

ప్రవీణ అస్థికలు తీసి భద్రపరిచే నిమిత్తం స్మశానవాటిక ఆఫీసులో రుసుము చెల్లించి రసీదు తీసుకున్నాడు.

గేటుదగ్గర నిలబడి ఆఖరిసారిగా చూసాడు పూర్తిగా కాలిపోయి నల్లటిపొగ వస్తున్న ఆ చితివంక.

తర్వాత నెమ్మదిగా నడవసాగాడు.

రైల్వేబ్రిడ్జి కిందనుంచి వెళ్ళి కాచిగూడ స్టేషన్ చేరుకున్నాడు గంట తర్వాత.

అక్కడనుండి లైబ్రరీకి ఫోన్ చేసాడు.

"ఏమయింది?" అడిగాడు లైబ్రేరియన్.

"ఏంకాలేదు."

"మీకు ఫోన్ వచ్చింది. బి.హెచ్.ఇ.ఎల్ నుంచి మీ స్నేహితుడు ఫోన్ చేసి మీకో ఎడ్రస్ యివ్వమని చెప్పాడు. చెప్పనా?"

"చెప్పండి."

నాలుగయిదుసార్లు చెప్పమని గుర్తు పెట్టుకున్నాడు సత్యమూర్తి. ఫోన్ పెట్టేసి ఆటోలో ఇంటికి చేరుకున్నాడు, కళ్ళు మూసుకుని కూర్చుని ఏదో ఆలోచిస్తూ.

16

ప్రియంవద చాలాసేపు మాట్లాడలేదు.

కుర్చీకి ఆనుకుని నేలమీద కూర్చుని కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్న భర్తవంక చూస్తూండిపోయింది.

"గడియారం, వుంగరం ఏవి?" అడిగింది అకస్మాత్తుగా అవి మాయమవడం చూసి.

స్వ జ్ఞాన యోగం

ఇంటి ముందు నిలిచి చెయ్యి జాపితే
సిగ్గు లేదు అన్నావే, శ్రీహరీ!
ఎంత దైన్య హైన్య స్థితి కానిదే
ఈనాటిది, నీ యీ సిరి! కానుకో.

*　　*　　*

నాటి కవులు రాజు పొందు కోరగా
మండి పడిన నవసాహితి సారధీ!
నీ రచనలు అచ్చులోన చూడగా
నువ్వు పట్టుకోని కాళ్ల లేవుటా!

*　　*　　*

కొడుకు పెళ్లి కీర్తి నీది పూర్తిగా
వియ్యంకుడి పనిమాత్రం దివాళా
ముష్టివాళ్ల లిష్టులోన, మోహినీ!
ముందు పేరు నీదేమో, చూసుకో

నూకలిన్ని తిన్నందుకు శాస్త్రిగా
చిట్టెలకని చెరబట్టిన నేటుజీ!
జాతి జాతి దోచుకునే జాణవే
తమ బోట్లకి తగిన శిక్ష ఏమిటో!

*　　*　　*

ప్రతి మనిషిని కొసరి కొసరి అడిగితే
గుండె కరిగి ఓటిస్తే హాయిగా
గట్టెక్కిన గద్దెక్కిన, ఏలికా!
మా బాధలు చెవిపెట్టవు, రోగమా!

*　　*　　*

ఎత్తుమీద ఉన్నారని, పెద్దలూ!
లేమి చూసి కొట్టకండి లేవిడీ
కింది మనిషి ఎరిగి ఎదురు తిరిగితే
మీ సొమ్ము నమ్మకాలు బూడిదే!

అవసరాల రామకృష్ణారావు ఆలపించు రసవద్గీత (10)

మౌనంగా వుండిపోయాడు సత్యమూర్తి.

"మిమ్మల్నే."

దగ్గరకి వెళ్ళి గట్టిగా కుదుపుతూ అడిగింది రౌద్రంగా.

"రాత్రి వెళ్ళినదానికే యిచ్చారా? మళ్ళీ యివాళ కూడా వెళ్ళారా?"

సత్యమూర్తి కళ్ళు తెరిచి లేచి నిల్చున్నాడు. సత్యమూర్తి కళ్ళలో, మొహంలో అంతకు మునుపెన్నడూ ప్రియంవద చూడని భావం కనబడింది ఆమెకి.

సత్యమూర్తిలోపలకి వెళ్ళి డ్రాయర్ తెరచి చెక్ బుక్ తీసుకువచ్చి ఆ బ్యాంక్ చెక్ మీద సంతకం పెట్టాడు భార్యపేరు వ్రాసి. చెక్ బుక్ ని అందించాడు ప్రియంవదకి.

"ఏమిటిది? ఎందుకు?" అడిగింది ప్రియంవద కొద్దిగా భయంగా.

పడకగదిలో పడుకుని నిద్రపోతున్న బాబుని భుజాన వేసుకుని వీధి గుమ్మం వైపు నడిచాడు సత్యమూర్తి.


"ఎక్కడికి?" అడిగింది ప్రియంవద.

సమాధానం చెప్పలేదు సత్యమూర్తి.

ప్రియంవదని పక్కకి బలంగా తోసి గబగబ బయటికి నడిచాడు. ప్రియంవద ఆశ్చర్యంలోంచి తేరుకునేసరికే సత్యమూర్తి సందు తిరిగి మాయమయాడు.

(ఇంకా వుంది)

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు — అక్టోబరు '78

అడ్డం:

1 ఇది వస్తే కథేలేదు
4 బహువచనంలో బాధలు
7 ఆ రోజుల్లో ఇదీ ఒక పజిలే!
8 తులాభారం
10 అగికి ఆచూకీ
11 అప్పుడప్పుడు పడకుతుంది
13 నలుపు
14 కవి నక్షత్రం
15 అశ్వధాటి
16 జలం ధరిత్రి
18 రాక పోవడం అమ్మాయిపేరు
21 పిడితో ధాన్యాదులను రాల్చడం
22 తిరుపతి పంచ శిఖలలో దిగువది (చూ. కృష్ణశాస్త్రి వేమన శతకం)
24 చిన్న కుంపటి
25 కవితకీ, కడగడానికీ

నిలువు:

1 వాయవ్యాస్త్రం
2 కీలెరిగి పెట్టేది

3 కుక్కకి మనిషిమీద, ఆస్తికులకు దేవుడి మీద
4 జాస్తీ
5 విషం
6 పల్లెటూళ్ళలో దొరుకుతుంది
9 జబర్దస్తీకి కావాలి
10 ఉదాహరణకి కురుక్షేత్రం
12 మొల్లం కావాలన్నాడు అల్లసాని
15 స్త్రీ
17 ఊరిపేరు, ఇంటిపేరు
19 బెనెగాల్ పాత్ర
20 ముక్కిడి
22 సంతో సంతానం
23 కొరగానితనానికి ఉపమానం

సెప్టెంబరు పదబంధ ప్రహేళికకు సమాధానం :

అడ్డం : 1 ఆవుతోక 4 దస్తగిరి 7 దుబుడుక్కలు 8 స్మితం 10 కృథా 11 కంజాక్షి 13 వైష్ణవి 14 వనమా 15 తరువు 16 సమాసం 18 పోలో 21 రివ 22 కాకుత్థ్స వంశం 24 నిఘంటువు 25 తికమక

నిలువు : 1 ఆకస్మికం 2 తోడు 3 కబుర్లు 4 దక్కుడు 5 స్తలు 6 రివఖారి 9 తంజావూరులో 10 కృష్ణకుమారి 12 పనస 15 తపోవని 17 సంవర్తిక 19 రంకువు 20 అవంతి 22 కాటు 23 శంక

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి అక్టోబరు 1వ తేదిలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్ల కాగితంమీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్‌కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీ వొచ్చినపుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పైనెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

సెప్టెంబరు '78 పదబంధ ప్రహేళిక విజేతలు :

1. కె. వి. యన్. ఆచార్య 2-3-64/14 అంబర్‌పేట, హైదరాబాదు. 2. పి. సరస్వతి మలికిపురం;....వీరికి బహుమతి మొత్తాన్ని పంచి పంపిస్తున్నాము.


వచ్చే సంచిక నుంచే

యద్దనపూడి సులోచనారాణి సీరియల్

ప్రారంభం

మృగయా

ప్రశాంత



ఆ ఇంటి గదిలోకి అశోకవృక్షాల్ని నిలబెట్టి తీసుకెళ్ళచ్చు. గదుల గోడలు పోతపోసిన మంచుగోడల్లా తెల్లగా వున్నాయి.

ఇంట్లోవున్న ఇరవైఆరు గదుల్లో ఆ ఊళ్ళో జనం అందర్నీ పక్కలేసి వరసగా పడుకోపెట్టచ్చు! ఇంటిబయట తోటలోని ఫ్యాషన్ మొక్కల్ని లాన్స్‌ని పీకేస్తే ఒక చిన్న ఊరికి కావల్సిన పంటలు పండించవచ్చు.

ఇంట్లో ఎక్కడి వస్తువులు అక్కడ సృష్టిక్రమం అంత అందంగా పేర్చివున్నాయి. ఇంట్లో వాళ్ళ స్థాయిని ఇంటిగేట్లు హుందాగా

★ మృగయా — అంటే వేట. వేటకాడు మానవుడూ వేటాడబడేది మృగమూ అయిఉంటాయి సాధారణంగా. మానవులే మానవుల్ని వేటాడటం కూడా జరుగుతుంది ఒక్కోసారి! ★

చెప్తాయి. ఇంటి యజమాని నాగభూషణం పరపతిని గూర్ఖా మీసాలు చెప్తాయి. అతని ఎర్రటి కళ్లు అందులో క్రూరత్వం నాగ భూషణంలోని క్రూరత్వాన్ని చెప్తాయి.

ఆ ఇంట్లో రోజూ ఎన్నికలంత సందడి. సంత జరుగుతున్నంత గందరగోళం. తమాషా ఏం అంటే ఆ ఇంట్లోనే మళ్ళీ అంత అంద మయిన నిశ్శబ్దం గూడా గంభీరంగా తిరుగు తుంటుంది.

'ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్....'లోనిజం ఎంత వుందో ఆ ఇంట్లోమనిషి మనిషికీ అంతే అనుబంధం. పేరుకు ఒక కప్పుకింద వుంటున్నా ఒకళ్ళతో ఒకరు అవసరం అయితేగానీ మాట్లాడుకోరు. పనిలేనప్పుడు ఒకళ్ళతో ఒకళ్లు అపరిచ యస్తుల్లా వుండటం ఆ ఇంట్లోనే చూడవచ్చు.

నాగభూషణానికి నలుగురు అల్లుళ్ళు నలు గురు కొడుకులు ఇద్దరు భార్యలు కాక ఇంకా బీరకాయపీచు చుట్టాలు చాలామంది ఉన్నారు. అంతా ఆ ఇంట్లోనే వుంటారు. ఇంట్లోని అందరికీ ఒకటే పని—తెల్లారితే సంపాదన; దాన్ని ఏరూపంగా సంపాదిస్తున్నాం అనే ప్రశ్న అసలు వ్యాళకి తెలీదు. స్మగ్లింగ్‌నుంచి బ్రాందీ షాపులదాకా ఆ నగరంలోని అన్ని వ్యాపారాల్లో ఆ ఇంట్లోవాళ్ళ చెయ్యి వుంటుంది.

ఊళ్ళో అందాలు ఐశ్వర్యాలు అక్కడ మస్తరు వేయించుకుంటే తప్ప వాటికి ఉనికి లేదు.

ఆ ఇంటికి నాలుగు దిక్కులున్నాయి. నాలుగు దిక్కుల్లో నాలుగు గేట్లు. నాలుగూ నాలుగు వీధుల్లోంచి లోపలకి దారితీస్తాయి.

ఊళ్లోకి కొత్తగా వచ్చినవాడు నాలుగు వీధుల్లో ఎటువెళ్ళినా నాగభూషణం ఇల్లు చూడక తప్పదు. నాగభూషణం ఇల్లు చూడటం అంటే ప్రముఖ సినీతారని ప్రయివేట్‌గా కల వడం అంత క్రెడిట్.

ఆ ఇంటి కారు షెడ్స్ అన్నీ కలిస్తే లేబర్ కాలనీకి సరిపోతుంది. ఇంటి ముందు ఫౌంటెన్‌లో నీరు ఊరు మొత్తానికి సరి పోతుంది.

నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. ఆ నగరంలో సంపదలన్నీ ఫైనల్‌గా అక్కడే చేర్తాయి. ఎందుకంటే చేసేవన్నీ హోల్‌సేల్ వ్యాపారాలు ఫోన్ బిజినెస్‌లూ కాబట్టి. నాగ భూషణం పైకి వచ్చింది బ్రోకరేజింగ్‌లో. ఆయన చెయ్యని బ్రోకరేజింగ్, తెలీనికమీషన్ వ్యాపారంలేవు. ఆకాశంలో నక్షత్రాలన్ని వ్యవ హారాలు ఆయనవి. అల్లుళ్ళూ కోడళ్ళూ నుంచి మేడలు తోటలు దాకా అన్నీ బ్రోకరేజింగ్‌లో సంపాదించినవే.

నాగభూషణానికి చీకటిపడ్తే వెన్నెల వస్తుందో రాదో అనవసరం. కానీ అతని గదికి ఓ కొత్త ఆడది రావాలి. కొత్త బాటిల్ ఓపెన్ అవాలి.

బాటిల్స్‌ని ఆడవాళ్ళనీ ఓపెన్ చెయ్య డంలో సిద్ధహస్తుడు. పగలు పూట సంస్థల్ని చీకటి పడ్డాక మత్తుల్ని ఆరంభించడం అతని రివాజు.

అల్లుడు శేషాచలం కొడుకు సింహాచలం నాగభూషణం అలవాట్లకి ప్రతిబింబాలు. ఆ ఇంట్లో అలాంటి ప్రతిబింబాలు ఇంకా చాలా ఉన్నాయి.

ఇంటి మెయిన్ హాల్‌లో గాంధీ నెహ్రూ పటాలు అహింసా సిద్ధాంతాన్ని తాతలనాటి గన్ పులిచర్మాలు హింసనీ చెప్తాయి. లైఫ్ సైజు ఉమర్ ఖయ్యాం పెయింటింగ్ ఆ ఇంటి రస తత్త్వాన్ని అసలు దాహాన్ని చెప్తాయి.

ఆ బంగళా....లేదా ఆ కోటలో సమయం రాత్రి ఎనిమిది అయింది. ఆ ఇంటి గది గది లోనూ ఏదో రంజు పసందు జరుగుతున్నా మొత్తం ఇల్లు మాత్రం బయటికి మహా నిశ్శ బ్దంగా కనిపిస్తుంది.

నాగభూషణం ఫారెస్ట్ డిపార్ట్ మెంట్‌లో పనిచేశాడు. అందుకే అతనికి వేట ఊపిరి. ఆ ఉద్యోగం వదిలేశాక జంతువుల వేట ఆగిపోయి ధనం వేట ఆరంభం అయింది. అది ఉండేది మనుషుల దగ్గర కాబట్టి మను షుల వేట, రక్తంలో జీర్ణించుకు పోయింది.

మాజీ లెక్చెరర్ రత్నవతి నాగభూషణం గదికి వచ్చి గంట అయింది. కావాలని తనని ఇంతసేపు వెయిట్ చేయిస్తున్నాడని ఆమెకి తెలుసు. అయినా నిస్సహాయ.

రత్నావతి కూర్చున్నది ఏ. సి. రూం అయినా ఒళ్ళంతా పొగలు ఆవిర్లుగా ఉంది. రత్నావతికి ఉద్యోగంపోయి నాలుగేళ్లు అయింది. విచిత్ర మయిన పరిస్థితుల్లో ఆమె నాగభూషణం కళ్ళ బడింది. అది జరిగి ఎనిమిదేళ్ళు అయింది. అప్పట్నించి ఈ వేటగాడి బారినుంచి తప్పించు కోడానికి దేశం అంతా పిచ్చిగా తిరిగింది. భూమి గుండ్రమో కాదో తెలీదుగానీ దేశం మాత్రం గుండ్రం అని ఆమెకి బాగా తెలిసిపోయింది. వృత్త కేంద్రంలోని బిందువులా ఆమె ఎటు వెళ్ళినా అతన్నించి తప్పుకోలేకపోయింది. ఇది విధి వైపరీత్యంగాదు, వ్యవస్థ వైపరీత్యం.

'రవి కాంచనిచో కవి కాంచునే గదా' పాత సూక్తి.

'రవి కాంచనిచో రూక కాంచునే గదా' నేటి సూక్తి.

పక్క రూంలో ఆడ మగ నవ్వులు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఈవేట ఆ గదిలోనూ సాగుతున్నది గాబోలు. అందులో మరో ఆడది మరో వయస్సు మరో ఎత్తులు మరో వెచ్చదనం. అంతే. మొత్తంమీద అసలు ఒకటే. అదే ఆడది. అసలు మీద పెరిగే వడ్డీలాంటివాడు మగాడు.

రత్నావతి గదిలో పెయింటింగ్ సైజులో ఉన్న ఆధునిక గడియారాన్ని చూసింది. మోచెయ్యి పొడుగున కట్ అయిన పన్నెండు ఆకులు పన్నెండు గంటల్నీ చూపుతున్నాయి.

గదిలో అర్ధ నగ్న పూర్తి నగ్న చిత్రాలు రేడియో గ్రాంలో నుంచి వస్తున్న సంగీతం పాల సరస్సు అంత విశాలం అయిన పక్క నేలమీద స్పాంజి కార్పెట్ డిమ్ లైటింగ్ చూస్తుంటే రత్నావతికి వికారంగా కసిగా ఉంది.

ఎనిమిదేళ్ళ జీవితంలో ఆమె తన రక్షణ కోసం పరిగెత్తడంలో భర్తని పోగొట్టుకుంది. ఆరోగ్యం ఉద్యోగం హోదా శాంతి చైతన్యం పోగొట్టుకుంది.

భర్త మోహన్ సహజంగా చనిపోయాడని డాక్టర్లు చెప్పినప్పటికీ అతను హత్యచెయ్యబడ్డాడు. ఏం అనుమానంలేదు. ఈ నిజం ఆమెకీ భగవంతుడికీ తప్ప ఎవరికీ తెలీదు.

దేముడు రూప రహితుడు గాబట్టి రూపం ఉన్న మనుష్యులకి కోర్టుకి సాక్ష్యం చెప్పలేడు. ఆమెకి డబ్బులేదు కాబట్టి ఎవరితోనయినా చెప్పుకొని నాగభూషణాన్ని ఏదన్నా చేసే ప్రసక్తి అసలులేదు. ట్రాన్స్‌ఫర్స్‌మీద ఊరూరా తిరగడంలో ఆమె లివర్ పాడు అయిపోయింది. దాని చికిత్సలో ఉన్న డబ్బు ఉద్యోగం పోయాయి. అనారోగ్యవంతులు ఉండాల్సింది ఆసుపత్రుల్లోగానీ ఉద్యోగాల్లో కాదని ఉన్న ఉద్యోగం కాస్తా పీకేశారు....

నాలుగేళ్ళగా ఈ పరిస్థితులు ఈ ఒంటరిదనం ఈ భయం మధ్య శోభనతో జీవితాన్ని గడిపింది.


ఇన్నాళ్లుగా తనకి తనే ఒక సమస్య. అది ఇప్పుడు రెండు సమస్యలుగా చీలింది. దాని పేరు శోభన, ఆమె పందొమ్మిదేళ్ళ వయస్సు. చదువు కోవాలని ఆశ తపన ఉన్నప్పటికీ శోభన తన కూతురు అయిన పాపానికి బి. ఏ. మధ్యలోనే ఆపెయ్యాల్సి వచ్చింది.

ఏడాదిగా ఉద్యోగం కోసం అడ్డమయిన ప్రతి వెధవనీ అర్థించడం అర్థంలేని సమాధానాలు తీసుకోడం.

శోభన కనీసం ఆడపిల్ల కాకపోతే, ఆడపిల్ల అయినా ఇంత అందగత్తె కాకపోతే ఈ రోజు ఈ వేటగాడి కోటలోకి తనకి తనుగా అడుగు పెట్టేదికాదు.

రేడియో గ్రాంలో జండా ఉంచా రహే హమారా వినిపిస్తున్నది. ఇవాళ స్వతంత్ర దినం గాబోలు. కొంతమంది లైసెన్స్‌డ్ మర్డర్లు చెయ్యడానికి రెండుకాళ్ళ ఆడ జీవాల్ని వేటాడటానికి అధికార ముద్ర లభించిన రోజు గాబోలు ఇది.

గదిలో గుప్పుని కొట్టిన ఇంపోర్టెడ్ సెంటు వాసనకి రత్నావతి తలెత్తి చూసింది. ఆకలితో కసిలో కైపెక్కిపోయి కోరికతో ఊగి



పోతున్న మృగంలాంటి నల్లటి లావుపాటి నాగభూషణం కనిపించాడు.

నాగభూషణం దగ్గరి డబ్బు తీసేస్తే అతను ఎందుకూ పనికిరాడు. నాగభూషణం ఒంట్లో తెల్లటి పళ్ళు తీసేస్తే ఆకారం అంతా నల్లటి చీకటి ముద్దగా తప్ప ఇంకేం కనిపించదు.

కార్పెట్ మీద ఉన్న రత్నావతి కాళ్ళు జివ్వు మన్నాయి అతని అడుగులు కార్పెట్ మీద నడిచి వస్తుంటే.

కోనేరు అంత విశాలం అయిన హాలులో నల్ల కలువలా మెరుస్తున్న నాగభూషణం సగర్వంగా గొంతు సర్దుకున్న శబ్దం.

'ఎంత సేపు అయింది వచ్చి?'

'మీరు పక్క గదిలోకి వెళ్ళే ముందు'

'ఎవరికో ఉద్యోగం కావాలట. అప్లికేషన్; కాదని పొమ్మంటే వినరు.' నాగభూషణం పరోక్షంగా వేసిన చురకకి ఆమె ఒళ్ళంతా కాలింది.

సోఫా మీద కూర్చుని టీపాయ్ మీద బాటిల్ మూత ఓపెన్ చేస్తున్నాడు. ఎన్ని సంవత్సరాలక్రితం ఏ దేశంలో ఆ ద్రావకం ఈ సీసాలో బిగించబడిందో అది నేటికి అతని పాలు అవుతున్నది. తనకీ ఆ బాటిల్‌కి చాలా సాపత్యం ఉన్నట్లు అనిపించింది.

"మీలాంటి గౌరవనీయులకి ఇలాంటివి.... నచ్చవని నేనే పుచ్చుకుంటున్నా క్షమించాలి" రత్నావతి ఒంటిమీద రెండో చురక పడింది. ఇది కొరడా దెబ్బ కాదు పిడుగుపాటు. పరపురుష సంపర్కం అసహ్యం అని ఆనాడు మొహంమీద చెప్పి తనే ఇవాళ అతని దగ్గరకి వచ్చిందని మొహంమీద ఎంత తెలివిగా చెప్తున్నాడా అని కుమిలి పోయింది.

రెండో రౌండ్ నింపాడు. మంచు ముక్కలు రెండు వేశాడు. గ్లాసులో మందు బుసలు కొడ్తున్న కోరికలా ఉంది. మందు మధ్యలో తేల్తున్న మంచు గడ్డలు కోరికల్తో తేలున్న వయస్సులా ఉంది.

'రత్నావతిగారికి ఇన్నాళ్ళకి మామీద దయ కలిగింది....' నాగభూషణం చెయ్యి ఆమె జాకెట్టు పై భాగంలో మెడకింద తగుల్తున్నది. ఆకలి భరించే స్థాయి దాటిపోతే కలిగే వికారం లాంటి వికారం రత్నావతి గుండెల్ని పిండేస్తున్నది.

'అమ్మాయికి ఉద్యోగం కావాలా?...... చలపతి చెప్పాడు. వాడికి నువ్వు ఏడాది ఇంటి అద్దెగూడా చెల్లించాలన్నాడు. ఫర్వాలేదులే,

రత్న ఎక్కడికీ పారిపోదు. లేకపోతే కాస్త దొరక్కుండా జారిపోతూ ఉంటుంది అన్నా. అంతే నంటావా?' అప్పటికే రత్నావతి జాకెట్టు అతని చేతిలో ఖాళీ చిప్స్ పాకెట్‌లా నలిగి కింద పడిపోయింది.

రత్నావతి పచ్చటి ఒంటి ఒంపులమీద పౌడర్ జల్లుతున్నట్లు డిమ్‌లైటింగ్ గొడ్తున్నది.

అనుభవజ్ఞుడు అయిన వేటగాడు తేను చంపిన జీవం చర్మాన్ని ఎంత నేర్పుగా ఒలుస్తాడో అంత నేర్పుగా గుడ్డలు ఒలుస్తున్నాడు.

జీవాన్ని ఒలిస్తే మాంసం వస్తుంది. ఆడదాని గుడ్డల్ని ఒలిస్తే సృష్టి సౌందర్యాల్లోని పరమాద్భుతాలు వెలికి వస్తాయి. ప్రపంచంలో అత్యధిక హింస ఆడదాని కోసం, ఐశ్వర్యం కోసమే జరుగుతాయి.

కొన్నివేల అడుగుల లోతయిన గదిలోంచి వచ్చే వేడి సెగలాంటి సెగ నాగభూషణం ఒంట్లోంచివచ్చి రత్నావతి ఒళ్ళంతా చుట్టేస్తున్నది.

ఆమె మెత్తదనాల మధ్య అతనూ అతని పొగరు, మొరటుదనం, రసికత్వం ఆవేశం పరిగెడుతుంటే అది అనుభవమో బలాత్కారమో గూడా రత్నావతికి అర్థం గావడంలేదు.

గది వాతావరణం వేడెక్కింది. గదిలోని మనిషి వేడి చల్లబడింది.

ఒక వ్యక్తి ఆత్మగౌరవం కోల్పోతే మరొకరి అహం ఆకాశం అంత ఎత్తున పొంగింది.

రత్నావతి మెల్లిగా లోకపు మర్యాదల్ని కట్టుకుంది.

'ఈ లెటర్ తీసుకెళ్ళి రేపు ఖాన్‌ని కలవమని అమ్మాయికి చెప్పు. అన్నట్లు చలపతికి నువ్వు ఇయ్యాల్సిన అద్దెతో ఇంకో సంవత్సరం ఎడ్వాన్స్‌గూడా యిచ్చా. ఇంక నీకేం భయంలేదు. ..' నాగభూషణం రత్నావతికి చిన్న కాగితం ఇచ్చి ఖాళీ సీసా బయటపడేసి ఇంకోటి అందుకోడానికి ఫ్రిజ్ దగ్గరికివెళ్ళాడు.

రత్నావతి బయటికివచ్చి రిక్షా ఎక్కుతుంటే గూర్ఖా ఓ నవ్వు నవ్వి విష్‌చేశాడు. వాడు రోజూ అలాంటి నవ్వులు ఎన్ని నవ్వుతాడో! నాగభూషణం అనుభవాల చిత్రాకి వాడు చిత్రగుప్తుడు గాబోలు.

తొమ్మిది దాటుతున్నది. బజారు పల్చబడుతున్నది. దారిలో రిక్షా ఆపి సోడా తాగాక రత్నావతికి రిలీఫ్ అనిపించింది.


రోజుచూసే రోడ్డు వీధులు షాపులు కొత్తగా కనబడ్తున్నాయి. రేపట్నించి తనకి ఇంక చాలా సమస్యలు ఉండవు. ఇంటివాడు అద్దె కోసం వచ్చి నానా మాటలు అనడు. నిన్నటిదాకా నడివీధిలో నలుగురి మధ్యా నానా మాటల్తో నగ్నంగా నిలబెట్టి పరువు తీసినంత పనిచేసే వాడు. బట్టలవాడు కిరాణావాడు వాడువీడు. .. ఛీ! భగవాన్ ఒక్క జీవితంమీద ఆర్థిక నిస్సహాయత ఎందరికి అధికారం ఇస్తుంది.

—ఒక రకంగా నాగభూషణమే మంచివాడేమో! ఇందరి నుంచి ఎదురయ్యే సమస్యల్ని పావు గంటలో ఎవరూ చూడని గదిలో నగ్నంగా అనుభవించేసి తీర్చేశాడు.

శోభనకి ఉద్యోగం వచ్చాక మెల్లిగా పెళ్ళి అయిపోతే తన జీవితానికి ఇంక సమస్యలు ఉండవు. మనిషి జీవితానికి ఇదే అర్థం. ఈపని చెయ్యడానికి రెండేళ్ళుగా తాత్సారం చేసింది.

నాగభూషణాన్ని తను వెళ్ళి అడిగితే పని జరుగుతుందని శోభనకి ఎవరో చేప్తే తనను అతని దగ్గరికి వెళ్ళి రమ్మని ఎంతకాలంగానో పోరింది. తను ఎందుకు వెళ్ళనని అన్నదో తన జీవితం ఇంత విషాదం ఎవరివలన అయిందో శోభనకి తెలీదు. ఆఖరికి నిన్న రాత్రి నాకు ఉద్యోగంవచ్చి మన సమస్యలు పరిష్కారం అవడం నీకు ఇష్టంలేదు. అందుకే నాగభూషణంగారి దగ్గరికి నువ్వు వెళ్ళవు. నన్ను వెళ్ల నియ్యవు అంది. తన కడుపు చించుకు పుట్టిన శోభన అంతమాట అంటుందని ఊహించలేదు. కానీ పరిస్థితులు కలిగిస్తున్న కడుపుమంట శోభనచేత అలా మాట్లాడించింది. అనుకొని ఆఖరికి ఇవాళ సాయంత్రం నాగభూషణం దగ్గరికి వెళ్ళడానికి నిర్ణయించుకొని ఫోన్‌చేసి బయలుదేరింది.

(వి) చిత్ర విజ్ఞానం



పూనా నుండి 20 కిలోమీటర్ల దూరంలో వున్న ఖడక్‌వాస్లాలో నేషనల్ డిఫెన్స్ ఎకాడమీ (NDA) వుంది. మన సైనిక దళానికి చెందిన మూడు తెగలకు సంబంధించినవారికి యీ కేంద్రంలో తర్ఫీదు యివ్వబడుతుంది. ప్రతి యేటా జూన్, డిసెంబరు మాసాలలో 250 క్యాడెట్లు యీ కేంద్రం నుండి తర్ఫీదుపొంది మన సైనిక దళంలో చేరుతారు. ఇటువంటి శిక్షణా కేంద్రం ప్రపంచంలో మరెక్కడా లేదు.

—అందుకే చాలా కాలం తర్వాత తన జీవితం మళ్ళీ ఆరంభం అయింది.

రత్నావతి తనను ఎంత సమాధాన పరుచుకోవలుచుకొన్నా సాధ్యం కావడంలేదు. ఆడది ఇలా వేటలో తనకి తనుగా వేటగాడి దగ్గరికి వెళ్ళడం తప్పదా? ఆడది జీవితంలో ప్రతిదానికీ తనని అమ్ముకుంటే తప్ప బతకడం సాధ్యం కాదెందుకని?

భూమిమీద మనుగడ ఉన్నంతకాలం ఆడది ఇలా వేటలో జీవం పాత్ర ధరించాల్సిందేనా? నలభై సంవత్సరాలుగా ఏ ఆత్మగౌరవం కోసం పోరాడిందో దాన్ని ఒక్క క్షణంలో పోగొట్టుకోవడంలోని బాధని భరించ శక్యం కాకుండా ఉంది.

రత్నావతి ఇంటి గుమ్మం దగ్గర రిక్షా దిగి వరండాలో కూర్చున్న శోభనతో ఏం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

శోభనగూడా తల్లిని ఎక్కడికి వెళ్ళావని అడగలేదు. శోభన ఉదయం పదకొండు గంటలకి ఓ ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళింది. రత్నావతి బయలుదేరేదాకా ఇంటికి రాలేదు. అయినా కూతుర్ని ఎప్పుడు వచ్చావ్ అని అడగలేదు.

ఇల్లంతా నిశ్శబ్దం. నిశ్శబ్దంలోనే గంటలు నిమిషాలు సెకండులు వచ్చి వెళ్తున్నాయి. రాత్రి పదకొండు అయింది..

ఇంట్లో ఇద్దరికీ భోజనం మీదకి మనస్సు పోలేదు.

తల్లి బెడ్ రూంలోకి శోభన వెళ్ళి అమ్మా అంది.

'రా శోభనా. .' గదిలో దీపం గూడాలేదు. గొంతే వినిపించింది.

'నీకోమాట చెప్పాలి అమ్మా' రత్నావతి కూతురు వేపు చూసింది.

'నాగభూషణంగార్ని నువ్వింక కలవవని నేనే ఇవాళ వెళ్ళి కలిశా.'

'భగవంతుడి దయవలన ఆయన కలిశారు. నా పని తప్పకుండా చేస్తానన్నారు.'

'ఎన్ని గంటకి వెళ్ళావ్?'

'ఆరు గంటలకి'

'ఎన్ని గంటల్దాకా ఉన్నావ్?'

'ఎనిమిది గంటల దాకా ఉన్నా'

'శోభా!' ఆ పిలుపులో యుగయుగాలుగా మగవాడి వేటలో ప్రాణాలు పోగొట్టుకొన్న జీవాల ఆర్తనాదం అంతా కలిసి ఒక్కసారిగా వినిపించింది. □

నైలాన్ చీర

చివుకుల పురుషోత్తం



ఆ ఆఫీస్‌లో ఒక లేడీ క్లర్కు ఉంది. ఆవిడ పేరు చాలా మందికి తెలియదు. కానీ నైలాన్ చీర, అంటే, అందరికీ తెలుసు, నిజానికి ఆవిడ పేరు భారతి.

భారతికి పాతిక సంవత్సరాల వయస్సు. కను ముక్కుతీరు చాలా అందంగా ఉంటుంది. పచ్చని దేహ చాయ, పొడవాటిజడ, స్వచ్ఛతను వెలిగ్రక్కే కళ్లు; గలగల మాట్లాడే తత్వంతో, ఆఫీసులో అందర్నీ ఆకర్షించింది.

ఆ ఆఫీసులో ఉన్న పదిమంది క్లర్కుల్లో ముగ్గురు మాత్రమే ఆడవాళ్లు. ఇద్దరు వివాహితలు. ఒకమ్మాయిః పెండ్లి కాలేదు. ఆ ముగ్గురిలోనూ అందకత్తె భారతి. భారతి వివాహిత. కానీ అందరిలాంటి వివాహిత ఐతే భారతిని ఎవ్వరూ పట్టించుకోక పోయేవారే. భారతి భర్త నిరుద్యోగి కుంటివాడు. భారతి భర్త రామారావుకు, కుడిచెయ్యి మోచేతికి పైన విరిగి పోయి ఉంటుంది.

★ "నైలాన్ చీర అందంగా ఉంటుంది. ఉతుక్కోవడానికి సులువు. కట్టుకొన్నమనిషికి హోదాతెస్తుంది. అందాన్నిస్తుంది. అంతేగాక యింకా........" ★

ఆఫీసులో తెలిసినంతవరకూ. భారతిభర్త అప్రయోజకుడు; పెళ్ళాం సంపాదనమీద బ్రతుకుతుంటాడు. వారికి కలిగిన ఒకే ఒక్క రెండేండ్ల బిడ్డను పట్టుకొని, సాయంకాలం టంచన్‌గా అయిదింటికి ఆఫీసు ముందర హాజరౌతాడు.

ఆఫీసునుండి వెలుపలికి రాగానే, భారతి, భర్తచేతి బిడ్డనందుకుంటుంది. రామారావు, భారతిచేతి సంచిని అందుకుంటాడు. ఇద్దరూ అలాగా వెళ్లి ఒక హోటల్‌లో, కాఫీ త్రాగి, అలా బజారుకెళ్లి ఇంట్లోకి కావలసిన కూర గాయలు, సామానులు, కొనుక్కొని ఇంటి కెళ్తారు.

భారతి భర్త, ఇలా ఆఫీసు దగ్గరికి రావడంతో, భారతి ఆఫీసులోని వాళ్ళు, పనిగట్టుకొని, రామారావును పలుకరిస్తారు. రామారావు ఒక కార్టూనిస్టు. పత్రికలలో పడ్డ కార్టూనులవల్ల సరాసరి నెలకు ఇరవై ముప్పై రూపాయలు, అతడి సంపాదన.

రామారావు సంపాదనను గురించి ఆఫీసులో జోకులు వేస్తుంటారు. భారతి నైలాన్ చీర ప్రసక్తి తెచ్చినప్పుడల్లా అందరూ అంటారు, "చూస్తూండండి! ఒక రోజున మీయాయన ఒక బ్రహ్మాండమైన కార్టూన్ వేస్తారు. దాంతో వేలువచ్చిపడతాయి. ఆమైన ఓ అరడజన్ నైలాన్ చీరలు కొనుక్కోవచ్చు" అంటారు. భారతికి అందులోని ఎద్దేవ అర్థం అయినా, పట్టించుకోదు. నవ్వి పారేస్తుంది.

భారతి మట్టుకు, చేనేత చీరలు తప్ప రెండోవి వాడదు. ఆమె లేడీ కొలీగ్స్, నైలాన్ చీరలు, తప్ప రెండోవి వాడరు. అయినా భారతి, తన స్నేహితురాళ్ళు, ఆఫీసుకు కట్టుకొచ్చిన నైలాన్ చీరలను పట్టి, పట్టి చూస్తుంది. ఇలా అంటుంది.

"అబ్బా' ఓసారేమో మావారు, ఒకనైలాన్ చీర తెచ్చారు. అబ్బ! ఎంత బాగుందని, అది కట్టుకున్న రోజున మా బజారంతా నన్ను తెగ మెచ్చుకున్నారు." అంటుంది.

దాదాపు మూడేళ్ళనుండి, భారతి, తన భర్త తెచ్చిన నైలాన్ చీర సంగతి చెబుతుంటే, ఆఫీసులో అందరికీ నవ్వుగా ఉంటుంది. కానీ భారతి మట్టుకు, అదిపట్టించుకోదు. తన భర్త మూడేండ్ల కింద తెచ్చిన చీర సంగతి చెబుతూ, ఆనంద సామ్రాజ్యంలో తేలిపోతుంటుంది.

భారతికి నైలాన్ చీరలంటే గల ఇష్టం చూచి, ఆమె స్నేహితురాళ్ళు ఒక పథకం వేశారు. అప్పుడప్పుడు, ఛకటో తారీఖున ఒక చీరల మూట తీసుకొని ఒకడు ఆఫీసుకొస్తుంటాడు. ఆఫీసులో అందరూ కలిసి, ఒక రోజున మూటలవాడ్ని పట్టుకొన్నారు.

జీవితం

జీవితం
దివారాత్రులు సంగమించే సంధ్య
వెలుతురు, చీకటి
సగం సగం కలసినట్లు,
సుందర హర్మ్యాల మధురోహలనూ,
జీర్ణ కుటీరాల నైరాశ్యాన్ని
కలగలిపి కలవర పెడుతుంది;

జీవితం
ఎవరో నిర్లక్ష్యంగా విసిరేసిన విత్తు;
అంకురించిన వెంటనే అది ఆకర్షించే
విధాన్ననుసరించి
ఉంటుంది దాని పురోగమనం తీరు;

జీవితం
మహదానందానికీ.
దుర్భర దుఃఖానికీ
రెండు పళ్ళాలు కట్టిన త్రాసు.
తనిష్టం వచ్చినట్లు.
తనిష్టం వచ్చిన వైపు మ్రొగ్గుతుంది—

జీవితం
జీవించి మరణించడానికీ;
చేతనైతే
సాధించి,
సరైన సమాధానంతో ముగించడానికీ;

దేశం జగన్మోహన్‌రెడ్డి ఎం.ఏ.

వాడితో గీచి, గీచి, బేరం ఆడి, ఒక చీరను, అరవై రూపాయలకు బేరంచేసి భారతికి ఇప్పించదలుచుకున్నారు. డబ్బు అంతా ఒక్కసారి ఇచ్చేలాగున కాక నెలకు ఇరవై రూపాయలు ఇచ్చేట్లుగా బేరం ఆడారు.

భారతి, సంతోషంగా, ఆ చీరను తీసుకొని పట్టి పట్టి చూచింది. తన భుజంపైన వేసుకొని, పరిశీలించుకుంది. ఆఖరుకు నిస్పృహగా. చీరను మూటలవాడి కిచ్చేసింది, 'నాకొద్దంటూ' అంతా ఆశ్చర్యపోయారు. కారణం అడిగారు. నైలాన్ చీరను కట్టుకోనని, నా భర్తకు మాట ఇచ్చాను' అన్నది. అంతా ఆశ్చర్యపోయారు. సంపాదనలేని, కుంటి రామారావు, భార్య సంపాదనను తింటూ, భార్యను ఎంత హింసిస్తున్నాడో తెలుసుకొని వారి కడుపు మండిపోయింది.

"ఆ! అవును! వాడు దుర్మార్గుడు! అప్రయోజకుడు! అసలు వాడు రోజూ, ఐదింటికి, ఆఫీసు కెందుకొస్తాడో తెలుసా? వాడి పెళ్లాన్ని కాపలా కాచుకోడానికి! కుంటి వెధవని తనను ఒదిలి పారిపోతుందేమోనని భయం!'' ఇలా తలా ఒక రకంగా అనుకున్నారు.

'నేచర్ అబ్హార్స్ వాక్యూం' అని, ఒక సిద్ధాంతం, ఉంది.

అంటే ప్రకృతిలో అంతా, గాలి నిండి ఉండాలి—ఒకే ఒత్తిడి శక్తితో. అలా ఉన్న గాలిలో, ఒకచోట ఒత్తిడి శక్తి తగ్గితే, చుట్టూ ఉన్న గాలి, దూసుకొని అక్కడికెళ్లి ఒత్తిడి శక్తిని సమంగా ఉండేలా చూస్తుంది. ఐతే అప్పుడే, అక్కడ బ్రహ్మాండమైన తుఫానులు పుట్టి, ప్రకృతిని బీభత్సం చేస్తాయి.

భారతి పనిచేసే ఆఫీసులో సరిగా, అలాగే జరిగింది.

భారతి భర్త అసమర్థుడూ, దుర్మార్గుడూ, భార్యను హింసించేవాడూ అని తేలింది. అంటే భారతి దాంపత్యంలో ఒత్తిడి శక్తి తగ్గిందన్న మాట! అనాటినుండి, ఆ ఆఫీసులోని పురుష పుంగవులు, ఆమె దాంపత్యంలో గల 'ఖాళీ'ని భర్తీ చేయదల్చుకున్నారు!

భారతి స్నేహితురాళ్ళు, ఎలాగైనా, ఆవిడను నైలాన్ చీరను కొనుక్కోమన్నారు. మగ క్లర్క్స్. ఆమెకు అప్పుగా చీరను ఇప్పిస్తామన్నారు. డబ్బు ఉన్నప్పుడు ఇవ్వమన్నారు. ఒకరిద్దరైతే ఉచితంగానే—ఇస్తామని, నోటితో అనకుండా చూపులతో వ్యక్తం చేశారు.

సరిగా ఈసమయంలోనే, కాస్త పైచూపులు అలవాటున్న, ఆఫీసర్‌గార్కి—. భారతి భర్త కథ, ఆవిడకు నైలాన్ చీరలంటే ఉండే ఇష్టం, సంగతి తెలిసింది. అనాటినుండి, ఆఫీసర్, కిశోర్, భారతిని ప్రత్యేకంగా చూస్తున్నాడు. ఖరీదైన సూట్లను పెట్టెల్లో నుండి బయటకు తీసి, రోజూ పూల రంగడిలాగా తయారై ఆఫీస్ కొస్తున్నాడు. ఆఫీసు విషయాలలో భారతి సలహాలను తీసుకోడం, నడుమ, నడుమ, ఆవిడను ఉబ్బెయ్యాడం చేస్తున్నాడు.

క్రమంగా, భారతికి తనంటే, ఇష్టం, ఉన్నదనిపించింది కిశోర్‌కు.

ఒక రోజున, ఐదింటికి, భారతి బయలుదేరింది ఆఫీసునుండి ఇంటి కెళ్ళడానికి. అందరూ వెళ్లి పోతున్నారు. జవాను ఒచ్చి భారతితో "అర్జంటు పని ఉంది, అయ్యగారు మిమ్ముల్ని ఉండమన్నారు!" అన్నాడు.

భారతి నిస్పృహగా, కుర్చీలో కూలబడింది. అందరూ వెళ్ళిపోయారు. ఆఫీసులో కిశోర్, భారతి, జవానులు మాత్రం ఉన్నారు.

భారతి జవానుతో కబురు పంపింది—వాకిట్లో వేచి ఉన్న భర్తకు తనకు పని తగిలింది గనుక ఆలస్యంగా ఇంటి కొస్తానని. జవానువెళ్ళి రామారావుకు సంగతి చెప్పి ఒచ్చాడు.

జవాను ఒక సంచెడు ఫైళ్ళను పట్టుకొని ఒచ్చి, భారతి కిచ్చి, "ఇందులో లెటర్స్ అన్నీ టైప్ చేయమన్నారు అయ్యగారు" అన్నాడు.

భారతి ఆ ఫైళ్లను తీసుకొని టైప్ మిషన్ దగ్గరి కెళ్ళింది.

ఏడు గంటలదాకా, టైప్ చేసింది.

జవాన్, ఫ్లాస్క్ పట్టుకొని వెళ్ళిపోతూ,

"టైపింగ్ అయ్యాక, తమర్ని రమ్మన్నా రండి!" అని భారతితో అని వెళ్ళిపోయాడు.

భారతి టైప్ చేసిన లెటర్స్‌ను పట్టుకొని, ఆఫీసర్ రూంలో కెళ్ళింది.

"కమాన్! భారతీ! సిట్ డౌన్!" అన్నాడు కిశోర్.

భారతి టైప్డ్ లెటర్స్‌ను కిశోర్ ముందు పెట్టి, ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

"సార్! ఇక నేను వెళ్ళొచ్చా?" ఆందోళనగా అడిగింది భారతి. తను ఆలస్యంగా ఇంటికెళ్తే, వంట సరంజామాతో, ఒక్క చేతితో తంటాలుపడే భర్తను ఊహించుకుంటూ.

'జస్ట్ ఎమినిట్!' అంటూ కిశోర్ డ్రాయర్ తెరిచి ఒక పాకెట్‌ను బయటకు తీశాడు. పాకెట్‌ను భారతి ముందుపెట్టి 'చూడు!' అన్నాడు.

భారతి పేకెట్‌ను విప్పి చూచింది.

భారతి కండ్లు, జిగేల్‌మన్నాయి. అందులో రెండు చీరలున్నాయి!

"ఎవరికి సార్? మీయావిడకా?" అని అడిగింది భారతి కండ్లను చీరల మీదినుండి తిప్పకుండానే.

"తీసిచూడు!" అన్నాడు కిశోర్.

భారతి ఉత్సాహంగా, పేకెట్‌లోని చీరలను తీసి, చెరో భుజంమీద వాటిని వేసుకొని చూచుకుంటున్నది.

కిశోర్ కుర్చీలోనుండి లేచి, మెల్లగా భారతిని సమీపిస్తూ అన్నాడు.

"ఇవి మామూలు నైలాన్ చీరలు కావు. స్మగుల్డు టెరిలీన్ దారంతో నేయబడి, పైన ఎంబ్రాయ్‌డరీ చేయబడిన చీరలు. ఒక్కొక్కటి ఐదు వందల రూపాయలు!"

భారతి కిశోర్ మాటలను వింటూ చీరల రంగును, ఎంబ్రాయిడరీ పూలను పట్టి పట్టి చూస్తున్నది. కిశోర్ భారతి వెనుకగా చేరి, ఆమె భుజంమీద చేయివేస్తూ, "బాగుంటే తీసుకో!" అన్నాడు.

తన భుజంమీద చెయ్యిపడగానే, భారతి

ఉలిక్కిపడి, చివాలున కిశోర్ చేతిని, తన భుజంమీదనుండి విదలించి కొట్టింది.

"సార్!!!"

"పిచ్చిపిల్లా! భయపడకు! కావాలంటే రెండు చీరలూ నీవే తీసుకో! ఇంకా కావాలంటే తెచ్చి పెడతాను. నీ సౌందర్యం, నన్ను పిచ్చివాడ్ని చేసింది. నీ జీతంతో, ఇలాంటి చీరలు నీ జన్మలో కొనుక్కోలేవు. నీ భర్త కొని పెట్టడం సరే!" అన్నాడు ఆవేశంగా కిశోర్.

"సార్! మీరు నన్ను అపార్థం చేసుకొన్నారు. నాకు ఇలాటి చీరలంటే ఇష్టమే కానీ మీ దగ్గరమట్టుకు. తీసుకోను మీరు ఆశించిన విధంగా, తుచ్ఛంగా ప్రవర్తించను" అన్నది భారతి దృఢంగా.

కిశోర్ బిత్తరపోయాడు. ఒక చీర చూస్తేనే భారతి తన ఒళ్ళో వాల్తుందనుకున్నాడు. రెండు చీరలు చూచినా, భారతి చలించదేం?!

"భారతీ! ఇంకా ఇలాంటి చీరలు చాలా తెస్తాను. బంగారు సొమ్ములు కొనిపెడ్తాను. నా కోర్కె తీర్చు."

"ఛీ! ఛీ! ఒక్కనాటికీ అలా జరుగదు!"

"భారతీ! జాగ్రత్తగా ఆలోచించుకో! నన్ను కాదంటే, రేపీపాటికి నిన్ను వూస్ట్ చేయిస్తాను."

"వూస్ట్ చేయించండి! పై వాళ్ళకు కాగితం పెట్టి, మీ పరువు బజారు కీడుస్తాను. మీ శ్రీమతికి, ఈ చీరల సంగతి చెబుతాను!"

భారతిచేసిన మొదటి బెదిరింపు కంటే, రెండో దానికే, కిశోర్ గజగజలాడాడు. ప్లేట్ మార్చాడు.

"భారతీ! ఆలోచించుకో! నీ భర్త కుంటివాడు! అప్రయోజకుడు. నీ సంపాదన తినేవాడు! వాడు నీ ముద్దూ ముచ్చటలేం తీర్చగలడు."

"కిశోర్‌గారూ! నేను పేద దానిని కావచ్చు; మీరు ఇచ్చిన రెండు చీరలకు, మీకు శీలం సమర్పిస్తానని ఎలా అనుకున్నారు? ఇదేనా మీ సంస్కారం? కానీ, నా భర్త సమర్థుడు! ప్రయోజకుడు! మొగవాడు! మీ కంటే సమరుడు! ధైర్యశాలి!"

"వాడా? ఆ కుంటివాడు: నా కంటె సమర్థుడా?"

"అవును!"

"ఎలా?"

"నిరూపిస్తాను. నిరూపించగలితే?"

"క్షమాపణ చెప్పుకుంటాను."

"సరేవినండి! ఈ నైలాన్ టెరిలీన్ చీరలంటే, ఏమనుకుంటున్నారు? మానవ దేహాన్ని బ్రతికుండగనే భస్మం చేయగల 'నాపాం' బాంబులలాంటివి! ఈ చీరలలో వాడే పదార్థానికీ, నాపాం బాంబులతో వాడే పదార్థానికీ, ఒకటే పుట్టిల్లు! ఇవి అంటుకుంటే పెట్రోల్ పోసి నిప్పు అంటించుకున్నట్లే.

ఇవి కట్టుకుంటే నిప్పంటుకుంటే, ఈచీరలు నల్లటి ద్రవ పదార్థంగామారి, మండుతూ, ఉడికిపోతూ, చర్మాన్ని అంటుకొని, చర్మం, కండా, ఎముకా, మాడిపోయే దాకా వదలవు. ఈ చీరలకు నిప్పంటుకుంటే, వాటిని కట్టుకున్న వాళ్ళు చచ్చిపోయినట్లే: ఇలాంటి భయంకరమైన చీరలను కట్టుకొని, ఎంతమంది ఆడవాళ్ళు చచ్చిపోతున్నారో లెక్కలేదు.

మా వివాహం అయిన కొత్తలో, మావారికి ఒక ప్రముఖ వార పత్రికలో ముఖచిత్రం వేసినందుకు, వందరూపాయలపారితోషికంఇచ్చారు. ఈ చీరలమీద నాకున్న మోజును గ్రహించి, మావారు నాకో మంచి నైలాన్ చీరను కొని తెచ్చి ఇచ్చారు. నేను కాపురానికెళ్ళాక, మా వారు నాకు కొని ఇచ్చిన మొదటి చీర అదే.

ఆ చీరను కట్టుకొని, ఒక ఆదివారంనాడు మా బజార్లో అందరికీ చూపాను. అంతామెచ్చుకొన్నారు. మావారూ బ్రహ్మానందంలో మునిగిపోయారు. కొత్త చీరతో, కాఫీచేసి ఇచ్చి మా వారికి కృతజ్ఞత చెప్పుకుందామనుకొని, వంటింట్లోకెళ్ళి, స్టౌ ముట్టించి, కాఫీ పొడి తీద్దామని వెనక్కు తిరిగాను. చీరకొంగుకు స్టౌ అంటుకుంది గామోలు గప్పున మంటలేచింది. నేను కాఫీపొడి కిందపారేసి, కెవ్వున కేకవేశాను. నా భర్త తుఫాన్‌లాగా ఒచ్చి మండే చీరను

తన చేతికి చుట్టుకొని, నన్ను క్షణంలో వివస్త్రను చేశారు. ఆ తరువాత, చీర వారి చేతికి చుట్టుకొని, భగభగమండుతుంటే. వారు అరుస్తూ, దాన్ని విదిలించుకోడానికి వ్యర్థప్రయత్నం చేశారు.

నా మెడలో మంగళ సూత్రం కట్టిన పవిత్రమైన హస్తం, నన్ను తన సంపాదనతో పోషించే నా భర్త హస్తం, చిత్ర విచిత్రమైన కళా ఖండాలను సృష్టించే మావారిచేయి,— ఆఖరుకు, నాకు నచ్చిన నైలాన్ చీరను తెచ్చిచ్చిన వారి చెయ్యి, నా కండ్ల ముందే, భస్మమైపోతుంటే, నాకు నోటమాట రాలేదు. వారు స్పృహ తప్పిపడిపోయారు. నా జుట్టు చాలా వరకూ కాలిపోయింది. వీపున బొబ్బలెక్కాయి.

ఇద్దర్నీ హాస్పిటల్‌లో చేర్చారు. నేను మూడు రోజులలో బయటపడ్డాను. వారు మూడు వారాలకు బయటకొచ్చారు. కుడిచేయిపోయింది. ఉద్యోగం పోయింది. ఆ తరువాత నేను ఉద్యోగంలో చేరాను.

నా నైలాన్ చీరల ప్రీతి, ఒకసారి నన్ను మరణంలోకి తోసింది. ఇప్పుడు ఇలా పతనంలోకి తోయబోయింది.

ఇప్పుడు చెప్పండి! నా భర్త అసమర్థుడా? నైలాన్ చీరలు కొనడం, ఒక మొగతనంకాదు. దాన్ని నచ్చిన వాళ్ళకు ప్రజంట్‌చేయడం, ఒక ప్రయోజకతకాదు. నైలాన్ చీరలో కాలిపోయే దాన్ని రక్షించే సామర్థ్యం ఉందా మీకు?

చెప్పండి! ఇప్పుడే ఒక చీర కట్టుకొని, నిప్పంటించుకుంటాను. దాన్ని చేతులతో ఆర్పగలరా?"

భారతి ఉపన్యాసం విని డంగైపోయాడు కిశోర్. మౌనంగా టేబిల్ దగ్గరికొచ్చి, అస్తవ్యస్తంగా టేబిల్‌మీద ఉన్న చీరలను పాక్ చేస్తూ తలవంచుకొని—

"భారతీ! పద! నిన్ను కార్లో డ్రాప్‌చేస్తాను. రామారావుగార్ని పరిచయం చేసుకుంటాను.... ప్లీజ్—ఎక్స్‌క్యూజ్....మీ'' అన్నాడు కిశోర్.

కిశోర్, భారతి, భారతి ఇంటికి చేరారు.

కిశోర్‌ను, రామారావుకు పరిచయం చేసింది భారతి.

కిశోర్, రామారావును ఆరాధనగా చూస్తూ ఇలా అన్నాడు.

"రామారావుగారూ! మీ భార్య చాలా సమర్థురాలు! ఆఫీస్ పనిలో ఆవిడగారు చూపే శ్రద్ధ నాకు నచ్చింది. ఈ రోజు, పని ఎక్కువ ఉన్నందువల్ల, ఆలస్యం అయితే, నా కార్లో డ్రాప్ చేయడానికి ఒచ్చాను. ఒస్తాను అంటూ వెళ్ళిపోయాడు, రామారావు కాఫీ తీసుకొని వెళ్ళండి అన్నా వినకుండా.

రామారావు అన్నాడు "సారీ! డియర్! ఈ రోజు వంట చేయలేదు."

"ఆఫీస్ దగ్గర కలుస్తావేమో, సరాసరి, గుడ్డలకొట్ల దగ్గరి కెళ్దాం అనుకున్నాను. నీవు రాలేదు. నేనే వెళ్ళి చాలా శ్రమపడి, ఒక నైలాన్ చీర తెచ్చాను."

"నైలాన్ చీర తెచ్చారా?!"

"అవును! చౌకదేననుకో! ఈ రోజే మన కార్టూన్ల బాపతు పారితోషికం అందింది. తెచ్చాను. మీ ఆఫీసులో వాళ్ళు నిన్ను నైలాన్ చీర అని ఆటలాడించడం విన్నాను.''

"ఏమండీ! ఎందుకు తెచ్చారు? నైలాన్ చీరలు చూడాలంటేనే నాకిష్టం! కానీ కట్టుకోనని నేనే గదా మీతో ప్రమాణం చేశాను?"

"దట్సాల్ రైట్! ప్రమాణానికి, చిన్న అమెండ్‌మెంటు ఇద్దాం? నైలాన్ చీర కట్టుకొని, వంటింట్లోకి వెళ్ళనని సరిక్రొత్త ప్రమాణం చెయ్యి!"

"అలాగేనండీ!" అంది భారతి, ఆరాధనగా భర్తను చూస్తూ.

మెల్లగా భారతి రామారావు ఇచ్చిన పాకెట్ విప్పింది. అందులో ఉన్న చౌకబారు నైలాన్ చీరను చూచి, ఆమె అణువు అణువు పొంగిపోయింది.

"ఇంత అందమైన నైలాన్ చీరను నా జన్మలో చూడ లేదండీ!" అన్నది భారతి.

భారతికోసం ఆఫీసరు తెచ్చిన రెండు చీరలూ ఆమెకు జ్ఞాపకానికే రాలేదు. □

పుస్తకసమీక్ష

నారీ దృక్పథం. రచన: కె. రామలక్ష్మి; సమర్పణ: నవభారత్ బుక్ హౌస్; ఏలూరు రోడ్డు, విజయవాడ - 2, వెల: రు. 6/-.

ప్రముఖ రచయిత్రి కె. రామలక్ష్మి 'నారీ దృక్పథం' శీర్షికన ఆంధ్ర పత్రిక (డైలీ)లో రాసిన వ్యాసాల నుంచి కొన్నిటిని ఎన్నికచేసి సంకలనం చేయబడ్డదీ పుస్తకం. స్త్రీలకు సంబంధించిన ఎన్నో సమస్యలు ఈ గ్రంథంలో చర్చించబడ్డాయి. విశ్లేషించబడ్డాయి. వివరించ బడ్డాయి. మహిళోద్యమాల గురించీ, స్త్రీకి సంబంధించి భారతదేశపు చట్టాల్లో క్రమ క్రమంగా వచ్చిన మార్పులగురించీ విపులంగా చర్చించారు రచయిత్రి. ఈ గ్రంథంలో యాభై ఆరు వ్యాసాలున్నాయి. ఎక్కువగా స్త్రీ సమస్యలు చర్చించబడ్డవే అయినా అలా కాని పాఠకులకు ఆసక్తి కలిగించేవీ కూడా కొన్ని వ్యాసాలున్నాయిందులో. 'స్త్రీ పురుషులు ప్రకృతిలో సగం-సగం. ఏ ఒక్కరైనా సంపూర్ణత పొందాలంటే రెండు భాగాలూ సమానమేనని గుర్తించి తీరవలసిందే' అన్న రచయిత్రి అభిప్రాయంతో ఎంతమంది మగవాళ్ళు ఏకీభవిస్తారో తెలియదుగాని, అలా ఏకీభవించక పోవడమన్నది ఈ వ్యాసాలన్నీ చదివాక చేస్తే మంచిది. కాలక్షేపానికిగాక ఆలోచింపజేసేందుకు ఉపయోగపడే పుస్తకం ఇది. రచయిత్రికి జర్నలిజంలో వున్న అనుభవం ఈ పుస్తకం తయారీలో ప్రస్ఫుటంగా ప్రతిఫలించింది——వ్యాసాల చివర అక్కడక్కడా లభించిన ఖాళీని మంచి సూక్తులతో నింపి చక్కగా ఉపయోగించుకున్నారు.

స్త్రీకి విముక్తి ఎప్పుడు?; సమతా పబ్లికేషన్స్, మ్యూజియం రోడ్డు, విజయవాడ-2, వెల 1:25.

స్త్రీ సమస్యలు చర్చించబడ్డ కొన్ని వ్యాసాల సంకలనం. ఇందులో టైటిల్ వ్యాసంగా 'స్త్రీకి విముక్తి ఎప్పుడు' అన్న వ్యాసం వున్నది. పి. మమత ఈ వ్యాసంలో స్త్రీ అనాదికాలం నుంచీ ఎలా అలక్ష్యం చెయ్యబడిందో, పురాణాల్లో సైతం ఎంత తక్కువగా చిత్రీకరించ బడిందో విశదీకరించారు. మగవారిని సంతృప్తి పరచే సాధనంగా మాత్రమే స్త్రీ జీవితం వుంటోందని వాపోయారు. ఈ వ్యాసంలో భారత దేశంలో మహిళలకు సంబంధించి వివరంగా స్టాటిస్టిక్స్ ఇవ్వబడ్డాయి. మొత్తం మహిళలు, అక్షరాస్యులు. నిరక్షరాస్యులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్నవారు-ఇలా వివరాలు ఇవ్వబడ్డాయి. సోషలిస్టు దేశాలయిన చైనా, రష్యాలలో మహిళల గురించి, భారత మహిళకంటే వారెటువంటి ప్రగతి సాధించగలిగారో వివరించ బడి వుంది ఈ వ్యాసంలో. 'చట్టము-భారతీయ మహిళ' అన్న వ్యాసంలో జస్టిస్ చిన్నపరెడ్డి భారతదేశపు చట్టంలో స్త్రీకి గల హక్కుల గురించి విశదంగా చర్చించారు. తర్వాత రెండు వ్యాసాలలో మోటూరి ఉదయం 'ఉత్తర వియత్నాంలో మాతా శిశు సంక్షేమం' గురించీ, తూర్పు జర్మనీలో తల్లులకు. వృద్ధులకు కల్పించ బడ్డ సౌకర్యాల గురించీ చర్చించారు. మోటూరి ఉదయం రచించిన రెండు కవితలుకూడా వున్నాయీ పుస్తకంలో.

——ఎస్.

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

ఇంటర్మీడియెట్ వరకే చదువుకొన్నా కృషి, పట్టుదల, ఓర్పులను ఆయుధాలుగా స్వీకరించి జీవితంలో విజయం సాధించినవారు శ్రీ మద్దాలి వెంకటేశ్వరరావు. భారతదేశంలోకెల్లా పెద్ద కమ్మర్షియల్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రసాద్ ప్రాసెస్ (ప్రై) లిమిటెడ్‌కి సెక్రటరీగా వున్నారాయన ప్రస్తుతం.

బ్రిటిష్ ఆర్మీలో పనిచేసిన శ్రీరావు జపాన్ వారి చేతికి యుద్ధ ఖైదీగా చిక్కి కొంతకాలం కానసన్‌ట్రేషన్ క్యాంపులో ఉన్నారు. ఆ తర్వాత ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరారీయన. ఐ. ఎన్. ఏ. బ్రిటిష్ ఆర్మీకి లొంగిన స్థితిలో ఖైదీగా మలయాలోని ఈపింగ్ జైలులో కొంతకాలం గడిపారీయన. సైన్యంలో ఉండగా శ్రీరావు సింగపూర్, పెనాంగ్, కౌలాలంపూర్, ఈపింగ్, జకార్తా, థైలాండ్, ఫ్రాన్స్, ఇండో చైనాలు దర్శించారు. ఐ. ఎన్. ఎలో ఉండగా నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కి మిలిటరీ సెక్రటరీగా ఉన్న కల్నల్ సెహగల్‌కి పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేశారు శ్రీరావు. ఆ సమయంలోనే 'నేతాజీ దగ్గర స్వయంగా డిక్టేషన్ తీసుకొన్నాను' అని చెప్పినప్పుడు ఆయన కంఠం గాద్గదికమైంది. అది వింటున్న మా వళ్ళు జలదరించింది. ఆర్మీ కెరీర్ తర్వాత తిరిగి సివిల్ లైఫ్‌లో ప్రవేశించి పట్టాభి సీతారామయ్యగారు నడిపిన జన్మభూమి దిన పత్రికలో ప్రెస్ మేనేజర్‌గా చేరారు. తర్వాత 1955 లో ప్రసాద్ ప్రాసెస్‌లో చేరారీయన.



శ్రీ మద్దాలి వెంకటేశ్వరరావు

ప్రింటింగ్ లైన్‌లో కృషిచేసి 'ముద్రణాలయాలకు సంబంధించి ఏ సమస్యలనైనా అవలీలగా పరిష్కరించగల వ్యక్తిగా' పేరు తెచ్చుకొన్నారీయన.

"నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగావకాశాలు పెంచడం బాగా ఉపయోగంగా ఉంటుంది. వ్యవసాయ రంగంలో ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చు" అని అభిప్రాయపడ్డారీయన.

ప్రస్తుత యువతరం పై వ్యాఖ్యానిస్తూ "ప్రతివారూ 'వైట్‌కాలర్డ్' ఉద్యోగాలే కోరుకొంటున్నారు. యంత్రాల దగ్గర, ఇతరంగా శారీరకంగా అధిక శ్రమచేసే చోట్లా పనిచేసేందుకు వెనుకాడుతున్నారు; అలా కాకూడదు" అన్నారీయన.

సాంస్కృతిక రంగంపై కూడా ఆసక్తి అధికంగా గల శ్రీరావు మద్రాసులోని తెలుగు తమిళ సాంస్కృతిక సంస్థలెన్నింటితోనో సంబంధాలు కలిగి ఉన్నారు. తమిళ సినీ నటీనటులు 'స్టేజి' [నాటక రంగం]ని అలక్ష్యం చెయ్యక పోవడాన్ని మెచ్చుకొన్నారీయన.

"ఆంధ్ర యువత అత్యంత ప్రతిభావంతమైనది. వారి ప్రతిభను సరైన మార్గాన మళ్ళించడం పెద్దల, విద్యావేత్తల, రాజకీయ నాయకుల బాధ్యత" అన్నారీయన.

—పి. సరళా సూర్యారావు



'అనుకొన్నది సాధిస్తా'లో లత

సభ్యత కోల్పోని స్థితినించి....ఇదిగో అవసర మున్నా లేకున్నా యిలా తయారయ్యే స్థితి కొచ్చినదాన్ని....ఇంకా నాగురించి నీకుతెలియ లేదని అమాయకపు ముఖం పెట్టేసేంటే అది నీ దౌర్భాగ్యం" శపిస్తున్నట్లుగా లేచి నిలబడి చరచరా బయటకెళ్ళిపోయింది ఆ యువతి.

టకటక టైపుమిషన్ శబ్దం వినిపించడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను.

నా వళ్ళంతా చెమటపట్టింది.

"ఏమిటిసార్....అలా వున్నారు వంట్లో బాగాలేదా?" ఆఫీస్‌బాయ్ ఆదరంగా అడిగాడు. నన్ను నేను సంబాళించుకుంటూ "ఏంలేదు.... కొంచెం మంచి పాటలివ్వు...." అంటూనే నాలుక కొరుక్కుని "కొంచెం మంచినీళ్ళివ్వు" అన్నాను.

సాహసవంతుడు

నేపాల్‌లో కొంతభాగం చిత్రీకరణ జరుపుకున్న 'సాహసవంతుడు' చిత్రం తయారయి త్వరలో విడుదల కాబోతుంది. ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, వాణిశ్రీ, చంద్రకళ, మంజుభార్గవి, సత్యనారాయణ, జగ్గయ్య, ప్రభాకరరెడ్డి, గిరిబాబు, శరత్‌బాబు, పండరీబాయిలతో పాటు నేపాల్‌తార లక్ష్మిశ్రేష్ఠకూడా నటించింది. భమిడిపాటి మాటలు, కె. వి. మహాదేవన్ సంగీతం నిర్వహించిన ఈ చిత్రానికి దర్శకుడు కె. బాపయ్య, నిర్మాత విద్యాసాగర్.



'రామచిలక'లో వాణిశ్రీ



'శివరంజని'లో సుభాషిణి, హరిప్రసాద్

సంక్షిప్త సమాచారం

* కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను కొమ్మినేని చేపట్టిన పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ 'తాయారమ్మ—బంగారయ్య' చిత్రంలో జానకి, సత్యనారాయణ టైటిల్ రోల్స్ పోషిస్తున్నారు. చంద్రమోహన్, రంగనాథ్, రాజబాబు, అల్లు, మాడా, మాధవి, జయ, ఛాయాదేవి ఇతర తారాగణం. నిర్మాతలు: ఏడిద నాగేశ్వరరావు, ఆకాశం శ్రీరాములు.
* కౌముదీ పిక్చర్స్ పతాకంపై నిర్మాత యం. యస్. రెడ్డి నిర్మించే 'రామబాణం' చిత్రం ఈశ్వరరెడ్డి దర్శకత్వంలో తయారవుతోంది. శోభన్‌బాబు, జయప్రద, కృష్ణంరాజు, లత, సత్యనారాయణ, జమున మోహన్‌బాబు, నాగేష్ నటిస్తున్నారు.
* శ్యాంప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్ నిర్మించిన 'బొమ్మరిల్లు', ఆండాళ్ ప్రొడక్షన్స్ నిర్మించిన 'మరో చరిత్ర' చిత్రాలు విజయం సాధించి నూరురోజుల పండుగ జరుపుకొన్నాయి.
* మద్రాసులోని తెలుగు సాంస్కృతికసంస్థ కళాభారతి వైభవంగా జరిపిన సభలో 'కళాప్రపూర్ణ' బిరుదం పొందిన హీరో ఎన్. టి. రామారావును ఘనంగా సన్మానించి గౌరవించింది.
* తెలుగుభాషలో తయారయి విడుదలకు సిద్ధంగావున్న 'కరుణామయుడు' చిత్రాన్ని ముఖ్యమైన భారతీయ భాషలలోకే గాక ఫ్రెంచి, జర్మన్, స్పానిష్, ఇంగ్లీషు

భాషలలోకి డబ్ చేస్తున్నట్లు నిర్మాత, హీరో విజయచందర్ పత్రికావిలేఖరులతో జరిపిన గోష్ఠిలో చెప్పారు.

* బాపు దర్శకత్వం, ముళ్ళపూడి వెంకట రమణ రచనతో తయారయిన నూతన తరహా చిత్రం 'మనవూరి పాండవులు' హీరో కృష్ణంరాజు సమర్పణలో, జయ కృష్ణా మూవీస్ పతాకంక్రింద జయకృష్ణ నిర్మించారు.
* మలయాళంలో విజయవంతంగా ప్రదర్శింప బడ్డ 'హర్‌నైట్స్' చిత్రం ఆధారంగా తెలుగులో 'అంగడిబొమ్మ' చిత్రం నిర్మింప బడుతోంది. వి. మధుసూదనరావు దర్శకత్వములో తయారవుతున్న ఈ చిత్రంలో 'హర్ నైట్స్'లో నటించిన 'సీమా'యే కథా నాయిక. నారాయణరావు, శ్రీధర్, నాగ భూషణం, రాళ్ళపల్లి, అంజలీదేవి మొద లయినవారు నటించారు.
* కె. తాతాజీ ఉమాదేవి పిక్చర్స్ పతాకం క్రింద నిర్మించే 'పట్నంపిల్ల'కు కె. సత్యం దర్శకుడు. కమలహాసన్, మురళీమోహన్, శ్రీదేవి, సత్యప్రియ, మోహన్‌బాబు, రమాప్రభ.పి. ఆర్.వరలక్ష్మి నటిస్తున్నారు.
* సత్యచిత్ర నిర్మిస్తున్న 'కుమార్ రాజా' చిత్రానికిగాను కొంతభాగం కాశ్మీర్‌లో షూటింగ్ జరిపారు. 'కుమార్ రాజా'తో పాటు అదేసంస్థ నిర్మిస్తున్న 'లారీ డ్రయివర్' చిత్రానికికూడా కొంతభాగం షూటింగ్ కాశ్మీర్‌లోనే జరిపారు. రెండుచిత్రాలలోను కృష్ణ, జయప్రద నాయకా, నాయికలు. రెండు చిత్రాలకూ పి. సాంబశివరావు దర్శకుడు. నిర్మాతలు: సత్యనారాయణ,సూర్య యణ.
* జయచిత్ర టైటిల్ రోల్ నిర్వహించిన 'రిక్షా రాజీ' చిత్రంలో చంద్రమోహన్, మోహన్‌బాబు, అల్లురామలింగయ్య,ప్రభాకరరెడ్డి, సారధి, హరిబాబు, రోజారమణి, నిర్మల, జయమాలిని నటించారు. డి.ఎస్. ప్రకాశరావు దర్శకత్వంలో తయారవుతోందీ చిత్రం.

'మనవూరి పాండవులు' భాను, ప్రసాద్‌బాబు, మురళీమోహన్, చిరంజీవి, భాస్కర్





'ఎంకి-నాయుడుబావ'లో శోభన్‌బాబు

* సారథీ స్టూడియోస్ నిర్మిస్తున్న 'ఇద్దరూ అసాధ్యులే' చిత్రంలో కృష్ణ, రజనీకాంత్ చలం, నాగభూషణం, గిరిబాబు, అల్లు రామలింగయ్య, లత, మాధవి, కవిత, గీత, జానకి మొదలయినవారు నటిస్తున్నారు. దర్శకత్వం; కె. యస్. ఆర్.దాస్, నిర్మాతలు : జి. డి. ప్రసాదరావు, పి. శశిభూషణ్.

* మహాభారతంలోని పాత్రలతో ఆధునిక కథాంశంతో తయారౌతున్న చిత్రం 'కలియుగ మహాభారతం'. చలం, హరిబాబు, నరసింహరాజు, రంగారావు, వంకాయల, పి. యల్. నారాయణ, మాధవి మొదలయినవారు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు పరుచూరి.దర్శకత్వం:హనుమాన్ ప్రసాద్. నిర్మాత: ఎస్. సత్యనారాయణ.

* దాసరి నారాయణరావు దర్శకత్వంలో 'రావణుడే రాముడైతే' చిత్రాన్ని లక్ష్మి ఫిలిం కంబైన్స్‌వారు నిర్మిస్తున్నారు. నాగేశ్వరరావు, జయసుధ, మురళీమోహన్, లత, ప్రభాకరరెడ్డి, మాడా, కె. వి. చలం, మోహన్‌బాబు నటిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతోపాటు, కథ, మాటలు స్క్రీన్‌ప్లే బాధ్యతలుకూడా దాసరి చేపట్టారు. నిర్మాత అనూరాధాదేవి.

—యస్వీ నారాయణ.

'పట్నం పిల్ల' శ్రీదేవి



జయసుధ జవాబులు

వి. విజయప్రకాష్, నిజామాబాద్.

పెళ్ళి చేసుకొంటే కష్టాలుంటా యంటారు. మరి పెళ్ళెందుకు చేసు కుంటారు?

పెళ్ళయిన వాళ్ళనడగవలసిన ప్రశ్న నన్నడిగారేం?

యం. మోహన్‌దాస్ చోళసముద్రం.

మీరు వెనకజన్మలో ఏ రంభో, ఊర్వశో అయివుంటారా?

గత జన్మ స్మృతులు లేవు నాకు.

యం. సుధాకరగుప్త, తిరుపతి.

మా ప్రశ్నకు ప్రశ్నేవస్తే మీ ప్రశ్నే మౌతుంది?

మీ ప్రశ్నకు జవాబైన నా ప్రశ్నవు తుంది.

నాగాంథోని, సికింద్రాబాద్.

నేను మీ కోసం కలవరిస్తున్నా....!

మీ యిష్టప్రకారం 'కల'నే వరించండి!

కె. వి. రమణమూర్తి, డొంకరాయి.

మీ జీవితంలో మీరు ఎవర్నయినా ప్రేమించదలచారా?

'దలచుకొని' ప్రేమించలేము. పథకం వేసుకొనీ, ఆలోచనచేసీ, మంచిచెడుల బేరీజు వేసుకొనీ ప్రేమించడం సాధ్యంకాదు. అలా ప్రేమించినా అది 'ప్రేమ' అవదు. ప్రేమ స్వాంతే నియస్‌గా పుడుతుంది.

వి. యల్. చంద్రరావ్, హైదరాబాద్.

మీకు తెలుగు రాదనీ, డైరక్టర్లు మీచేత చిలకపలుకుల్లాగా డైలాగ్స్ చెప్పిస్తారనీ విన్నాను. ఇది నిజమేనా?

అబద్ధం.

కొండాటి కృష్ణ, గుసుపూరు.

ప్రతిమనిషి నిజాయితీగా నడవక పోవడానికి కారణమేమిటి?

స్వార్థం.

బి. శివశంకర్, కర్నూల్.

ప్రేమించి పెళ్ళిచేసుకోవడం మంచిదా? పెళ్ళిచేసుకొని ప్రేమించడం మంచిదా?

ఎలా అయినా 'ప్రేమించడం' మంచిది!

బి. భ్రమరాంబ, విజయనగరం.

ప్రేమలోవున్న తీయదనం ఇంకెందు లోనూ లేదంటారు? కాని ప్రేమలోవున్న మోసం ఇంకెందులోనూ లేదంటాను? మీరేమంటారు?

రెండూ నిజమేనంటాను. అది ప్రేమించే వ్యక్తులనుబట్టి వుంటుంది. అన్నట్లు ప్రేమలో 'పడిపోయారా' మీరు?

పి సత్యనారాయణ, కోరుట్ల.

ఒకపని సాధించేందుకు కొందరు కృషిచేస్తారు? కొందరు భగవంతునిపై భారంవేస్తారు. ఎవరి కోరిక సఫలమవు తుందో చెప్పగలరా?

ఆ రెండూ ప్రధానం కాదు. భగ వంతుని నమ్మినంత మాత్రాన, కృషి చేసినంతమాత్రాన విజయం వరించా లన్న రూలులేదు. 'టన్స్ ఆఫ్ టేలెంటూ' కయినా 'పించ్ ఆఫ్ లక్' తోడుండాలంటారందుకే. కృషి

బహుమతి పొందిన ప్రశ్న

కాయితాపురం ఉపేందర్‌రెడ్డి, జనగామ.

నవమాసాలు మోసి కనిపెంచే 'తల్లిని' మరచి, సృష్టిలో తియ్యనిది 'స్నేహం' అంటారెందుకని?

చాలా పిచ్చి అనుమానం. సృష్టిలో తీయ నిది స్నేహమేనోయ్ అన్నంత మాత్రాన తల్లిని మరచారని ఎక్కడుంది. తల్లిని మించిన స్నేహితులు ఎవరుంటారు?



'కళాభారతి' తరపున ఎన్. టి. ఆర్ ను సన్మానిస్తున్న శ్రీ బ్రహ్మయ్య, శ్రీ నాయుడమ్మ కూడా చిత్రంలో ఉన్నారు.

లోపం చేయకపోవడమే మనం చెయ్యవలసింది. ఫలితం ఎలావున్నా స్వీకరించగలగాలి.

కె. రత్నకుమారి, పాదేరు.

ఆడదానికి మరోపేరు అసూయ అని కొందరంటారు? మీరేమంటారు!

అందరి విషయంలోనూ అది సరి కాదంటాను.

వరకట్నాలనూ, వర్ణాంతర వివాహాలనూ మీరు ప్రోత్సహిస్తారా? ఖండిస్తారా?

మొదటిదాన్ని ఖండిస్తాను, రెండో దానికి దండ వేస్తాను.

పల్లి వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెం

మానవత్వమున్న ప్రతిమనిషికీ కావలసిందేమిటి?

ఏమీ అవసరం లేదు. మానవత్వాన్ని కలిగి వుండడాన్ని మించిన గొప్ప గుణం వుండదు!

వి. అమరేంద్ర, హైదరాబాదు.

మీ అందాల సంతకముతో కూడిన మీ అందమైన ఫోటో సంపాదించాలంటే నేను ఎటువంటి ప్రశ్న వెయ్యాలి.

ఈ ప్రశ్న మాత్రం కాదు!

ఎ. వెంకటరావు, విశాఖపట్నం-27

"మీరు ఎంతో బాగా నటించిన పాత్ర పోషణను ప్రేక్షకులు ఏమీ బాగోలేదంటే మీరు ఏమని ఫీలవుతారు?"

చాలా బాధపడతాను!

ఎన్. రమేశ్‌కుమార్, శ్రీకాకుళం.

జయాన్ని వరించే జయసుధా నిన్ను జయించాలంటే ఏం చేయాలి?

మీరు అభిమానించటమే!

నీ అందాల్ని సంతరించుకున్న నీ చెల్లి అభిమానులుగా, నీ అభిమానులు మారిపోతే నీ మనస్సెలా వుంటుంది?

చాలా సంతోషిస్తుంది.

ఎ. ఎస్. కె. సోమసుందరం, గొల్లప్రోలు

మీరు నటించిన "జ్యోతి" "ఆమె కథ" "అమర దీపం" చిత్రాలు ప్రేక్షక హృదయాలను దోచుకున్నాయి. అలాంటపుడు మీరు డబ్బింగు చిత్రాలలో నటించడానికి కారణమేమి?

డబ్బింగు చిత్రాలలో నటీ నటులు నటించరు—కేవలం భాష మార్చి డైలాగులు, పాటలు మాత్రం మారుస్తారు!



Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024, & Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.